www.andhrajyothy.com
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHI

మంగళవారం | 20-1-2026 | పేజీలు: 12 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 23 సంచిక (Issue) : 314 | శ్రీ విశ్వావసునామసంవత్సరం, ఉత్తరాయణం, శిశిరుఋతువు, మాఘమాసం, శుక్లపక్షం, తిథి: విదియ రా.2.43 తదుపరి తదియ, నక్షత్రం: శ్రవణం మ.1.07 తదుపరి ధనిష్ఠ, వర్జ్యం: సా.5.15-6.54, దుర్ముహూర్తం: రా.10.13-రా.11.03, అమృతఘడియలు: తె. 3.11-4.51, రాహుకాలం: మ.3.00-4.30, సూర్యోదయం: 6.52, సూర్యాస్తమయం: 5.59 | గుంటూరు సిటీ

Guntur | Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

మిలియనీర్ బిచ్చగాడు!

ఇండోర్‌లో 3 సొంత ఇళ్లు, 3 ఆటోలు,

ఒక విలాసవంతమైన కారు..

మార్కెట్‌లో పదుల మందికి వడ్డీకి డబ్బులు

అయినా చక్రాల బండిపై యాచన


మంగీలాల్ (ఫైల్)

2

విదేశీ విద్యకు గ్యారెంటీ!

4% వడ్డీతో విద్యా రుణాలు

చదువుకోవాలనుకునే ప్రతి ఒక్కరినీ చదివిస్తాం

రూ.50 కోట్లతో ఎన్నార్టీల కోసం కార్పస్ ఫండ్

పెట్టుబడుల కోసం మంత్రులకు, నాకు మధ్య పోటీ

ఫలితమే దేశానికి వచ్చిన పెట్టుబడుల్లో 25% ఏపీకి

విద్యుత్తు సంస్కరణలతోనే రాష్ట్రానికి డేటా సెంటర్లు

అన్ని రంగాల్లో తెలుగు వారు అభివృద్ధి సాధించాలి

అదే నా లక్ష్యం.. అప్పుడే నాకు సంతృప్తి

జ్యూరిక్‌లో యూరప్ తెలుగు డయాస్పోరా సమావేశంలో సీఎం చంద్రబాబు వ్యాఖ్యలు

రాష్ట్రంలో వ్యాపారాలకు, పరిశ్రమల ఏర్పాటుకు ఎన్నో అవకాశాలున్నాయి. పెట్టుబడులు పెట్టేందుకు ముందు కొచ్చే ప్రవాస తెలుగువారికి (ఎన్నార్టీ) సహకరిస్తాం. వారిని పారిశ్రామికవేత్తలుగా చేయడానికి రూ.50 కోట్లతో కార్పస్ ఫండ్ ఏర్పాటు చేస్తున్నాం. 195 దేశాల్లో తెలుగువారు ఉంటే 148 దేశాల్లో ఎన్నార్టీ వ్యవస్థను ఏర్పాటు చేశాం. మిగిలిన దేశాలకూ విస్తరిస్తాం.

- సీఎం చంద్రబాబు


జ్యూరిక్‌లో నిర్వహించిన తెలుగు డయాస్పోరాలో మాట్లాడుకుంటున్న సీఎం చంద్రబాబు, మంత్రి లోకేశ్, కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు

అమరావతి, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): చదువుకోవాలనుకునే ప్రతి ఒక్కరినీ చదివిస్తున్నామని ముఖ్యమంత్రి చంద్రబాబు తెలిపారు. "ప్రపంచవ్యాప్తంగా ఉన్న మంచి యూనివర్సిటీల్లో ఎక్కడ చదవాలని విద్యార్థులు కోరుకుంటే అక్కడ అవకాశం కల్పిస్తున్నాం. ప్రభుత్వ గ్యారెంటీతో 4 శాతం వడ్డీతో విద్యారుణాలు ఇప్పించి వారికి విదేశీ విద్య అందించేందుకు చర్యలు తీసుకుంటున్నాం" అని పేర్కొన్నారు. దావోస్ ఆర్థిక సదస్సులో పాల్గొనేందుకు వెళ్లిన చంద్రబాబు స్విట్జర్లాండ్‌లోని జ్యూరిక్‌లో యూరప్ తెలుగు డయాస్పోరా సమావేశంలో పాల్గొన్నారు. దావోస్‌కు తొలిసారి వచ్చినప్పుడు భారతీయులు తక్కువగా ఉండేవారని, తెలుగువాళ్లు అసలే లేరన్నారు. కానీ ఇప్పుడు తెలుగువారు ఉండటమే కాదు, వారిని చూస్తే

మిగతా 12వ పేజీలో...

'టీమ్ 11' ముఖం చూసి.. ఎవరొస్తారు?

అభివృద్ధి అంటే గుర్తు వచ్చేది చంద్రబాబే!

ఆయన విజన్ సాధనకు అహర్నిశలు కృషి

18 నెలల్లో 23 లక్షల కోట్ల ఎంవోయూలు

స్విట్జర్లాండ్‌లోని జ్యూరిక్‌లో యూరప్ తెలుగు డయాస్పోరా సమావేశంలో మంత్రి లోకేశ్

ఏపీలో టీం 11 ఉంది. అర్థమైందా రాజా? అదో ఏడుపు గొట్టు టీం. పెట్టుబడులు తీసుకొస్తామంటే ఏడుస్తారు. ఏ మంచి చేసినా ఏడుస్తారు. చంద్రబాబును చూసి రాష్ట్రానికి కంపెనీలు వస్తే, క్రెడిట్ మాత్రం ఏడుపుగొట్టు టీం తీసుకోవాలని అనుకుంటుంది. టీం 11 ముఖం చూసి ఎవరైనా రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టడానికి వస్తారా? క్రెడిట్ చోరీ అంటూ టీం 11 గగ్గోలు పెడుతోంది. వారికి కోడికత్తి క్రెడిట్ ఇవ్వాలి.. బాబాయిని లేపేసిన క్రెడిట్ ఇవ్వాలి.. చెల్లినీ, తల్లినీ గెంటేసిన క్రెడిట్ ఇవ్వాలి.

-మంత్రి లోకేశ్



అదే వ్యథ.. పాత కథ!

అప్పుల వలయం.. ఆర్థిక విలయం

జగన్ హయాంలో గాడి తప్పిన 'ఆర్థికం'

కూటమి సర్కారులోనూ గతుకుల ప్రయాణం

అన్ని రకాల ఆదాయం కలిపితే రూ.లక్షన్నర కోట్లు

అది వడ్డీలు, అసలు చెల్లింపు, జీతాలు, పెన్షన్లకే సరి

పథకాలు, అభివృద్ధి, ఇతర ఖర్చులకు అప్పులే గతి

అప్పుల రీపేమెంట్లు దిదాదికి రూ.75,000 కోట్లు

జీతాలు, పెన్షన్లు మరో రూ.75,000 కోట్లు

డిసెంబరు నాటికే లక్ష కోట్లు దాటిన అప్పు

'పథకాల పులి'పై ప్రభుత్వాల స్వారీ

దశాబ్దాలుగా అమలు చేస్తున్నా తగ్గని పేదరికం

(అమరావతి - ఆంధ్రజ్యోతి)

ఇదో విష వలయం! ఆర్థికంగా 'విలయం'! పాత అప్పులు, వడ్డీలు, జీతాలు, పెన్షన్లు, రాయితీలు, పథకాలు! వెరసి కొండలా అవసరాలు! కానీ... ఆదాయం కొంచమే! ఆధారం... ఎప్పటికప్పుడు తెచ్చే అప్పులే! జగన్ హయాంలో జరిగిన పాత కథ ఒక్కసారిగా మారిపోయేది కాదు! కూటమి సర్కారు వచ్చాకైనా పరిస్థితి కొంచెం కొంచెం మెరుగుపడుతుందేమో అనుకుంటే... అదీ జరగడంలేదు. పైగా... జగన్ చేసిన అప్పులు, తప్పుల బాటలోనే నడుస్తున్న ఛాయలు కనిపిస్తున్నాయి. ఈ ఆర్థిక సంవత్సరంలో డిసెంబరు నాటికే రాష్ట్ర అప్పులు రూ.లక్ష కోట్లు దాటాయి. ఈ ఏడాదిన్నరలో రాష్ట్రాన్ని గాడిన పెట్టామని, ఆర్థిక పరిస్థితిని ఎంతో మెరుగుపర్చామని

మిగతా 6వ పేజీలో...

ప్రణయ్ రాయ్ దంపతులకు ఊరట



2016లో ఐటీ విభాగం జారీ చేసిన నోటీసులను కొట్టివేసిన ఢిల్లీ హైకోర్టు

మూడేళ్ల క్రితమే ఆ కేసు ముగిసిందని.. మళ్లీ నోటీసులివ్వడం వేధించడమేనని వ్యాఖ్య

కక్షిదారులకు రూ.లక్ష చొప్పున జరిమానా చెల్లించాలని ఐటీకి ఆదేశాలు

2



ఆ 1.25 కోట్ల ఓటర్ల పేర్లను పంచాయతీల్లో ప్రదర్శించండి

పశ్చిమ బెంగాల్‌లో ఓటర్లకు నోటీసులపై ఈసీకి సుప్రీంకోర్టు ఆదేశం

ఓటర్ల అభ్యంతరాలూ స్వీకరించాలని సూచన

న్యూఢిల్లీ, జనవరి 19: పశ్చిమ బెంగాల్‌లో సమగ్ర ఓటర్ల సవరణ(ఎస్ఐఆర్)లో భాగంగా ఓటర్ల తల్లిదండ్రుల పేర్లు, వయసుల్లో తేడాల వల్ల నోటీసులు అందుకున్నవారి వివరాలను ప్రతి గ్రామపంచాయతీ, బ్లాక్ కార్యాలయాల్లో ప్రదర్శించాలని కేంద్ర ఎన్నికల సంఘానికి సుప్రీంకోర్టు ఆదేశాలు జారీచేసింది. ఎస్ఐఆర్‌లో భాగంగా ప్రాథమిక వివరాల్లో తేడాలు ఉన్న 1.25 కోట్ల ఓటర్లను ఈసీ 'లాజికల్ డిస్క్రిపెన్సీ' (తార్కిక తేడాలు) జాబితాలో చేర్చింది. వీరి ఓట్లను ఎందుకు రద్దు చేయకూడదో చెప్పాలని నోటీసులు జారీచేసింది. దీనిని వ్యతిరేకిస్తూ దాఖలైన పిటిషన్లను చీఫ్ జస్టిస్ సూర్యకాంత్ మిశ్రా, జస్టిస్‌లు దీపాంకర్ దత్తా, జోయ్‌మాల్య బాగ్చీలతో కూడిన త్రిసభ్య ధర్మాసనం సోమవారం విచారించింది. ఈ జాబితాలో చేర్చిన

మిగతా 2వ పేజీలో...

సెంగార్‌కు మరో ఎదురుదెబ్బ

ఉన్నావ్ బాధితురాలి తండ్రి మృతి కేసులో శిక్ష రద్దుకు ఢిల్లీ హైకోర్టు నిరాకరణ

ఈ కేసులో సెంగార్‌కు పదేళ్ల జైలు.. ఇప్పటికే 9 ఏళ్లు పూర్తి

2



మిథున్‌రెడ్డికి ఈడీ పిలుపు

లిక్కర్ స్కామ్‌లో 23న విచారణకు రావాలని సమన్లు

22న విజయసాయిరెడ్డి వాంగ్మూలం

తర్వాతి రోజే వైసీపీ ఎంపీ విచారణ

అంతిమ లబ్ధిదారు లెక్క తేలుతుందా?

6

2 వేల కేసులు.. 1.3 కోట్ల ఫైన్!

సంక్రాంతి 'ప్రైవేటు' బాదుడుపై ఆర్టీఏ కొరడా

వందల ట్రావెల్స్ బస్సులపై అధికారుల చర్యలు

స్పెషల్ డ్రైవ్‌లో రాష్ట్రవ్యాప్తంగా విస్తృత తనిఖీలు

పన్ను ఎగవేత, పర్మిట్ ఉల్లంఘనలూ గుర్తింపు

3

ముగిసిన 'ఈశాన్య' సీజన్

నేడు, రేపు పలు జిల్లాల్లో పొగమంచు

ఉదయం 10 వరకు వాహనాలు జాగ్రత్తగా నడపాలని సూచన

3

స్పెయిన్‌లో ఢీకొన్న 2 హైస్పీడ్ రైళ్లు

39 మంది మృతి..

100 మందికిపైగా గాయాలు

2

ఆఫీసులోనే డీజీపీ ర్యాంక్ అధికారి

రాసలీలలు

కర్ణాటకలో సీనియర్ ఐపీఎస్ రామచంద్రరావు బాగోతం బట్టబయలు



సోషల్ మీడియాలో వీడియో వైరల్

జూన్‌లో రిటైర్ కానున్న అధికారి

గతంలోనూ ఆయనపై పలు ఆరోపణలు

అవినీతి కేసులు నమోదు

పెంపుడు కుమార్తె రన్యారావ్ గోల్డ్ స్మగ్లింగ్ కేసులో సస్పెన్షన్

డీజీపీపై సీఎం సిద్దరామయ్య ఆగ్రహం

మార్ఫింగ్ చేశారంటున్న రామచంద్రరావు

బెంగళూరు, జనవరి 19(ఆంధ్రజ్యోతి): కర్ణాటక పోలీసు శాఖలో ఉన్నతాధికారి రాసలీలల వీడియోలు కలకలం రేపుతున్నాయి. తన కార్యాలయంలో పోలీసు యూనిఫాంలోనే పలువురు యువతులతో ఆ సీనియర్ ఐపీఎస్ అధికారి సరసాలు ఆడుతున్న దృశ్యాలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. డైరెక్టరేట్ ఆఫ్ సివిల్ రైట్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ (డీసీఆర్ఈ) డీజీపీ రామచంద్రరావు తన చాంబర్‌లో యువతులను కౌగిలించుకుంటూ, ముద్దులు పెట్టే దృశ్యాలు బయటపడ్డాయి. వివిధ సందర్భాల్లో తీసిన ఆ వీడియోల్లో ఉన్న ముగ్గురు యువతుల్లో ఒకరు మోడల్ అని చెబుతున్నారు. కర్ణాటకలో డీజీపీ హోదాలో ఉన్న రామచంద్రరావు ఉమ్మడి గుంటూరు జిల్లాకు చెందిన అధికారి. గతంలోనూ ఆయన పలు వివాదాల్లో చిక్కుకుని సస్పెండ్ అయ్యారు. తాజాగా రామచంద్రరావు చేష్టలతో

మిగతా 2వ పేజీలో...



బీజేపీ సారథిగా నితిన్ నబీన్

అధ్యక్ష పదవికి ఆయన ఒక్కరే నామినేషన్

ఎన్నిక ఇక లాంఛనమే.. నేడు అధికారిక ప్రకటన

ఆర్ఎస్ఎస్ నేపథ్యం.. ఇంటర్మీడియట్ విద్యార్హత

జాతీయ అధ్యక్షుడిగా తొలిసారి బిహార్ నేత

న్యూఢిల్లీ, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): భారతీయ జనతా పార్టీ నూతన జాతీయ అధ్యక్షుడిగా నితిన్ నబీన్ సిన్హా ఎన్నిక కావడం లాంఛనప్రాయమైంది. ప్రస్తుతం ఆయన పార్టీ కార్యనిర్వాహక అధ్యక్షుడిగా వ్యవహరిస్తున్నారు. 46 ఏళ్ల చరిత్ర గల బీజేపీకి తొలిసారిగా పార్టీ కంటే పిన్న వయస్సు గల నితిన్ నబీన్ అధ్యక్షుడు కాబోతున్నారు. పార్టీ ప్రస్తుత అధ్యక్షుడు జేపీ నడ్డా, కేంద్ర మంత్రులు అమిత్ షా, రాజ్‌నాథ్‌సింగ్, నితిన్ గడ్కరీ, నిర్మలా సీతారామన్, పీయూష్ గోయల్, హర్దీప్‌సింగ్ పురి, కిరణ్ రిజుజు తదితరులు నితిన్‌కు మద్దతుగా నామినేషన్ దాఖలు చేశారు. సంస్థాగత ఎన్నికల రిటర్నింగ్ అధికారి, ఎంపీ కె.లక్ష్మణ్‌కు నామినేషన్ పత్రాలను సమర్పించారు. సోమవారం ఢిల్లీలో వివిధ రాష్ట్రాల పార్టీ అధ్యక్షుల నేతృత్వంలో నామినేషన్ల దాఖలు ప్రక్రియ జరిగింది. నితిన్‌కు మద్దతుగా మొత్తం 37 సెట్ల

మిగతా 2వ పేజీలో...

ఎగువ మధ్య ఆదాయ దేశంగా భారత్!

రూ.3.63 లక్షలకు చేరనున్న స్థూల తలసరి ఆదాయం

త్వరలో జర్మనీని దాటి 3వ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా ఆవిర్భావం

చైనా, ఇండోనేషియాల సరసన చేరనున్న భారత్: ఎస్‌బీఐ

న్యూఢిల్లీ, జనవరి 19: ఎగువ మధ్య ఆదాయ దేశాలుగా ఉన్న చైనా, ఇండోనేషియాల సరసన భారత్ కూడా త్వరలోనే చేరనుంది. ఈ దశాబ్దం చివరి నాటికి ఎగువ మధ్య ఆదాయ దేశంగా అవతరించనుంది. స్థూల తలసరి ఆదాయం రూ.3,63,462(4 వేల డాలర్లు)కు చేరనుంది. అదేసమయంలో మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా కూడా మారనుంది. ఈ మేరకు స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా(ఎస్‌బీఐ) తన విశ్లేషణలో స్పష్టం చేసింది. "భారత స్థూల తలసరి ఆదాయం రూ.3,63,462కు

మిగతా 2వ పేజీలో...

'మహా' పతనం దిశగా చైనా జనాభా!

వేగంగా వృద్ధాప్యం వైపు అడుగులు

నేషనల్ బ్యూరో ఆఫ్ స్టాటిస్టిక్స్ నివేదిక

2

నోబెల్ ఇవ్వలేదుగా.. ఇక శాంతిమంత్రం ఉండదు



నార్వే ప్రధానికి ట్రంప్ సంచలన లేఖ

ఎనిమిది యుద్ధాలు ఆపినా తనకు నోబెల్ పురస్కారం ఇవ్వలేదని ఆక్రోశం

ఇకపై తాను శాంతికి కట్టుబడి ఉండాల్సిన పనిలేదని స్పష్టీకరణ

2

బులియన్ మార్కెట్‌కు గ్రీన్‌లాండ్ సెగ





ఒక్కరోజే రూ.పదివేలు పెరిగిన కిలో వెండి ధర.. రూ.3,02,600కి చేరిక

అదే బాటలో పసిడి.. రూ.1,900 పెరుగుదలతో రూ.1.48 లక్షలకు తులం బంగారం

10

ధాన్యం కొన్న రోజే సొమ్ము చెల్లింపు



అధికారులకు మంత్రి నాదెండ్ల ఆదేశం

తుది దశలో ఖరీఫ్ సీజన్ కొనుగోళ్ల ప్రక్రియ

24 గంటల్లోపే 94 శాతం నగదును రైతుల ఖాతాల్లో జమ చేసినట్లు వెల్లడి

11



ప్రధాని మోదీ, యూఏఈ అధ్యక్షుడు నహ్యాన్ సమక్షంలో ఒప్పంద పత్రాలను మార్చుకుంటున్న ఇరు దేశాల ప్రతినిధులు

రెండు గంటల పర్యటనలో కీలక ఒప్పందాలు

» భారత్ వచ్చిన యూఏఈ అధ్యక్షుడు

» ప్రధాని మోదీతో పలు అంశాలపై విస్తృత చర్చలు

న్యూఢిల్లీ, జనవరి 19: యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ (యూఏఈ) అధికారిక బృందం సోమవారం రెండు గంటల పాటు భారత్‌లో పర్యటించి కీలక ఒప్పందాలను కుదుర్చుకొంది. యూఏఈ అధ్యక్షుడు షేక్ మహమ్మద్ బిన్ జయేద్ అల్ నహ్యాన్ ఆధ్వర్యంలో వచ్చిన ఈ బృందంలో అబుదాబి, దుబాయ్ రాచకుటుంబాల సభ్యులు కూడా ఉన్నారు. యూఏఈ ఉప ప్రధాని, రక్షణ మంత్రిగా వ్యవహరిస్తున్న దుబాయ్ క్రౌన్ ప్రిన్స్ షేక్ హమ్దాన్ బిన్ మహమ్మద్ బిన్ మౌక్తుం కూడా ఈ బృందంలో ఉన్నారు. వీరంతా ప్రధాని మోదీతో విస్తృతంగా చర్చలు జరిపి ఉగ్రవాద నిర్మూలన, కృత్రిమ మేథ, రక్షణ రంగంలో సహకారం, వ్యూహాత్మక పెట్టుబడులు తదితర రంగాల్లో ఒప్పందాలను కుదుర్చుకొని పత్రాలను ఇచ్చిపుచ్చుకున్నారు. ఇందుకు సంబంధించిన వివరాలను భారత విదేశీ వ్యవహారాల శాఖ కార్యదర్శి విక్రం మిస్రి వెల్లడించారు. భారత్-యూఏఈల మధ్య రక్షణ రంగంలో వ్యూహాత్మక భాగస్వామ్యానికి సంబంధించిన సంకల్ప లేఖ(లెటర్ ఆఫ్ ఇంటెంట్)పై ఇరు పక్షాలు సంతకాలు చేశాయి. ఏటా 50 లక్షల టన్నుల వంతున దీర్ఘకాలం పాటు ద్రవీకృత సహజ వాయువు(ఎల్ఎన్‌జీ) సరఫరాపై ఒప్పందం కుదిరింది. గుజరాత్‌లోని ధేలారాలో ఉన్న స్పెషల్ ఇన్వెస్ట్‌మెంట్ రీజియన్‌లో యూఈఏ పెట్టుబడులకు సంబంధించిన సంకల్ప లేఖపై కూడా సంతకాలు జరిగాయి. ఆహార భద్రత, వ్యవసాయ రంగంలో సాంకేతిక పరిజ్ఞానానికి సంబంధించి అవగాహన ఒప్పందం(ఎంఓయూ) కుదిరింది. భారత్‌లో డాటా సెంటర్, సూపర్ కంప్యూటింగ్ క్లస్టర్, వినూత్నంగా 'డాటా ఎంబసీ' ఏర్పాటుపై చర్చలు జరిగాయి. సాంస్కృతిక రంగంలో సహకారంలో భాగంగా అబుదాబీలో 'హౌస్ ఆఫ్ ఇండియా' ఏర్పాటు చేయాలని నిర్ణయించారు.

నోబెల్ ఇవ్వలేదుగా.. ఇక శాంతిమంత్రం ఉండదు

» నార్వే ప్రధానికి అమెరికా అధ్యక్షుడి సంచలన లేఖ

వాషింగ్టన్, జనవరి 19: నోబెల్ శాంతి పురస్కారం కోసం తీవ్రంగా ప్రయత్నించి భంగపడిన అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్.. తన ఆక్రోషాన్ని మరోసారి వెల్లగక్కారు. ఈసారి ఏకంగా నోబెల్ శాంతి పురస్కారం ఇచ్చే నార్వే దేశ ప్రధానమంత్రికే నిందాపూర్వక లేఖ రాశారు. ఈ లేఖను బ్లూమ్‌బర్గ్ పత్రిక బయటపెట్టింది. ట్రంప్ తనకు లేఖ రాసినట్లు నార్వే ప్రధాని జోనాస్ గహర్ స్టోర్ కూడా సోమవారం ధ్రువీకరించారు. 'డియర్ జోనాస్.. ఎనిమిదికి పైగా యుద్ధాలను ఆపినా.. నోబెల్ శాంతి పురస్కారం విషయంలో మీరు నన్ను పరిగణనలోకి తీసుకోలేదు. అలాంటప్పుడు నేను ఇకపై పూర్తిగా శాంతికి కట్టుబడి ఉండాల్సిన అవసరం లేదు. నేనిప్పుడు అమెరికాకు ఏది మంచిది? ఏది అవసరం అని మాత్రమే ఆలోచించదల్చుకున్నాను. ఆ భూభాగాన్ని (గ్రీన్‌లాండ్) రష్యా లేదా చైనా నుంచి డెన్మార్క్ కాపాడలేదు. అలాంటప్పుడు దానిపై వారికి హక్కు ఎలా ఉంటుంది? గ్రీన్‌లాండ్‌పై అధికారాలకు సంబంధించి ఎలాంటి రాతపూర్వక ఒప్పంద పత్రాలు లేవు. మేము గ్రీన్‌లాండ్‌ను పూర్తిగా అధీనంలోకి తెచ్చుకోనంతకాలం ప్రపంచం శాంతియుతంగా ఉండలేదు' అని ట్రంప్ తన లేఖలో బెదిరించారు.

2025 నోబెల్ ఎప్పటికీ మచాడోదే

న్యూఢిల్లీ, జనవరి 19 : వెనిజులా ప్రతిపక్ష నేత మరియా మచాడోకి ఇచ్చిన 2025 సంవత్సరం నోబెల్ శాంతి బహుమతిని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌కు ఇచ్చివేయడంపై ప్రపంచ వ్యాప్తంగా చర్చ నెలకొంది. పలువురు దీనిపై విమర్శలు వ్యక్తం చేస్తూ.. నోబెల్ ఫౌండేషన్ దాన్ని వెనక్కు తీసుకోవాలని లేదా మరొకరికి ఇవ్వాలని సూచిస్తున్నారు. దీనిపై స్పందించిన నార్వేజియన్ నోబెల్ ఇన్‌స్టిట్యూట్.. మచాడో నోబెల్ బహుమతిని ట్రంప్‌కు ఇచ్చినా.. ఆ గౌరవం ఆమెకే చెందుతుందని పేర్కొంది. దాన్ని బదిలీ చేయడంగానీ, పంచుకోవడంగానీ, రద్దు చేయడంగానీ సాధ్యం కాదని గత వారమే స్పష్టం చేసింది. ఎప్పటికీ ఇదే తుది నిర్ణయమని, ఇందులో మార్పు ఉండదని పేర్కొంది.

ప్రణయ్ రాయ్ దంపతులకు ఢిల్లీ హైకోర్టులో ఊరట

న్యూఢిల్లీ, జనవరి 19: ఐటీ ఉత్తర్వులకు సంబంధించి ఎన్డీటీవీ వ్యవస్థాపకులు ప్రణయ్ రాయ్, రాధికా రాయ్ దంపతులకు ఊరట లభించింది. ఆదాయ పన్ను విభాగం ఈ ఇద్దరికి ఐటీ పునర్ మదింపునకు సంబంధించి జారీచేసిన నోటీసులను ఢిల్లీ హైకోర్టు కొట్టివేసింది. ఈ మేరకు జస్టిస్ దినేశ్ మెహతా, వినోద్ కుమార్‌లతో కూడిన ధర్మాసనం సోమవారం తీర్పు వెలువరించింది. ఐటీ విభాగం ప్రణయ్, రాధిక దంపతులకు రూ.లక్ష చొప్పున జరిమానా చెల్లించాలని నిర్దేశించింది. ఎన్డీటీవీ ప్రమోటర్ అయిన ఆర్ఆర్‌పీఆర్ హోల్డింగ్ ప్రైవేట్ లిమిటెడ్‌కు 2009-10లో టీవీ నెట్‌వర్క్ వడ్డీలేకుండా రూ.404 కోట్ల రుణాన్ని అందజేసిన అంశమ్మీద ఐటీ విభాగం నుంచి పన్ను ఎగవేత ఆరోపణలొచ్చాయి. దీనిపై 2016లో ప్రణయ్, రాధికలకు ఐటీ విభాగం సదరు ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ఐటీ పునర్ మదింపు చేయాలని నోటీసులు జారీచేసింది. దీన్ని ప్రణయ్, రాధిక దంపతులు 2017లో ఢిల్లీ హైకోర్టులో సవాలు చేశారు. ఈ వ్యవహారానికి సంబంధించి 2011లో పునర్ మదింపు ప్రక్రియ ప్రారంభించి 2013లో ముగించారని కక్షిదారులు కోర్టు దృష్టికి తెచ్చారు. అయితే దీనిపైనే 2016 మార్చి 31న మళ్లీ ఐటీ అధికారులు నోటీసులు జారీ చేశారని పేర్కొన్నారు. ఆదాయపన్ను నిబంధనల ప్రకారం ఒకే కేసులో రెండోసారి ఐటీ పునర్ మదింపు ప్రక్రియ కోసం నోటీసులు జారీ చేయడం చెల్లదని కోర్టు దృష్టికి తెచ్చారు. ఈ వాదనతో ధర్మాసనం ఏకీభవించింది. నోటీసులను కొట్టివేస్తూ ఉత్తర్వులు జారీచేసింది. మూడేళ్ల క్రితమే ఆ కేసు ముగిసిందని.. మళ్లీ నోటీసులివ్వడం వేధించడమేనని వ్యాఖ్యానించింది.

స్పెయిన్‌లో ఢీకొన్న రెండు హైస్పీడ్ రైళ్లు

» 39 మంది మృతి.. 100 మందికి పైగా గాయాలు

ఆడముజ్, జనవరి 19: స్పెయిన్‌లో ఘోర రైలు ప్రమాదం చోటుచేసుకుంది. ఓ హైస్పీడ్ రైలు పట్టాలు తప్పి ఎదురుగా వస్తున్న మరో హైస్పీడ్ రైలును ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో 39 మంది మరణించగా.. 100 మందికి పైగా గాయపడ్డారు. వీరిలో కొందరి పరిస్థితి విషమంగా ఉంది. ఆదివారం రాత్రి 7.45 గంటల సమయంలో మలాగా నుంచి రాజధాని మాడ్రిడ్‌కు వెళ్తున్న హైస్పీడ్ రైలు (ఇర్యో) పట్టాలు తప్పి ఎదురుగా హుయెల్వాకు వెళ్తున్న హైస్పీడ్ రైలు (రెన్ఫే)ను ఢీకొట్టింది. ఈ సమయంలో రెండు రైళ్లలో దాదాపు 400 మంది ఉన్నారు.

ఆ 1.25 కోట్ల ఓటర్ల పేర్లను పంచాయతీల్లో ప్రదర్శించండి

(మొదటి పేజీ తరువాయి)

ఓటర్ల పేర్లను వారి గ్రామపంచాయతీలోనే ప్రదర్శించాలని ఆదేశించింది. ఆయా ఓటర్లు తమకు సంబంధించిన సరైన గుర్తింపు పత్రాలను సమర్పించేందుకు అవకాశం ఇవ్వాలని, ఆ పత్రాలను ప్రతి గ్రామపంచాయతీ, బ్లాక్ ఆఫీసుల్లో స్వీకరించాలని సూచించింది. ఇందుకోసం అవసరమైన మానవ వనరులను సమకూర్చాలని పశ్చిమబెంగాల్ ప్రభుత్వాన్ని ఆదేశించింది. ఈ ప్రక్రియ సజావుగా సాగేందుకు ఏర్పాట్లు చేయాలని ఆ రాష్ట్ర డీజీపీకి సూచించింది.

'మహా' పతనం దిశగా

చైనా జనాభా!



వేగంగా వృద్ధాప్యం వైపు అడుగులు.. నేషనల్ బ్యూరో ఆఫ్ స్టాటిస్టిక్స్ నివేదిక

బీజింగ్, జనవరి 19: అధిక జనాభా అండతో బలమైన ఆర్థిక శక్తిగా అవతరించిన చైనాకు.. ఇప్పుడు అతిపెద్ద శత్రువు యుద్ధమో.. ఆర్థికమాంద్యమో కాదు. స్వయంగా ఆ దేశంలో పడిపోతున్న జనాభా. ప్రస్తుతం చైనా తీవ్రమైన 'జనాభా సంక్షోభం' అంచున ఉంది. నేషనల్ బ్యూరో ఆఫ్ స్టాటిస్టిక్స్(ఎన్‌బీఎస్) సోమవారం విడుదల చేసిన గణాంకాలు డ్రాగన్ దేశాన్ని కలవరపెడుతున్నాయి. వరుసగా నాలుగో ఏడాది జనాభా తగ్గుదల సమస్యతో ఆ దేశం తంటాలు పడుతోంది. దీర్ఘకాలంలో శ్రామికశక్తి తగ్గిపోయి ఆర్థికంగా సంకట స్థితి ఏర్పడుతుందని ఆందోళన చెందుతోంది. ప్రభుత్వం ఎన్ని దిద్దుబాటు చర్యలు చేపట్టినా అక్కడి యువత పెళ్లి చేసుకోవడానికి ససేమిరా అంటుండడంతో సంతృప్తికర ఫలితాలనివ్వడం లేదు. దీంతో దేశంలో వృద్ధ జనాభా పెరిగి, జననాల రేటు తగ్గి సంక్షోభం నెలకొన్న వేళ దేశ భవిష్యత్తుపై నీలినీడలు కమ్ముకున్నాయి.

65ఏళ్లలో ఎన్నడూ లేని విధంగా సంక్షోభం

ఎన్‌బీఎస్ గణాంకాల ప్రకారం, గతేడాదితో పోలిస్తే చైనా జనాభా 140.83కోట్ల నుంచి 140.49కోట్లకు పడిపోయింది. అంటే 33.9లక్షల జనాభా కనుమరుగైంది. 2025లో సుమారు 79.2లక్షల మంది పిల్లలు జన్మించారు. ఈ సంఖ్య 2024 జననాల రేటు(95.4లక్షలు)తో పోలిస్తే 17శాతం తగ్గిందని నివేదిక పేర్కొంది. 1949 నుంచి ఇప్పటి వరకు నమోదైన అత్యల్ప జనన రేటు ఇదే. పరిస్థితి ఇలాగే కొనసాగితే 2100నాటికి చైనా జనాభా 63.3 కోట్లకు పడిపోతుందని ఐక్యరాజ్యసమితి అంచనా వేసింది. మరోవైపు చైనా వేగంగా వృద్ధాప్యం వైపు అడుగులేస్తోంది. 2024 చివరి నాటికి 60ఏళ్లు పైబడిన వారి సంఖ్య 31కోట్లకు చేరగా, 2035 నాటికి 40కోట్లు దాటుతుందని అంచనా. ఓవైపు జననాల రేటు తగ్గుతుంటే, మరణాల సంఖ్య ఆందోళన కలిగిస్తోంది. గతేడాది చైనాలో సుమారు 1.13కోట్ల మంది మరణించారు. గత 50ఏళ్లలో ఇన్ని మరణాలు సంభవించడం ఇదే తొలిసారి. 65ఏళ్ల క్రితం సంభవించిన ఘోర కరువు తర్వాత, చైనాలో జనాభా ఇంతవేగంగా తగ్గడం ఇప్పుడే జరుగుతోందని నిపుణులు పేర్కొన్నారు.

యువత ఆలోచనలో మార్పే కారణమా ?

ఈ జనాభా సంక్షోభానికి చైనా కొన్నేళ్లుగా అమలు చేసిన 'ఒక్కరు ముద్దు' విధానంతో పాటు యువత ఆలోచన ధోరణిలో వచ్చిన విప్లవాత్మక మార్పులే మూలకారణాలుగా విశ్లేషకులు భావిస్తున్నారు. అయితే జననాల రేటు భారీగా పడిపోతోందని గ్రహించిన డ్రాగన్ దేశం.. 2016లో ఒకే సంతానం విధానానికి స్వస్తి పలికింది. అప్పటి నుంచి ముగ్గురు సంతానం ఉండొచ్చని ప్రకటించడంతో పాటు ప్రజలకు ప్రోత్సాహకాలు కూడా ఇవ్వడం మొదలు పెట్టింది. పిల్లల పెంపకం, విద్య, జీవన వ్యయానికి అయ్యే ఖర్చులు భారీగా పెరగడంతో పిల్లలు కనడానికి యువజంటలు ముందుకు రాకపోవడంతో, ప్రభుత్వం ఏటా ప్రతిబిడ్డకు సుమారు రూ.1.28లక్షల సబ్సిడీని ప్రకటించింది. కండోమ్‌లపై పన్ను పెంచడం వంటి వినూత్న చర్యల ద్వారా కూడా జననాల రేటు పెంచేందుకు ప్రయత్నించింది. అయితే, 2025 మొదటి మూడు త్రైమాసికాల్లో వివాహాల నమోదులో 8.5శాతం పెరుగుదలను నమోదు చేయడం కొంత సానుకూలాంశమని నివేదిక తెలిపింది. జనాభా తగ్గుదల వేగాన్ని విశ్లేషించిన చైనా ఆర్థిక నిపుణులు.. యువతలో వివాహం పట్ల పెరుగుతున్న విముఖత, ఆర్థిక ఒత్తిడితో పాటు ముఖ్యంగా మహిళల్లో తమ కెరీర్ దెబ్బతింటుందనే ఆందోళనే ఇందుకు ప్రధాన అడ్డంకులుగా మారాయని వెల్లడించారు.

అబూదాబిలో మనకూ చమురు నిల్వలు

» భారీ చమురు నిక్షేపాలను ఆవిష్కరించిన 'ఉర్జా భారత్'

» ఇకపై ఉత్పత్తి రంగంలోనూ ఇండియా

యూఏఈ రాజధాని అబూదాబిలో భారతీయ కంపెనీ 'ఉర్జా భారత్' ఇటీవల భారీ ఎత్తున చమురు నిక్షేపాలను గుర్తించటం.. ఈ రంగానికి సంబంధించి భారత్ ప్రస్థానంలో ఒక మైలురాయిగా నిపుణులు అభివర్ణిస్తున్నారు. ఇప్పటి వరకు చమురు దిగుమతిదారుగానే ఉన్న భారత్.. చమురు ఉత్పత్తిలో కీలకమైన పాత్రధారిగా ఈ ఆవిష్కరణతో మారిందని చెబుతున్నారు. భారత్ పెట్రోలియం కార్పొరేషన్ అనుబంధ సంస్థ భారత్ పెట్రో రిసోర్సెస్, ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ సంయుక్తంగా ఏర్పాటు చేసిన సంస్థ ఉర్జా భారత్. ఈ సంస్థ అబూదాబిలో 2019లో చమురు అన్వేషణ కాంట్రాక్టును దక్కించుకొని, బ్లాక్-1లో తవ్వకాలు చేపట్టింది. ఈ ప్రాజెక్టుపై 16.60 కోట్ల డాలర్ల(రూ.1508 కోట్లు) పెట్టుబడి పెట్టింది. అన్వేషణ ఫలించి 2024లో తొలిసారిగా ఎక్స్ఎన్-76 బావిలో చమురు నిల్వలు బయటపడ్డాయి. తాజాగా ఈ నెలలో ఎక్స్ఎన్-79 02ఎస్ బావిలో భారీగా చమురు నిల్వలు గుర్తించారు.

అక్కడ 15% సక్సెస్ రేటు మాత్రమే

అబూదాబిలో ఉర్జా భారత్ చమురు నిల్వలకై అన్వేషణ జరిపిన బ్లాక్-1లో సక్సెస్ రేటు 15 శాతం మాత్రమే ఉంది. అధునాతన సాంకేతిక పరిజ్ఞానం ఉంటేగానీ ఆ ప్రాంతంలో చమురును గుర్తించటం సాధ్యం కాదు. కానీ, ఉర్జా భారత్.. రెండేళ్లలో ఏకంగా రెండు బావుల్లో చమురు నిక్షేపాలను గుర్తించటం.. చమురు అన్వేషణలో భారత్ సామర్థ్యానికి అద్దం పడుతోంది. ఈ ఆవిష్కరణలతో.. పశ్చిమాసియాలో చమురు అన్వేషణలో ఉన్న సంస్థలు, దేశాలన్నింటినీ తనవైపు తల తిప్పి చూసేలా చేసింది ఉర్జా భారత్. ఉర్జా భారత్ ఆధీనంలో ఉన్న బ్లాక్-1.. 6,162 కి.మీ. పరిధితో కూడిన విశాల ప్రాంతం. విదేశాల్లో భారత్ చేపట్టిన అతి పెద్ద చమురు అన్వేషణ ఇదే. భవిష్యత్తులో ఇక్కడ మరిన్ని చమురు నిల్వలను గుర్తించే అవకాశం ఉంది. చమురు ఉత్పత్తిలో భారత్ వేగంగా అడుగులు వేయటం స్వావలంబనకు తోడ్పడనుంది. అంతేకాదు, యూఏఈతో సంబంధాలు మరింత మెరుగుపడి.. భారత్ చమురు అవసరాలకు సంబంధించి మరో నమ్మకమైన భాగస్వామ్యదేశంగా యూఏఈ ఆవిర్భవించే అవకాశాలూ ఉన్నాయి.


- సెంట్రల్‌డెస్క్

కస్టోడియల్ మృతి కేసులో..

సెంగార్ శిక్ష సస్పెన్షన్‌కు ఢిల్లీ హైకోర్టు నిరాకరణ

న్యూఢిల్లీ, జనవరి 19: ఉత్తరప్రదేశ్‌లోని ఉన్నావ్‌లో జరిగిన లాకప్ మృతి కేసులో శిక్ష అనుభవిస్తున్న బీజేపీ బహిష్కృత నేత కులదీప్ సింగ్ సెంగార్‌కు సోమవారం ఢిల్లీ హైకోర్టులో నిరాశ ఎదురయింది. ఆయన శిక్షను సస్పెండ్ చేయడానికి ధర్మాసనం నిరాకరించింది. ఉన్నావ్‌లో బాలికపై జరిగిన అత్యాచారం చేసిన కేసులో ఆయన జీవితకాల కారాగార శిక్ష అనుభవిస్తున్నారు. ఆ కేసు విచారణ జరుగుతున్న సమయంలో బాధితురాలి తండ్రి పోలీసు కస్టడీలో మరణించడంతో సెంగార్‌పై కూడా కేసు పెట్టారు. ఈ రెండో కేసులో ఆయనకు పదేళ్ల కఠిన కారాగార శిక్ష, రూ.10 లక్షల జరిమానా విధిస్తూ ట్రయల్ కోర్టు తీర్పు ఇచ్చింది. ఇప్పటికే తొమ్మిదేళ్లు జైలులో ఉన్నానని, ఇంకా 11 నెలలు మాత్రమే మిగిలి ఉన్నందున శిక్షను సస్పెండ్ చేయాలని ఆయన ఢిల్లీ హైకోర్టును ఆశ్రయించారు. ట్రయల్ కోర్టు తీర్పుపై తాను చేసిన అప్పీలు ఇంకా పెండింగ్‌లో ఉందని తెలిపారు. అప్పీలు పెండింగ్‌లో ఉందన్న కారణంతో శిక్షను సస్పెండ్ చేయలేమని కేసును విచారించిన జస్టిస్ రవీందర్ డుడేజా తెలిపారు.

లోకం తీరు



ఆఫీసులోనే డీజీపీ ర్యాంక్ అధికారి రాసలీలలు

(మొదటి పేజీ తరువాయి)

ప్రభుత్వానికి చెడ్డపేరు వచ్చిందని సీఎం సిద్దరామయ్య ఆగ్రహం వ్యక్తం చేసినట్లు సమాచారం. రామచంద్రరావు నుంచి వివరణ తీసుకుని చర్యలు తీసుకోవాలని హోం శాఖను ఆదేశించినట్లు తెలుస్తోంది. అయితే ఆ వీడియోలు మార్ఫింగ్ చేసినవని రామచంద్రరావు చెబుతున్నారు. ఏపీలోని గుంటూరుకు చెందిన రామచంద్రరావు 1993 బ్యాచ్ ఐపీఎస్ అధికారి. 2023లో ఆయన డీజీపీగా పదోన్నతి పొందారు. వచ్చే జూన్‌లో ఆయన రిటైర్ కాబోతున్నారు. ఆయన పదవీకాలంలో పలుమార్లు వివాదాల్లో చిక్కుకున్నారు. ఆయన పెంపుడు కూతురు, సినీనటి రన్యారావ్ దుబాయ్ నుంచి పలుమార్లు బంగారాన్ని అక్రమంగా తీసుకొచ్చిన విషయం గతంలో దేశవ్యాప్తంగా సంచలనమైంది. ఎయిర్‌పోర్టు నుంచి రన్యారావ్ ఎలాంటి చెకింగ్ లేకుండా ప్రొటోకాల్ ద్వారా బయటకు వచ్చేందుకు పోలీసు వాహనాన్ని వినియోగించారు. ఈ కేసును సిట్ అధికారులు దర్యాప్తు జరిపారు. ఈ క్రమంలో డీజీపీపై అప్పట్లో సస్పెన్షన్ వేటు పడింది. గత ఏడాది చివర్లో మరోసారి రామచంద్రరావుకు పోస్టింగ్ ఇచ్చారు. పోలీస్ హౌసింగ్, ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ సీఎండీగా పనిచేసిన సమయంలోనూ ఆయన కేసులు, అంతర్గత విచారణలు ఎదుర్కొన్నారు. దక్షిణ రేంజ్ ఐజీపీగా ఉన్నప్పుడు ఓ కేసులో పట్టుబడ్డ డబ్బులో పెద్ద మొత్తం మాయం చేశారనే ఆరోపణలు ఆయనపై వచ్చాయి. కాగా హోం మంత్రి పరమేశ్వర్‌ను కలిసి వివరణ ఇచ్చేందుకు సోమవారం సాయంత్రం రామచంద్రరావు ప్రయత్నించినా సాధ్యంకాలేదు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ వైరల్ అయిన వీడియోలు మార్ఫింగ్ చేసినవన్నారు. ఇది తన పరువుకు భంగం కలిగించేందుకు చేసిన కుట్ర అని ఆరోపించారు. ఆ వీడియోలు 8 క్రితం నాటివని, ఆ సమయంలో తాను బెళగావిలో ఉన్నానన్నారు.

ఎగువ మధ్య ఆదాయ దేశంగా భారత్!

(మొదటి పేజీ తరువాయి)

చేరనుందన్న అంచనాల నేపథ్యంలో ఎగువ మధ్య ఆదాయ దేశాలుగా ఉన్న చైనా, ఇండోనేషియాల సరసన భారత్ కూడా చేరనుంది'అని ఎస్‌బీఐ పేర్కొంది. ఈ విశ్లేషణకు ఇటీవల ప్రపంచ బ్యాంకు ఉదహరించిన అంశాలను జోడించింది. తలసరి స్థూల జాతీయ ఆదాయం ఆధారంగా ప్రపంచ బ్యాంకు వివిధ దేశాలను మధ్య అధిక ఆదాయ, ఉన్నత మధ్య ఆదాయ దేశాలుగా వర్గీకరించింది. దీనికిగాను 1990-2024 మధ్య గణాంకాలను పరిగణనలోకి తీసుకుంది. ఈ లెక్కల ప్రకారం.. చైనా తలసరి ఆదాయం 1990లో 330 డాలర్లు ఉండగా.. 2024 నాటికి పుంజుకుని ఉన్నత మధ్య ఆదాయ దేశంగా మారింది. ప్రపంచ బ్యాంకు సూచీల ప్రకారం అల్పాదాయ దేశాలు 26 ఉండగా, దిగువ మధ్యస్థ ఆదాయ దేశాలుగా 50, ఉన్నత మధ్య ఆదాయ దేశాలుగా 54 ఉన్నాయి. ఇక, అధిక ఆదాయ దేశాల సంఖ్య పెరిగి 87కు చేరింది.

మరిన్ని కీలక విషయాలు..

- ప్రపంచంలో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా అమెరికా తన స్థాయిని నిలబెట్టుకుంది.
- 2028 నాటికి జర్మనీని తోసిపుచ్చి భారత్ మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా దూసుకుపోనుంది. 1962లో 90 డాలర్లుగా ఉన్న భారత తలసరి అల్ప ఆదాయం నుంచి 910డాలర్లకు చేరడానికి60ఏళ్లు పట్టింది.
- ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా అవతరించేందుకు భారత్‌కు తొలి విడత 60ఏళ్లు పట్టగా, 2014 నాటికి 2 ట్రిలియన్ డాలర్ల వ్యవస్థకు చేరింది. 2021 నాటికి 3 ట్రిలియన్ డాలర్లు, 2025నాటికి 4 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా మారింది.
- మరో రెండేళ్లలో భారత్ రమారమి 5 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థకు చేరనుంది. భారత స్థూల తలసరి ఆదాయం 2026నాటికి రూ.2,72,611, 2030నాటికి రూ.3,63,462కు చేరనుంది.

బీజేపీ సారథిగా నితిన్ నబీన్

(మొదటి పేజీ తరువాయి)

నామినేషన్ పత్రాలు దాఖలయ్యాయి. బరిలో ఒక్కరే ఉండటంతో ఆయన ఎన్నిక ఏకగ్రీవంగా ఖరారు కాగా, అధికారికంగా ప్రకటించడమే మిగిలింది. మంగళవారం ఉదయం 11.30గంటల తర్వాత పార్టీ కేంద్ర కార్యాలయంలో పార్టీ జాతీయ కౌన్సిల్ సభ్యులు, ముఖ్య నేతల సమక్షంలో ప్రధాని నరేంద్ర మోదీ, పార్టీ రిటర్నింగ్ ఆఫీసర్ కె.లక్ష్మణ్‌తో కలిసి బీజేపీ నూతన అధ్యక్షుడి పేరును ప్రకటించనున్నారు. నితిన్ నబీన్ అభ్యర్థిత్వాన్ని బలపరుస్తూ తెలుగు రాష్ట్రాల బీజేపీ నేతలు నామినేషన్ పత్రాలు సమర్పించారు. తెలంగాణ బీజేపీ తరఫున పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావు నేతృత్వంలో కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి, ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, డీకే అరుణ, ఎమ్మెల్యే పాయల్ శంకర్, ఎమ్మెల్సీ మల్క కొమరయ్య నామినేషన్ పత్రాలను లక్ష్మణ్‌కు అందజేశారు. ఉమ్మడి బిహార్‌లోని రాంచీలో పుట్టిన నితిన్ నబీన్ తొలుత బీజేవైఎం జాతీయ ప్రధాన కార్యదర్శిగా పనిచేశారు. ఇంటర్మీడియట్ చదివిన ఆయన బీజేపీ తరఫున కొన్ని రాష్ట్రాలకు ఇన్‌ఛార్జిగా పనిచేశారు. బిహార్ బాంకీపూర్ నుంచి వరుసగా 4సార్లు ఎమ్మెల్యేగా గెలిచారు. ఆయనకు ఆర్ఎస్ఎస్ నేపథ్యం ఉంది. బిహార్ నుంచి బీజేపీ జాతీయ అధ్యక్షుడి హోదాకు ఎదిగిన తొలి నేత నితిన్ నబీన్.

అమెరికాపై ఈయూ ట్రేడ్ బజూకా?

ట్రంప్ విధించిన 'గ్రీన్‌లాండ్ టారిఫ్'పై మండిపాటు.. బదులుగా అమెరికాపై ప్రతీకార సుంకాలు వేసే చాన్స్

» యూరప్ దేశాల్లో అమెరికా పెట్టుబడులకు అడ్డుకట్ట.. ఎల్లుండి నిర్వహించే భేటీలో నిర్ణయం

లండన్, జనవరి 19: అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తమపై విధించిన 10శాతం 'గ్రీన్‌లాండ్ టారిఫ్'పై మండిపడుతున్న యూరప్ దేశాలు.. అందుకు ప్రతిగా అమెరికాపై 'ట్రేడ్ బజూకా'ను ప్రయోగించే అంశంపై మల్లగుల్లాలు పడుతున్నాయి. ఈ ప్రతిపాదనకు ఫ్రాన్స్ సుముఖంగా ఉండగా.. జర్మనీ మాత్రం దాన్ని ఇప్పటికిప్పుడు అమలు చేయకుండా ఆచితూచి వ్యవహరించాలని, అమెరికాను భయపెట్టే ఆయుధంగా దాచి ఉంచాలని వాదిస్తోంది. బ్రిటన్ ప్రధాని కీర్ స్టార్మర్ కూడా వాణిజ్య యుద్ధాల వల్ల ఎవరికీ ఉపయోగం ఉండదని అభిప్రాయపడుతున్నారు. దీనిపై తాను ట్రంప్‌తో వ్యక్తిగతంగా మాట్లాడానని.. 'మీరు చేస్తున్నది తప్పు' అని కూడా చెప్పానని స్టార్మర్ తెలిపారు. గ్రీన్‌లాండ్‌ను తన ఆధీనంలోకి తెచ్చుకునేందుకు అమెరికా చేస్తున్న ప్రతిపాదనలను వ్యతిరేకిస్తున్న డెన్మార్క్, ఫ్రాన్స్, జర్మనీ, యూకే, నార్వే, స్వీడన్, ఫిన్లాండ్, నెదర్లాండ్స్ దేశాలపై ట్రంప్ 10శాతం అదనపు సుంకాలను ట్రంప్ ప్రకటించారు. జూన్ నుంచి ఈ అదనపు సుంకాలను 25శాతానికి పెంచుతామని.. గ్రీన్‌లాండ్ అమెరికా ఆధీనంలోకి వచ్చే వరకు సుంకాలు కొనసాగిస్తామని ట్రంప్ పేర్కొన్నారు (ట్రంప్ ప్రకటించిన గ్రీన్‌లాండ్ టారిఫ్‌తో ఈయూ దేశాలపై సుంకాలు ఫిబ్రవరి1 నుంచి 25 శాతానికి, జూన్‌తర్వాత 40శాతానికి పెరుగుతాయి). ఈ నేపథ్యంలోనే.. అమెరికాపై ట్రేడ్ బజూకాను



ప్రయోగించాల్సిందిగా ఈయూకు విజ్ఞప్తి చేస్తానని ఫ్రాన్స్ అధ్యక్షుడు మేక్రాన్ ఇప్పటికే ప్రకటించారు.

ఏమిటీ ట్రేడ్ బజూకా?

సుంకాల విధింపు, పెట్టుబడులను అడ్డుకోవడం, సేవల నిలిపివేత వంటి చర్యలతో ఇతర దేశాలు ఆర్థికపరమైన ఒత్తిడి తెచ్చి, రాజకీయ నిర్ణయాలను తీసుకునేలా యూరప్ దేశాలను బలవంతం చేసిన సందర్భాల్లో బలంగా ప్రతిఘటించడానికి, అటువంటి ఒత్తిళ్లపై పోరాడడానికి యూరోపియన్ యూనియన్ దేశాలు ఒక కొత్త, శక్తిమంతమైన ఆర్థిక, వాణిజ్య విధానాన్ని రూపొందించుకున్నాయి. దానిపేరు 'యాంటీ కొయెర్షన్ ఇన్‌స్ట్రుమెంట్ (ఏసీఐ)'. దీన్నే 'ట్రేడ్ బజూకా'గానూ వ్యవహరిస్తున్నారు. 2023 చివరి నుంచి ఇది అమల్లోకి వచ్చింది. 'పాలిటిక్స్ కోసం ఎకనమిక్స్‌ను వాడే' దేశాలపై ఈయూ ప్రయోగించే శక్తిమంతమైన ఆయుధమది.

'ట్రేడ్ బజూకా' ఎలా పనిచేస్తుంది?

- తమపై ఆర్థిక ఒత్తిడి తెచ్చేందుకు ప్రయత్నిస్తున్న అమెరికా నుంచి దిగుమతి చేసుకునే వస్తువులపై అదనపు సుంకాలు విధించడానికి
- అమెరికన్ కంపెనీలేవీ ఈయూ ప్రభుత్వ కాంట్రాక్టులు పొందకుండా నిలువరించడానికి
- యూరప్ దేశాల్లో అమెరికన్ పెట్టుబడులను పరిమితం చేయడానికి
- అమెరికాకు భారీగా లాభాలు తెచ్చే సేవల రంగాల్లో ఈయూ మార్కెట్లోకి అమెరికా కంపెనీలకు ప్రవేశాన్ని నిలిపివేయడానికి ట్రేడ్ బజూకా ఒక ఆయుధంలా ఈయూకు ఉపయోగపడుతుంది.

సాధారణంగా రెండు దేశాల మధ్య వాణిజ్యపరమైన విభేదాలు/తగాదాలు వస్తే ప్రపంచ వాణిజ్య సంస్థ ఆ తగువును తీరుస్తుంది. ఆ ప్రక్రియ చాలా నెమ్మదిగా ఉంటుంది. దానికన్నా వేగంగా చర్యలు తీసుకునే అవకాశాన్ని ఈ 'ట్రేడ్ బజూకా' యూరప్ దేశాలకు కల్పిస్తుంది.

ఏం చేద్దాం?

ట్రంప్ సుంకాల రంకెల నేపథ్యంలో దీనిపై చర్చించేందుకు ఈయూ నేతలు గురువారం బ్రసెల్స్‌లో అత్యవసర శిఖరాగ్ర సమావేశ నిర్వహణకు సిద్ధమయ్యారు. ట్రంప్ తమపై విధించిన సుంకాలకు బదులుగా.. అమెరికా ఉత్పత్తులపై 9300 కోట్ల యూరోల (దాదాపు రూ.9.78 లక్షల కోట్ల) సుంకాలు విధించాలని ఈయూ దేశాలు గతంలోనే నిర్ణయించాయి. సుంకాల యుద్ధాన్ని నివారించడానికి ఆ నిర్ణయం అమలును ఈయూ ఆర్నెళ్లు వాయిదా వేసింది. గురువారం జరిగే భేటీలో ఎక్కువ దేశాలు ఈ టారిఫ్‌ల ప్యాకేజీ అమలుకు ఆమోదం తెలిపితే ఫిబ్రవరి 6 నుంచి ఆ సుంకాలు అమల్లోకి రావొచ్చు.

మిలియనీర్ బిచ్చగాడు

ఇండోర్, జనవరి 19: క్లీన్ సిటీ ఇండోర్‌లో నిత్యం ఎంతో రద్దీగా ఉండే ప్రాంతం సరాఫా బజార్. ఒక్కడ నాలుగు చక్రాలున్న చెక్కపై కూర్చుని, చేతులకున్న బూట్లతో బండిని తోసుకుంటూ దీనంగా చూసే మంగీలాల్‌ను చూసి కరిగిపోయి డబ్బులు వేసే వాళ్లు ఎంతో మంది. కొన్నేళ్లుగా బిచ్చమెత్తుకుంటున్న అతను కోట్లకు అధిపతి అని తెలియడంతో అనేక మంది ఆశ్చర్యానికి లోనయ్యారు. బిచ్చగాళ్లు లేని నగరంగా తీర్చిదిద్దాలన్న లక్ష్యంతో పనిచేస్తున్న అధికారులకు అతనిపై అనేక ఫిర్యాదుల అందాయి. ఈ నేపథ్యంలో మహిళా, శిశు అభివృద్ధి శాఖ మంగీలాల్‌ను మానవ అక్రమ రవాణా బాధితుడిగా గుర్తించి సరాఫా బజార్ నుంచి రక్షించి, విచారణ నిమిత్తం పోలీసులకు అప్పగించింది. విచారణలో బయటపడ్డ వాస్తవాలు చూసి పోలీసులు నోరెళ్లబెట్టారు. బిచ్చగాడు మంగీలాల్ వాస్తవంగా కోట్లకు అధిపతి. అతనికి మూడు స్వంత ఇళ్లు ఉన్నాయి. అవి రూ.కోటి వరకూ విలువ చేస్తాయి. అద్దెకు ఇవ్వడానికి మూడు ఆటోలు, ఒక విలాసవంతమైన కారు ఉన్నాయి. రోజూ తనకు వచ్చిన డబ్బులతో వడ్డీ వ్యాపారం చేస్తున్నాడు.



దావోస్‌లో భారత్ జోష్

» రామ్మోహన్ నాయుడు, కేంద్ర మంత్రులు, చంద్రబాబు, రాష్ట్రాల సీఎంలు హాజరు

న్యూఢిల్లీ, జనవరి 19: దావోస్ వేదికగా మరిన్ని అంతర్జాతీయ పెట్టుబడులను ఆకర్షించేందుకు భారత్ సిద్ధమైంది. సోమవారం నుంచి ఐదు రోజుల పాటు స్విట్జర్లాండ్‌లోని దావోస్‌లో జరగనున్న 56వ వార్షిక సదస్సులో పాల్గొనేందుకు కేంద్ర మంత్రులు, రాష్ట్ర ముఖ్యమంత్రులు, పారిశ్రామిక ప్రముఖులు ఇప్పటికే సమావేశ ప్రాంగణానికి చేరుకున్నారు. జెన్సన్ హువాంగ్, సత్య నాదెళ్ల(ఏఐ) సహా ప్రపంచవ్యాప్తంగా 130 దేశాలకు చెందిన మూడు వేలమంది ప్రతినిధులు దావోస్ సదస్సులో పాల్గొంటున్నారు. ట్రంప్ సుంకాలు, భౌగోళిక ఉద్రిక్తతల కారణంగా ప్రపంచ ఆర్థిక వ్యవస్థ అనిశ్చితికి గురి అవుతుండటంపై సదస్సులో చర్చించనున్నారు. కాగా, అమెరికా వ్యాపార బృందానికి ట్రంప్ నేతృత్వం వహిస్తున్నారు. కేంద్ర మంత్రులు రామ్మోహన్ నాయుడు, అశ్వినీ వైష్ణవ్, శివరాజ్‌సింగ్ చౌహాన్, ప్రహ్లాద్ జోషి; రాష్ట్రాల ముఖ్యమంత్రులు చంద్రబాబు, దేవేంద్ర ఫడణవీస్, హేమంత్ సోరెన్, మోహన్ యాదవ్, హిమాంత బిశ్వా శర్మ తదితరులు ఇక్కడకు చేరుకున్నారు. మనదేశం నుంచి వందకుపైగా దిగ్గజ కంపెనీల సీఈవోలు దావోస్ చేరుకున్నారు.

భారత్‌లో రిజర్వేషన్లు భేష్

భారత్‌లో రాజకీయ రిజర్వేషన్ల అమలు తీరును ఆక్స్‌ఫామ్ ప్రశంసించింది. ఆర్థికంగా అవకాశాలు దక్కని, సామాజికంగా దూరంపెట్టిన ఎస్సీ, ఎస్టీల ప్రాతినిధ్యాన్ని రిజర్వేషన్లు రాజకీయాల్లో పెంచగలిగాయని తన నివేదికలో తెలిపింది. అసమానతలు ఉన్నా.. రాజకీయ, వ్యవస్థీకృత, సామాజిక మద్దతు దొరికి, విధాన నిర్ణయాలను ప్రభావితం చేసే వీలున్న రాజకీయ వ్యవస్థలు కలిగిన సమాజంలో సామాన్యులు సాధికారికతను పొందగలుగుతున్నారని తెలిపింది. ఈ నివేదికను దావోస్ సదస్సులో ఆవిష్కరించారు.

గల్ఫ్ దేశాల్లో ఎన్టీఆర్‌కు ఘనంగా నివాళి



ఎన్టీఆర్ వర్ధంతిని పురస్కరించుకుని సౌదీ అరేబియాలో, బహ్రెయిన్‌లో నివాళులు అర్పిస్తున్న టీడీపీ కార్యకర్తలు, అభిమానులు

(ఆంధ్రజ్యోతి గల్ఫ్ ప్రతినిధి)

తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపకుడు, దివంగత ముఖ్యమంత్రి నందమూరి తారక రామారావు 30వ వర్ధంతి సందర్భంగా ఆదివారం రాత్రి గల్ఫ్ దేశాల్లో తెలుగు దేశం పార్టీ కార్యకర్తలు, అభిమానులు ఆయనకు ఘనంగా నివాళులు అర్పించారు. తెలుగుదేశం పార్టీ సౌదీ అరేబియా అధ్వర్యంలో రాజధాని రియాద్ నగరంలో జాని బాషా అధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో పార్టీ అభిమానులు, కార్యకర్తలు భారీగా పాల్గొన్నారు. సమాజమే దేవాలయం ప్రజలే దేవుళ్లు అనే సిద్దాంతాన్ని తెలుగునాట శ్రీకారం చుట్టిన మహానాయకుడు ఎన్టీఆర్ అని జానీ బాషా పేర్కొన్నారు. బహ్రెయిన్ జరిగిన కార్యక్రమంలో పార్టీ నాయకులను ఉద్దేశించి శాసన సభ స్పీకర్ అయ్యన్న పాత్రుడు వీడియో కాల్ ద్వారా మాట్లాడారు. ప్రజాస్వామ్యాన్ని సంపూర్ణంగా బలపర్చిన ఎన్టీఆర్ ఆశయాలను కొనసాగించడానికి నేటి తరం కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు రఘునాథ్ బాబు, హరిబాబు, రాంమోహన్, తదితరులు పాల్గొన్నారు. కువైత్‌లో నిర్వహించిన కార్యక్రమంలో పార్టీ నాయకులు సుధాకర్ రావు కుదరవల్లి, ఈశ్వర్లు ,వెంకట్ కోడూరి, సుబ్బరాయుడు ఎన్టీఆర్‌కు ఘన నివాళి అర్పించారు. దుబాయి ఎమిరేట్‌లో కూడ తెలుగుదేశం పార్టీ అభిమానులు ఎన్టీఆర్ వర్ధంతిని నిర్వహించారు. ఒమన్, ఖతర్ దేశాల్లోనూ తెలుగుదేశం పార్టీ అభిమానులు నందమూరి తారక రామారావుకు ఘనంగా నివాళులు అర్పించారు. గల్ఫ్ దేశాల్లో కార్యక్రమాన్ని తెలుగుదేశం పార్టీ గల్ఫ్ విభాగం అధ్యక్షుడు రావి రాధాకృష్ణ సమన్వయం చేసారు.

20 ఏళ్ల తరువాత వైద్య మండలికి ఎన్నికలు

- 20 నుంచి నామినేషన్ల స్వీకరణ.. అర్హులైన ఓటర్ల సంఖ్య 55,504

అమరావతి, జనవరి 19(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ వైద్య మండలి(ఏపీఎంసీ) సభ్యుల ఎంపిక కోసం ఫిబ్రవరి 9న ఆన్‌లైన్ ద్వారా ఎన్నికలను నిర్వహించనున్నట్లు డైరెక్టర్ ఆఫ్ సెకండరీ హెల్త్, ఏపీఎంసీ ఎన్నికల రిటర్నింగ్ ఆఫీసర్ చక్రధరబాబు వెల్లడించారు. ఏపీఎంసీ చట్టంలో నిర్దేశించిన 13 మంది సభ్యుల ఎంపిక కోసం సోమవారం ఎన్నికల నోటిఫికేషన్ జారీ చేశారు. ఈ సందర్భంగా తాడేపల్లిలోని డీఎస్‌హెచ్ ప్రధాన కార్యాలయంలో ఆయన మాట్లాడారు. 'హైకోర్టు ఆదేశాలను అనుసరించి 20 ఏళ్ల తర్వాత వైద్య మండలిలో సభ్యుల ఎంపిక కోసం ఎన్నికలు నిర్వహిస్తున్నాం. ఈ ఎన్నికల్లో 55,504 మంది వైద్యులకు ఓటు హక్కు ఉంది. మండలిలో సభ్యత్వం కలిగిన 55,504 మందిలో ఐదేళ్లపైబడి ఏపీలో ఉంటున్న వారు ఎవరైనా ఎన్నికల్లో పోటీ చేయవచ్చు. మంగళవారం నుంచి 26 వరకూ నామినేషన్లు స్వీకరిస్తాం. ఫిబ్రవరి 2న పోటీలో ఉన్న అభ్యర్థుల జాబితాను ప్రకటిస్తాం. ఫిబ్రవరి 9న ఉదయం 8 నుంచి సాయంత్రం 5 గంటల వరకూ ఆన్‌లైన్‌లో ఎన్నికలు నిర్వహిస్తాం. ఎన్నికల ప్రక్రియ పూర్తయిన మరుసటి రోజు కౌంటింగ్ నిర్వహించి, ఫలితాలు వెల్లడిస్తాం. ఏపీఎంసీలో చురుకుగా ఉన్న సభ్యులకు మాత్రమే ఓటు హక్కు ఉంటుంది' అని చక్రధరబాబు తెలిపారు.

వేల మంది నోట.. 'వినుర వేమా'

- శ్రీసత్యసాయి జిల్లా కటారుపల్లిలో 20 వేల మందితో వేమన పద్యాలాపన
- ఏషియన్ బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో చోటు



శ్రీసత్యసాయి జిల్లా గాండ్లపెంట మండలం కటారుపల్లిలో వేమన పద్యాల సామూహిక ఆలాపనలో పాల్గొన్న ప్రజలు

కదిరి, జనవరి 19(ఆంధ్రజ్యోతి): శ్రీసత్యసాయి జిల్లా గాండ్లపెంట మండలం కటారుపల్లిలో యోగి వేమన జయంతి వేడుకలను రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన వేమన పద్యాల సామూహిక ఆలాపనకు ఏషియన్ బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో చోటు దక్కింది. ఈ కార్యక్రమంలో 20 వేల మందికి పైగా ప్రజలు, విద్యార్థులు, ప్రజాప్రతినిధులు, నాయకులు, అధికారులు పాల్గొన్నారు. యోగి వేమన పద్యాలాపనకు ఏషియన్ బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో స్థానం కల్పిస్తున్నామని ఆ సంస్థ ప్రతినిధులు వేదికపై ప్రకటించారు. సంబంధిత ధ్రువీకరణ పత్రాన్ని జిల్లా కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్‌కు అందించారు. వేడుకల్లో పాల్గొన్న బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత మాట్లాడుతూ మానవతా విలువలు చాటిన మహనీయుడు ప్రజాకవి యోగివేమన అని కొనియాడారు. సామాజిక చైతన్యమే లక్ష్యంగా పద్యాలను రాశారని అన్నారు. అంతకుముందు వేమన సమాధి వద్ద మంత్రి సవిత, కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్, హిందూపురం ఎంపీ బీకే పార్థసారథి, కదిరి ఎమ్మెల్యే వెంకటప్రసాద్, కళ్యాణదుర్గం ఎమ్మెల్యే సురేంద్రబాబు తదితరులు నివాళులర్పించారు.

పద్యాలతో ప్రజల్లో చైతన్యం తెచ్చిన వేమన: సీఎస్

అమరావతి, జనవరి 19(ఆంధ్రజ్యోతి): వేమన శతకం తెలుగు సాహిత్యంలో ఓ కీర్తి కిరీటమని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ కొనియాడారు. యోగి వేమన జయంతి వేడుకలను రాష్ట్ర పండుగగా ప్రభుత్వం ప్రకటించిన నేపథ్యంలో అమరావతిలోని రాష్ట్ర సచివాలయంలో సీఎస్ విజయానంద్, జీఏడీ ముఖ్య కార్యదర్శి శ్యామలరావు, సీఎంవో కార్యదర్శి రాజమౌళి, సచివాలయ ఉద్యోగుల సంఘ అధ్యక్షుడు రామకృష్ణ తదితరులు సోమవారం వేమన చిత్రపటానికి పుష్పాంజలి ఘటించి, నివాళులర్పించారు.

2 వేల కేసులు.. 1.3 కోట్ల ఫైన్!

సంక్రాంతికి 'ప్రైవేటు' బాదుడుపై ఆర్టీఏ కొరడా

- వందల ట్రావెల్స్ బస్సులపై అధికారుల చర్యలు
- స్పెషల్ డ్రైవ్‌లో రాష్ట్రవ్యాప్తంగా విస్తృత తనిఖీలు
- పన్ను ఎగవేత, పర్మిట్ ఉల్లంఘనలు సైతం గుర్తింపు

అమరావతి, జనవరి 19(ఆంధ్రజ్యోతి): సంక్రాంతి పండుగ రద్దీని సొమ్ము చేసుకుంటూ, ప్రయాణికుల నుంచి అనుమతికి మించి అధిక చార్జీలు వసూలు చేసిన ప్రైవేట్ ట్రావెల్స్‌పై రవాణా శాఖ అధికారులు కొరడా ఝుళిపించారు. ఈ నెల 9 నుంచి 18 వరకు ఆర్టీఏ ఎన్‌ఫోర్స్‌మెంట్ స్పెషల్ డ్రైవ్ చేపట్టింది. రెండు, మూడు రెట్లు అధికంగా చార్జీలు పిండుకున్న 548 బస్సులపై కేసులు నమోదు చేసి, రూ.55.87 లక్షల జరిమానా విధించారు. సాధారణ చార్జీలతో పోలిస్తే పండుగ సమయంలో 50 శాతం అదనంగా వసూలు చేసుకొనేందుకు ప్రైవేట్ ట్రావెల్స్‌ను ఆర్టీఏ అధికారులు అనుమతించారు. అయితే అత్యాశకు పోయిన కొన్ని ట్రావెల్స్ వంద, రెండొందల శాతం అధికంగా వసూలు చేశాయి. దీంతో రవాణా శాఖ అధికారులు రంగంలోకి దిగి చర్యలు చేపట్టారు. మన రాష్ట్రంలో అతి పెద్ద పండుగైన సంక్రాంతికి పొరుగు రాష్ట్రాలైన తెలంగాణ, కర్ణాటక, తమిళనాడు నుంచి లక్షలాది మంది సొంతూళ్లకు వచ్చి వెళ్లారు. పండుగకు ముందు ఇటు వచ్చే, ఆ తర్వాత తిరిగి వెళ్లే వారి నుంచి భారీగా చార్జీలు వసూలు చేస్తున్న ట్రావెల్స్‌పై రవాణా శాఖ కమిషనర్ మనీష్ కుమార్ సిన్హాకు ఫిర్యాదులు అందాయి. టికెట్లు బుక్ చేసుకునే ఆన్‌లైన్ వేదికల్లో ధరలు పరిశీలించిన ఎం.కే.సిన్హా పండుగ సమయంలో రాష్ట్రవ్యాప్తంగా ఎంవీఐలను రోడ్డెక్కించి విస్తృతంగా తనిఖీలు చేయించారు. ఈ ప్రత్యేక డ్రైవ్‌లో అత్యధికంగా నెల్లూరు జిల్లాలో 87 బస్సులపై కేసులు నమోదు చేసి, రూ.8.31 లక్షల ఫైన్ వేశారు. అంబేద్కర్ కోనసీమలో 78, పశ్చిమ గోదావరిలో 65, విశాఖపట్నంలో 54, అన్నమయ్యలో 41, చిత్తూరులో 35, గుంటూరులో 27, తూర్పు గోదావరిలో 27 కేసులు నమోదు చేసి, జరిమానా వసూలు చేశారు.

కఠిన చర్యలు తప్పవు..: కమిషనర్



రాష్ట్రంలో ప్రయాణికులను గమ్యం చేర్చే ప్రైవేటు ట్రావెల్స్ తమ వ్యాపారాన్ని నిరభ్యంతరంగా చేసుకోవచ్చని, ప్రభుత్వం అనుమతించిన చార్జీలు వసూలు చేసుకొంటే.. రవాణా శాఖ పూర్తిగా మద్దతిస్తుందని కమిషనర్ ఎం.కే.సిన్హా పేర్కొన్నారు. అలా కాకుండా నిబంధనలు ఉల్లంఘిస్తాం.. అధిక చార్జీలు వసూలు చేస్తాం.. పన్నులు ఎగవేస్తాం.. అంటే అంగీకరించే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు.

యథేచ్ఛగా నిబంధనల ఉల్లంఘన

కొన్ని ప్రైవేటు ట్రావెల్స్ ప్రభుత్వానికి చెల్లించాల్సిన పన్నులను ఎగ్గొట్టినట్లు అధికారులు తేల్చారు. అధిక ప్రయాణ చార్జీలు వసూలు చేస్తున్న బస్సులపై కొరడా ఝుళిపించిన రవాణా శాఖ అధికారులు.. ఈ క్రమంలో ఇతర నిబంధనల ఉల్లంఘనలను సైతం గుర్తించారు. అందులో పన్ను ఎగవేత, పర్మిట్ లేని, ఫిట్‌నెస్ చేసుకోని బస్సులతో పాటు ఇతర ఉల్లంఘనలను పసిగట్టారు. పది రోజుల్లో ఏకంగా 1,348 బస్సులపై కేసులు నమోదు చేసి, రూ.71.29 లక్షల జరిమానా వసూలు చేశారు. ఇందులోనూ నెల్లూరు జిల్లా 94 కేసులు, రూ.12.34 లక్షల జరిమానాతో మొదటి స్థానంలో ఉండగా.. గుంటూరు జిల్లాలో 122 కేసుల్లో రూ.5.04 లక్షలు, పల్నాడు 104 కేసుల్లో రూ.4.62 లక్షలు, ఎన్టీఆర్ జిల్లా 129 కేసుల్లో రూ.4.51 లక్షల జరిమానా విధించినట్లు ఎం.కే. సిన్హా వెల్లడించారు.

మహిళ కడుపులో 9.5 కిలోల కణితి తొలగింపు

- అరకులోయ ప్రాంతీయ ఆస్పత్రిలో అరుదైన శస్త్ర చికిత్స



మహిళ కడుపులోని 9.5 కిలోల కణితిని తొలగించిన డాక్టర్ రాము బృందం

అరకులోయ, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): అల్లూరి సీతారామరాజు జిల్లా అరకులోయ ప్రాంతీయ ఆస్పత్రిలో ఒక గిరిజన మహిళకు సోమవారం అరుదైన శస్త్రచికిత్స చేసి 9.5 కిలోల కణితిని తొలగించారు. అరకులోయ మండలం మొర్రిగుడ గ్రామానికి చెందిన వంతల లచ్చు (40) రెండేళ్లుగా పొత్తి కడుపులో నొప్పితో బాధపడుతోంది. కాగా ఉదరభాగం పొంగి పోవడంతో ఈ నెల 16న అరకులోయ ప్రాంతీయ ఆస్పత్రికి వచ్చింది. సూపరింటెండెంట్, జనరల్ సర్జన్ డాక్టర్ లగుడు రాము పరీక్షలు నిర్వహించి, కణితి ఉన్నట్టు గుర్తించారు. ఎనస్థీషియన్ డాక్టర్ అప్పారావు, డాక్టర్ గీతతో కలిసి సోమవారం ఆ మహిళకు శస్త్ర చికిత్స చేసి 9.5 కిలోల కణితిని తొలగించారు. వాస్తవానికి ఇటువంటి అరుదైన కేసును విశాఖ కేజీహెచ్‌కు తరలిస్తుంటారు. అయితే ఇక్కడే విజయవంతంగా శస్త్ర చికిత్స చేయడం గమనార్హం.

మరోమారు పోలీసు కస్టడీకి పిన్నెల్లి సోదరులు

- జంట హత్యల కేసులో మూడు రోజులు విచారించనున్న మాచర్ల రూరల్ పోలీసులు



మాచర్ల, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): మాచర్ల మాజీ ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి, అతని సోదరుడు వెంకట్రామిరెడ్డిని మరోమారు మాచర్ల రూరల్ పోలీసులు విచారించనున్నారు. వారిని మూడు రోజులపాటు విచారించేందుకు మాచర్ల కోర్టు అనుమతించింది. పిన్నెల్లి సోదరులను తమ కస్టడీకి ఇవ్వాలని మాచర్ల రూరల్ పోలీసులు కోరగా న్యాయాధికారి శ్రీనివాస్ కల్యాణ్ సోమవారం వర్చువల్‌గా విచారణ జరిపారు. ఈ నెల 20, 21, 22 తేదీల్లో పిన్నెల్లి సోదరులను విచారించేందుకు అనుమతించారు. ప్రభుత్వం తరుపున ఏపీపీ విజయ్‌కుమార్ వాధించగా పిన్నెల్లి సోదరుల తరుపున బార్రెడ్డి నాగిరెడ్డి, గుంజె వరప్రసాద్ తమ వాదనలు వినిపించారు. పల్నాడు జిల్లా వెల్దుర్తి మండలం గుండ్లపాడులో గతేడాది మే నెల 24వ తేదీన జరిగిన టీడీపీ నేతలు జెవిశెట్టి వెంకటేశ్వర్లు, అతని సోదరుడు జెవిశెట్టి కోటేశ్వరరావు జంట హత్య కేసులో పిన్నెల్లి సోదరులు నెల్లూరు జిల్లా జైలులో రిమాండ్‌లో ఉన్నారు. గతేడాది డిసెంబరు 29, 30 తేదీల్లో మాచర్ల రూరల్ పోలీసులు పిన్నెల్లి సోదరులను తొలిసారి కస్టడీకి తీసుకొని విచారించారు.

పోలవరం పనులపై అంతర్జాతీయ నిపుణుల సంతృప్తి



గ్యాప్ 2 ప్రాంతంలో ఫొటో ఎగ్జిబిషన్ పరిశీలిస్తున్న విదేశీ నిపుణుల బృందం

అమరావతి/పోలవరం, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): పోలవరం ప్రధాన ప్రాజెక్టు పనులపై అంతర్జాతీయ నిపుణుల త్రయం సీన్ హిచ్‌బర్గర్ (కెనడా), డేవిడ్ బి.పాల్ (అమెరికా), గియాన్ ఫ్రాంకో డి కాకో సంతృప్తి వ్యక్తం చేశారు. సోమవారం వారు రాజమహేంద్రవరం చేరుకున్న వెంటనే.. పోలవరం ప్రాజెక్టు ప్రాంతానికి ఈఎన్‌సీ నరసింహమూర్తితో కలసి వెళ్లారు. డయాఫ్రమ్‌వాల్ నిర్మాణ పనులపై సంతృప్తిని వ్యక్తం చేశారు. గ్యాప్-1, గ్యాప్-2 ప్రాంతంలో పర్యటించారు. అనంతరం పోలవరం ప్రాజెక్టు ప్రధాన డ్యామ్ పనులపైనా, డిజైన్లపైనా సమీక్షించారు. ఈ సమీక్షలో పోలవరం పనుల నాణ్యత, కాంక్రీట్‌పై సంతృప్తి వ్యక్తం చేశారు. మంగళవారం సమగ్ర పరిశీలన చేస్తామని నిపుణుల త్రయం పేర్కొంది. పనులకు సంబంధించి పూర్తి సమాచారం అందించాలని అధికారులకు సూచించింది.

ముగిసిన 'ఈశాన్య' సీజన్

- నేడు, రేపు పలు జిల్లాల్లో పొగమంచు
- ఉదయం 10 వరకు వాహనాలు జాగ్రత్తగా నడపాలని సూచన

విశాఖపట్నం, జనవరి 19(ఆంధ్రజ్యోతి): ఈశాన్య రుతుపవనాల సీజన్ సోమవారంతో ముగిసింది. గడచిన రెండు రోజుల నుంచి దక్షిణ భారతంలో వర్షాలు నమోదుకాలేదు. అదే సమయంలో ఉత్తర భారతం నుంచి పొడిగాలులు వీస్తున్నాయి. వీటన్నింటినీ పరిగణనలోకి తీసుకున్న భారత వాతావరణ శాఖ(ఐఎండీ)...ఐదు వాతావరణ సబ్ డివిజన్ల(తమిళనాడు-పుదుచ్చేరి, రాయలసీమ, కోస్తాంధ్ర, కేరళ, దక్షిణ కర్ణాటక)లో ఈశాన్య రుతుపవనాల సీజన్ ముగిసినట్టు ప్రకటించింది. సాధారణంగా అక్టోబరు ఒకటో తేదీ నుంచి డిసెంబరు నెలాఖరు వరకూ ఈశాన్య రుతుపవనాల సీజన్‌గా పరిగణిస్తారు. అయితే సీజన్‌లో వర్షాలు తగ్గేందుకు కొంత సమయం పడుతుంది గనుక కొన్ని వాతావరణ అంశాలను పరిగణనలోకి తీసుకున్న తర్వాతే సీజన్ ముగింపుపై అధికారిక ప్రకటన చేస్తారు. అక్టోబరు ఒకటి నుంచి డిసెంబరు నెలాఖరు వరకు ఏపీలో 287.2 మి.మీ.కు గాను 357.6 మి.మీ.(సాధారణం కంటే 25 శాతం ఎక్కువ) వర్షపాతం నమోదైంది. మొంథా, దిత్వా తుఫాన్ల సమయంలో ఎక్కువ వర్షాలు కురిశాయి తప్ప, మూడు నెలల సీజన్‌లో తూర్పుగాలులు, రుతుపవనాల ప్రభావంతో వర్షాలు కురవలేదు.

కొనసాగుతున్న మంచు, చలి

ఒడిశా పరిసరాల్లో అధిక పీడనం కొనసాగుతోంది. దీని ప్రభావంతో సోమవారం పొడి వాతావరణం నెలకొంది. అదే సమయంలో ఉత్తరాది నుంచి చలిగాలులు వీస్తుండడంతో కోస్తాలోని పలు జిల్లాల్లో పొగమంచు కురిసింది. అనేక ప్రాంతాల్లో చలి తీవ్రత కొనసాగింది. మంగళ, బుధవారాల్లో శ్రీకాకుళం, పార్వతీపురం మన్యం, విజయనగరం, అల్లూరి సీతారామరాజు, ఏలూరు, ఎన్టీఆర్, కృష్ణా, గుంటూరు, పల్నాడు, ప్రకాశం జిల్లాల్లో పొగమంచు కురుస్తుందని విశాఖ తుఫాన్ హెచ్చరిక కేంద్రం తెలిపింది. ఉదయం పది గంటల వరకూ వాహనాలు నెమ్మదిగా నడపడంతోపాటు అప్రమత్తంగా ఉండాలని సూచించింది.

వ్యవసాయ శాస్త్రవేత్తలు క్షేత్రస్థాయికి వెళ్లాలి

అమరావతి, జనవరి 19(ఆంధ్రజ్యోతి):వ్యవసాయ శాస్త్రవేత్తలు రైతులకు సరైన సమయంలో సూచనలు, సలహాలు అందించాలని వ్యవసాయశాఖ మంత్రి అచ్చెన్నాయుడు కోరారు. విజయవాడ క్యాంప్ ఆఫీస్‌లో ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయ డైరీ, క్యాలెండర్‌ను ఆయన సోమవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ... రైతులు ఎదుర్కొంటున్న వాతావరణ మార్పులు, పంటలపై తెగుళ్ల నేపథ్యంపై శాస్త్రవేత్తలు మరింత బాధ్యతగా పనిచేయాలన్నారు. వ్యవసాయ విశ్వవిద్యాలయంలో జరుగుతున్న విద్య, పరిశోధన, విస్తరణ కార్యక్రమాల సమాచారాన్ని ఎప్పటికప్పుడు ప్రభుత్వానికి తెలియజేసేలా ప్రత్యేక వాట్సాప్ గ్రూప్‌ను ఏర్పాటు చేయాలి' అని సూచించారు. కార్యక్రమంలో వర్సిటీ వీసీ శారదా జయలక్ష్మీ, రిజిస్ట్రార్ ఎంవీ రమణ, ఇతర అధికారులు పాల్గొన్నారు.

త్వరలో వెటర్నరీ పోస్టుల భర్తీకి చర్యలు: మంత్రి అచ్చెన్న



ఉచిత పశు ఆరోగ్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న మంత్రి అచ్చెన్న

అమరావతి, జనవరి 19(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఖాళీగా ఉన్న వెటర్నరీ డాక్టర్ పోస్టుల భర్తీలతో పాటు పశు వైద్య సిబ్బంది నియామకంపై సీఎం చంద్రబాబుతో చర్చించి, త్వరలో ఓ ప్రకటన చేస్తామని వ్యవసాయ, పశుసంవర్ధకశాఖ మంత్రి మంత్రి అచ్చెన్నాయుడు వెల్లడించారు. రాష్ట్రవ్యాప్తంగా ఈ నెల 19 నుంచి 31 వరకు జరిగే ఉచిత పశు ఆరోగ్య శిబిరాలను సోమవారం విజయవాడ రూరల్ నిడమానూరులో గన్నవరం ఎమ్మెల్యే వెంకట్రావుతో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా అచ్చెన్న మాట్లాడుతూ పశువుల ఆరోగ్యం పరిరక్షిస్తూ, ఉత్పాదకత పెంచుతూ, వ్యాధులను నియంత్రిస్తూ, పశుపోషణ ఖర్చు తగ్గించే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటోందని చెప్పారు. పాలు, గుడ్లు, మాంసం ఉత్పత్తిలో ఏపీ దేశంలోనే తొలి మూడు స్థానాల్లో నిలవాలనే స్పష్టమైన కార్యాచరణ అమలు చేస్తామని తెలిపారు. ఒంగోలు జాతి పశువులకు పునర్వైభవం తెస్తామని పేర్కొన్నారు.పెయ్య దూడల ఉత్పత్తి పెంపు కోసం 50 శాతం రాయితీతో లింగ నిర్ధారిత వీర్యనాళికలను రూ.150కే ఇస్తున్నామని చెప్పారు. 'పశుసంవర్ధకశాఖ డైరెక్టర్ దామోదర్‌నాయుడు మాట్లాడుతూ ఉచిత పశు ఆరోగ్య శిబిరాలను పశుపోషకులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

శివయ్య సన్నిధిలో జస్టిస్ మల్లికార్జునరావు



జస్టిస్ మల్లికార్జునరావు దంపతులకు ప్రసాదం అందజేస్తున్న అర్చకులు

పెదకాకాని, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): గుంటూరు జిల్లా పెదకాకానిలోని శ్రీ మల్లేశ్వరస్వామి దేవస్థానాన్ని రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ టి.మల్లికార్జునరావు దంపతులు సోమవారం దర్శించుకున్నారు. ఆలయ అర్చకులు, వేద పండితులు వేద ఆశీర్వచనం అందజేశారు. ఆలయ కార్యనిర్వహణాధికారి గోగినేని లీలా కుమార్ స్వామి వారి చిత్రపటం అందజేశారు.

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

శాంతి భూతం

అనుకున్నంతా అయింది. భయపడ్డట్టే జరిగింది. కలలోనైనా, మెలకువనైనా శాంతిని వల్లెవేస్తున్నాడు, ఒక్క పీస్ ప్రైజ్ ప్లీజ్ అని అదేపనిగా అడుగుతున్నాడు, ఓ నోబెల్ ఇప్పి శాలువా కప్పండని ఎంత మొత్తుకున్నా ఎవరూ వినిపించుకోలేదు. ఓ పాకిస్తాన్, ఓ ఇజ్రాయెల్ వినా యూరప్‌లో అప్తులనుకున్నవారూ, ఆసియాలో ఆశ్రీయులనుకున్నవారూ అమెరికా అధ్యక్షుడి పక్షాన వకాల్తా పుచ్చుకోలేదు. కమిటీతో ఒక్క మాటైనా చెప్పలేదు. ఇప్పుడు ఆయన ఉగ్గబట్టుకున్న ఆగ్రహాన్నంతా కక్కేశాడు. తనను శాంతిదూతగా గుర్తించని, ఓ అవార్డు కూడా ఇవ్వని ఈ మానవలోకంమీద ప్రతీకారం తీర్చుకుంటున్నాడు. యుద్ధాలనుంచి ప్రపంచాన్ని తాను ఎందుకు రక్షించాలని అడుగుతున్నాడు. ఎప్పుడైతే తనకు నోబెల్ దక్కలేదో, అప్పుడే శాంతికోసం తపించాల్సిన అగత్యం తనకు తప్పిపోయిందని, యుద్ధాలు లేని ప్రపంచంకోసం వెంపర్లాడాల్సిన అవసరం లేకపోయిందన్నది ఆయన వ్యాఖ్య సారాంశం. ఇది ఆయన అప్పటికప్పుడు ఆవేశంగా అన్నమాట కాదు. నార్వే ప్రధానమంత్రికి రాసినలేఖలో ఎనిమిది యుద్ధాలు ఆపినా తనకు నోబెల్ పీస్ దక్కనందునే గ్రీన్‌ల్యాండ్ మీదకు దండెత్తుతున్నానని చెప్పకనే చెప్పారు. అమెరికా ప్రయోజనాలు తప్ప ఇక శాంతి గురించి దేబిరించాల్సిన అవసరం తనకు లేదనడం ద్వారా రేపోమాపో దురాక్రమణ తథ్యమని తేల్చేశారు.

తనకు ఆ కాస్తంత సత్కారం కూడా చేయని ఈ పాడులోకాన్ని ఆయన మాత్రం ఎంతకని కాపాడుకొస్తాడు? అప్పటికీ, తాను ఏయే యుద్ధాలు ఆపానో ఈ ప్రపంచానికి గుర్తుచేస్తూనే వచ్చాడు. నోబెల్ శాంతి ప్రకటనకు ముందు మరింత గట్టిగా చెప్పిచూశాడు. ఆపరేషన్ సిందూర్‌ను అర్ధంతరంగా ఆపించింది తానేనని ఎన్నిసార్లు చెప్పుకున్నారో. ఆపింది అమెరికా అధిపతులు కాదు, ఇక చాలు మహాప్రభో అని పొరుగుదేశం మొరపెట్టుకుంటే, మేమే ఆపేశామని మన పాలకులు చెప్పుకోవడంతో ట్రంప్‌కు ఇంకా చిర్రెత్తుకొచ్చింది. తళతళలాడే సరికొత్త విమానాలు ఇన్ని కూలాయి, ఇలా కూలాయి అంటూ ఏవో కొత్త పద్దులు విప్పాడు. పాకిస్తాన్ సైనికాధిపతికి కమ్మటిభోజనం పెట్టి ఎంత భజన చేయించుకున్నా, తమ్ముడు షరీఫ్ నోబెల్ కమిటీకి రాసిన లేఖను చూపినా ట్రంప్ తపనతీరలేదు. ఇజ్రాయెల్ అధినేత నెతన్యాహూ ట్రంప్‌ను శాంతి దూతగా కీర్తించి, నోబెల్ కమిటీకి రాసిన లేఖ పూర్తిపాఠాన్ని చదివి వినిపించినా, ఈయన ఆశలైతే పెరిగాయి కానీ, కల మాత్రం నెరవేరలేదు.

వెనెజువెలా విపక్షనేత, మదురో ఆగర్భశత్రువు మచాడోకు నోబెల్ శాంతి పురస్కారాన్ని ప్రకటించినప్పుడు, అది ట్రంప్‌కు దక్కినట్టుగానే విశ్లేషకులు భావించారు. కాగల కార్యాన్ని తీర్చడానికే ఆమెకు ఈ అవార్డు ఇచ్చారని అంతా అన్నారు. వెనువెంటనే మదురోను మాయంచేసే కార్యక్రమమూ జరిగిపోయింది. ఒక అర్ధరాత్రి అమెరికా సైనికబలగాలు వెనెజువెలాలోకి చొరబడి, వందలాది మంది సిబ్బందిని కాల్చిపారేసి, తమ దేశాధ్యక్షుడినీ, ఆతడి భార్యనూ సైనిక విమానాల్లో ఎత్తుకుపోయి, అమెరికా జైళ్లలో కుక్కి, అక్కడి కోర్టుల్లో శిక్షలు వేసి, రేపోమాపో ఉరికంబం ఎక్కించబోతున్నందుకు ఈ నోబెల్‌శాంతి విజేతకు ఎంతో సంతోషం కలిగింది. తమదేశపు చమురు సంపదను దౌర్జన్యంగా స్వాధీనం చేసుకొని, మిగతాదేశాలతో వ్యాపారం చేసుకుంటున్న ట్రంప్‌ను మించిన మంచోడెవరూ లేరని మచాడోకు అనిపించింది. పరుగుపరుగున వెళ్ళి నోబెల్ కమిటీ తనకు ఇచ్చిన శాంతి పురస్కారాన్ని అమెరికా అధ్యక్షుడి చేతుల్లో పెట్టింది. ఇలా నోబెల్ కమిటీ ఇచ్చిన అవార్డులను ఇంతవరకూ ఎవరెవరు ఇచ్చేశారు, వచ్చిన ధనాన్ని సమాజసేవకోసం ఏం చేశారు ఇత్యాది వివరాలతో చాలా కథనాలు వచ్చాయి. పురస్కారం ట్రంప్‌కు ఇచ్చేసినా మా పద్దులో ఆమె పేరే ఉంటుందని నోబెల్ కమిటీ ఓ మాటన్నది కూడా. అయినప్పటికీ, తన పురస్కారాన్ని ట్రంప్ చేతుల్లో పెట్టడం వల్ల రాబోయేరోజుల్లో తనకు ఒనగూరే లబ్ధి ఎంతో ఆమెకు బాగా తెలుసు. అవార్డు ఆమెకు ఇచ్చినా, అది ట్రంప్ దేనని అప్పట్లో అన్నవారు ఈ పరిణామాలతో తమమాట నిజమైనందుకు సంతోషించారు. తనది కాని అవార్డును స్వీకరించి ట్రంప్‌కు తాను భవిష్యత్తులో చేయబోయే యుద్ధాలకు, దురాక్రమణలకు నోబెల్‌శాంతిని అడ్డుపెట్టుకోవచ్చునన్న భలే ఆలోచన కలిగింది. శాంతి కాముకుడి ముసుగు తీసిపారేసి, అస్త్రశస్త్రాలు చేబూని, ఇరాన్, గ్రీన్‌ల్యాండ్ సహా ఆశించినవన్నీ సాధించుకోవడానికి ఆయన సిద్ధపడుతున్నారు.

విధాన వైకల్యాలలో భారత దౌత్యనీతి



భారత విదేశాంగ విధానం ఎవరి పర్యవేక్షణలో అమలు అవుతున్నది? ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రభుత్వ విదేశాంగ విధానాన్ని స్ఫుటంగా వ్యక్తీకరించడంలో, గట్టిగా సమర్థించడంలో ప్రభావదాయక పాత్ర నిర్వహిస్తోన్న విదేశాంగ మంత్రి జైశంకర్ అన్నది ఆ ప్రశ్నకు స్పష్టమైన సమాధానంగా కనిపిస్తోంది. అయితే సౌత్ బ్లాక్ (విదేశీ వ్యవహారాల మంత్రిత్వశాఖ నెలవు) విధానాలను నిర్ణయిస్తున్నది, నిర్దేశిస్తున్నది ఎవరు అని జైశంకర్ సైతం ఆశ్చర్యపోక తప్పని పరిణామాలు సంభవిస్తున్న రోజులివి. బంగ్లాదేశ్‌తో సంబంధాల విషయంలో నెలకొన్న దౌత్యపరమైన గందరగోళ పరిస్థితులే అందుకొక తాజా నిదర్శనం.

బంగ్లాదేశ్ మాజీ ప్రధాని ఖలీదా జియాకు నివాళు లర్పించేందుకు జైశంకర్ 2025 డిసెంబర్ 31న ఢాకా వెళ్లారు. ఖలీదా మృతిపట్ల సంతాపం తెలుపుతూ ప్రధానమంత్రి నరేంద్ర మోదీ రాసిన ఒక వ్యక్తిగత లేఖను ఆమె కుమారుడు తారిక్ రెహమాన్‌కు జైశంకర్ అందజేశారు. బంగ్లాదేశ్ భావి ప్రధాని అని అందరూ విశ్వసిస్తున్న తారిక్ రెహమాన్‌తో జైశంకర్ కరచాలనం చూస్తే, క్షీణించిన భారత్–బంగ్లాదేశ్ ద్వైపాక్షిక సంబంధాలు మెరుగుపడే సూచనలు కనిపించాయి. ఇది జరిగిన రెండు రోజులకే బంగ్లాదేశ్ స్టార్ క్రికెటర్ ముస్తాఫిజుర్ రెహమాన్‌ను తాను కాంట్రాక్ట్ తీసుకున్న క్రీడాకారుల జాబితా నుంచి తొలగించాలని ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్) ఫ్రాంచైజీ కోల్‌కతా నైట్ రైడర్స్ (కేకేఆర్)ను భారత్ క్రికెట్ నియంత్రణ మండలి (బీసీసీఐ) ఆదేశించింది. ఆ ప్రైవేట్ ఫ్రాంచైజీ మరో ఆలోచన చేయకుండా ఆ ఆదేశాన్ని శిరసావహించింది. దీనిపై బంగ్లాదేశ్ ప్రభుత్వం తీవ్రంగా ప్రతిస్పందించింది. ముస్తాఫిజుర్ రెహమాన్ తొలగింపునకు నిరసనగా తాము టీ 20 మ్యాచ్‌లు భారత్‌లో ఆడబోమని బంగ్లాదేశ్ క్రికెట్ బోర్డ్ ప్రకటించింది.

సహజంగానే ఒక ప్రశ్న అనివార్యమవుతోంది: కేవలం 48 గంటల వ్యవధిలో–అత్యున్నత స్థాయి దౌత్య సమావేశం, ఒక క్రికెటర్‌ను లక్ష్యంగా చేసుకున్న ఒక నిష్కారణ నిర్ణయం తీసుకోవడానికి మధ్య ఏమి జరిగింది? బంగ్లాదేశ్ ఆగ్రహపూరిత ప్రతిస్పందనను ప్రేరేపించింది ఏమిటి? చోటుచేసుకున్న మార్పుకు కారణమేమిటి? అంటే, హిందూత్వ తీవ్రవాదులు బంగ్లాదేశ్‌కు వ్యతిరేకంగా ప్రారంభించిన ప్రచారోద్యమమేనని చెప్పక తప్పదు. బంగ్లాదేశ్‌లో హిందువులపై జరుగుతున్న దాడులకు నిరసనగా ఢాకాలో ఎటువంటి రాజీ లేకుండా కఠిన వైఖరితో వ్యవహరించాలని మోదీ ప్రభుత్వాన్ని ఈ హిందూత్వ శక్తులు గట్టిగా డిమాండ్ చేశాయి. కేకేఆర్‌పై ఉత్తరప్రదేశ్‌కు చెందిన బీజేపీ శాసన సభ్యుడు సంగీత్ సోమ్ తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. ప్రత్యేకించి దాని యజమాని, బాలీవుడ్ సూపర్‌స్టార్ షారుఖ్ ఖాన్‌ను తీవ్రంగా తప్పుపట్టారు. ముస్తాఫిజుర్ రెహమాన్‌తో కాంట్రాక్టు కుదుర్చుకున్న షారుఖ్ ఖాన్‌ను 'దేశ ద్రోహి' అని సంగీత్ సోమ్ ఆరోపించారు. అయితే కేకేఆర్‌కు షారుఖ్ ఖాన్ ఒక్కడే యజమాని కాదని, ఇంకా ఇద్దరు యజమానులున్నారని, వారు బాలీవుడ్ నటి జూహీ చావ్లా, ఆమె భర్త జై మెహతా అనే విషయాన్ని సంగీత్ సోమ్ తెలివిగా విస్మరించారు. మీ పేరులో ఖాన్ అని ఉంటే చాలు హిందూత్వ తీవ్రవాదుల కోపావేశాలకు మీరు తప్పక లక్ష్యమవుతారు సుమా!

సాధారణ సమయాల్లో వివేచనాయుతమైన ప్రభుత్వం హిందూత్వ తీవ్రవాదుల వీరాలాపాలను విస్మరించి ఉండేది. అయితే 'న్యూ' ఇండియాలో ఈ అప్రధాన హిందూత్వ శక్తులే 'ప్రధాన స్రవంతి'గా భాసిల్లుతున్నాయి! విషపూరిత మతతత్వ రాజకీయాలకు వత్తాసునిస్తున్న ప్రభుత్వం, తనకు సంపూర్ణ మద్దతుదారులు అయిన సామాజిక మాధ్యమాలలో చెలరేగిపోయే సంఘ్ పరివార్ శ్రేణుల డిమాండ్లను విస్మరించ లేదు. మరి ఈ సామాజిక మాధ్యమాలలో వ్యక్తమవుతున్న ఆగ్రహావేశాలు విదేశాంగ విధాన నిర్ణయాలను ప్రభావితం చేయడం ఒక అవాంఛనీయ పరిణామం. అది చాలా ప్రమాదకరమైనది. విదేశాంగ విధానానికి ప్రధాన బాధ్యులలో ఒకరైన విదేశాంగ మంత్రి స్వయంగా ఢాకా వెళ్లి బాధ్యతాయుత నాయకులు, అధికారులతో చర్చలు జరపడాన్ని పరిగణనలోకి తీసుకోవల్సిన విషయం కాదన్నట్టుగా బీజేపీ మద్దతుదారులు వ్యవహరించడాన్ని ఎలా అర్థం చేసుకోవాలి? రాజకీయ ప్రయోజనాల కోసం, మొరటు రాజకీయాలతో సంబంధంలేని ఒక క్రికెటర్‌తో సహా బంగ్లాదేశీయుల పట్ల వ్యతిరేకతను రెచ్చగొట్టడం సరైన విషయమేనా?

రాజకీయాల నుంచి క్రీడా రంగాన్ని వేరు చేయాలి. నిజమే. ఇదొక సర్వసాధారణమైన వాదన. అయితే భారత ఉపఖండంలో క్రీడలు, మరీ ముఖ్యంగా క్రికెట్ భారతీయ 'సాఫ్ట్ పవర్' (ఒక దేశ సంస్కృతి, రాజకీయాల, విదేశాంగ విధాన ప్రభావశీలత)కు స్పష్టమైన నిదర్శనంగా ఉన్నప్పుడు రాజకీయాల నుంచి క్రీడలను వేరు చేయడం అంత సులువు కాదు. ప్రపంచ క్రికెట్ వ్యవహారాలను, బీసీసీఐని నిర్దేశిస్తున్నది– అంతర్జాతీయ క్రికెట్ మండలి చైర్మన్‌గా ఉన్న జై షా (కేంద్ర హోం మంత్రి అమిత్ షా కుమారుడు). క్రికెట్ జగత్తులో ఇప్పుడు ఆయనే మహా శక్తిమంతమైన వ్యక్తి. ఆసియా కప్ మ్యాచ్ ముగిసిన అనంతరం పాకిస్థానీ క్రికెటర్లతో కరచాలనం చేసేందుకు భారతీయ క్రికెటర్లు నిరాకరించడమైనా, బంగ్లాదేశ్ స్టార్ క్రికెటర్ కాంట్రాక్టు రద్దు చేయడమైనా భారతీయ క్రికెట్ అధిపతుల మాటే తుదిమాట అన్నది స్పష్టమయింది. క్రికెట్ ప్రపంచంలో తనకు లభించిన 'సూపర్ పవర్' హోదాను భారత్ దుర్వినియోగం చేస్తోందని చెప్పి తీరాలి. భారత ప్రభుత్వానికి నాయకత్వం వహిస్తున్న రాజకీయ పార్టీ అలా వ్యవహరించడం గర్హనీయం. ముస్తాఫిజుర్ రెహమాన్‌ను తొలగించాలన్న నిర్ణయం, ఐపీఎల్ బాధ్యులతో సంప్రదించిన తరువాత తీసుకున్నది కాదు. రాజకీయ నాయకత్వం తమకు జారీ చేసిన ఆదేశాన్ని ఎటువంటి ఆలోచన లేకుండా వెన్వెంటనే తీసుకున్నది అనడంలో సందేహం లేదు.

ఇది, మళ్లీ మనలను అసలు ప్రశ్న వద్దకు తీసుకువస్తుంది: భారత విదేశాంగ విధానాన్ని నిర్ణయిస్తున్నది ఎవరు? అనుభవజ్ఞులైన దౌత్య అధికారులా? కేంద్ర హోం మంత్రి, బీజేపీ సంఘ్ పరివార్ శ్రేణులా? కెరీర్ దౌత్యవేత్తలు తమ విధుల నిర్వహణలో తరచూ క్లిష్ట పరిస్థితుల నెదుర్కోవడం కద్దు. అయితే ఓర్పు, నేర్పుతో వారు ఆ అననుకూలతలను అధిగమించి, విస్తృత వ్యూహాత్మక లక్ష్యాల పరిధిలో జాతీయ ప్రయోజనాలను కాపాడతారు. దౌత్యవేత్తలకు భిన్నంగా నాయకులు, వారి మద్దతుదారులు వ్యవహరిస్తారు. రాబోయే నెలల్లో అసోం, పశ్చిమ బెంగాల్‌లో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్నాయి. ఈ దృష్ట్యా బంగ్లాదేశ్ వ్యతిరేక భావోద్వేగాలను రెచ్చగొట్టడం ఓట్లను కైవసం చేసుకునే మార్గంగా వారు భావిస్తున్నారు. బంగ్లాదేశ్‌లో హిందువులపై దాడులను వివేచనాయుతమైన దౌత్య విధానం తప్పక ఖండిస్తుంది. అయితే ఆ ఖండన మండనలు మీడియాలో పతాక శీర్షికలు కాకుండా సంయమనం పాటిస్తుంది. రాజకీయ పార్టీల నాయకులు అనుక్షణం వార్తల్లో ఉండేలా వ్యవహరిస్తారు. ఎన్నికలలో ప్రయోజనం పొందడమే లక్ష్యమైనప్పుడు అలా కాకుండా మరోలా వారు ఎందుకు వ్యవహరిస్తారు? పర్యవసానాల విషయం వారికి పట్టదు. ఢాకాతో స్నేహ వారధుల నిర్మాణానికి వారి వైఖరి తోడ్పడదు. పైగా మన పట్ల అపనమ్మకాన్ని పెంపొందిస్తుంది. ఆగ్రహాన్ని కలిగిస్తుంది. ఇప్పటికే క్లిష్టమైన పరిస్థితులను మరింత సంక్లిష్టం చేస్తుంది. బంగ్లాదేశ్‌లోని ఇస్లామిక్ ఛాందసవాదులు మరింత తెంపరితనంతో వ్యవహరించేలా ప్రోద్బలిస్తుంది. క్రికెట్ ఆడేందుకు భారత్‌కు రాకుండా, తమకు 'భద్ర'మైన మరో పొరుగుదేశం శ్రీలంకలో ఆడేందుకే బంగ్లాదేశ్ నిర్ణయం తీసుకున్న పక్షంలో అది మనకు ఎంతగా ఇబ్బంది కలిగిస్తుందో ఊహించండి.

> భారత విదేశాంగ విధానాన్ని నిర్ణయిస్తున్నది ఎవరు? అనుభవజ్ఞులైన దౌత్య అధికారులా? కేంద్ర హోం మంత్రి, బీజేపీ సంఘ్ పరివార్ శ్రేణులా? విదేశీ వ్యవహారాలలో తాత్కాలిక ప్రాతిపదికన తీసుకొంటున్న విధానపరమైన నిర్ణయాలు మనకు ప్రతికూలంగా పర్యవసిస్తున్నాయి. బంగ్లాదేశ్‌తో బెడిసిన సంబంధాలే అందుకు నిదర్శనం.



■ రాజ్‌దీప్ సర్దేశాయి

విదేశీ వ్యవహారాలలో పరిమిత ప్రయోజనాలకే ప్రాధాన్యమిస్తూ, తాత్కాలిక ప్రాతిపదికన తీసుకొంటున్న విధానపరమైన నిర్ణయాలు మనకు ప్రతికూలంగా పర్యవసిస్తున్నాయనే దానికి బంగ్లాదేశ్‌తో బెడిసిన సంబంధాలు మాత్రమే ఏకైక నిదర్శనం కాదు. 2024లో మాల్దీవులతోనూ ఇలాంటి పరిస్థితే వాటిల్లింది. పూర్తిగా నివారింపదగిన పోట్లాటే అయినప్పటికీ, ఇరువైపులా కలహశీల ట్వీట్ల వెల్లువకు కారణమయింది. అంతిమంగా మన దౌత్య దురంధరులు వివేకవంతమైన నిర్ణయాలు తీసుకోవడంతో ఆ దౌత్య వివాదం ముగిసిపోయింది. గత ఏడాది మోదీ ప్రభుత్వం ఆపరేషన్ సిందూర్ సందర్భంగా విమానాశ్రయాల వ్యవహారాలకు సంబంధించి టర్కిష్ సంస్థ నొకదానికి భద్రతాపరమైన అనుమతులను ఉపసంహరించుకున్నది. జాతీయ భద్రతను దృష్టిలో ఉంచుకుని ఈ నిర్ణయం తీసుకోవడం అనివార్యమయిందని మోదీ ప్రభుత్వం వివరణ ఇచ్చింది. గత వేసవిలో వాటిల్లిన యుద్ధంలో భారత్‌కు వ్యతిరేకంగా పాకిస్థాన్‌కు అంకారా మద్దతునిచ్చిందనే నెపంతో టర్కిష్ సంస్థకు అనుమతులను రద్దు చేశారు. ఇది ఉన్నపాటున తీసుకున్న నిర్ణయం. మన విదేశాంగ విధానం మరింత అర్థవంతమైనది అయివుంటే అంకారాతో దౌత్య ఘర్షణను నివారించి ఉండేది.

2020లో గల్వాన్ ఘర్షణలు చోటుచేసుకున్న వెన్వెంటనే బీజింగ్‌కు వ్యతిరేకంగా న్యూఢిల్లీ చేపట్టిన చర్యలు సామాజిక మాధ్యమాల (బాధ్యతారహిత) యోధులు మన విదేశాంగ విధానాన్ని ప్రభావితం చేసిన తీరుకు స్పష్టమైన నిదర్శనమనడంలో సందేహం లేదు. గల్వాన్ ఘర్షణల కారణంగా టిక్–టాక్‌పై నిషేధం విధించారు. చైనా సరుకులను బాయ్‌కాట్ చేయాలని సంఘ్ పరివార్ శ్రేణులు పదే పదే డిమాండ్ చేశాయి. సరిహద్దుల్లో ఘర్షణలు మరింతగా పెచ్చరిల్లి పోయేలా మోదీ సర్కార్ తక్షణమే తగు చర్యలు చేపట్టాలనీ డిమాండ్ చేశాయి. ఆ చర్యలు ఎంతగా తీసుకున్నా విస్తరణవాద ఉన్మాదంలో ఉన్న చైనాను అవి ఎంత మాత్రం నిరోధించేవి కానే కావు. ఐదు సంవత్సరాల అనంతరం భారత పర్యటనకు వచ్చిన చైనా కమ్యూనిస్ట్ పార్టీ ప్రతినిధి బృందానికి బీజేపీ–ఆర్ఎస్ఎస్ నాయకత్వం ఆతిథ్యమిచ్చింది. మరి బీజింగ్ రాజకీయ శ్రేణులతో కాంగ్రెస్ పార్టీ చర్చలకు పూనుకున్నప్పుడు– జాతీయ ప్రయోజనాలను కాంగ్రెస్ పూర్తిగా ఉపేక్షిస్తోందని బీజేపీ శ్రేణులు గొంతులు చించుకున్నాయి, గుండెలు బాదుకున్నాయి. ఇప్పుడు తామే చైనా కమ్యూనిస్టులకు ఆతిథ్యమివ్వడం ఒక యథావిధి కార్యక్రమమని అంటున్నాయి. ఎంత నయవంచన!

(వ్యాసకర్త సీనియర్ జర్నలిస్ట్)

ఇలా..యుద్ధాలతో నశిస్తామా?

యుద్ధాలు లేకపోతే, ఉద్రిక్తతలు అంతరిస్తే ప్రపంచం ఎంతో అందంగా మారిపోతుంది, ఆర్థికంగా కళకళలాడుతుంది. ప్రపంచ జీడీపీ ఒక్కసారిగా అయిదు శాతం వరకూ ఎగబాకుతుంది. 2021లో చేసిన ఒక అధ్యయనం ప్రకారం యుద్ధాలు, ఘర్షణలే లేకపోతే– కృత్రిమ మేధ (ఏఐ), బయోటెక్నాలజీ, ఇంధన రంగాలు చాలా ఏళ్లక్రితమే మానవాళికి అందుబాటులోకొచ్చేవి. ఆకలి, అనారోగ్యం, దారిద్ర్యం అంతమయ్యేవి. మానవజాతి ఇంకా ఎంతో ప్రగతి సాధించి, ఆనందదాయక ప్రపంచం ఏర్పడి ఉండేది.

చరిత్రలో నమోదైన తొలి రాజ్య విస్తరణ యుద్ధం క్రీస్తు పూర్వం 336–323 మధ్య జరిగింది. వ్యూహం, ఎత్తుగడల్లో ఆరితేరిన అలెగ్జాండర్ సాగించిన యుద్ధమది. అతడిని గ్రీకువీరుడిగా, జగజ్జేతగా నిలబెట్టడానికి ఆ యుద్ధం తోడ్పడి ఉండొచ్చుగానీ, అందులో మరణించిన సైనికులు, ప్రజల సంఖ్య లక్షల్లో ఉండవచ్చని అంటారు. ఇక దానివల్ల వచ్చిపడిన కరువు కాటకాలు, అంటువ్యాధుల సంగతి చెప్పనవసరం లేదు. ప్రపంచ జనాభా అప్పటికి దాదాపు 10 కోట్లకు మించదు. చాలా సమాజాలు ఈ యుద్ధం తర్వాత నిర్మానుష్యంగా మారడం లేదా బానిసలుగా పరాయి దేశాలకు పోవడం జరిగాయంటే జన నష్టం ఎంతగా జరిగి ఉంటుందో ఊహించుకోవచ్చు. అటుతర్వాత ప్రపంచవ్యాప్తంగా జరిగిన అనేకానేక యుద్ధాలు, వాటి పర్యవసానాలు లక్షలమంది ఉసురుతీశాయి.



ఆధునిక ప్రపంచానికి పూర్వదశలో 1618–1648 మధ్య యూరప్‌లో మూడు దశాబ్దాలపాటు సాగిన నిరంతరాయ యుద్ధాలు దాదాపు 80 లక్షల మందిని బలిగొన్నాయి. ఇందులో ఆ యుద్ధాలు తెచ్చిన కరువు, వ్యాధుల కారణంగా అకాల మరణం చెందినవారు కూడా ఉన్నారు. అప్పటికి ప్రపంచ జనాభా దాదాపు 60 కోట్లు. ఇక ఇరవయ్యో శతాబ్దానికి వస్తే– యుద్ధతంత్రం, మారణాయుధాల విన్యాసం కొత్త పోకడలు పోయాయి. మొదటి ప్రపంచయుద్ధ సమయానికి ప్రపంచ జనాభా 200 కోట్లయితే, ఆ యుద్ధంలో దాదాపు 2 కోట్లమంది మరణించారు. రెండో ప్రపంచ యుద్ధం వల్ల సాగిన నరమేధంతోపాటు అది సృష్టించిన కరువు కాటకాలు, విరుచుకుపడిన వ్యాధుల వల్ల మృతి చెందినవారి సంఖ్య 8.5 కోట్లు! ఇది చరిత్రలో నమోదైన అతిపెద్ద ఉత్పాతం. ప్రస్తుతం సాగుతున్న రష్యా–ఉక్రెయిన్ యుద్ధంలో ఇప్పటికే లక్షలాది మంది మరణించారు. గాజాలో ఇజ్రాయెల్ జన హననం, ఇతరేతర యుద్ధాలు ఈ సంఖ్యను మరిన్ని లక్షలకు పెంచాయి.

వరుస యుద్ధాలు, ఘర్షణలు మానవ జీవితాన్ని ఇక్కట్లపాలు చేస్తూ, కోలుకోలేని నష్టాలు కలగజేస్తున్నాయి. సాధించుకున్న అభివృద్ధినంతా నీరుగారుస్తూ దశాబ్దాలూ, శతాబ్దాలూ వెనక్కి తీసుకెళ్తున్నాయి. చరిత్ర నేర్పిన గుణపాఠాలు ఈ పరీక్షా సమయంలో సమష్టితత్వాన్ని బోధిస్తున్నాయి. యుద్ధాల పర్యవసానంగా కలిగే నష్టాలను కనిష్ఠ స్థాయిలో ఉంచాలని, ప్రపంచ పౌరుల రక్షణకు శక్తివంచన లేకుండా కృషి చేయాలని కోరుతున్నాయి. విని, జీవితాలను నిలబెట్టుకోవడమా? విస్మరించి నశించిపోవడమా? అన్నది తేల్చుకోవాల్సిన సమయం ఆసన్నమైంది.

ధరిత్రి చరిత్రలో ఇంతవరకూ అయిదుసార్లు జీవుల సమూల నిర్మూలనలు (extinctions) జరిగాయంటారు. వాటిని 'బిగ్ ఫైవ్'గా పిలుస్తారు. తొలిసారి 44.4 కోట్ల సంవత్సరాల క్రితం, ఆ తర్వాత 36 కోట్ల సంవత్సరాల క్రితం, ఆ తర్వాత 25 కోట్ల సంవత్సరాల క్రితం, దరిమిలా 20 కోట్ల సంవత్సరాల క్రితం, మరలా 6.6 కోట్ల సంవత్సరాల క్రితం డైనోసార్ల వంటి అభివృద్ధి చెందిన జీవులు సమూలంగా అంతరించాయని ఆ సిద్ధాంతం చెబుతోంది. వంద అణు బాంబులు పేలితే ఈ భూమండలం మొత్తం భస్మీపటలమై మానవజాతి పూర్తిగా అంతరించిపోక తప్పదు. రష్యా–ఉక్రెయిన్ యుద్ధం క్రమంగా నాటో దేశాలకూ విస్తరించి, అది అణ్వస్త్ర దాడులకు దారి తీసే ప్రమాదం పొంచి ఉంది. రాచరికాలు అంతరించి, జనస్వామ్యాలు అవతరించి వర్ధిల్లుతున్న ఈ యుగంలో సామూహిక హననం వైపు మానవాళి ప్రయాణం సాగిస్తుందా? సమష్టిలోనే తనకు బంగారు భవిత ఉంటుందని గ్రహిస్తుందా? చూద్దాం.

● బి.టి.గోవిందరెడ్డి

కుల–వర్గ దృక్పథాల్ని కలిపే పోరాడాలి!

సి.పి.ఐ ప్రధాన కార్యదర్శి కామ్రేడ్ డి.రాజా 2025 జనవరి 26న ది హిందూ పత్రికలో వంద సంవత్సరాల కమ్యూనిస్ట్ ఉద్యమాన్ని సమీక్షిస్తూ రాసిన వ్యాసంలో భారతదేశంలో కులాన్ని క్లుప్తంగా ఇలా నిర్వచించారు: "The CPI articulated the vision of a classless and casteless India, recognising caste not as a cultural residue but as a material system deeply intertwined with class exploitation".

కులం గురించి కామ్రేడ్ డి.రాజా ఇచ్చిన పై నిర్వచనం వాస్తవికంగా ఉన్నది. కుల–వర్గ దృక్పథాన్ని ప్రతిబింబిస్తూంది. పార్టీల నిర్మాణాల్లో పనిచేస్తోన్న కమ్యూనిస్టులు, నిర్మాణాల వెలుపల ఉన్న కమ్యూనిస్ట్ ఆలోచనాపరులు అంతా తమ విధానాల్లోను, కార్యాచరణల్లోను, నిర్మాణాల్లోను డి.రాజా చెప్తున్నట్టే, "కులాన్ని ఒక సాంస్కృతిక అవశేషంగా చూడటం గాక, వర్గ దోపిడీతో లోతుగా, జమిలిగా పెనవేసుకునిపోయి వున్న ఒక భౌతిక వ్యవస్థగా గుర్తిస్తూ, భారతదేశంలో వర్గ రహిత, కుల రహిత భారతావని స్థాపన లక్ష్యం" దిశగా నడవాలి. ఈ దృక్పథంలో ఇండియాలో గత వందేళ్ల కమ్యూనిస్ట్ ఉద్యమం ఏ మేరకు పనిచేసిందో నేడు సమీక్షించుకోవాలి. మరింత వాస్తవిక దృక్పథంతో పనిచేయాలి. వర్గ–కుల దృక్పథంతో ఉద్యమాలతోపాటు, రాజకీయ పోరాటాలు కూడా చేయాలి.

– వై.కె.

వ్యాసాలు, ఉత్తరాలు పంపవలసిన చిరునామా
ఎడిట్‌పేజీ, ఆంధ్రజ్యోతి, ప్లాట్–76, అశ్వినీ లే ఔట్, హుడా హైట్స్, రోడ్ నంబరు–70, జూబ్లీహిల్స్, హైదరాబాద్–500033.
మెయిల్: editpage@andhrajyothy.com

టీడీపీపై బురద చల్లుతున్న రేవంత్, జగన్

రాయలసీమ లిఫ్ట్ ఇరిగేషన్ పథకాన్ని అడ్డం పెట్టుకొని, చంద్రబాబు సారథ్యంలోని కూటమి ప్రభుత్వంపై తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి జగన్ అనవసరంగా బురద చల్లుతున్నారు. రేవంత్‌రెడ్డి ప్రయత్నం అధికారం కాపాడుకోవడంలో భాగమేమో కానీ, జగన్మోహన్‌రెడ్డిది మాత్రం– అధికారాన్ని తిరిగి పొందాలంటే చంద్రబాబును బదనాం చేయాలనే శుష్క తాపత్రయం.

కేంద్ర అనుమతులు తీసుకోకుండా రాయలసీమ లిఫ్ట్ ప్రాజెక్టును మొదలుపెట్టి; ఆ తర్వాత కేంద్రం, కృష్ణా బోర్డు, ఎన్జీటీ ఆదేశాలతో రూ.2.65 కోట్లు జరిమానా కట్టి, చివరకు విధిలేక ప్రాజెక్టు అమలును ఆపేసిన జగన్మోహన్‌రెడ్డి, ఇప్పుడు ఉన్నట్టుండి చంద్రబాబే ఆపేశారని అంటున్నారు. ప్రాజెక్ట్ కట్టేటప్పుడు అసలేమీ మాట్లాడని రేవంత్‌రెడ్డి, తాను అధికారంలోకి వచ్చిన తర్వాత, చంద్రబాబుతో మాట్లాడి, రాయలసీమ లిఫ్ట్ పథకాన్ని ఆపించేశానని తెలంగాణ అసెంబ్లీలో అన్నారు.

వీరిద్దరూ కావాలని మర్చిపోతున్నది ఏమిటంటే.. ప్రజలకు ఏ మాత్రం జ్ఞానం ఉండదని, వారు పూర్తి మతిమరుపుతో ఉంటారని, తాము ఏమి చెప్పినా చెల్లిపోతుందని! తెలంగాణలో రేవంత్, ఆంధ్రాలో చంద్రబాబు అధికారంలోకి వచ్చిన తర్వాతే, కేంద్రం తుదిగా లిఫ్ట్ ప్రాజెక్టుకు అనుమతులు ఇవ్వబోమని కరాఖండిగా చెప్పేసింది. 2025 ఫిబ్రవరి 27న ఆన్‌లైన్‌లో జరిగిన 25వ కేంద్ర పర్యావరణ మంత్రిత్వ శాఖ ఎక్స్‌పర్ట్ అప్రైజల్ కమిటీ సమావేశంలో, ఎన్జీటీ విధించిన బ్యాన్‌ను కూడా దృష్టిలో ఉంచుకొని, తాము రాయలసీమ లిఫ్ట్ పథకానికి పర్యావరణ అనుమతులు నిరాకరిస్తున్నామని స్పష్టంగా చెప్పి, ఆ మేరకు రాష్ట్రానికి లేఖ కూడా రాసింది. అంతేకాకుండా తదుపరి పర్యావరణ అనుమతులు కోరే ముందు, ప్రాజెక్ట్ సవివర నివేదిక (డీపీఆర్) మినహా, ప్రాజెక్ట్ సైట్‌లో ఎలాంటి పనులు చేయలేదని, పర్యావరణ అంచనా నివేదిక ప్రకారం ప్రాజెక్ట్ ప్రస్తుత ప్రదేశాన్ని, ప్రాజెక్ట్ పూర్వస్థితికి తేవాలని, ఆ మేరకు ఫొటోలతో సహా పూర్తి ఆధారాలతో అఫిడవిట్ దాఖలు చేయాలని సూచించింది.

ఇంత సాధికారికంగా కేంద్ర పర్యావరణ శాఖ 2025 ఫిబ్రవరిలో చెప్పినప్పుడు, నేనే చెప్పి ఆపించేశాను అని ఒకరు, చంద్రబాబే ఆపేశారు అని ఇంకొకరు మాట్లాడ్డం కేవలం స్వప్రయోజన రాజకీయం మాత్రమే. రాజ్యాంగంలోని 7వ షెడ్యూల్ ప్రకారం.. సాగునీటి వనరులు 17వ క్రమసంఖ్యలో రాష్ట్రాల పరిధిలోనే ఉన్నా కూడా; యూనియన్ లిస్టు ప్రకారం 56వ ఎంట్రీలో అంతర్రాష్ట్ర నదీ జలాలు, లోయలు తదితరాల మీద కేంద్ర ప్రభుత్వానికే అధికారం ఉంటుంది. ఆర్టికల్ 262 ప్రకారం అంతర్రాష్ట్ర నదీ జలాలకు సంబంధించిన వివాదాలను పరిష్కరించే అధికారం పార్లమెంటుకు మాత్రమే ఉంటుంది. ఇంత స్పష్టంగా రాజ్యాంగంలో నిర్వచించి ఉండగా, భారతదేశ ఫెడరల్ వ్యవస్థ విధి విధానాలనే సవాలు చేస్తూ కాంగ్రెస్ పార్టీ నుంచి రేవంత్ రెడ్డి కానీ, వైసీపీ నుంచి జగన్ కానీ, చంద్రబాబే ఆపేశారు అని చెప్పడం హాస్యాస్పదమే.

> రాయలసీమ లిఫ్ట్ ప్రాజెక్ట్ జాతీయ హరిత ట్రిబ్యునల్ ఆదేశాలతో జగన్ హయాంలోనే ఆగిపోయిందని రేవంత్‌రెడ్డితో పాటుగా అందరికీ తెలుసు. వీరిరువురూ తమ తప్పులను కప్పిపుచ్చుకోవడానికి, చంద్రబాబు సారథ్యంలోని కూటమి ప్రభుత్వాన్ని నిందించడం సరికాదు.



కేంద్ర ప్రభుత్వం, జలసంఘం నుంచి ఏ విధమైన అనుమతులు తీసుకోకుండానే సంగమేశ్వరం నుంచి రోజుకు 3 టీఎంసీల నీటిని తోడి శ్రీశైలం కుడి ప్రధాన కాలువలో పోసే లక్ష్యంతో జగన్మోహన్‌రెడ్డి ఈ పథకాన్ని మొదలుపెట్టారు. 2020 ఆగస్టులో టెండర్ల ప్రక్రియకు ముందే కృష్ణా బోర్డు... కేంద్ర జల సంఘం, అపెక్స్ కౌన్సిల్ అనుమతులు లేవు కాబట్టి, రాయలసీమ లిఫ్ట్ ప్రాజెక్ట్‌ను ఆపేయాలని ఆంధ్రప్రదేశ్‌కు లేఖ రాసింది. 2020 మే నెలలోనే జాతీయ హరిత ట్రిబ్యునల్, రాయలసీమ లిఫ్ట్ మీద వేసిన వ్యాజ్యాలను పరిష్కరిస్తూ, కేవలం డీపీఆర్ మాత్రమే తయారు చేసుకోవచ్చని, ప్రాజెక్ట్ కట్టుబడి పనులు చేపట్టకూడదని ఆదేశించింది. కానీ జగన్ ఆధ్వర్యంలోని వైసీపీ ప్రభుత్వం మాత్రం 'ఇప్పటికే ఉన్న ప్రాజెక్ట్‌కు మేము ఆధునికీకరణ మాత్రమే చేస్తున్నాం' అంటూ రూ.3,800 కోట్లకు పాలనాపరమైన అనుమతులు ఇచ్చింది.


2020 మే–జూలై మాసాల మధ్యలో కృష్ణా బోర్డు, కేంద్ర జలసంఘం, లిఫ్ట్ ప్రాజెక్ట్‌పై ముందుకు వెళ్లొద్దంటూ రాష్ట్రానికి పలు లేఖలు రాసినా జగన్ ఖాతరు చేయలేదు. పైగా, కోర్టులు, కేంద్రం వద్దని ఆదేశించే లోపే 2020 ఆగస్టు 10న టెండర్లను ఆహ్వానించి, జగన్ ప్రభుత్వం వాటికి పనులు కట్టబెట్టింది. 2020 అక్టోబర్‌లో మళ్ళీ ఈ లిఫ్ట్ ప్రాజెక్ట్‌కు అనుమతులు ఇవ్వలేమని, పర్యావరణ అనుమతులు వచ్చే వరకు ముందుకు పోకూడదని జాతీయ హరిత ట్రిబ్యునల్ ఆర్డర్ ఇచ్చింది. అంతేగాక, 2021 డిసెంబర్ 17న 'రాయలసీమ'కు సంబంధించిన అన్ని పనులను వెంటనే నిలిపేయాలని, కేంద్ర పర్యావరణ శాఖ ఇచ్చే అనుమతుల తర్వాతే తాము స్పందిస్తామని తేల్చి చెప్పి పనులు ఆపేయించింది. కానీ ఈ లోపే దాదాపు రూ.900 కోట్లతో మట్టి పనులు మాత్రం చేయించి, కొన్ని కాలువలు తవ్వారు. ముందుగా చెప్పుకొన్నట్టు, పర్యావరణ అనుమతులు కుదరవు అంటూ కేంద్ర పర్యావరణ శాఖ 2025 ఫిబ్రవరిలో తేల్చి చెప్పింది. ఈ లిఫ్ట్ మీద ఎన్జీటీ తదుపరి వాయిదా 2026 జనవరి 22న ఉంది.

ఈ ప్రాజెక్ట్ ద్వారా జగన్ గరిష్ఠంగా 34 టీఎంసీల నీటిని మాత్రమే అదనంగా తీసుకోగలరు. దాంట్లో, దాదాపు 22 టీఎంసీలు మల్యాలలో 834 అడుగుల వద్ద, ముచ్చుమర్రిలో 798 అడుగుల వద్ద ఇప్పటికే తీసుకుంటున్నాం. నాలుగువేల కోట్లతో జగన్ తలపెట్టిన ఈ లిఫ్ట్ ప్రాజెక్ట్‌తో కేవలం 12 టీఎంసీలు మాత్రమే అదనంగా వస్తున్న నేపథ్యంలో, ఇంత ఖర్చు, హంగామాతో తలపెట్టిన ఆ ప్రాజెక్ట్ ముందుకు పోదని, అనుమతులు రావని తెలిసి కూడా, కేవలం సులభంగా డబ్బులు సంపాదించడం కోసం మొదలెట్టారని అప్పట్లోనే ప్రజలకు అర్థమయింది.

పోనీ మిగతా ప్రాజెక్టుల మీద జగన్ ఖర్చు పెట్టారా అంటే, అప్పటికే మొదలుపెట్టాల్సిన 102 ప్రాజెక్టులను రద్దు చేశారు. 2014–19 మధ్య ఆ ప్రాంత సాగునీటి ప్రాజెక్టులపై టీడీపీ ప్రభుత్వం రూ.12,441 కోట్లు ఖర్చు చేయగా, జగన్ తన హయాంలో రూ.2,011 కోట్లే ఖర్చు చేశారు. కూటమి అధికారంలోకి వచ్చాక రూ.3,870 కోట్లతో 100 రోజుల్లోనే 738 కి.మీ మేర హంద్రీ–నీవా కాలువ వెడల్పు పనులు చేపట్టి, కుప్పం వరకూ నీటిని తరలించింది. సీమ ప్రాజెక్టులపై ప్రస్తుతం రూ.6,613 కోట్లు ఖర్చు చేస్తోంది.

రాయలసీమ లిఫ్ట్ ప్రాజెక్ట్ జాతీయ హరిత ట్రిబ్యునల్ ఆదేశాలతో జగన్ హయాంలోనే, ఆగిపోయిందని రేవంత్‌రెడ్డితో పాటుగా అందరికీ తెలుసు. ఎన్జీటీ ప్రాజెక్ట్ పని ఆపేసిన తర్వాత, జగన్ రెండున్నర సంవత్సరాలకు పైగా అధికారంలో ఉన్నారు. పర్యావరణ అనుమతులు తెచ్చే ప్రయత్నం చేయలేదే? అధికారం కోల్పోయిన ఈ 18 మాసాల్లో కూడా జగన్ ఏ రోజూ ఈ ప్రాజెక్టు గురించి ఒక్కసారీ మాట్లాడలేదే? తమ తప్పులను కప్పిపుచ్చుకోవడానికి, కూటమి ప్రభుత్వాన్ని నిందించడం సరికాదు.

■ నీలాయపాలెం విజయ్‌కుమార్
తెలుగుదేశం అధికార ప్రతినిధి



నూతన రైల్వే లైన్‌కు శాయశక్తులా కృషి: ఎంపీ లావు

చిలకలూరిపేట, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): ప్రాంతీయ అభివృద్ధిలో విప్లవాత్మక మార్పులు తీసు కొచ్చే శావల్యాపురం-బాపట్ల నూతన రైల్వే లైన్‌కు శాయశక్తులా కృషి చేస్తానని నరసరావుపేట ఎంపీ శ్రీకృష్ణదేవరాయలు పేర్కొన్నారు. కొత్త రైల్వే లైన్ సాధన సమితి సభ్యులు రైల్వేలైన్ అవశ్య కతపై రూపొందించిన నివేదికను ఎమ్మెల్యే పుల్లారావు సమక్షంలో ఎంపీని కలిసి సోమవారం అందజేశారు. ఎంపీ స్పందిస్తూ.. చిలకలూరిపేట మీదగా రైల్వేలైన్ రావడం వల్ల స్థానిక వాణిజ్యానికి కొత్త కళ వస్తుం దన్నారు. ప్రాజెక్టు ప్రాధాన్యతను కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి, సాధ్యమైనంత త్వరగా మంజూరు అయ్యేలా చొరవ చూపుతానని హామీ ఇచ్చారు. రైల్వే సాధన సమితి అధ్యక్షుడు గోగినేని నాగేశ్వర రావు, ఆర్గనైజింగ్ సెక్రటరీ శ్యామ్‌మోహనరావు, సెక్రటరీ బ్రహ్మస్వాములు, రంజిత్ పాల్గొన్నారు.

హోదా కల్పించారు.. నిధులు మరిచారు

కోటప్పకొండ తిరునాళ్లకు నిధుల తంటా

శాశ్వత బడ్జెట్‌ను విస్మరించిన పాలకులు ● నేడు తిరునాళ్ల ఏర్పాట్లపై సమీక్ష

మహాశివరాత్రి పర్వదినాన దేశ ప్రసిద్ధి చెందిన ప్రముఖ శైవ క్షేత్రం కోటప్పకొండ శ్రీ త్రికోటేశ్వర స్వామి సన్నిధిలో జరిగే తిరునాళ్లకు లక్షలాదిగా భక్తులు తరలి వస్తారు. ఇందుకు విస్తృత ఏర్పాట్లు చేయాల్సి ఉంది. ఫిబ్రవరి 15న కోటయ్య స్వామి తిరునాళ్ల జరగనుంది. దీనికి ఇంకా 27 రోజులే ఉంది. ఏర్పాట్లకు ప్రభుత్వం ఇప్పటి వరకు నిధులు విడుదల చేయ లేదు. తిరునాళ్లకు ప్రభుత్వం రాష్ట్ర పండుగ హోదా కల్పించిం దే తప్ప.. సంవత్సరాల తరబడి నిధుల కేటాయింపులను విస్మరి స్తోంది. తిరునాళ్లకు రాష్ట్ర పండుగ హోదా ఉన్నా ఏర్పాట్ల కు శాశ్వత బడ్జెట్‌ను పాలకులు విస్మరించారన్న విమర్శ లున్నా యి. ఏటా ఏర్పాట్లకు నిధుల సమస్యను అధికారులు ఎదుర్కొంటున్నారు.

కోటప్పకొండ(నరసరావుపేట), ఆంధ్రజ్యోతి): తెలంగాణలో సమక్క సారలమ్మ జాతరకు అక్కడి ప్రభుత్వం రాష్ట్ర పండుగ హోదా కల్పించింది. జాతరకు వచ్చే భక్తుల కోసం ఏర్పా ట్లకు పెద్ద ఎత్తున నిధులు విడుదల చేస్తోంది. మన ప్రభుత్వం కోటప్పకొండ తిరునాళ్లకు రాష్ట్ర పండుగ హోదా ప్రకటించిందే తప్ప.. నిధులు కేటాయించడం లేదు. ఆ జాతర తరహాలో కోట ప్పకొండ తిరునాళ్లకు ప్రభుత్వం ఈసారైనా నిధు లు విడుదల చేయాలని భక్తులు కోరుతున్నారు. తిరునాళ్ల ఏర్పాట్లపై మంగళవారం కోటప్పకొండ దేవస్థానం వద్ద కలెక్టర్ కృతికా శుక్లా అధ్యక్షతన సమీక్ష సమా వేశం నిర్వహించనున్నారు.

ఏర్పాట్లకు నిధుల కష్టాలు

తిరునాళ్ల ఏర్పాట్లలో పోలీసు, దేవదాయ, ఆర్ డబ్ల్యూఎస్, విద్యుత్, అగ్నిమాపక, ఆర్టీసీ, పం చాయతీ రాజ్, వైద్య, ఆరోగ్యం, అటవీ, రెవెన్యూ తదితర శాఖలు కీలక పాత్ర పోషించాల్సి ఉంది. తాగు నీరు, పారిశుధ్యం, యాత్రికుల భద్రతపై ప్రత్యేక దృష్టి సారించాలి. కొండ దిగువున, ఎగువున కోటయ్య స్వామి సన్నిధిన విస్తృత

(మిగతా 7వ పేజీలో)



10 వేల ఫేక్ వీఐపీ పాసులు

గతేడాది కోటప్పకొండ తిరు నాళ్లలో దాదాపు 20 వేల మంది వీఐపీల పేరుతో స్వామిని దర్శిం చుకున్నారు. 10 వేల వీఐపీ పాసు లు జారీ చేయగా.. మరో పది వేలు ఫేక్ వీఐపీ పాసులు ముద్రించి పం పిణీ చేసినట్లు అధికారులు నిర్ధారిం చారు. వీఐపీల పాసులతో వచ్చే వారి తాకిడి అధికంగా ఉండ టంతో సామాన్య భక్తులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ పాసుల వల్ల దేవస్థానం ఆదాయం కూడా కోల్పోతోంది. కలెక్టర్ సమావేశంలో వీటిపై స్పష్టమైన నిర్ణయాలు తీసుకుంటారో లేదో చూడాలి.

వాణిజ్య పంటలకు ఊపిరి



- జాతీయ మిషన్‌లోకి పత్తి, మిర్చి
- ఒకే గొడుగు కిందకు కేంద్ర, రాష్ట్ర పథకాలు
- నూతన వంగడాలు, పరిశోధనలకు ఆర్థిక శక్తి
- కేంద్ర బడ్జెట్‌లో 'నేషనల్ మిషన్ ఫర్ కమర్షియల్ క్రాప్స్'
- అమలైతే..ఉమ్మడి గుంటూరుకు కొత్త వెలుగు

దేశ వ్యవసాయ రంగంలో వాణిజ్య పంటలకు మరింత ప్రాధాన్యం ఇవ్వాలన్న దిశగా కేంద్ర ప్రభుత్వం కీలక అడుగులు వేస్తోంది. పత్తి, మిర్చి, ఆయిల్ సీడ్స్, హార్టికల్చర్ వంటి అధిక విలువ గల పంటలను ఒకే సమగ్ర విధానంలో అభివృద్ధి చేయాలన్న ఉద్దేశంతో 'నేషనల్ మిషన్ ఫర్ కమర్షియల్ క్రాప్స్'ను ప్రవేశపెట్టే అంశంపై కేంద్రం దృష్టి సారించింది. 2026-27 కేంద్ర బడ్జెట్‌లో ఈ మిషన్‌కు ప్రత్యేక నిధులు కేటా యించే అవకాశాలు కనిపించడంతో ఉమ్మడి గుంటూరు జిల్లా వాణిజ్య పంటల దశ దిశ మారే అవకాశం కనిపిస్తోంది. ఈ మిషన్ అమలైతే వాణిజ్య పంటలకు కీలకంగా నిలిచిన ఉమ్మడి గుంటూరు జిల్లా.. ప్రత్యేకంగా మిర్చి, పత్తి పంటల విషయంలో మోడల్ ప్రాంతంగా మారే అవకాశముంది.

(గుంటూరు సిటీ, ఆంధ్రజ్యోతి)

ప్రస్తుతం పత్తి, మిర్చి ఇతర వాణిజ్య పంట లకు కేంద్ర, రాష్ట్ర స్థాయిలో వేర్వేరు పథకాలు అమలులో ఉన్నాయి. అయితే ఇవన్నీ ఒక సమగ్ర మిషన్ కిందకు తీసుకొస్తే రైతు లకు నేరుగా లాభం చేకూరుతుందన్న అభిప్రా యం కేంద్రానికి అందినట్లు సమాచారం. ఈ ప్రతిపా దిత మిషన్ ద్వారా సాగు వ్యయం తగ్గింపు, దిగుబడి పెంపు, మార్కెటింగ్, ఎగు మతులకు నేరుగా అనుసంధానం, ప్రాసెసింగ్ పరిశ్రమల ప్రోత్సాహం అనే అంశాలను ఒకే చట్రం కింద కు తేవాలని కేంద్రం భావిస్తోంది. ఇది అమలై తే ఉమ్మడి గుంటూరు జిల్లా వ్యవ సాయ ఆర్థిక వ్యవస్థకు కొత్త ఊపిరి అందనుంది.

గుంటూరు మిర్చికి జాతీయ మద్దతు

ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు పొందిన గుంటూరు మిర్చి ఇప్పటి వరకు ప్రత్యేక జాతీయ మిషన్ పరిధిలోకి రాలేదు. కొత్తగా ప్రతిపాదిస్తున్న కమర్షియల్ క్రాప్స్ మిషన్‌లో మిర్చిని కీలక పంటగా చేర్చితే పరిస్థితి పూర్తిగా మారనుంది. ఆసియాలోనే అతిపెద్ద మిర్చి మార్కెట్ ఉన్న గుంటూరు ప్రాంతంలో తెగుళ్లకు తట్టుకునే కొత్త వంగడాల అభివృద్ధి, వైరస్, తామర పురుగు నియంత్రణపై ప్రత్యేక పరిశోధనలు, ఎగుమతులకు అవసరమైన నాణ్యత పరీక్షల కోసం ఆధునిక ల్యాబ్‌లు, అంతర్జాతీయ ప్రమాణాలకు అనుగుణంగా గ్రేడింగ్ సౌకర్యాలు అందుబాటులోకి వచ్చే అవకాశముంది. అదే విధంగా మిర్చి పౌడర్, ఓలియోరెసిన్(కారానికి కారణమైన క్యాప్సైసిన్, రంగుకు కారణమైన క్యారో టినాయిడ్స్, వాసననిచ్చే తైలాలు అన్నింటినీ తీసి తయారుచేసిన సా రం)విలువ ఆధారిత ఉత్పత్తుల త యారీకి స్థానికంగా పరిశ్రమలు ఏర్పా టు చేయాలన్న ఆలోచన కూడా ఈ మిషన్‌లో భాగంగా ఉండొచ్చని నిపు ణులు చెబుతున్నారు.

పరిశోధనకు కేంద్రం బలం

ఉమ్మడి గుంటూరు జిల్లాలో ఉన్న ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వ విద్యాలయం వంటి పరిశోధనా కేంద్రా లు ఈ మిషన్ ద్వారా మరింత బలో పేతం కానున్నాయి. మిర్చి, పత్తి రం గాల్లో ఇప్పటికే కీలక వంగడాలను అభివృద్ధి చేసిన ఈ సంస్థలకు కేంద్ర నిధులు చేరితే అధిక దిగుబడి రకాలు, తెగుళ్లను (మిగతా 7వ పేజీలో)

పల్నాడు పత్తికి కొత్త దిశ


పల్నాడు జిల్లాలో విస్తృతంగా సాగయ్యే పత్తి పంట కూడా ఈ జాతీయ మిషన్ తో.. కొత్త అవకాశాలు అందుకుంటుంది. ఇప్పటికే పత్తికి సంబంధించి కేంద్రం అమలు చేస్తున్న పథకాలను మరింత విస్తరించి, అన్ని వాణిజ్య పంటలకు వర్తింప జేయాలన్న ఆలోచన రైతులకు ఊరటనిస్తోంది. ఫార్మ్ నుంచి ఫారిన్ వరకు అనే భావనతో ఆధునిక సాగు పద్ధతులు, నాణ్యమైన ముడి సరుకు ఉత్ప త్తి, జిన్నింగ్, ప్రాసెసింగ్ యూనిట్లు, టెక్స్‌టైల్ పరిశ్రమలతో అనుసంధానం, అంత ర్జాతీయ ఎగు మతులు ఇలా మొత్తం శ్రేణిని బలోపేతం చేయాలని కేంద్రం యో చిస్తోంది. పల్నా డు పత్తి నాణ్యతకు ఇప్పటికే మంచి గుర్తింపు ఉండటంతో ఈ ప్రాంతంలో టెక్స్ టైల్ పార్కులు ఏర్పడే అవకాశాలు కూడా కనిపిస్తున్నాయి.

రోడ్డెక్కని.. పీపీపీ

- కేంద్రం ఆమోదిస్తేనే గుంటూరు - బాపట్ల, పర్చూరు రోడ్లకు మహర్దశ
- మంగళగిరి - తెనాలి - నారాకోడూరు రహదారి నవీకరణా పెండింగ్

ఆదిలోనే ఆగిన మూడు రహదారుల అభివృద్ధి

గుంటూరు, జనవరి 19 (ఆంధ్ర జ్యోతి): గుంటూరు, బాపట్ల జిల్లాల్లోని కొన్ని ఊళ్లకు రోడ్డు కనెక్టివిటీని బాగా విస్తరింపజేసే ప్రాజెక్టులవి. దాదాపుగా రూ.2,200 కోట్ల అంచనా విలువ కాగల పనులు కావడంతో.. అంత పెద్ద మొత్తంలో నిధులు భరించలేని స్థితిలో ఉన్న రాష్ట్ర ప్రభుత్వం వాటిని పీపీపీ (పబ్లిక్, ప్రైవేటు పార్టనర్‌షిప్) విధా నంలో అభివృద్ధి చేయాలని నిర్ణయిం చింది. గతేడాదే మూడు రహదారుల పనులను రాష్ట్ర ప్రభుత్వం కేంద్ర ఆర్థిక వ్యవహారాల మం త్రిత్వ శాఖకు ప్రతిపాదిం చింది. గతేడాది అక్టోబరు లోనే ఇవి టెండర్ దశకు చేరుకొంటాయని అంతా భావించారు. అయితే ఏ కారణం చేతనో కేంద్ర ప్రభుత్వం పెండింగ్‌లో పెట్టడంతో మూడు కీలక మైన రహదారుల నవీక రణ పీపీపీ ప్రాజెక్టు పైపు లైనులోనే మగ్గుతోంది.



తెనాలి - మంగళగిరి రోడ్డు

గుంటూరు - పర్చూరు, గుంటూ రు - బాపట్ల, మంగళగిరి - తెనాలి - నారాకోడూరు రహదారులు గుం టూరు, బాపట్ల జిల్లాల్లో ఎంతో కీలకమైనవి. ఈ మార్గాల్లో నిత్యం వేలాది సంఖ్యలో వాహనాలు రాక పోకలు సాగిస్తుం టాయి. ప్రస్తుతం ఈ రహదారులు రెండు వరసలు గానే ఉన్నాయి. కొన్ని చోట్ల మాత్రం ఫోర్ లేన్‌గా ఉన్నాయి. దీని వల్ల ట్రాఫిక్ సమస్యలు ఉత్పన్నమవు తున్నాయి. దీనిని పరిగణలోకి తీసు కున్న రాష్ట్ర ప్రభుత్వం గత ఏడాది సమీక్ష నిర్వహించి పీపీపీ మోడల్‌లో డిజైన్ ఫైనాన్స్ - బిల్డ్ ఆపరేటర్ ట్రాన్స్‌ఫర్ (డీఎఫ్-బీవోటీ) విధానం లో నవీకరించేందుకు కేంద్రానికి ప్రతి పాదించింది. ఇందులో గుంటూరు - పర్చూరు రోడ్డుకు రూ.398 కోట్లు, గుంటూరు - బాపట్లకు రూ.908 కోట్లు, మంగళగిరి - తెనాలి - నారాకోడూరు రోడ్డుకు రూ.923 కోట్లు ఖర్చు అవుతాయని అంచనా వేసింది. వీటికి సంబంధించి టెండర్ నిర్వ హణ తర్వాత ఎంపిక చేసే ఏజెన్సీలే డిజైన్, ఫైనాన్స్ చేయాలి. ఆ తర్వాత రోడ్లను నిర్మించి కాంట్రాక్టు వ్యవధి ప్రకారం మెయిన్‌టెన్స్ చేసి చివరికి రాష్ట్ర ప్రభుత్వానికి వాపసు చేయాల్సి ఉంటుంది.

ఈ మూడు రహదారులు నాలుగు వరుసలుగా అభివృద్ధి జరిగితే మార్గ మధ్యలో ఉన్న గ్రామాలు, పట్టణ ప్రాంతాలకు కనెక్టివిటీ పెరుగుతుంది. అంతేకాకుండా దారి పొడవునా ఇరువైపులా అభివృద్ధి జరిగే అవ కాశం ఉంది. అలానే రియల్‌ఎస్టేట్ రంగానికి కూడా మంచి ఊపు వ స్తుంది. అయితే ఇప్పటి వరకు వీటిని కేంద్రం మంజూరు చేయలేదు. దీని పై ఇప్పటికే పలుమార్లు సీఎం చంద్రబాబునాయుడు, విద్యా శాఖ మంత్రి నారా లోకేశ్ కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌ని కలిసి వివరించారు. కాగా వచ్చే కేంద్ర బడ్జెట్ సమావేశాల్లో ఈ మూడు రోడ్ల ప్రాజెక్టులకు ఆమోదం లభిం చొచ్చని అందరూ ఆశలు పెట్టు కొంటున్నారు.

రెండు రోజుల్లో శుభ్రం చేయాలి

రిజర్వాయర్ల పరిశుభ్రతపై జీఎంసీ కమిషనర్ ఆదేశం

గుంటూరు కార్పొరేషన్, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): నగరంలోని తాగునీటి రిజర్వాయర్లు, పరిసరాలను రెండు రోజుల్లో పరిశుభ్రం చేసి.. తాగునీటి సరఫరాకు అధిక ప్రాధాన్యం ఇవ్వాలని నగర కమిషనర్ కె.మయూర్ అశోక్ ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. సోమవారం నల్లచెరువు రిజర్వాయర్‌ను పరిశీలించిన కమిషనర్.. పరిసరాలు, సంప్ అపరిశుభ్రతపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రతి ఎమినిటి కార్యదర్శి రోజూ తమ పరిధిలో క్లోరిన్ శ్యాంపిల్స్ తీసి వివరాలు అప్‌లోడ్ చేయాలన్నారు. కలుషిత నీటి సరఫరా జరిగితే కార్యదర్శితో పాటు పర్యవేక్షణ అధికారులు కూడా బాధ్యత వహిం చాల్సి ఉంటుందని హెచ్చరించారు. రామనామక్షేత్రం, నల్లచెరువు రోడ్డు, జీటీ రోడ్డులో పారిశుధ్య పనులను పరిశీలించిన కమిషనర్ పారిశుధ్య కార్మికులతో మాట్లాడారు. ఏటుకూరు రోడ్డులోని సెకండరీ ట్రాన్సిస్ట్ పాయింట్‌ని పరిశీలించి వ్యర్థాల నిర్వహణపై అసంతృప్తి వ్యక్తం చేశారు. నల్ల చెరువు వాకింగ్ ట్రాక్ అభివృద్ధి పనులపై సమగ్ర నివేదిక అందించాలని డీఈఈని ఆదేశించారు. నల్లచెరువు మెయిన్ రోడ్డులోని అన్న క్యాంటీన్‌ని సందర్శించిన కమిషనర్.. భోజనం చేస్తున్న వారితో మాట్లాడారు. ఆహార నాణ్యత, రుచిపై వారు సంతృప్తి వ్యక్తం చేసినట్లు చెప్పారు.

అనంతరం నగరపాలక సంస్థ అధికారులు, సిబ్బందితో కౌన్సిల్ సమావేశ మందిరంలో కమిషనర్ సమావేశమయ్యారు. ప్రధానంగా కార్యాలయ సిబ్బంది సమయపాలన పాటించడం లేదని.. ఇక నుంచి ప్రతి రోజు ఆకస్మికంగా తనిఖీ చేస్తామన్నారు. జీఎంసీలో నూరు శాతం ఈ-ఆఫీస్ ద్వారానే ఫైల్స్ రావాలని కమిషనర్ అశోక్ స్పష్టం చేశారు. పన్ను వసూళ్లపై దిశానిర్దేశం చేశారు.



నల్లచెరువు రిజర్వాయర్ పరిసరాలను పరిశీలిస్తున్న కమిషనర్ అశోక్

50 పడకలుగా.. నిడుబ్రోలు ప్రభుత్వాసుపత్రి

- అభివృద్ధికి రూ.5 కోట్లు మంజూరు
- ఫలించిన ఎమ్మెల్యే ధూళిపాళ్ల కృషి

పొన్నూరు, జనవరి19(ఆంధ్రజ్యో తి): పొన్నూరు ప్రజల చిరకాల వాంఛ నిడుబ్రోలు ప్రభుత్వ ఆసుప త్రిని 50 పడకల ఆసుపత్రిగా మా ర్చేందుకు కూటమి ప్రభుత్వం అను మతులు మంజూరు చేసింది. ఇందు కు వైద్య ఆరోగ్య శాఖ నుంచి రూ.5 కోట్లు మంజూరయ్యాయి. నిడుబ్రో లు ఆసుపత్రిలో ప్రస్తుతం 30 పడక లున్నాయి. గత టీడీపీ ప్రభుత్వంలో పాత ఆసుపత్రి భవనాలు శిథిలమై పోవడంతో ఎమ్మెల్యే ధూళిపాళ్ళ న రేంద్రకుమార్ ప్రభుత్వంతో మాట్లాడి, మరో వైపు నాట్కో సహకారంతో నిధులు సాధించి నూతన భవనాన్ని రూ. 5 కోట్ల వ్యయంతో ని ర్మించారు. అయితే కీలక సమయాల్లో ఇక్కడి బెడ్లు సరిపోకపోవడంతో రోగులను గుంటూ రు, తెనాలి వంటి ప్రాంతాలకు తరలించాల్సిన పరిస్థితులు ఏర్పడ్డాయి. వీటిని దృష్టిలో ఉం చుకుని పొన్నూరు ప్రభుత్వ ఆసుపత్రిని అభి వృద్ధి చేసేందుకు గతంలోనే ప్రతిపాదనలు పంపించారు. అయితే గత ప్రభుత్వ హయాంలో ఆసపత్రి అభివృద్ధి కేవలం కాగి తాలకే పరిమితమైంది. కూటమి ప్రభుత్వం వచ్చాక ఆసుపత్రిని 50 పడకలుగా అప్‌గ్రేడ్ చేయాలని ప్రభుత్వంతో ఎమ్మెల్యే నరేంద్రకు మార్ పలుమార్లు చర్చించారు. దీంతో వైద్య, ఆరోగ్య శాఖ అధికారులు ప్రభుత్వ ఆసుపత్రి ని సందర్శించి 50 పడకలు మంజూరు చేశా రు. ప్రస్తుతం ఉన్న భవనం పైనే మరో రెం డు అంతస్తులు నిర్మించనున్నట్లు వైద్య ఆరోగ్య శాఖ అధికారులు వెల్లడించారు. ఆస్ప త్రి అభివృద్ధిపై ప్రజల్లో సర్వత్రా హ ర్షం వ్యక్తమవుతోంది.



నాణ్యమైన వైద్యసేవలు అందిస్తాం

పొన్నూరు గ్రామీణ ప్రాంతం కావ డంతో ప్రజలు వైద్యానికి తీవ్ర ఇబ్బం దులు ఎదుర్కొంటున్నారు. ప్రజలకు అవసరమైన అన్ని రకాల వైద్య సేవలను ప్రభుత్వ ఆసుపత్రిలో లభిం చే విధంగా ఏర్పాట్లు చేస్తున్నాం. గ్రా మాల్లో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల ఏర్పాటు మరో రూ.6 కోట్లు ప్రభు త్వం మంజూరు చే సింది. త్వరలోనే ప్ర జల ముంగిటికి నా ణ్యమైన అత్యాధునిక వైద్య సేవలను తీసుకొస్తాం



- నరేంద్ర కుమార్, ఎమ్మెల్యే, పొన్నూరు



ఆటిజం సెంటరును పరిశీలిస్తున్న పాఠశాల విద్యా శాఖ కార్యదర్శి కోన శశిధర్

విద్యా రంగం అభివృద్ధికి ప్రభుత్వం చర్యలు

మంగళగిరి సిటీ, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో విద్యారంగం అభివృద్ధికి ప్రభుత్వం అనేక పథకాలను అమలు చేస్తోందని పాఠశాల విద్యా శాఖ కార్యదర్శి కోన శశి ధర్ పేర్కొన్నారు. మంగళగిరి మండలం చినకాకాని జడ్పీ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన ఆటిజం సపోర్ట్ సెంట రును సోమవారం ఆయన అధికారులతో కలిసి సందర్శిం చారు. కేంద్రంలోని విద్యార్థులు, తల్లిదండ్రులతో మాట్లాడి అక్కడి సేవలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం పాఠ శాలను సందర్శించి విద్యార్థుల హాజరు, ఇతర రికార్డులను పరిశీలించారు. కొన్ని రోజులుగా పాఠశాలకు రాని ఓ వి ద్యార్థి మెకానిక్ పనికి వెళుతున్నాడని తెలుసుకుని.. బాలుడి తండ్రి నాగమల్లేశ్వరరావును పిలిపించి మాట్లాడారు. చదువు ప్రయోజనాలు, ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలను శశిధర్ అతనికి వివరించారు. దీంతో మర్నాటి నుంచి తమ కుమా రుడిని పాఠశాలకు పంపిస్తానని నాగమల్లేశ్వరరావు చెప్పా రు. కార్యక్రమంలో సమగ్ర శిక్ష రాష్ట్ర ప్రాజెక్టు డైరెక్టర్ శ్రీని వాసరావు, విద్యాశాఖ మంత్రి ఓఎస్డీ వెంకటరమణ, డీఈ వో సలీమ్‌బాషా, సమగ్ర శిక్ష ఏపీసీ పద్మావతి పాల్గొన్నారు.

పకడ్బందీగా గణతంత్ర వేడుకల ఏర్పాట్లు

- కలెక్టర్ తమీమ్ అన్సారియా



గుంటూరు, జనవరి 19 (ఆంధ్ర జ్యోతి): గణతంత్ర వేడుకలకు పకడ్బం దీగా ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ ఎ.తమీమ్ అన్సారియా అధికారులను ఆదేశించారు. 77వ గణతంత్ర దినోత్సవా లపై సోమవారం తన కార్యాలయంలో ఆమె సమీక్షించారు. తుళ్లూరు మండలం రాయపూడిలో నిర్వహించనున్న రాష్ట్ర స్థాయి గణతంత్ర వేడుకలను విజయవం తం చేసేందుకు అధికా రులంతా సమష్టిగా కృషి చేయాలన్నారు. సీఆర్‌డీఏ, శాఖల ప్రధాన కార్యాలయాలతో సమన్వయం చేసుకోవా లని సూచించారు. ప్రభుత్వ శాఖల అభివృద్ధి తెలియజేసే శకటాలను ఏర్పాటు చేయాలని చెప్పారు. అలాగే జిల్లాలో పీఎంఈవై ఇళ్ల నిర్మాణాలకు మున్సిపల్ కమిషనర్లు, ఎంపీ డీవోలు అత్యధిక ప్రాధాన్యం ఇవ్వాలని కలెక్టర్ అన్సారి యా ఆదేశించారు. వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఆమె హౌ సింగ్, గ్రామ, వార్డు సచివాల యాల సేవలు, ఉపాధి హామీ పథకం తదితర అంశాలపై ప్రత్యేక అధికారులు, మున్సి పల్ కమిషనర్లు, తహసీల్దార్లు, ఎంపీడీవోలతో సమీక్షిం చారు. లేఅవుట్లలోని ఆప్షన్ 1, 2 కింద ఇళ్ల నిర్మా ణాలు ఉగాది నాటికి నిర్దేశించిన లక్ష్యాల మేరకు పూర్తి చేయాలన్నారు. పీఎంఏవై 2.0 ఇళ్ల నిర్మాణ పనులు నెలా ఖరుకు వందశాతం గ్రౌండింగ్ చేయాలని స్పష్టం చేశారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ఉపాధి హామీ పథకం ద్వారా మంజూరు చేసిన పనులు మార్చి 31 నాటికి ఖచ్చితంగా పూర్తి చేసి బిల్లులు ఆన్‌లైన్‌లో నమోదు చేయాలన్నారు. ఈ సమావేశాల్లో జేసీ అశుతోష్ శ్రీవాస్తవ, డీఆర్వో ఎన్.ఎస్.కె. ఖాజావలి జిల్లా అధికారులు పాల్గొన్నారు.

రామచంద్రా.. ఏమిటిదీ
● వివాదాల్లో కర్ణాటక పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ ఎండీ..
● నాడు కూతురు బంగారం స్మగ్లింగ్ కేసు... ● నేడు చర్చనీయాంశంగా రామచంద్రరావు రాసలీలలు ● ఉమ్మడి గుంటూరు వాసి కావడంతో చర్చనీయాంశం

బ్రెజిల్ వరకు ఒంగోలు జాతి ఎడ్ల వైభవం
● రైతులకు ఆవులు, ఎడ్లు బిడ్డలతో సమానం
● మంత్రి డోలా శ్రీబాలవీరాంజనేయ స్వామి

విద్యుత్ ధరలపై ఏపీఈఆర్సీ విచారణ
● 22, 23 తేదీల్లో విజయవాడలో నిర్వహణ

అత్తోట స్వాతికి అపూర్వ గౌరవం
రాష్ట్రపతి భవన్ ఎట్ హోమ్‌కు ఆహ్వానం

7లో

వైసీపీ హయాంలో 1.23 కోట్లు స్వాహా

- పేదలకు ఇళ్లు పేరుతో మెప్మా సొమ్ము మింగేశారు
- వైసీపీ ఎంపీ పిల్లి సుభాశ్ చంద్రబోస్ సంచలన ఆరోపణలు



రామచంద్రపురం(ద్రాక్షారామ), జనవరి 19 (ఆంధ్రజ్యోతి): 'అంబేడ్కర్ కోనసీమ జిల్లా రామచంద్రపురం పట్టణంలో పేదల గృహ నిర్మాణం పేరుతో గత వైసీపీ ప్రభుత్వ హయాంలో రూ.1 కోటి 22 లక్షల 93 వేలు కైంకర్యం చేశారు' అని ఆ పార్టీ రాజ్యసభ సభ్యుడు పిల్లి సుభాశ్ చంద్రబోస్ ఆరోపించారు. సోమవారం స్థానిక వైసీపీ కార్యాలయంలో విలేకరులతో ఎంపీ మాట్లాడారు. 'రామచంద్రపురం పట్టణానికి సంబంధించి వెల్ల, వెల్లసావరం, ఉండూరు, ఏరుపల్లి హసన్‌బాద గ్రామాల్లో స్థలాలు కేటాయించారు. ఓ కాంట్రాక్టరుకు కొంత సొమ్ము చెల్లిస్తే గృహాలు నిర్మించి ఇస్తారని లబ్ధిదారులకు చెప్పారు. లబ్ధిదారులు మెప్మా ద్వారా రుణాలు తీసుకొని కాంట్రాక్టర్‌కు రూ.కోటికి పైగా చెల్లించారు. అలా వచ్చిన సొమ్ములో బీ వెంకట రమణకు రూ.86.63 లక్షలు, కె.శ్రీనివాస్‌కు రూ.14.80 లక్షలు, షియర్ వాల్ టెక్నాలజీ సంస్థకు రూ.21.50 లక్షలు చెల్లించారు. ఈ వ్యవహారమంతటికీ రింగ్‌లీడర్ అప్పటి మున్సిపల్ కమిషనర్ శ్రీకాంత్ రెడ్డి. గృహ నిర్మాణ శాఖ లబ్ధిదారులపేరుతో సిమెంటు, ఐరన్ ఇచ్చింది. అయితే గృహ నిర్మాణాలు మొదలు పెట్టలేదు. పేద ప్రజల పేరుతో మెప్మా సొమ్ములు కైంకర్యం చేసిన వారిని కోర్టు ముందు హాజరు పరచాలి. ఈ విషయం సీఎం దృష్టికి తీసుకువెళతాం. రామచంద్రపురం వంటి చిన్న పట్టణంలో రూ.1.22 కోట్లు అంటే చాలా పెద్ద విషయం. నష్టపోయిన పేదలు, కైంకర్యం చేసిన వారూ వైసీపీనే. ఎవరైతే ఏంటి? తప్పుచేసిన వారు శిక్షింపబడాల్సిందే' అని స్పష్టం చేశారు.

జగన్ కిట్లకు ఇప్పుడు చెల్లింపులు

- 2024-25లో 'ఆర్థిక అనుమతి' లేకుండానే కొనుగోళ్లు

అమరావతి, జనవరి 19(ఆంధ్రజ్యోతి): జగన్ హయాంలో ఆర్థిక అనుమతుల్లేకుండా కొనుగోలు చేసిన స్టూడెంట్ కిట్లకు కూటమి ప్రభుత్వం ఆమోదం తెలిపింది. 2024-25 విద్యా సంవత్సరానికి కిట్లు కొనుగోలు చేసిన పాఠశాల విద్యా శాఖ అప్పట్లో ఆర్థిక శాఖ అనుమతి లేకుండానే ముందుకెళ్లింది. వాస్తవానికి నిబంధనల ప్రకారం టెండర్లు పిలిచి కాంట్రాక్టు ఖరారు చేయాలి. అప్పట్లో సమగ్ర శిక్ష ఎస్పీడీ టెండర్ల కోసం ప్రభుత్వానికి లేఖలు రాసినా స్పందన లేదు. కొంతకాలానికి పాతవారికే రిపీట్ ఆర్డర్లు ఇవ్వాలని ప్రభుత్వం జీవో జారీచేసింది. అయితే ఉత్తర్వులకు ఆర్థిక శాఖ అనుమతి లభించలేదు. ప్రభుత్వ ఉత్తర్వుల ప్రకారం పాఠశాల విద్యాశాఖ కిట్లు కొనుగోలు చేసి విద్యార్థులకు పంపిణీ చేసింది. ఆ తర్వాత ప్రభుత్వం మారింది. ఆర్థిక అనుమతులు లేకపోవడంతో అప్పటినుంచీ ఆ బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయి. ఇటీవల క్యాబినెట్‌లో వాటి విడుదలకు ఆమోదం లభించింది. అందుకు అనుగుణంగా రూ.944.53 కోట్లకు పరిపాలనా అనుమతులు మంజూరు చేస్తూ పాఠశాల విద్యాశాఖ ఇప్పుడు ఉత్తర్వులు జారీ చేసింది.

నైనీ బొగ్గు గని టెండర్ నోటిఫికేషన్ రద్దు

- వెబ్‌సైట్ నుంచి డాక్యుమెంట్ల తొలగింపు
- 'ఆంధ్రజ్యోతి' కథనాల ఎఫెక్ట్

హైదరాబాద్, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): ఒడిశాలోని నైనీ బొగ్గు గని టెండర్ల నోటిఫికేషన్‌ను వెనక్కి తీసుకోవాలని సింగరేణి యాజమాన్యం నిర్ణయించింది. సోమవారం http://tender.telangana.gov.in అనే ఈ-ప్రొక్యూర్‌మెంట్ వెబ్‌సైట్ నుంచి సంబంధిత డాక్యుమెంట్లను తొలగించారు. కోల్ లింకేజీలో భాగంగా సింగరేణికి ఒడిశాలో అంగుల్ జిల్లాలోని నైనీ బొగ్గు గని దక్కిన విషయం తెలిసిందే. తవ్వకాలు, బొగ్గు ఉత్పత్తి పనులకు టెండర్ వేసే సంస్థ విధిగా దాన్ని సందర్శించాలి. ఆ సంస్థ గనిని సందర్శించినట్లు సింగరేణి ధ్రువీకరణ పత్రం ఇవ్వాలనే నిబంధనపై విమర్శలు వచ్చాయి. దీనిపై ఆదివారం 'బొగ్గు కోసం నీచ కథనం' శీర్షికతో 'ఆంధ్రజ్యోతి-ఏబీఎన్' ఎండీ వేమూరి రాధాకృష్ణ రాసిన వ్యాసంపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క స్పందించారు. ఇతర ప్రభుత్వ రంగ బొగ్గు సంస్థలు ఏ నిబంధనలు విధించాయో వాటిపై అధ్యయనం చేసి.. తిరిగి టెండర్లు పిలవాలని నిర్ణయించినట్లు ఉప ముఖ్యమంత్రి ప్రకటించారు. ఈ మేరకు సింగరేణి అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఆ ఆదేశాలతోనే వెబ్‌సైట్ నుంచి టెండర్ డాక్యుమెంట్‌ను తొలగించినట్లు తెలిసింది. దీనిపై సింగరేణి యాజమాన్యం ఎటువంటి ప్రకటన జారీ చేయలేదు.

ఒక్కటి కరిచిందని వీధి కుక్కలన్నింటినీ చంపేస్తారా!

- ఇది అమానవీయం: రేణు దేశాయ్



హైదరాబాద్ సిటీ, జనవరి19 (ఆంధ్రజ్యోతి): "ఎవడో ఒకడు లైంగిక దాడికి పాల్పడ్డాడని మగాళ్లందరినీ చంపేయలేం కదా? అలాగే ఒక కుక్క కరిస్తే.. వీధి కుక్కలన్నింటినీ నిర్మూలించాలనుకోవడం దుర్మార్గం కాదా? అమానవీయం కాదా?" అని సినీనటి, ఓ జంతు సంరక్షణ కేంద్రం నిర్వాహకురాలు రేణు దేశాయ్ ప్రశ్నించారు. కుక్కలను కాలభైరవుడిగా ఆరాధిస్తూనే వాటిని చంపేయడం భావ్యం కాదన్నారు. వీధి కుక్కల విషయంలో సుప్రీంకోర్టు మార్గదర్శకాలు కూడా సహేతుకంగా లేవన్నారు. "వీధి కుక్కలు కరిస్తే వాటికి ఆహారం పెట్టిన వారినీ బాధ్యులు చేయాలన్న సుప్రీం న్యాయమూర్తి వ్యాఖ్యల్లో ఏమైనా సెన్స్ ఉందా? ఇది మానవీయ కోణంలో ఇచ్చిన తీర్పు కాదు. వ్యక్తిగతంగా ఇచ్చిన తీర్పు" అని వ్యాఖ్యానించారు. వీధి కుక్కల సమస్యపై సుప్రీంకోర్టు వ్యాఖ్యలు.. తెలంగాణ, ఏపీలో కుక్కలను చంపిన ఘటనల నేపథ్యంలో సోమవారం హైదరాబాద్‌లో విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. "మన దేశంలో కుక్కకాటుకంటే దోమకాటుకు ఎక్కువమంది చనిపోతున్నారు. రోడ్డు ప్రమాదాల్లో ఎంతోమంది మరణిస్తున్నారు. మద్యం తాగి వాహనాలు నడుపుతూ అమాయకుల ఉసురు తీస్తున్నారు. ఆ ప్రాణాలకు విలువలేదా? కుక్క కరిచిన వారి ప్రాణాలకే విలువా?" అని రేణు దేశాయ్ ప్రశ్నించారు. మనిషి ప్రాణంలాగే... మూగ జీవుల ప్రాణాలూ విలువైనవే అని గుర్తించాలన్నారు. స్త్రీల వస్త్రధారణ మాత్రమే కాదు.. మన చుట్టూ ఉన్న మూగ జీవులను పరిరక్షించడమూ భారతీయ సంస్కృతిలో భాగమని నటి, యాంకర్ రష్మీ పేర్కొన్నారు.

అదే వ్యథ.. పాత కథ!

(మొదటి పేజీ తరువాయి)

స్వయంగా సీఎం చంద్రబాబు చెబుతున్నారు. కానీ, ఇప్పటికిప్పుడు కేంద్ర ప్రభుత్వం రాష్ట్రానికి 2 లక్షల కోట్లు ఇచ్చినా ఆర్థిక పరిస్థితి మెరుగుపడే అవకాశమే లేదు. ఎందుకంటే పాత అప్పులపై కట్టాల్సిన వడ్డీ, అసలే ఏడాదికి సుమారు రూ.75,000 కోట్లు ఉన్నాయి. ఇలా మరో 15 ఏళ్లు కడుతూనే ఉండాలి. ఆ తర్వాత పరిస్థితి ఏంటనేది ఇప్పటి ప్రభుత్వం, రాబోయే ప్రభుత్వాలు చేసే కొత్త అప్పులపై ఆధారపడి ఉంటుంది. ఇక... ప్రభుత్వ ఉద్యోగుల జీతాలు, పెన్షన్లు కలిపి ఏడాదికి దాదాపు రూ.75,000 కోట్లు ఉంటాయి. అప్పుల అసలు, వడ్డీ... ఉద్యోగుల జీతాలు, పెన్షన్లు! ఇవి రెండూ కలిపితే లక్షన్నర కోట్లు! ఇవి అనివార్య, అత్యవసర ఖర్చులు. అప్పులపై అసలు, వడ్డీ నేరుగా రాష్ట్ర ఖాతా నుంచి ఆర్‌బీఐ మినహాయిస్తుంది. వాయిదా వేయడం కుదరదు. అసలు, వడ్డీలు చెల్లించగా మిగిలిన డబ్బులనే ఏ అవసరానికైనా వాడుకోవాలి. ఇందులో మొదటి ఖర్చు ఉద్యోగుల వేతనాలు, పెన్షన్లు!

ఆదాయం అంతే...

ఏతావాతా... రాష్ట్ర ప్రభుత్వానికి అనివార్యమైన, అత్యవసర ఖర్చులే ఏటా లక్షన్నర కోట్లు! రాష్ట్ర సొంత ఆదాయం మాత్రం రూ.లక్ష కోట్లకు కొంచెం అటూఇటూగా ఉంటుంది. అంటే... ఇక్కడే 50వేల కోట్లకు 'లోటు' తేలింది. అప్పులు కాకుండా రాష్ట్రానికి వచ్చే ఆదాయ మార్గాలు మరో రెండు ఉన్నాయి. అవి... కేంద్ర గ్రాంట్లు, కేంద్ర పన్నుల్లో రాష్ట్ర వాటా! గ్రాంట్ల రూపంలో ఈ ఆర్థిక సంవత్సరం రూ.32,000 కోట్లు వస్తాయని రాష్ట్ర ప్రభుత్వం అంచనా వేసింది. కానీ, నవంబరు నాటికి రూ.7692 కోట్లు మాత్రమే వచ్చాయి. నెలకు కనీసం రూ.1,000 కోట్లు కూడా రావడంలేదు. ఇక... కేంద్ర పన్నుల్లో రాష్ట్ర వాటా రూ.40,000 కోట్లు రావచ్చని అంచనా వేశారు. నవంబరు నాటికి రూ.26,000 కోట్లు వచ్చాయి. ఇక... పన్నేతర ఆదాయం 8 నెలల్లో రూ.3,671 కోట్లు వచ్చింది. వెరసి... రాష్ట్ర ప్రభుత్వ సొంత ఆదాయం, కేంద్ర పన్నుల్లో వాటా, గ్రాంట్లు, పన్నేతర ఆదాయం కలిపి వడ్డీలు, అసలు వాయిదాల చెల్లింపులు, జీతాలు, పెన్షన్లకు సరిపోతుంది. అదీ బొటాబొటిగానే. మరి... అభివృద్ధి కార్యక్రమాలు, పథకాలు, రాయితీలు, ఇతర ఖర్చుల మాటేమిటి??? మళ్లీ అప్పులు చేయడమే! లేదా... సొంత ఆదాయాన్ని గణనీయంగా పెంచుకోవాలి. ఇప్పుడు ఆ పరిస్థితి కనిపించడంలేదు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ఏప్రిల్ - నవంబరు వరకు రాష్ట్ర సొంత ఆదాయం రూ.68,102 కోట్లు వచ్చింది. ఇదే పంథా కొనసాగితే మార్చి చివరి నాటికి రూ.1,03,000 కోట్లు రావచ్చు. కానీ, జీఎస్టీ సంస్కరణల వల్ల ప్రతి నెలా ఆదాయం తగ్గుతోంది. దీనివల్ల రాష్ట్ర ఆదాయం ఇంకా తగ్గొచ్చు.

మరేమిటి మార్గం...

2017 వరకు... రాష్ట్రానికి ఉన్న అప్పుల పరిమితిని కూడా పూర్తిగా ఉపయోగించుకోవాల్సిన అవసరం ఉండేది కాదు. సొంత ఆదాయం, కేంద్ర గ్రాంట్లు, పన్నుల్లో వాటాలు, పరిమితికి లోబడిన అప్పులతో బండి చక్కగా నడిచేది. కానీ... మెల్లమెల్లగా పరిస్థితి మారుతూ వచ్చింది. జగన్ హయాంలో అది మరింత దిగజారింది. సొంత ఆదాయం పెంచుకోకుండా... 'బటన్ నొక్కుడు'కు అలవాటు పడటమే దీనికి కారణం. 'అప్పట్లో మాకు అనుమతించిన మేరకు పూర్తిగా అప్పులు తెచ్చుకోలేదు. ఇప్పుడు వాటిని తెచ్చుకునే అవకాశమివ్వండి' అని జగన్ సర్కారు కోరిందంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు. రాజకీయ కారణాలు, అనివార్యతల నేపథ్యంలో కావొచ్చు... కూటమి కూడా ఇబ్బడి ముబ్బడిగా పథకాలు, హామీలు ప్రకటించి అధికారంలోకి వచ్చింది. దీంతో... జగన్ హయాంలో జరిగిన అప్పులు, తప్పులను కొనసాగించక తప్పడంలేదు. అభివృద్ధి ప్రాజెక్టుల కోసం అప్పులు చేయడం తప్పేమీ కాదు. కానీ, ఓటుబ్యాంకు పదిలం చేసుకునేందుకు, మళ్లీ అధికారంలోకి వచ్చేందుకు భారీగా అప్పులు చేసి మరీ సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారు.

కార్పొరేషన్ల మాటున...

ప్రస్తుతం రాష్ట్రానికి ఎఫ్ఆర్‌బీఎం చట్టం ప్రకారం కేంద్రం ఇచ్చే అప్పులు సరిపోవడం లేదు. అందుకే, కార్పొరేషన్ల ముసుగులో అప్పులు తెచ్చుకోవడం మొదలైంది. 'ఎన్నికల గండం గడవాలి' అనే లక్ష్యంతో 2019లో చంద్రబాబు 'పసుపు కుంకుమ' ప్రకటించారు. దీనికోసం కార్పొరేషన్ల ద్వారా అప్పులు తెచ్చారు. దీనిని జగన్ సీఎం అయ్యాక 'పీక్స్'కు తీసుకెళ్లారు. కార్పొరేషన్లకు ప్రభుత్వమే వేలకోట్ల గ్యారెంటీలు ఇచ్చి, ఎక్కువ వడ్డీకి అప్పులు తెచ్చి, తిరిగిరాని ఖర్చుల కోసం వాడటం 'అలవాటు'గా మారింది.

అప్పుల చిట్టా...

ఏప్రిల్ నుంచి నవంబరు వరకు ఆర్‌బీఐ ద్వారా రూ.77,040 కోట్లు అప్పు తెచ్చినట్టు కాగ్ తన నివేదికలో పేర్కొంది. డిసెంబరులో రూ.7,000 కోట్లు అప్పు తెచ్చారు. జనవరి 6న ఏకంగా రూ.6,500 కోట్లు అప్పు తెచ్చారు. ప్రస్తుతానికి అప్పు రూ.90,540 కోట్లకు చేరింది. రాజధాని కోసం తెస్తున్న అప్పులు, వివిధ కార్పొరేషన్లకు గ్యారెంటీలు ఇచ్చి తెస్తున్నవి అదనం. అన్నీ కలిపితే డిసెంబరు నాటికే రూ.లక్ష కోట్లు దాటింది.

తిరిగి వచ్చేలా...

అప్పులతో రహదారులు, రేవులు, విద్యుత్ కేంద్రాలు వంటి మౌలిక వసతుల నిర్మాణానికి ఖర్చుచేస్తే ఆ అప్పులు గుదిబండలుగా మారవు. ఆ సదుపాయాల వల్ల అభివృద్ధి జరిగి అప్పులు తీర్చే స్థోమతను ఇస్తాయి. మానవవనరులను అభివృద్ధి చేసుకుంటే రాష్ట్రాభివృద్ధికి ఉపయోగపడతారు.

అంతులేని కథ...

రాష్ట్రాలు, కేంద్రం దశాబ్దాల తరబడి పదుల కొద్దీ సంక్షేమ పథకాలు అమలుచేస్తూనే ఉన్నాయి. రాష్ట్రంలో అమలవుతున్న సూపర్ సిక్స్, ఇతర పథకాలకు తోడు కేంద్రం 131 పథకాలను అమలు చేస్తోంది. అయినప్పటికీ వైద్యం ఖర్చులు భరించలేని సామాన్యులు, ఫీజులు కట్టలేని విద్యార్థులు, ఉద్యోగాల్లేని యువత పెరుగుతూనే ఉన్నారు.

మచ్చుకు ఒక లెక్క!

సొంత ఆదాయం పెంచుకోవడంతోపాటు... పథకాల్లో వృథా తగ్గించి, 'లీకేజీ'లు లేకుండా అమలు చేస్తే పరిస్థితి కొంతైనా మెరుగుపడుతుంది. ఉదాహరణకు... రేషన్‌బియ్యం కోసం ఏటా రూ.15 వేల కోట్లు ఖర్చు పెడుతున్నారు. సమీకరణ, రవాణా, ఇతర ఖర్చులతో కలిపి ఒక్క కిలో బియ్యం కోసం ప్రభుత్వం రూ.40 దాకా ఖర్చు పెడుతోంది. కానీ... రేషన్ బియ్యాన్ని వండుకుని తినేది ఎంతమంది? అవి సముద్రాలు దాటి ఎలా స్మగ్లింగ్ అవుతున్నాయి. దీన్ని ఎందుకు సంస్కరించకూడదు.?

పాత పంథాలోనే...

ప్రభుత్వాలు సాధ్యమైనంత తక్కువ వడ్డీకి అప్పులు తీసుకునేందుకు ప్రాధాన్యమిస్తాయి. కానీ, జగన్ హయాంలో 12 శాతం వరకు వడ్డీకి అప్పులు తెచ్చారు. 'కొంత నయం' అనిపించినా, కూటమి ప్రభుత్వానిదీ ఇదే బాట. ప్రస్తుతం మార్కెట్లో వడ్డీరేటు 8 శాతం ఉండగా, ఇటీవల కూటమి ప్రభుత్వం మార్కెట్లో బేవరేజెస్ కార్పొరేషన్ బాండ్లను విక్రయించి 9.5 శాతం వడ్డీకి రూ.5,750 కోట్లు అప్పు తెచ్చింది. రాష్ట్ర ప్రభుత్వం ఏపీసీపీడీసీఎల్, ఏపీఎస్‌పీడీసీఎల్, పౌరసరఫరాల సంస్థ, ఏపీఎండీసీ, ఏపీ మార్క్‌ఫెడ్, జల్ జీవన్ మిషన్ కార్పొరేషన్, ఏపీఐఐసీ, ఏపీ బేవరేజెస్ కార్పొరేషన్, ఏపీ పవర్ ఫైనాన్స్ కార్పొరేషన్, ఏపీమార్క్‌ఫెడ్‌కు వేల కోట్ల అప్పులకు గ్యారెంటీ ఇచ్చింది.

- బిల్లుల చెల్లింపు కూడా వైసీపీ తరహాలోనే చేస్తున్నారు. గత ఆర్థిక సంవత్సరం ముగింపు సందర్భంగా రూ.30,000 కోట్ల బిల్లులను ఆర్థిక శాఖ వెనక్కి పంపింది. ఆ బిల్లులను తిరిగి వ్యవస్థలోకి తీసుకురావాలంటే సంబంధిత శాఖల్లో కొత్తగా ఫైళ్లు పెట్టించుకుని తెచ్చుకోవాలి లేదా కోర్టుకి వెళ్లి పోరాడాలి.

మిథున్‌రెడ్డికి ఈడీ పిలుపు



- లిక్కర్ స్కామ్‌లో 23న విచారణకు రావాలని సమన్లు
- 22న విజయసాయిరెడ్డి వాంగ్మూలం

అమరావతి, జనవరి 19(ఆంధ్రజ్యోతి): వైసీపీ ప్రభుత్వ హయాంలో జరిగిన భారీ మద్యం కుంభకోణం విచారణలో కేంద్ర దర్యాప్తు సంస్థ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్(ఈడీ) వేగంగా అడుగులు వేస్తోంది. ఈ కేసులో ఈనెల 23న విచారణకు రావాలంటూ వైసీపీ పార్లమెంటరీ పార్టీ నేత మిథున్‌రెడ్డికి సమన్లు జారీ చేసింది. అంతకుముందు రోజు.. అంటే 22న హైదరాబాద్‌లోని తమ కార్యాలయానికి విచారణకు రావాలంటూ విజయసాయిరెడ్డికి ఇప్పటికే ఈడీ నోటీసులు జారీ చేసిన విషయం తెలిసిందే. ఆ తర్వాత రోజునే మిథున్‌రెడ్డిని విచారించడానికి తాజాగా ఈడీ నోటీసులు పంపడంతో సర్వత్రా ఉత్కంఠ నెలకొంది. దేశంలోని లిక్కర్ స్కామ్‌ల్లో పెద్దదైన ఈ మద్యం కుంభకోణంలో రూ.3,500 కోట్లు ముడుపుల రూపంలో చేతులు మారినట్లు నిర్ధారణకు వచ్చారు. ఈ స్కామ్‌కు సంబంధించి ఏపీ సీఐడీ సిట్ పలు ఆధారాలు సేకరించి 50 మందికిపైగా నిందితులతో ఎఫ్ఐఆర్ నమోదు చేసి అందులో కీలక వ్యక్తుల్ని అరెస్టు చేసింది. జగన్ మాజీ సలహాదారు రాజ్ కసిరెడ్డి(ఏ1) కింగ్ పిన్‌గా భావిస్తున్న ఈ భారీ కుంభకోణంలో వైసీపీ మాజీ ఎంపీ విజయసాయిరెడ్డి, ఆపార్టీ ఎంపీ మిథున్‌రెడ్డి కూడా నిందితులే. వైసీపీ హయాంలో 2019లో మద్యం పాలసీ రూపకల్పన మొదలుకొని వ్యాపారుల నుంచి కమీషన్ లెక్క వరకూ వీరిద్దరూ కీలకంగా వ్యవహరించారు. అలాగే విధాన నిర్ణయాల నుంచి రహస్య ఆర్థిక లావాదేవీల వరకూ క్రియాశీలకంగా వ్యవహరించారు. పేరున్న మద్యం బ్రాండ్లను తొక్కిపెట్టి నాసిరకం లిక్కర్ కోసం కమీషన్లు తీసుకుని 16 సంస్థలకు రూ. 23 వేల కోట్లు మద్యం సరఫరా ఆర్డర్లు ఇప్పించినట్లు సిట్ తేల్చింది. ఈ కేసులో గతంలో విజయసాయి ఇచ్చిన కీలక సమాచారం ఆధారంగా కేసులో సంచలన విషయాలు వెలికితీసిన సిట్.. గత ఏడాది జూలైలో మిథున్‌రెడ్డిని అరెస్టు చేసింది. రాజమహేంద్రవరం జైలులో 71 రోజుల రిమాండ్ తర్వాత సెప్టెంబరులో బెయిల్‌పై మిథున్‌రెడ్డి బయటకు వచ్చారు. మద్యం కుంభకోణంలో దాదాపు అన్ని విషయాలు తెలిసిన విజయసాయిరెడ్డి, మిథున్‌రెడ్డిని ప్రశ్నించబోతున్న ఈడీ అధికారులు అంతిమ లబ్ధిదారుకు ఎంత చేరింది.. ఆ సొమ్ము ఎక్కడెక్కడికి వెళ్లింది.. ఎన్నికల్లో ఖర్చు చేసిందెంత.. పెట్టుబడులు, హవాలా, బంగారం కొనుగోలు లాంటి వివరాలన్నీ రాబట్టబోతోందని తెలిసింది. ఈ నేపథ్యంలో.. అమెరికా బలగాలు వెనెజువెలా మాజీ అధ్యక్షుడు మదురోను అరెస్టు చేసి తీసుకెళ్లిన విషయాన్ని ప్రస్తావిస్తూ 'చుట్టూ ఉన్న కోటరీ అమ్ముడుపోతే ఎలాంటి ప్యాలెస్‌లో ఉన్న వారికైనా ఇదే గతి' అంటూ విజయసాయిరెడ్డి సోషల్ మీడియాలో చేసిన పోస్టు తాడేపల్లి ప్యాలెస్‌లో ప్రకంపనలు పుట్టిస్తోంది. సాయిరెడ్డి పోస్టుపై సోషల్ మీడియా వేదికగా తీవ్రంగా చర్చ జరుగుతోంది.

మద్యం నిందితుల బెయిల్ విచారణ రేపటికి వాయిదా

విజయవాడ, జనవరి 19(ఆంధ్రజ్యోతి): నకిలీ మద్యం కేసులో నిందితుల బెయిల్ పిటిషన్లపై విచారణ బుధవారానికి వాయిదా పడింది. అద్దేపల్లి జనార్దనరావు, జగన్మోహనరావు, బాలాజీ, సయ్యద్ హాజీ, కట్టా రాజు, సుదర్శన్, అంతాదాస్, ప్రదీప్ దాస్, తలారి రంగయ్య, అల్లాభక్షి పిటిషన్లు వేశారు. వాదనలను జ్యుడీషియల్ ఫస్ట్‌క్లాస్ మేజిస్ట్రేట్ కోర్టు 21కి వాయిదా వేసింది.

రాష్ట్రంలో త్వరలో సంచలనాలు

- లిక్కర్ ఒక్కటే కాదు... అనేక అరాచకాలు జరిగాయి: మాధవ్



న్యూఢిల్లీ, విజయవాడ సిటీ, జనవరి 19(ఆంధ్రజ్యోతి): 'త్వరలో ఆంధ్రప్రదేశ్‌లో సంచలనాలు జరగబోతున్నాయి. వైసీపీ పాలనలో లిక్కర్ అవినీతి ఒక్కటే కాదు... అనేక అరాచకాలు జరిగాయి. వాటిని కూటమి ప్రభుత్వం ఒక్కొక్కటిగా వెలికితీస్తోంది. రాబోయే కాలంలో ఇంకా వైసీపీ అరాచకాలు బయటకు వచ్చే అవకాశం ఉంది' అని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ తెలిపారు. సోమవారం, ఏపీ భవన్‌లో పలువురు నేతలతో కలసి ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. 'ప్రస్తుతం జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా బాధ్యతలు నిర్వహిస్తున్న యువ నాయకుడు నితిన్ నబిన్ అభ్యర్థిత్వాన్ని పార్టీ జాతీయ అధ్యక్ష పదవికి ఏకగ్రీవంగా బలపరుస్తున్నాం. ఆయన తరపున పార్టీ ఎన్నికల రిటర్నింగ్ అధికారి ఏ లక్ష్మణ్ వద్ద రెండు సెట్ల నామినేషన్ పత్రాలను దాఖలు చేశాం. బిహార్‌కు చెందిన యువ నాయకుడు నవీన్ నబిన్‌ను జాతీయ అధ్యక్షునిగా ఎంపిక చేయటం కార్యకర్తల్లో కొత్త ఉత్సాహాన్ని నింపింది' అని మాధవ్ పేర్కొన్నారు. విలేకరుల సమావేశంలో కేంద్ర సహాయ మంత్రి భూపతి రాజు శ్రీనివాస వర్మ, రాష్ట్ర మంత్రి సత్య కుమార్, ఎమ్మెల్సీ సోము వీర్రాజు, ఎంపీ పురందేశ్వరి, ఎమ్మెల్యేలు, బీజేపీ సీనియర్ నేతలు పలువురు పాల్గొన్నారు.

రీ సర్వేను ఆన్‌లైన్ చేయాలి

రాష్ట్రంలో అస్తవ్యస్తంగా ఉన్న వ్యవసాయ భూములను రీ సర్వే చేసి పారదర్శకత కోసం ఆన్‌లైన్ చేయాలని మాధవ్ సోమవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. 'గత వైసీపీ ప్రభుత్వం హయాంలో వ్యవసాయ భూముల రికార్డులు అస్తవ్యస్తంగా తయారయ్యాయి. ఎల్‌పీఎం, విస్తీర్ణం, సర్వే నంబర్లు, ఆధార్ లింక్ తదితరాల్లో అనేక తప్పులు ఉన్నాయి. దీని కారణంగానే లక్షలాది మంది రైతులు రెవెన్యూ కార్యాలయాల చుట్టూ కాళ్లు అరిగేలా తిరుగుతున్నారు. గత ప్రభుత్వ హాయాంలో జరిగిన భూ రీ సర్వే, రెవెన్యూ అవకతవకలపై కూటమి ప్రభుత్వం విచారణ చేపట్టాలి. 60 శాతానికి పైగా ఉన్న ఎల్‌పీఎం, సర్వే నెంబర్లు, విస్తీర్ణం, సరిహద్దు సమస్యల పట్ల దృష్టి సారించాల్సిన బాధ్యత కూటమి ప్రభుత్వంపై ఉంది' అని మాధవ్ పేర్కొన్నారు.

కరూర్ దుర్ఘటనపై మరోసారి సీబీఐ ముందుకు విజయ్

ఆరు గంటలకు పైగా విచారణ



చెన్నై, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): కరూర్ దుర్ఘటనకు సంబంధించి ఢిల్లీలో సీబీఐ అధికారులు సోమవారం జరిపిన రెండో విడత విచారణకు 'తమిళగ వెట్రి కళగం' (టీవీకే) అధినేత, నటుడు విజయ్ హాజరయ్యారు. కరూర్ వద్ద గత ఏడాది సెప్టెంబర్ 27 రాత్రి విజయ్ నిర్వహించిన రోడ్‌షోలో 41 మంది మృతి చెందగా, వందమందికి పైగా గాయపడిన విషయం తెలిసిందే. సుప్రీంకోర్టు ఆదేశాల ప్రకారం ఆ ఘటనపై సీబీఐ అధికారులు విచారణ జరుపుతున్నారు. దుర్ఘటన జరిగిన వేలుచ్చామిపురం దుకాణాల వ్యాపారులు.., టీవీకే ప్రముఖులు బుస్సీ ఆనంద్, ఆదవ్ అర్జున్, నిర్మల్‌కుమార్ వద్ద విచారణ జరిపారు. ఈ నేపథ్యంలో ఈ నెల 12న ఢిల్లీలోని సీబీఐ ప్రధాన కార్యాలయంలో విజయ్‌ను విచారించారు. కాగా, సోమవారం ఉదయం రెండో విడత విచారణకు కూడా విజయ్ హాజరయ్యారు. కరూర్ రోడ్‌షోకు విజయ్ ఆలస్యంగా వెళ్లటం, వాహనాన్ని జనం అధికంగా ఉన్న ప్రాంతం వరకు తీసుకెళ్లటం, తొక్కిసలాట జరుగుతున్న సమయంలో వాహనం పైనుంచి వాటర్ బాటిళ్లు విసరడం, ఈ సందర్భంగా జరిగిన తొక్కిసలాటకు సంబంధించి సీబీఐ అధికారులు అడిగిన ప్రశ్నలకు విజయ్ సమాధానాలిచ్చినట్టు సమాచారం. రోడ్‌షోకు రాష్ట్ర పోలీసులు గట్టి భద్రతా ఏర్పాట్లుచేపట్టి ఉంటారనే నమ్మకంతోనే తాను కరూర్‌కు వెళ్లానని, పోలీసు అధికారుల సూచనల మేరకే ఆ ప్రాంతానికి వెళ్లానని, అర్థాంతరంగా రోడ్‌షోను ముగించుకున్న తర్వాతే తొక్కిసలాట జరిగినట్టు తెలుసుకున్నానని విజయ్ సీబీఐ అధికారులకు తెలిపినట్టు సమాచారం. ఆరు గంటలకు పైగా జరిగిన విచారణలో విజయ్ కొన్నిమార్లు ముభావంగా, మరికొన్నిమార్లు వివరంగా సమాధానాలిచ్చినట్టు తెలిసింది. ఇదిలా ఉండగా కరూర్ దుర్ఘటనకు సంబంధించి సీబీఐ అధికారులు వచ్చే నెలలో చార్జ్‌షీట్ వేయనున్నట్టు తెలిసింది.

చిత్రజ్యోతి

SINCE 1965



అమెరికాలో టైటిల్ ఆవిష్కరణ

అభినవ్ గోమఠం, స్వాతి శర్మ ప్రధాన పాత్రధారులుగా నటిస్తోన్న సినిమా 'ఆటాడిన పాట'. రాయపోల్ ఉన్నత పాఠశాల పూర్వ విద్యార్థి వేణు నక్షత్రం దర్శకత్వం వహిస్తున్నారు. వర్జీనియాలోని స్టెర్లింగ్ నగరంలో నిర్వహించిన కార్యక్రమంలో అమెరికన్ తెలుగు అసోసియేషన్ అధ్యక్షుడు జయంత్ చల్లా తన సతీమణి కవిత చల్లాతో కలిసి సినిమా టైటిల్‌ను ఆవిష్కరించారు. టాలీవుడ్ నిర్మాత, ప్రముఖ న్యాయవాది నాగేశ్వరరావు పూజారి ఫస్ట్‌లుక్ పోస్టర్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా దర్శకుడు వేణు నక్షత్రం మాట్లాడుతూ సినిమాకు సంబంధించిన పూర్తి వివరాలను త్వరలో వెల్లడిస్తామని తెలిపారు. చిత్ర నిర్మాత అవంతిక నక్షత్రం మాట్లాడుతూ సోషియో ఫాంటసీగా తెరకెక్కుతున్న ఈ చిత్రం షూటింగ్ పూర్తయిందని, ప్రస్తుతం సీజీ వర్క్ చివరి దశలో ఉందని తెలిపారు.

రాయపోల్ (ఆంధ్రజ్యోతి)

'కొరియన్ కనకరాజు'గా వరుణ్‌తేజ్



వరుణ్‌తేజ్ హీరోగా మేర్లపాక గాంధీ దర్శకత్వంలో రూపుదిద్దుకుంటున్న హారర్, కామెడీ చిత్రానికి 'కొరియన్ కనకరాజు' అని పేరు పెట్టారు. వరుణ్‌తేజ్ పుట్టిన రోజు సందర్భంగా టైటిల్‌ను ప్రకటించడమే కాకుండా గ్లింప్స్ విడుదల చేశారు. ఇండియన్, కొరియన్ బ్యాక్‌డ్రాప్‌లో హారర్, కామెడీ కథాంశంతో ఈ చిత్రం రూపుదిద్దుకుంటోంది. తను ఇంతవరకూ చేయని ఓ విభిన్న పాత్రలో వరుణ్‌తేజ్ కనిపించనున్నారు. ఆయన లుక్ కూడా విభిన్నంగా ఉంది. రితికా నాయక్ కథానాయిక. అనంతపురంలోని పెనుకొండకు చెందిన ఫొటోగ్రాఫర్‌గా హాస్య నటుడు సత్య అలరించనున్నారు. వేసవిలో చిత్రాన్ని విడుదల చేయనున్నట్లు నిర్మాతలు ప్రకటించారు. కొరియన్ పోలీసులు సత్యని టార్చర్ పెడుతుంటే, వరుణ్‌తేజ్ రావడం, యాక్షన్ సీన్.. ఈ గ్లింప్స్‌లో ఉన్నాయి. 'నేను తిరిగి వచ్చాను' అని కొరియన్ భాషలో వరుణ్‌తేజ్ డైలాగ్ చెప్పడం ఇందులో హైలైట్ అంశం. ఇది హారర్ చిత్రమే అయినా రాయలసీమ కథకు, కొరియాను ముడిపెట్టడం ఆసక్తికలిగించే అంశం.

ప్రేక్షకులు ఆదరిస్తున్నారు



సుధాకర్ చెరుకూరి

రవితేజ కథానాయకుడిగా కిశోర్ తిరుమల తెరకెక్కించిన చిత్రం 'భర్త మహాశయులకు విజ్ఞప్తి'. ఎస్ఎల్‌వి సినిమాస్ పతాకంపై సుధాకర్ చెరుకూరి నిర్మించారు. సినిమా ఇటీవలె విడుదలైన సందర్భంగా సుధాకర్ మీడియాతో మాట్లాడారు. 'సినిమా సంక్రాంతి బ్లాక్‌బస్టర్‌గా నిలిచినందుకు ఆనందంగా ఉంది. అన్ని సెంటర్లలో ప్రేక్షకుల నుంచి మంచి ఆదరణ లభిస్తోంది. పండగకు కుటుంబ సమేతంగా చూసి ఆనందించేలా ఉండాలనే ఉద్దేశంతో ఈ సినిమాని తీశాం. స్పెయిన్‌లో చిత్రీకరించిన సన్నివేశాలను థియేటర్లలో ప్రేక్షకులు బాగా ఎంజాయ్ చేస్తున్నారు. 'ప్యారడైజ్' చిత్రం షూటింగ్ పూర్తికాగానే చిరంజీవితో కొత్త సినిమా ప్రారంభిస్తాం. ఈ కథ పీరియాడిక్ నేపథ్యంలో ఉంటుంది. అలాగే కిశోర్ తిరుమలతో మరో సినిమా చేయబోతున్నాం. 'అరుంధతి' లాంటి సినిమా చేయాలనుంది. కథపై ప్రయత్నాలు జరుగుతున్నాయి' అని సుధాకర్ చెరుకూరి చెప్పారు.

తెలుగు సినిమా కళకళలాడాలి



నరేశ్ విజయ్ కృష్ణ

నరేశ్ విజయ్ కృష్ణ ప్రధాన పాత్రలో రూపొందుతున్న చిత్రం 'శుభకృత్ నామ సంవత్సరం'. ఎస్ఎస్ సజ్జన్ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రాన్ని ఎస్వీ పిక్చర్స్, అవిష్క డ్రీ ప్రొడక్షన్ బ్యానర్లపై డీఆర్ విశ్వనాథ్ నాయక్ నిర్మిస్తున్నారు. సోమవారం నిర్వహించిన కార్యక్రమంలో ఈ చిత్రం గ్లింప్స్‌ని విడుదల చేశారు. ఈ సందర్భంగా నరేశ్ మాట్లాడుతూ 'మంచి కథాబలం ఉన్న సినిమా ఇది. డ్రామా, సస్పెన్స్, ట్రావెల్ అన్నీ అద్భుతంగా ఉంటాయి. 'నారి నారి నడుమ మురారి' సినిమాని సింగిల్ స్ర్కీన్‌లో చూద్దామని వెళ్లాను. థియేటర్లన్నీ హౌస్‌ఫుల్ బోర్డులతో దర్శనమిచ్చాయి. మొదటి సారి నా సినిమాకు నాకే టికెట్ దొరకలేదు. ఇలాగే ఏటా మన తెలుగు సినిమా కళకళలాడాలి' అని అన్నారు. హీరో శ్రీవిష్ణు మాట్లాడుతూ 'ఏ ప్రాత అయినా అద్భుతంగా చేయగలిగే నరేశ్‌గారు తెలుగు సినీ పరిశ్రమలో ఉండటం గర్వకారణం' అని అన్నారు. నటి పవిత్ర లోకేశ్, నిర్మాత విశ్వనాథ్ నాయక్, దర్శకులు సజ్జన్, రామ్ అబ్బరాజు, నిర్మాత రాజేశ్ దండా, ఎమ్మెల్యే ఎంఎస్ రాజు పాల్గొన్నారు.

మొక్కు తీర్చుకోవడానికి మహా సంకల్ప పాదయాత్ర



బండ్ల గణేశ్‌ను అభినందిస్తున్న నటుడు శివాజీ, విజయనగరం ఎంపీ అప్పల నాయుడు

ఏపీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు బాగుండాలనే కోర్కెను తీర్చిన ఏడుకొండల వెంకన్న మొక్కుబడిని తీర్చుకోవడానికే తాను మహా సంకల్ప పాదయాత్ర చేస్తున్నానని, ఇది రాజకీయ యాత్ర ఏమాత్రం కాదని నటుడు, నిర్మాత బండ్ల గణేశ్ స్పష్టం చేశారు. సోమవారం ఆయన రంగారెడ్డి జిల్లా షాద్‌నగర్‌లోని పెద్ద జానమ్మపేట శ్రీ లక్ష్మీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో పూజలు చేసి, అనంతరం పట్టణంలోని తన పరమేశ్వరి థియేటర్ నుంచి పాదయాత్రను ప్రారంభించారు. పాదయాత్రకు షాద్‌నగర్ ఎమ్మెల్యే, తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ రంగ సంస్థల చైర్మన్ వీర్లపల్లి శంకర్, విజయనగరం ఎంపీ అప్పలనాయుడు, సినీ నటుడు శివాజీ, కాంగ్రెస్ సీనియర్ నాయకుడు తాండ్ర కాశీనాథ్‌రెడ్డి హాజరయ్యారు.

షాద్‌నగర్ అర్బన్ (ఆంధ్రజ్యోతి)

కొండవీడుకోటలో ఘనంగా వేమన జయంతి



యోగి వేమన విగ్రహానికి పూలమాలలువేసి నివాళులర్పిస్తున్న శ్రీనాథ సాహితీ పరిషత్, అటవీశాఖ, అభివృద్ధి కమిటీ సభ్యులు

యడ్లపాడు, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): ప్రజాకవి యోగి వేమన జయంతి ఉత్సవాలు యడ్లపాడు మండలంలోని కొండవీడుకోటలో సోమవారం ఘనంగా నిర్వహించారు. కొండవీడుకోట అభివృద్ధి కమిటీ, నరసరావుపేటకు చెందిన శ్రీనాథ సాహితీ పరిషత్, అటవీశాఖ సంయుక్తంగా ఈ ఉత్సవాలను నిర్వహించాయి. ముందుగా కొండవీడుకోటలోని వేమన మండపం వద్ద ఉన్న వేమన విగ్రహానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా శ్రీనాథ సాహితీ పరిషత్ కార్యదర్శి నర్రా చిన్న రామిరెడ్డి మాట్లాడుతూ, వేమన కేవలం కవి మాత్రమే కాదని, సమాజంలోని మూఢనమ్మకాలను, సామాజిక రుగ్మతలను తన ఆటవెలది పద్యాలతో ఎండగట్టిన గొప్ప సంఘసంస్కర్త అని కొనియాడారు. కొండవీడు కోట అభివృద్ధి కమిటీ కన్వీనర్ కల్లి శివారెడ్డి మాట్లాడుతూ ఊరు కొండవీడు, ఉనికి పశ్చిమ వీధి, మూగ చింతపల్లి మొదలే ఇల్లు అనే పద్యం ద్వారా వేమనకు ఈ ప్రాంతంతో ఉన్న బంధం ఉన్నట్లు స్పష్టమవుతున్నదన్నారు. వేమన జయంతి ఉత్సవాలలో భాగంగా నరసరావుపేటకు చెందిన గాయకుడు నవీన్ వేమన పద్యాలను ఆలపించగా, కవి వెంకటరెడ్డి వేమనపై తాను రాసిన పద్యాన్ని చదివి వినిపించారు. ఈ కార్యక్రమంలో పల్నాడు జిల్లా అటవీశాఖ డిప్యూటీ రేంజ్ ఆఫీసర్ వీరశంకరం నాయుడు, కొండవీడు బీట్ అధికారి పురుషోత్తంరావు, ఆఫీల మురళీధరరెడ్డి, అటవీశాఖ సిబ్బంది, సమీప గ్రామాల ప్రజలు పాల్గొన్నారు.

సాగర్ ప్రాజెక్ట్ నీటి సమాచారం

విజయపురిసౌత్, జనవరి 19 (ఆంధ్రజ్యోతి):నాగార్జున సాగర్ జలాశయం నీటిమట్టం సోమవారానికి 552.00 అడుగుల వద్ద ఉంది. ఇది 214.20 టీఎంసీలకు సమానం. కుడి కాలువ ద్వారా 8,529 ఎడమ కాలువ ద్వారా 7,110 క్యూసెక్కులు, ప్రధాన జలవిద్యుత్ కేంద్రం ద్వారా 29,389 క్యూసెక్కులు ఎస్‌ఎల్‌బీసీ ద్వారా 1100 క్యూసెక్కులు, ఎల్‌ఎల్‌సీ ద్వారా 300 క్యూసెక్కులు,మొత్తం ఔట్‌ఫ్లో వాటర్‌గా 46428 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. శ్రీశైలం నుంచి నాగార్జున సాగర్‌కు ఇన్‌ఫ్లో వాటర్‌గా 46,428 క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతోంది.

క్వాంటం కంప్యూటింగ్‌తో నూతన ఆవిష్కరణలు

● వైద్యశాస్త్ర సమస్యలకు ఏఐతో చక్కటి పరిష్కారం ● ప్రముఖ కార్డియాలజిస్ట్ డాక్టర్ రమేష్

ఏఎన్‌యూ, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): క్వాంటం కంప్యూటింగ్‌తో వైద్య రంగంలో నూతన అధ్యయనం ప్రారంభమైందని రమేష్ హాస్పిటల్స్ మేనేజింగ్ డైరెక్టర్, ప్రముఖ కార్డియాలజిస్ట్ డాక్టర్ పోతినేని రమేష్‌బాబు అన్నారు. ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం ఎంబీఏ హాస్పిటల్ అడ్మినిస్ట్రేషన్ విభాగంలో ఎన్ఏబీహెచ్ సిక్స్ ఎడిషన్ అనే అంశంపై జరిగిన కార్యక్రమానికి సోమవారం ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, వైద్య రంగానికి నాణ్యత ప్రమాణాలు తీసుకురావాలన్నారు. గత 20 సంవత్సరాలలో వైద్యరంగంలో పెను మార్పులు జరిగాయన్నారు. ప్రస్తుత కాలంలో కృత్రిమ మేధస్సు కొన్ని సంక్లిష్టమైన వైద్యశాస్త్ర సమస్యలకు చక్కటి పరిష్కార మార్గాలు అందిస్తోందన్నారు. రమేష్ హాస్పిటల్స్ డిప్యూటీ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ రాయపాటి మమత మాట్లాడుతూ, నాణ్యత ప్రమాణాలతో అందుబాటు ఖర్చులతో



కార్యక్రమంలో మాట్లాడుతున్న రమేష్ హాస్పిటల్స్ మేనేజింగ్ డైరెక్టర్, ప్రముఖ కార్డియాలజిస్ట్ డాక్టర్ పోతినేని రమేష్ బాబు

భారత వైద్య సేవలు ప్రపంచ దేశాల కంటే మెరుగ్గా ఉన్నాయన్నారు. ఏఎన్‌యూ వీసీ ఆచార్య కే గంగాధరరావు మాట్లాడుతూ, తర్వాతి తరాలకు వైద్యశాస్త్ర విజ్ఞానం అందించడానికి కృత్రిమ మేధస్సు రూపంలో ఏజెంట్ సాఫ్ట్‌వేర్ ప్రపంచవ్యాప్తంగా అందుబాటులో ఉందన్నారు. ఈ కార్యక్రమంలో రెక్టార్ ఆచార్య రామినేని శివరాం, ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య సురేష్ కుమార్, ఆస్టర్ రమేష్ హాస్పిటల్ గ్రూప్ చైర్మన్ ఎమ్ ఎస్ రామ్మోహన్, హ్యూమన్ కేర్ వరల్డ్ వైడ్ ముంబై ముఖ్య కార్యనిర్వహణాధికారి డాక్టర్ డీఎస్ చక్రవర్తి, ఏఎన్‌యూ ఎంబీఏ హాస్పిటల్ అడ్మినిస్ట్రేషన్ విభాగాధిపతి ఆచార్య నాగరాజు బట్టు, మంగళగిరి ఎ యిమ్స్ ప్రముఖ పిల్లల వైద్య శస్త్రచికిత్స నిపుణులు డాక్టర్ దీప్తి, ఎయిమ్స్ నర్సింగ్‌స్టాఫ్ హెడ్ డాక్టర్ రమ్య, ఏఎన్‌యూ ఎంబీఏ హాస్పిటల్ అడ్మినిస్ట్రేషన్ డాక్టర్ పి. శ్రీనివాస్, డాక్టర్ జి.డేవిడ్ రాజు, డాక్టర్ సాధిక్, డాక్టర్ బి.శ్రీధర్ రెడ్డి, డాక్టర్ చుండి ప్రసాద్, హిందూ కాలేజ్ ఎంబీఏ హాస్పిటల్ అడ్మినిస్ట్రేషన్ విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యుత్ ధరలపై ఏపీఈఆర్సీ విచారణ

● 22, 23 తేదీల్లో విజయవాడలో నిర్వహణ

నరసరావుపేట రూరల్, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): పల్నాడు జిల్లా విద్యుత్ సమస్యలపై వినియోగదారుల నుంచి ఆంధ్రప్రదేశ్ విద్యుత్ నియంత్రణ మండలి (ఏపీఈఆర్సీ) అధికారులు బహిరంగ ప్రజాభిప్రాయ సేకరణ చేయనున్నారు. 2026-27 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి విద్యుత్ ధరలు, వివిధ కేటగిరీల టారిఫ్‌లపై అభిప్రాయాలు స్వీకరించనున్నారు. ఈ సమావేశాన్ని ఈ నెల 22, 23వ తేదీల్లో విజయవాడలోని తుమ్మలపల్లి కళాక్షేత్రంలో నిర్వహించనున్నట్లు పల్నాడు జిల్లా ఏపీఎస్పీడీసీఎల్ పర్యవేక్షక ఇంజనీరు డా పి.విజయకుమార్ తెలిపారు. ఉదయం 10:30 నుంచి మధ్యాహ్నం 1:30 గంట వరకు ప్రత్యక్షంగా, మధ్యాహ్నం 2:00 నుంచి సాయంత్రం 4:00వరకు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా నిర్వహించనున్నట్లు తెలిపారు.

బ్రెజిల్ వరకు ఒంగోలు జాతి ఎడ్ల వైభవం

● రైతులకు ఆవులు, ఎద్దులు బిడ్డలతో సమానం ● మంత్రి డోలా బాలవీరాంజనేయ స్వామి



ఎడ్ల యజమానురాలితో మంత్రి డోలా, ఎమ్మెల్యే ప్రత్తిపాటి

చిలకలూరిపేట, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): ఒంగోలు జాతి ఎడ్ల వైభవం బ్రెజిల్ దేశం వరకు విస్తరించిందని, ఈ జాతిని సంరక్షించి ప్రోత్సహించాల్సిన బాధ్యత అందరిపై ఉందని రాష్ట్ర సాంఘిక సంక్షేమశాఖ మంత్రి డోలా బాలవీరాంజనేయ స్వామి అన్నారు. పల్నాడు జిల్లా చిలకలూరిపేటలోని గోల్డెన్ గ్రౌండ్స్‌లో ప్రత్తిపాటి ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న రాష్ట్రస్థాయి ఒంగోలు జాతి ఎడ్ల పందేల పోటీలు సోమవారం రెండో రోజుకు చేరుకున్నాయి. స్థానిక ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావుతో కలిసి మంత్రి ఈ పోటీలను వీక్షించారు. ఈ సందర్భంగా మంత్రి డోలా మాట్లాడుతూ, ఒంగోలు జాతి ఎద్దుల అభివృద్ధికి ప్రభుత్వం [illegible] రైతు కుటుంబాలలో పశువులు, ఆవులు, ఎద్దు కేవలం జంతు సంపద మాత్రమే కాదని, అవి ఇంట్లోని బిడ్డలతో సమానమని మంత్రి కొనియాడారు. పోటీలలో విజేతలుగా నిలిచిన ఎడ్ల యజమానులకు మంత్రి బహుమతులు అందజేశారు. అనంతరం ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు మంత్రిని శాలువాతో సత్కరించి జ్ఞాపికను అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రత్తిపాటి ఫౌండేషన్ సభ్యులు, ఎడ్ల పందేల నిర్వాహకులు యలం సాంబశివరావు, తెల్లగోలు వీరయ్య చౌదరి, పేర్ని వీరనారాయణ, కందిమళ్ల అంజిబాబు, ముత్తినేని వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

అత్తోట 'స్వాతి'కి అపూర్వ గౌరవం



స్వాతికి ఆహ్వానపత్రం అందజేస్తున్న కలెక్టర్ తమీమ్ అన్సారియా, చిత్రంలో డీఏవో పద్మావతి, ప్రాజెక్టు మేనేజర్ రాజకుమారి

గుంటూరు సిటీ, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని కొల్లిపర మండలం అత్తోట గ్రామానికి చెందిన యర్రు స్వాతికి అపూర్వ గౌరవం దక్కింది. రిపబ్లిక్ డే సందర్భంగా రాష్ట్రపతి భవన్‌లో జరిగే "ఎట్ హోమ్" కార్యక్రమంలో పాల్గొనడానికి ఆమెకు ఆహ్వానం అందింది. 2016 నుంచి ప్రకృతి వ్యవసాయం ఆచరిస్తూ వివిధ రకాల దేశీ వరి రకాలను భర్తతో కలిసి 20 ఎకరాల్లో స్వాతి సాగుచేస్తున్నారు. ఈ నేపథ్యంలోనే ఆమెకు ఈ గౌరవం లభించింది. స్వాతికి అరుదైన గౌరవం లభించడం పట్ల కలెక్టర్ తమీమ్ అన్సారియా అభినందనలు తెలియజేశారు. సోమవారం కలెక్టర్ కార్యాలయానికి పిలిపించి రాష్ట్రపతి భవన్ నుంచి వచ్చిన ఆహ్వాన పత్రికను అందించారు. జిల్లా వ్యవసాయ అధికారి ముళ్లపూడి పద్మావతి, గ్రామీణ అభివృద్ధి సంస్థ ప్రాజెక్ట్ డైరెక్టర్ విజయలక్ష్మి, ప్రకృతి వ్యవసాయం జిల్లా ప్రాజెక్టు మేనేజర్ రాజకుమారి స్వాతికి శుభాకాంక్షలు తెలిపారు.

రామచంద్రా..ఏమిటిదీ

● వివాదాల్లో కర్ణాటక పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ ఎండీ..
● నాడు కూతురు బంగారం స్మగ్లింగ్ కేసు సంచలనం
● నేడు చర్చనీయాంశంగా రామచంద్రరావు రాసలీలలు
● ఉమ్మడి గుంటూరు వాసి కావడంతో చర్చనీయాంశం

గుంటూరు, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): కర్ణాటక రాష్ట్ర పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ ఎండీగా డీజీపీ హోదాలో విధులు నిర్వహిస్తున్న కె.రామచంద్రరావును వరుస వివాదాలు చుట్టుముడుతున్నాయి. గతేడాది మార్చి 14న బెంగళూరులోని కెంపెగౌడ అంతర్జాతీయ విమానాశ్రయంలో ఆయన కూతురు, కన్నడ సినీ నటి రన్యారావు 14 కిలోల బంగారు కడ్డీలు తీసుకొస్తూ పట్టుబడిన ఘటన దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించింది. తాజాగా రామచంద్రరావు తన కార్యాలయంలోనే ఓ మహిళతో రాసలీలలు సాగిస్తున్న వీడియో వైరల్ కావడం కలకలం రేపింది. ఆయన ఉమ్మడి గుంటూరు వ్యక్తి కావడంతో ఈ వ్యవహారం ఇక్కడా చర్చనీయాంశంగా మారింది. రామచంద్రరావుది బాపట్ల జిల్లా రేపల్లెలోని గూడవల్లి గ్రామం. నిరుపేద కుటుంబానికి చెందిన ఆయన.. బాపట్ల వ్యవసాయ విశ్వవిద్యాలయంలో అగ్రికల్చరల్ బీఎస్సీ పూర్తి చేశారు. 1990లో న్యూఢిల్లీలోని ఇండియన్ అగ్రికల్చరల్ రీసెర్చ్ ఇనిస్టిట్యూట్‌లో ఎంఎస్సీ గోల్డ్ మెడలిస్ట్‌గా నాటి ప్రధాని చంద్రశేఖర్ చేతుల మీదుగా అవార్డు అందుకున్నారు. 1993లో ఆయన కర్ణాటక క్యాడర్ ఐపీఎస్‌గా ఎంపికయ్యారు. రామచంద్రరావుపై 2014లో ఐజీగా మైసూరులో విధులు నిర్వహిస్తున్న సమయంలో కేరళ బంగారం దొంగతనం కేసులో నిందితుడి నుంచి రూ.2 కోట్ల నగదు రికవరీ చేసి రూ.20 లక్షలు మాత్రమే చూపడం సంచలనం సృష్టించింది. అప్పట్లో ఈ కేసును సీఐడీ విచారణకు కర్ణాటక ప్రభుత్వం ఆదేశించింది. చివరకు రామచంద్రరావు గన్‌మెన్‌ను ఈ కేసులో అరెస్టు చేసి రామచంద్రరావుపై ఆరోపణలను ముగింపు పలికారు. రామచంద్రరావు కూతురు బంగారం స్మగ్లింగ్ కేసులో పట్టుబడడం.. కర్ణాటక పోలీస్ శాఖను కుదిపేశాయి. ఆమె జతిన్ హుక్కేరీ అనే ఆర్కిటెక్ట్‌ను పెళ్లి చేసుకోవడంతో రామచంద్రరావు వారికి దూరంగా ఉన్నాడు. దీంతో కూతురిపై వచ్చిన ఆరోపణల విషయంలో ఆయన సేఫ్‌జోన్‌లో ఉన్నారు. తాజాగా తన కార్యాలయంలోనే ఓ మహిళతో రాసలీలలు సాగిస్తున్న వీడియో వైరల్ కావడంతో.. ఆయన రెడ్ హ్యాండెడ్‌గా దొరికిపోయినట్లయ్యింది.

హోదా కల్పించారు.. నిధులు మరిచారు

(5వ పేజీ తరువాయి)

ఏర్పాట్లు చేయాల్సి ఉంది. లక్షలాదిమంది భక్తులు మహాశివరాత్రి సందర్భంగా త్రికోటేశ్వర స్వామిని దర్శించుకుంటారు. వీరందరూ స్వామిని సులువుగా దర్శించుకొనేందుకు పటిష్టమైన క్యూలైన్లు ఏర్పాటు చేయాల్సి ఉంది. అయితే తిరునాళ్ల నిధులపై ప్రభుత్వం నుంచి స్పష్టత లేదు. దీంతో ఆయా శాఖల అధికారులు ఏర్పాట్ల కోసం నిధులు సమకూర్చుకోవడంలో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ సమావేశంలోనైనా నిధుల అంశంపై చర్చించి ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపేందుకు చర్యలు తీసుకోవాలి.

ఆనవాయితీగా ట్రాఫిక్ జామ్!

కొండకు వేలాది వాహనాల్లో భక్తులు వస్తారు. నరసరావుపేట, చిలకలూరిపేట, పెట్లూరివారిపాలెం, అవిశాయపాలెం రహదారుల్లో వాహనాల రాకపోకలు ఉంటాయి. ఈ రహదారులకు అవసరమైన చోట్ల మరమ్మతులు చేయాల్సి ఉంది. ఏటా తిరునాళ్ల సందర్భంగా ట్రాఫిక్ జామ్ అవడం ఆనవాయితీగా మారింది. దీనికి శాశ్వత పరిష్కారం చూపడంలో అధికారులు విఫలమవుతున్నారు. ట్రాఫిక్ సమస్యపై ఇప్పటి నుంచే చర్యలు చేపట్టాల్సి ఉండగా.. ఇందుకు ఎలాంటి ప్రయత్నాలు లేవు. ఆర్టీసీ వీఐపీల కోసం ఏసీ బస్సులను ఏర్పాటు చేస్తోంది. ఇందుకు సంబంధించి రూ.లక్షల్లో ఆర్టీసీకి బకాయి చెల్లించాల్సి ఉన్నట్లు సదరు అధికారులు తెలిపారు. బందోబస్తు విధుల్లో దాదాపు రెండు వేల మంది పోలీసులు పాల్గొంటారు. వీరందరికి రెండు రోజులు భోజన వసతి కల్పించాలి. ఇందుకు ఖర్చు భారీగానే ఉంటుంది. ఇందుకు ప్రభుత్వం నుంచి నిధులు లేవు. భక్తుల విరాళాలతోనే పోలీసులకు భోజన వసతిని కల్పిస్తున్నారు. ఇదే పరిస్థితిని వివిధ శాఖలు ఎదుర్కొంటున్నాయి. ఇకనైనా తిరునాళ్ల ఏర్పాట్లుకు ప్రభుత్వం ప్రత్యేక నిధుల కేటాయిస్తేనే అధికారులకు నిధుల తంటా తీరుతుంది.

నిధుల కోసం విజ్ఞప్తులు

కోటప్పకొండ తిరునాళ్లకు తరలి వచ్చే లక్షలాది మంది భక్తులకు నీటి వసతి, పరిశుభ్ర వాతావరణం, భద్రత, ఆరోగ్య సేవలు కల్పించాలి. ఇందుకు పెద్ద ఎత్తున నిధుల అవసరం ఉంది. ఏటా తిరునాళ్లకు రూ. 30 లక్షలు మంజూరు చేస్తున్నట్లు ప్రభుత్వం ప్రకటిస్తుందే తప్ప నిధులు విడుదల చేయడం లేదు. ఈ ఏడాది కూడా తిరునాళ్లకు రూ.30 లక్షలు మంజూరు చేయాలని కోరుతూ దేవస్థానం ఈవో డి.చంద్రశేఖరరావు ప్రభుత్వానికి లేఖ పంపుతున్నారు. ఈ నిధులు కేవలం ఏర్పాట్లకే సరిపోతాయి. అలాగే ఎమ్మెల్యే డాక్టర్ చదలవాద అరవిందబాబు దేవదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డిని కలసి తిరునాళ్లకు నిధులు విడుదల చేయాలని కోరారు. బకాయిల విషయం కూడా లేఖలో పేర్కొన్నారు.

వాణిజ్య పంటలకు ఊపిరి

(5వ పేజీ తరువాయి)

తట్టుకునే వంగడాలు, వాతావరణ మార్పులకు అనుగుణమైన సాగు విధానాలపై పరిశోధనలు వేగవంతం కానున్నాయి. గతంలో పత్తికి రూ.వేల కోట్లు కేటాయించిన తరహాలోనే, ఈసారి అన్ని వాణిజ్య పంటలకు భారీ నిధులు ఉండవచ్చన్న అంచనాలు వినిపిస్తున్నాయి.

మౌలిక సదుపాయాల విస్తరణ..

సాగు విస్తీర్ణం ఎక్కువగా ఉన్నప్పటికీ ఉమ్మడి గుంటూరు ప్రాంతంలో ఇప్పటికీ నిల్వ కేంద్రాలు, కోల్డ్ స్టోరేజీలు, ప్రాసెసింగ్ యూనిట్లు తగినంతగా లేవన్న విమర్శ ఉంది. జాతీయ మిషన్ అమలైతే ఈ లోటు తీర్చే అవకాశం ఉంది. డిజిటల్ వ్యవసాయం, డ్రోన్ టెక్నాలజీ, ఏఐ ఆధారిత తెగుళ్ల గుర్తింపు వంటి ఆధునిక సేవలు రైతులకు చేరువయ్యే సూచనలు ఉన్నాయి. విత్తనాల విషయంలో ప్రైవేట్ కంపెనీలపై ఆధారపడ కుండా.. ప్రభుత్వ పరిశోధనా సంస్థల ద్వారా తక్కువ ధరకు నాణ్యమైన విత్తనాలు అందించే విధానంపై కూడా చర్చ జరుగుతోంది.

ప్రాంతీయ ఆర్థిక వ్యవస్థకు బలం

గుంటూరు, పల్నాడు జిల్లాలు మిర్చి, పత్తి సాగులో రాష్ట్రంలో అగ్రస్థానంలో ఉండటంతో, ఈ మిషన్‌కు నిధులు కేటాయిస్తే వాటి ప్రభావం వ్యవసాయంతో పాటు రవాణా, నిల్వలు, వ్యాపారం, ఎగుమతులు వరకు విస్తరించనుంది. మొత్తం మీద ఈ ప్రతి పాదిత జాతీయ మిషన్ గుంటూరు మిర్చి ఘాటు, పల్నాడు పత్తి ప్రతిష్టను అంతర్జాతీయ వేదికపై మరింత బలంగా నిలబెట్టే సాధనంగా మారుతుందని రైతులు ఆశిస్తున్నారు.

ద్విచక్ర వాహనం, మినీ లారీ ఢీ

● ఒకరి మృతి, మరొకరికి తీవ్ర గాయాలు



సంకురాత్రి జగపతిబాబు(ఫైల్)

దాచేపల్లి, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): ద్విచక్ర వాహనం, మినీ లారీ ఎదురెదురుగా ఢీకొనడంతో ఒకరు మృతి చెందగా మరొకరు తీవ్రంగా గాయపడ్డారు. ఈ ఘటన నడికూడి గ్రామ సమీపంలోని జామతోట వద్ద సోమవారం జరిగింది. దాచేపల్లి మండలం గామాలపాడు గ్రామానికి చెందిన సంకురాత్రి జగపతిబాబు (26) ద్విచక్ర వాహనంపై గురుజాలకు వెళ్తున్నాడు. ఈ క్రమంలో గురజాల నుంచి దాచేపల్లి వెళ్తున్న మినీ లారీని అదుపు తప్పి వేగంగా ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో జగపతిబాబు అక్కడికక్కడే మృతి చెందగా, మినీ లారీలో ప్రయాణం చేస్తున్న బెల్లంకొండ మండలం చినరాజపాలెం గ్రామానికి చెందిన కలపాల వీరయ్య తీవ్రంగా గాయపడ్డాడు. అతనిని మెరుగైన చికిత్స నిమిత్తం గుంటూరు సమగ్రాస్పత్రికి తరలించారు. ప్రమాదంలో రెండు వాహనాలు పక్కనే ఉన్న పంటకాలువలో పడిపోయాయి. జగపతిబాబు మృతదేహాన్ని గురజాల ప్రభుత్వాస్పత్రికి తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ పాపారావు తెలిపారు.

విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి

పెదకూరపాడు, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి చెందిన ఘటన మండలంలోని అబ్బరాజుపాలెంలో ఆదివారం జరిగింది. గ్రామానికి చెందిన మోదుగుల శివారెడ్డి (42) సర్వీస్ వైరు బిగిస్తుండగా షాక్ కొట్టింది. దీంతో తీవ్ర గాయాలపాలై అతను అక్కడికక్కడే మృతి చెందాడు. కేసును దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.5.00 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్ (కిలో)	180, 189, 200
చికెన్ విత్ స్కిన్(కిలో)	350.00
చికెన్ స్కిన్ లెస్(కిలో)	360.00

మిర్చియార్డు సమాచారం

(సోమవారం ధరలు)

వచ్చిన బస్తాలు	53,138	
అమ్మకాలు	50,289	
నిల్వ	10,036	
నాన్ ఏసీ కామన్ వెరైటీ		
334	13000	19000
నెంబరు. 5	13500	19000
273	----	----
341	14000	22500
4884	----	----
సూపర్ 10	----	----
నాన్ ఏసీ స్పెషల్ వెరైటీ		
తేజ	12500	16500
షార్క్-1	-----	----
బ్యాడిగి	13500	18000
దేవనూరు డీలక్స్	14000	23000
ఆర్మూరు	12000	15300
ఏసీ కామన్ వెరైటీ		
334	12000	18500
నెంబరు. 5	----	----
	----	----
341	13000	20000
4884	----	----
సూపర్ 10	----	----
ఏసీ స్పెషల్ వెరైటీ		
తేజ	12000	15500
బ్యాడిగి 355	12000	17800
దేవనూరు డీలక్స్	----	----
తాలుకాయలు	5500	8800



పీజీఆర్ఎస్ ఫిర్యాదుల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలి

● కమిషనర్ కె మయూర్ అశోక్



అర్జీలు స్వీకరిస్తున్న మేయర్ రవీంద్ర, కమిషనర్ కె.మయూర్ అశోక్

గుంటూరు కార్పొరేషన్, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): నగరపాలక సంస్థలో ప్రతి సోమవారం జరిగే పీజీఆర్ఎస్, కాల్ సెంటర్‌కి అందే ఫిర్యాదులను కేటగిరీలుగా వేరు చేసి, 24, 48 గంటల్లోగా పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని నగర కమిషనర్ కె.మయూర్ అశోక్ స్పష్టం చేశారు. నగరపాలక సంస్థ ప్రధాన కార్యాలయంలో కాల్ సెంటర్, పీజీఆర్ఎస్ రిజిస్ట్రేషన్ కౌంటర్లను సోమవారం కమిషనర్ పరిశీలించి, కౌన్సిల్ హాల్లో పీజీఆర్ఎస్‌లో ప్రజల నుంచి అర్జీలను తీసుకున్నారు. పీజీఆర్ ఎస్‌లో నగర మేయర్ కోవెలమూడి రవీంద్ర పాల్గొన్నారు. మేయర్ రవీంద్ర మాట్లాడుతూ ప్రజలు తమ సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి తెస్తే త్వరగా పరిష్కారమవుతాయనే ఆశతో వస్తారని, అందుకు తగిన విధంగా పరిష్కారానికి అధికారులు చొరవ చూపాలన్నారు. అనంతరం కౌన్సిల్ సమావేశ మందిరంలో పీజీఆర్ఎస్ కార్యక్రమం ద్వారా ప్రజల నుంచి అర్జీలు తీసుకున్న కమిషనర్ అధికారులతో మాట్లాడుతూ ప్రతి అర్జీకి శాశ్వత పరిష్కారం చూపాలని, చేయలేకుంటే తగు వివరాలతో ఫిర్యాదికి ఎండార్స్‌మెంట్ ఇవ్వాలన్నారు. పీజీఆర్ఎస్ ద్వారా 26 అర్జీలు అందాయన్నారు. కార్యక్రమంలో అదనపు కమిషనర్ చల్లా ఓబులేసు, డిప్యూటీ కమిషనర్లు టి.శ్రీనివాసరావు, సీహెచ్ శ్రీనివాస్, సిటీ ప్లానర్ రాంబాబు, ఎస్ఈ సీహెచ్ డాక్టర్ శాంతికళ, ఈఈ సుందర్రామిరెడ్డి, మేనేజర్ బాలాజీ బాషా పాల్గొన్నారు.

సరస్ మేళా విజయం ... ప్రజలది : కలెక్టర్

గుంటూరు, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): సరస్ మేళా విజయం ప్రజలదని కలెక్టర్ ఎ.తమీమ్ అన్సారియా అన్నారు. సరస్ మేళా విజయవంతం కావడంపై సోమవారం కలెక్టర్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆమె మాట్లాడారు. గుంటూరులో సరస్ మేళా గొప్ప విజయవంతం అయిందన్నారు. సరస్‌లో 343 ప్రదర్శన శాలలు ఏర్పాటు చేసి రూ.25 కోట్లు పైగా విక్రయాలు చేశారని తెలిపారు. ఇది జాతీయ స్థాయి కార్యక్రమమన్నారు. కేంద్ర కమ్యూనికేషన్స్, గ్రామీణ అభివృద్ధి శాఖ సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ కృషి ఫలితంగా గుంటూరులో సరస్ జరిగిందన్నారు. ప్రజా ప్రతినిధులు, జాతీయ పేదరిక నిర్మూలన విభాగం అధికారులు మంచి సూచనలు అందించారని చెప్పారు. గుంటూరు ప్రజలు విజయవంతం చేయడంలో గొప్ప భాగస్వామ్యం వహించారని ప్రశంసించారు. సరస్‌లో నైపుణ్య శిక్షణ కార్యక్రమాలు ఇవ్వడం జరిగిందన్నారు. దాదాపు 14 లక్షల మంది సందర్శించారని తెలిపారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవ, జిల్లా రెవెన్యూ అధికారి ఎస్ఎస్‌కే ఖాజావలీ, డీఆర్‌డీఏ ప్రాజెక్టు డైరెక్టర్ వి.విజయలక్ష్మి, సహాయ ప్రాజెక్టు డైరెక్టర్ కిరణ్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

కిల్లాడ సత్యనారాయణ సాహిత్య సేవలు ప్రశంసనీయం

● ఏపీఎస్ ఆర్టీసీ ఎండీ ద్వారకా తిరుమలరావు

గుంటూరు(తూర్పు), జనవరి 19 (ఆంధ్రజ్యోతి): ఉత్తరప్రదేశ్, పోలీస్ శాఖలో కీలక బాధ్యతలు నిర్వహిస్తూ సాహిత్య పరంగా ఉన్నతంగా రాణిస్తున్న ఐపీఎస్ అధికారి కిల్లాడ సత్యనారాయణ తెలుగు వాడైనందుకు గర్విస్తున్నామని ఏపీఎస్ ఆర్టీసీ ఎండీ ద్వారకా తిరుమలరావు అన్నారు. స్థానిక నగరంపాలెం బొమ్మిడాల ఆర్య వైశ్య హాస్టల్ సమావేశ మందిరంలో సోమవారం విశ్వనాథ సాహిత్య అకాడమీ నిర్వహణలో మెట్టు సత్యనారాయణ ఎడ్యుకేషన్ సొసైటీ ఆధ్వర్యంలో మెట్టు సత్యనారాయణరెడ్డి స్మారక సాహిత్య పురస్కార సభ జరిగింది. ముఖ్య అతిథిగా హాజరైన ద్వారక తిరుమలరావు మాట్లాడుతూ తెలుగు సాహిత్యంపై ఆయన అనుభవం విశేషమైందన్నారు. అనంతరం కిల్లాడ సత్యనారాయణ సాహిత్య ప్రస్థానంపై కవి డాక్టర్ సుంకర గోపాలయ్య సాహిత్య సమీక్ష గావించారు. సభకు సాహితీ వేత్త ఆచార్య అనుమాండ్ల భూమయ్య అధ్యక్షత వహించారు. విశిష్ట అతిథిగా మొదుగుల రవికృష్ణ, వీవీఐటీ విశ్వవిద్యాలయం వీసీ వాసిరెడ్డి విద్యాసాగర్ పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్వీ రామారావు, మెట్టు సత్యనారాయణరెడ్డి, రెడ్డి విద్య కళాశాల ప్రిన్సిపల్ సెట్లం చంద్రమోహన్, వి.లక్ష్మణరెడ్డి, కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కార గ్రహీతలు డాక్టర్ పాపినేని శివశంకర్, పెనుగొండ లక్ష్మీనారాయణ, డాక్టర్ సీహెచ్ సుశీలమ్మ, డాక్టర్ నాగరాజ్యలక్ష్మి, బండ్ల మాధవరావు తదితరులు పాల్గొన్నారు.



సత్యనారాయణ అభినందన సభలో పాల్గొన్న ఆర్టీసీ ఎండీ ద్వారకా తిరుమలరావు, వాసిరెడ్డి విద్యాసాగర్ తదితరులు

వేమన పద్యం.. మానవ కోటికి జ్ఞానోదయం



వేమన చిత్ర పటానికి నివాళులర్పిస్తున్న జడ్పీ చైర్‌పర్సన్ హెనీ క్రిస్టినా

గుంటూరు సిటీ, జనవరి 19 (ఆంధ్రజ్యోతి) : జీవిత సారంతో రాయబడిన వేమన పద్యాలు మానవ కోటికి జ్ఞానోదయం కలిగించేవని ఉమ్మడి గుంటూరు జడ్పీ చైర్‌పర్సన్ కత్తెర హెనీ క్రిస్టినా అన్నారు. గుంటూరు జడ్పీ సమావేశ మందిరంలో సోమవారం యోగి వేమన జయంతి కార్యక్రమం నిర్వహించారు. జిల్లా పరిషత్ సీఈఓ వీర్ల జ్యోతి బసు మాట్లాడుతూ వేమన పద్యాలు చదవడం ద్వారా మానవ సమాజంలోని ఆలోచనా విధానాన్ని సంపూర్ణంగా అర్థం చేసుకోవచ్చునని అన్నారు. అకౌంట్స్ ఆఫీసర్ శామ్యూల్ పాల్, అధికారులు నిర్మల భారతి, రత్నబాబు, పూర్ణచంద్రారెడ్డి, మల్లేశ్వరరావు, నాగరాజు, మీటింగ్ హాల్ ఇన్‌చార్జి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

పోలీస్ కార్యాలయంలో...

గుంటూరు, జనవరి 19 (ఆంధ్రజ్యోతి) : వేమన బోధించిన నీతి సూత్రాలు నేటికీ సమాజానికి మార్గదర్శకంగా నిలుస్తున్నాయని జిల్లా అదనపు ఎస్పీ (ఏఆర్) హనుమంతు అన్నారు. ఎస్పీ వకుల్ జిందాల్ ఆదేశాల మేరకు, యోగి వేమన జయంతి సందర్భంగా జిల్లా పోలీస్ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి, పుష్పాలతో ఘన నివాళులు అర్పించారు. అదనపు ఎస్పీ (ఏఆర్) మాట్లాడుతూ, యోగి వేమన ప్రజాకవిగా, సామాజిక సంస్కర్తగా సమాజంలో విశిష్ట స్థానం సంపాదించుకున్నారని అన్నారు. కార్యక్రమం లో ఎస్బీ డీఎస్పీ శ్రీనివాసులు, ఏఆర్ డీఎస్పీ సుంకరయ్య, ఎస్బి సీఐ అళహరి శ్రీనివాస్, ఏఏఓ జగన్నాథరావు, ఆర్ఐలు సురేష్, శ్రీహరిరెడ్డి, రామకృష్ణారెడ్డి, శ్రీనివాస్ తదితర పోలీస్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

అన్నదాన సమాజం ఆడిటోరియంలో...

గుంటూరు(తూర్పు), జనవరి 19 (ఆంధ్రజ్యోతి): స్థానిక అమరావతి రోడ్డులోని అన్నదాన సమాజం ఆడిటోరియంలో సోమవారం వేమన జయంతి ఘనంగా నిర్వహించారు. ప్రముఖ రంగస్థలం, సినీ నటుడు తుర్లపాటి రాధాకృష్ణమూర్తి మాట్లాడుతూ సమాజ పరిస్థితులకు అద్దంపట్టేలా వేమన పద్య రచనలు సాగాయన్నారు. సభలో వ్యాపారవేత్త వంశీకృష్ణ, డాక్టర్ తూములూరి రాజేంద్ర ప్రసాద్ తదితరులు వేమనపై ప్రసంగించారు. అనంతరం ప్రజా గాయకుడు బీవీ రమణ బృందంచే గీతాలాపన జరిగింది. ఈ కార్యక్రమంలో బాల భారతి సేవా సంస్థ అధ్యక్ష, ఉపాధ్యక్షుడు సాంబిరెడ్డి, రాజశేఖర్, అన్నదాన సమాజం కార్య నిర్వహణ అధికారి జి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

పీజీ వైద్య అర్హత శాతం తగ్గింపుపై జేడీయూ ఆందోళన

గుంటూరు సిటీ, జనవరి 19 (ఆంధ్రజ్యోతి) : నేషనల్ బోర్డు ఆఫ్ ఎగ్జామినేషన్స్ ఇన్ మెడికల్ సైన్సెస్ (ఎన్‌బీఈఎంఎస్) పీజీ వైద్య ప్రవేశాల అర్హత శాతాలను రిజర్వ్ కేటగిరి కోసం 40 శాతం నుంచి 0 శాతానికి తగ్గించటంపై రాష్ట్ర జనతాదళ్ యూనైటెడ్ (జేడీయూ) ఆందోళన వ్యక్తం చేసింది. జనరల్ కేటగిరి కోసం 50 శాతం నుంచి 7 శాతానికి తగ్గించినట్లు ప్రకటించడం అత్యంత దుర్మార్గం అని జేడీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నల్లపనేని సాంబశివరావు అన్నారు. పీజీ కౌన్సెలింగ్ షెడ్యూల్ ప్రకారం నిర్వహించాలని, వైద్య విద్యను డబ్బుల ఆధారంగా కాకుండా మెరిట్ ఆధారంగా కొనసాగించాలని డిమాండ్ చేశారు.

పటిష్టంగా అర్జీల పరిష్కార ప్రక్రియ

● కలెక్టర్ తమీమ్ అన్సారియా ● పీజీఆర్ఎస్‌కు 195 అర్జీలు



అర్జీదారులతో మాట్లాడుతున్న కలెక్టర్ తమీమ్ అన్సారియా, డీఆర్వో ఖాజావలీ తదితరులు

గుంటూరు(తూర్పు), జనవరి 19 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కార వేదికకు వచ్చే అర్జీల నమోదు ప్రక్రియ, వాటి పరిష్కార మార్గాలను మరింత పటిష్టం చేయాలని అధికారులకు కలెక్టర్ తమీమ్ అన్సారియా సూచించారు. కలెక్టరేట్‌లోని ఎస్ఆర్ శంకరన్ సమావేశ మందిరంలో సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించారు. జేసీ అశుతోష్ శ్రీవాస్తవ, డీఆర్వో ఖాజావలీ, డిప్యూటీ కలెక్టర్లు గంగరాజు, లక్ష్మీకుమారి, ఆర్డీవో శ్రీనివాసరావు కలిసి ఆమె ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. వివిధ శాఖలకు సంబంధించి 195 అర్జీలు అందాయి. కలెక్టర్ మాట్లాడుతూ ప్రతి అర్జీ నమోదు చేయాల్సిందేనని స్పష్టం చేశారు. పీజీఆర్ఎస్‌కు ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తుందని, అప్రమత్తంగా ఉండాలన్నారు. అనంతరం శంకరన్ సమావేశ మందిరం ఆవరణలో ఏర్పాటు చేసిన రెవెన్యూ క్లినిక్‌ను కలెక్టర్ పరిశీలించారు. ఫిర్యాదుదారులతో మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో జడ్పీ సీఈవో వి జ్యోతిబసు, డీపీవో బీవీ నాగసాయి కుమార్, డీఆర్డీఏ పీడీ వి.విజయలక్ష్మి, పశు సంవర్ధక శాఖ జేడీ కేవీవీ సత్యనారాయణ, జిల్లా ఉపాధి కల్పన అధికారి డి.దుర్గాభాయి, ఉద్యాన శాఖ డీడీ రవీంద్ర బాబు, ఆర్టీవో శ్రీహరి తదితరులు పాల్గొన్నారు.

● గత ప్రభుత్వం ఇంటి పట్టాలు ఇచ్చినప్పటికీ... స్థలాలు మాత్రం చూపించలేదని... తక్షణమే స్థలాలు చూపాలని కోరుతూ స్థానిక అడవి తక్కెళ్ళపాడుకి చెందిన లబ్ధిదారులు అర్జీ అందజేశారు. గత ప్రభుత్వం పేరేచర్ల లేవుట్‌లో తమకు ఇళ్ల స్థలాలు కేటాయించి, రిజిస్ట్రేషన్ కూడా చేసిందన్నారు. నేటివరకు మాకు స్థలాలు చూపించలేదన్నారు. అర్జీ ఇచ్చిన వారిలో ఎస్‌కే అసిఫా, మౌలాబీ, ఎస్.పద్మ, విమలకుమారి, కృష్ణవేణి, రాజ్యలక్ష్మి, రమాదేవి తదితరులు ఉన్నారు.

● రైల్వే భూములలో చేపట్టిన అక్రమ నిర్మాణాలను అడ్డుకోవాలని కోరుతూ రాష్ట్రీయ మహాజన సమితి ఆధ్వర్యంలో గుంటూరు రూరల్, పెద పలకలూరు రోడ్డు, రత్నగిరినగర్ వాసులు అర్జీ అందజేశారు. రత్నగిరినగర్‌లో రైల్వేకి చెందిన కోట్ల రూపాయిల విలువైన భూముల్లో చప్పిడి రమేష్, చప్పిడి కుమారి, జోసఫ్ అనే వ్యక్తులు ఈ నిర్మాణాలు చేపట్టారని అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. తొలుత కలెక్టరేట్ ఎదుట బాధితులు నిరసన తెలిపారు. ఈ వినతి పత్రం అందజేసిన వారిలో కంభంపాటి ఆనంద్‌బాబు, గోగుల లక్ష్మి తదితరులు ఉన్నారు.

● అడవి తక్కెళ్లపాడులోని టిడ్కో గృహ సముదాయాల వద్ద మౌలిక సదుపాయాలు కల్పించాలని కోరుతూ అడవితక్కెళ్లపాడు టిడ్కో అపార్ట్‌మెంట్స్ ఓనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో స్థానికులు అర్జీ అందజేశారు. తాగునీరు, డ్రైనేజీ సమస్యలతో ఇబ్బందులు పడుతున్నామని, దీనికి తోడు ఆకతాయిలు గంజాయి తాగుతూ సమస్యలు సృష్టిస్తున్నారని కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు.

● దివ్యాంగ పెన్షన్ మంజూరు చేయాలని స్థానిక బ్రాడీపేట, 32వ డివిజన్‌కు చెందిన కటారి శంకర్ అర్జీ అందజేశారు. అనారోగ్యంతో గతంలో ఒక కాలు కోల్పోయానని, ఈ మధ్యనే రెండో కాలును కూడా వైద్యులు తొలగించారని తెలిపారు. సదరన్ సర్టిఫికెట్‌లో 90 శాతం నమోదు చేశారని అన్నారు. రేషన్ కార్డులో సమస్యల కారణంగా పెన్షన్‌కు దూరమయ్యానని వాపోయారు.

రెవెన్యూ క్లినిక్‌కు పాత అర్జీలే పునరావృతం

రెవెన్యూ క్లినిక్‌లో పాత అర్జీలే పునరావృతమయ్యాయి. సోమవారం జరిగిన పీజీఆర్ఎస్ మొత్తం 195 అర్జీలు అంద గా అందులో రెవెన్యూ క్లినిక్‌కు 125 అర్జీలు, ఇతర సమస్యలపై 70 అర్జీలు అందాయి. కాకపోతే అధికంగా రెవెన్యూ క్లినిక్‌లో వచ్చిన 125 అర్జీలలో 90 గతంలో వచ్చినవే పునరావృతమయ్యాయి. దీంతో అధికారులు వాటిని క్లోజ్ చేసినట్టు అర్జీదారుల చేత తిరిగి దరఖాస్తు చేయించారు. మిగిలినవి కొత్తగా వచ్చినవి 35 అర్జీలు మాత్రమే. వాటిని మాత్రమే సిబ్బంది ఆన్‌లైన్‌లో చేశారు.



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్ తదితరులు

10కే వాక్ విజయవంతం చేయాలి

● ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్

గుంటూరు(విద్య), జనవరి 19 (ఆంధ్రజ్యోతి): నగర ప్రజల సమష్టి భాగస్వామ్యంతో 10కే వాక్ విజయవంతం చేయడానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్ వెల్లడించారు. ఈనెల 25న నగరంలో నిర్వహించనున్న 10కే వాక్ కార్యక్రమానికి సంబంధించిన కరపత్రాన్ని విద్యానగర్‌లోని ఇండియన్‌స్ప్రింగ్స్ పాఠశాలలో సోమవారం ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ 10కె వాక్ కార్యక్రమాన్ని ఈ ఏడాది ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్నామని తెలిపారు. కార్యక్రమానికి ప్రఖ్యాత హాస్య నటుడు నటకిరీటి రాజేంద్ర ప్రసాద్, ప్రముఖ హీరోయిన్ కామ్నా జెఠ్మలానీ, జబర్దస్త్ ఫేమ్ నటులు పాల్గొంటారని తెలిపారు. ఈనెల 25వ తేదీ ఉదయం 6:00 గంటలకు విద్యానగర్‌లోని ఇండియన్ స్ప్రింగ్స్ స్కూల్ నుంచి ప్రారంభమై నగరంలోని ప్రధాన మార్గాల మీదుగా తిరిగి అదే ప్రదేశంలో ముగుస్తుందని తెలిపారు. ఇతర వివరాలకు 9849705144, 9596990666, 9441266395 నెంబర్లలో సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో 10కే వాక్ కన్వీనర్ డాక్టర్ కోయి సుబ్బారావు, కో కన్వీనర్లు డాక్టర్ టీవీ రావు, ఎన్నారై విద్యాసంస్థల ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ పిడికిటి తిలక్‌బాబు, మలినేని ఇంజనీరింగ్ కళాశాల చైర్మన్ మలినేని పెరుమాళ్ళు పాల్గొన్నారు.

ఓట్ చోరీతోనే కేంద్రంలో బీజేపీ గెలుపు

● ఏపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ మస్తాన్‌వలి

గుంటూరు, జనవరి 19 (ఆంధ్రజ్యోతి) : ఓట్ల చోరీతోనే ఎక్కడ ఎన్నికలు జరిగినా బీజేపీ గెలుపు సాధిస్తుందని ఏపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ ఎమ్మెల్యే షేక్ మస్తాన్‌వలి ఆరోపించారు. కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడిగా యన్నం సుధీర్‌బాబు, నగర అధ్యక్షుడిగా ఎండీ ఖలీల్‌ల ప్రమాణ స్వీకార కార్యక్రమం సోమవారం రాజీవ్‌గాంధీ భవన్‌లో జరిగింది. ఆయన మాట్లాడుతూ ఏ రాష్ట్రంలో అసెంబ్లీ ఎన్నికలు జరిగితే అక్కడ బీజేపీ అధికార బలంతో కాంగ్రెస్ అనుకూల ఓట్లను తొలగిస్తూ పబ్బం గడుపుకుంటుందని ధ్వజమెత్తారు. దేశంలో సంక్షేమం, అభివృద్ధికి నాంది పలికింది కాంగ్రెస్ ప్రభుత్వాలు మాత్రమేనని స్పష్టం చేశారు. మాజీ ఎమ్మెల్యే లింగంశెట్టి ఈశ్వరరావు మాట్లాడుతూ ప్రజలు మతతత్వ పార్టీలకు వ్యతిరేకంగా లౌకికవాదమైన కాంగ్రెస్ పక్షాన నిలవాలని కోరారు. నూతన జిల్లా అధ్యక్షుడు యన్నం సుధీర్‌బాబు, నగర అధ్యక్షుడు ఎండీ ఖలీల్ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ పురోభివృద్ధికి తమ శక్తివంచన లేకుండా కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో ఏపీసీసీ లీగల్‌సెల్ చైర్మన్ గురునాధం, కాంగ్రెస్ నాయకులు రాచకొండ జాన్‌బాబు, షేక్ సలీం, గడ్డం పాల్, గంగిశెట్టి ఉమామహేశ్వరరావు, రాధా కృష్ణ, షేక్ కరిముల్లా, రత్తయ్య, బోడపాటి నాగేశ్వరరావు, రామకృష్ణ, కిరణ్, జొన్నల వెంకటరెడ్డి, యలమంద తదితరులున్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న మస్తాన్‌వలి, వేదికపై లింగంశెట్టి, సుధీర్, ఖలీల్ తదితరులు

బీఆర్ స్టేడియం నుంచి భారీ ర్యాలీ....

కాంగ్రెస్ జిల్లా, నగర అధ్యక్షుల ప్రమాణ స్వీకారోత్సవం సందర్భంగా ఏపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ మస్తాన్‌వలి నేతృత్వంలో బీఆర్ స్టేడియం నుంచి రాజీవ్‌గాంధీ భవన్‌కు వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. డప్పుల వాయిద్యాలు కాంగ్రెస్ పతాకాలతో కార్యకర్తల కోలాహలం మధ్య ర్యాలీ జిన్నాటవర్ సెంటర్ మీదుగా సాగింది.

ఏఆర్ డీఎస్పీగా సంకురయ్య బాధ్యతల స్వీకరణ



ఎస్పీకి మొక్క అందజేస్తున్న ఏఆర్ డీఎస్పీ సంకురయ్య

గుంటూరు, జనవరి 19 (ఆంధ్రజ్యోతి) : ఏఆర్ డీఎస్పీగా నియమితులైన సంకురయ్య సోమవారం బాధ్యతలు స్వీకరించారు. అనంతరం ఎస్పీ వకుల్ జిందాల్‌ను మర్యాదపూర్వకంగా కలిసి పూలమొక్క అందించారు. ఈ సందర్భంగా ఆయనకు ఎస్పీ శుభాకాంక్షలు తెలిపారు. ఆయనను ఆర్ఐ అడ్మిన్, ఆర్ఐ ఎం టి సెక్షన్, ఆర్ఐ వెల్ఫేర్, సిబ్బంది కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

జిల్లా ప్రధాన కోర్టు ఇన్‌చార్జ్ జీపీగా సురేష్

గుంటూరు (లీగల్), జనవరి 19 (ఆంధ్రజ్యోతి) : గుంటూరు బార్ అసోసియేషన్ సీనియర్ న్యాయవాది మొఖమాటం సురేష్ బాబు జిల్లా ప్రధాన కోర్టు ఇన్‌చార్జ్ ప్రభుత్వ ప్లీడరుగా నియమితులయ్యారు. ఈ మేరకు కలెక్టర్ తమీమ్ అన్సారియా ఉత్తర్వులు జారీ చేశారు. గుంటూరులోని సివిల్ కోర్టుల్లో ఏ.జీ.పీ వ్యవహారాలను కూడా పరిపాలన సౌలభ్యం మేరకు, తదుపరి ఉత్తర్వులు వచ్చేవరకు సురేష్ చూడాలని పేర్కొన్నారు. సురేష్ ప్రస్తుతం గుంటూరు కార్మిక న్యాయస్థానంలో ఏజీపీగా పని చేస్తున్నారు.

నూరు శాతం టీకాల లక్ష్యాలను సాధించాలి : డీఎంహెచ్‌వో

గుంటూరు మెడికల్, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): జిల్లాకే నిర్దేశించిన వ్యాధి నిరోధక టీకాల లక్ష్యాలను వంద శాతం సాధించేందుకు ఆరోగ్య సిబ్బంది చిత్తశుద్ధితో కృషి చేయాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ కే.విజయలక్ష్మి కోరారు. సోమవారం జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయంలో పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యాధికారులకు వ్యాధినిరోధక టీకాల కార్యక్రమం మరింత బలోపేతం చేసేందుకు ఏర్పాటు చేసిన రెండు రోజుల శిక్షణ సమావేశంలో ఆమె మాట్లాడారు. అర్హులైన చిన్నారులందరికీ వ్యాధి నిరోధక టీకాలు అందించే బాధ్యత వైద్యాధికారులతో పాటు ఆరోగ్య కార్యకర్తలపై ఉందని ఆమె తెలిపారు. జిల్లా వ్యాధి నిరోధక టీకాల అధికారి డాక్టర్ ఏ శ్రవణ్‌బాబు, ప్రోగ్రామ్ ఆఫీసర్లు డాక్టర్ రోహిణి రత్నశ్రీ, డాక్టర్ సుజాత, ఎన్టీఆర్ వైద్య సేవ పథకం జిల్లా కోఆర్డినేటర్ డాక్టర్ విజయ్‌ప్రకాష్, తదితరులు పాల్గొన్నారు.

నిత్య పెళ్లి కొడుకుపై ఫిర్యాదు

● ఇప్పటికే రెండు పెళ్లిళ్లు.. మూడో పెళ్లికి సిద్ధం


గుంటూరు, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): ఇప్పటికే ఒకరికి తెలియకుండా మరొకరిని రెండు పెళ్లిళ్ల చేసుకున్న యువకుడు తాజాగా మూడో పెళ్లికి సిద్ధమయ్యాడు. దీనిపై ఇరువురు భార్యలు సోమవారం ఎస్పీ వకుల్ జిందాల్‌కు ఫిర్యాదు చేశారు. గుంటూరు నగరంలోని రెడ్డిపాలెం శివారు ఇన్నర్ రింగ్ రోడ్డు ప్రాంతానికి చెందిన పులి శ్రీకాంత్ హైదరాబాద్‌లో సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా పనిచేస్తున్నాడు. అక్కడ పనిచేసే సమయంలో హైదరాబాద్‌కు చెందిన ఉప్పల వందన అనే యువతిని ప్రేమించి 2017లో వివాహం చేసుకున్నాడు. ఐదు నెలలు కాపురం సజావుగానే సాగింది. ఆ తర్వాత నుంచి అదనపు కట్నం తేవాలంటూ శ్రీకాంత్ ఆమెను వేధించడం ప్రారంభించాడు. ఈ నేపథ్యంలో ఆమె హైదరాబాదులో కేసు పెట్టింది. ఇలా ఉంటే ఖమ్మం జిల్లా పెనుబల్లి మండలానికి చెందిన యువతిని 2023లో శ్రీకాంత్ రెండో పెళ్లి చేసుకున్నాడు. వారికి ప్రస్తుతం 15 నెలల వయసున్న కుమారుడున్నాడు. అయితే పెళ్లయిన కొద్ది నెలల నుంచి భార్యను వేధించేవాడు. ఆమెతో గొడవలు పడుతూ చివరకు ఆమె నుంచి దూరంగా ఉంటున్నాడు. ఇదిలా ఉంటే శ్రీకాంత్ ఇటీవల తాను మరో యువతిని పెళ్లి చేసుకుంటున్నానంటూ ఇరువురు భార్యలకు మార్ఫింగ్ చేసిన ఫొటోలను పంపాడు. దీనిపై మొదటి భార్య నల్లపాడు పోలీసులకు ఫిర్యాదు చేశారు. అయితే అతను ఇప్పటికే రెండు పెళ్లిళ్లు చేసుకున్నాడన్న విషయం ఇరువురు భార్యలు తెలుసుకొని ఖంగుతిన్నారు. ఇద్దరు కలిసి అతని మోసంపై ఎస్పీ వకుల్ జిందాల్‌కు ఫిర్యాదు చేశారు. చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని నల్లపాడు పోలీసులను ఎస్పీ ఆదేశించారు.

నగలు కాజేసిన పని మనిషి అరెస్టు

● 76 గ్రాముల బంగారు ఆభరణాలు స్వాధీనం

గుంటూరు, జనవరి 19 (ఆంధ్రజ్యోతి) : బంగారు ఆభరణాలు కాజేసిన పని మనిషిని కొత్తపేట పోలీసులు అరెస్టు చేసారు. సోమవారం కొత్తపేట పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో ఈస్ట్ డీఎస్పీ అబ్దుల్ అజీజ్, కొత్తపేట సీఐ వీరయ్య చౌదరి నిందితురాలు మంగమ్మను మీడియా ఎదుట హాజరుపరచి వివరాలు వెల్లడించారు. రైలుపేటకు చెందిన లక్ష్మీకుమారి తన కుటుంబంతో కలిసి డిసెంబరు నెలలో తీర్థయాత్రలకు వెళ్తూ వారి బంధువులకు ఇంటి తాళం ఇచ్చి తిరిగి వారు ఇంటికి వస్తున్న క్రమంలో ఇల్లు శుభ్రం చేయించమని చెప్పింది. బంధువులు పనిమనిషి అయిన మంగమ్మను పిలిచి ఇంటి తాళం ఇచ్చి ఇల్లు శుభ్రం చేయమనగా ఆమె ఎవరికి అనుమానం రాకుండా ఇంటిలోని బంగారు నగలను దొంగతనం చేసింది. ఇంటికి వచ్చిన లక్ష్మీకుమారి బంగారు ఆభరణాలు కనిపించనందున కొత్తపేట పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దర్యాప్తులో నిందితురాలు మంగమ్మ నేరం చేసినట్లుగా ఒప్పుకొనగా ఆమె వద్ద నుంచి మొత్తం 76 గ్రాముల బంగారు ఆభరణాలు స్వాధీనం చేసుకున్నారు.

పసి కందును రోడ్డు పక్కన వదిలివెళ్లిన అగంతకుడు



వదిలివెళ్లిన పసికందు

గుంటూరు, జనవరి 19 (ఆంధ్రజ్యోతి) : మూడు రోజుల చిన్నారిని ఓ అగంతకుడు రోడ్డు పక్కన వదిలి వెళ్ళిన ఘటన పట్టాభిపురంలో చోటు చేసుకుంది. సోమవారం రాత్రి సుమారు 8.30 గంటల సమయంలో గుర్తు తెలియని వ్యక్తి మూడు రోజుల వయసు ఉన్న చిన్నారిని కవర్లో పెట్టి పట్టాభిపురం రెండో లైన్‌లో గల మాతృశ్రీ పిల్లల ఆశ్రమం వద్ద రోడ్డు పక్కన వదిలి వెళ్ళాడు. చిన్నారి ఏడుపులు ఆశ్రమ నిర్వాహకులు గమనించి పట్టాభిపురం సిఐ వెంకటేశ్వర్లుకు సమాచారం అందించారు. దీంతో ఆయన ఐసీడీఎస్ అధికారులకు సమాచారం ఇవ్వడంతో వారు చిన్నారిని జీజీహెచ్‌లో శిశువుల వార్డుకు తరలించారు. అగంతకుడు ఎవరు అనేది తెలుసుకునేందుకు సాంకేతిక ఆధారాల కోసం ప్రయత్నిస్తున్నారు.

ప్రతిభ చూపిన చిన్నారులను అభినందించిన ఎస్పీ

గుంటూరు, జనవరి 19 (ఆంధ్రజ్యోతి) : ప్రజ్వల కమ్యూనిటీ డెవలప్‌మెంట్ సొసైటీ ఆధ్వర్యంలో కొల్లి శ్రీకాంత్ మోటివేషన్ మాస్టారు, పెరుమాళ్ళ గౌరీ శిరీష ఆధ్వర్యంలో జరిగిన వివిధ పోటీల్లో విజేతలైన చిన్నారులను ఎస్పీ వకుల్ జిందాల్ అభినందించారు. విజేతలైన 14 మంది చిన్నారులకు ఎస్పీ మెమోంటోలను బహూకరించారు. వీరు వివేకానంద జయంతి (యువజన దినోత్సవం) సందర్భంగా వ్యాస రైటింగ్, డ్రాయింగ్ కాంపిటీషన్లో వివిధ స్కూల్ లలో గెలుపొందారు.

అపస్మారక స్థితిలో గుర్తు తెలియని వ్యక్తి

డీఎంహెచ్ఓ కార్యాలయం వద్ద గుర్తు తెలియని యువకుడు అపస్మారక స్థితిలో ఉండగా జీజీహెచ్‌కు తరలించారు. అతని ఆచూకీ తెలిసిన వారు నగరంపాలెం పోలీస్ స్టేషన్‌లో లేదా జీజీహెచ్‌లోని పోలీస్ ఔట్ పోస్ట్ 8688831588కి సమాచారం ఇవ్వాలని పోలీసులు కోరారు.



కమిషనర్ మయూర్ అశోక్ తో సమావేశమైన ఎమ్మెల్యే మాధవి, కార్పొరేటర్లు

పశ్చిమ నియోజకవర్గ ప్రజా సమస్యలను పరిష్కరించండి

● నూతన కమిషనర్‌తో భేటీ అయిన ఎమ్మెల్యే మాధవి

గుంటూరు కార్పొరేషన్, జనవరి 19 (ఆంధ్రజ్యోతి) : నగరపాలక సంస్థ నూతన కమిషనర్‌గా బాధ్యతలు స్వీకరించిన మయూర్ అశోక్‌ని సోమవారం పశ్చిమ నియోజకవర్గ శాసనసభ్యురాలు గళ్ళా మాధవి మర్యాదపూర్వకంగా కలిశారు. పీకల వాగు ప్రక్షాళన అంశం, వీధి కుక్కల సమస్య, పారిశుధ్య సమస్యలను కమిషనర్‌కు వివరించారు. రాబోయే వేసవి కాలాన్ని దృష్టిలో ఉంచుకొని, నగరంలో ఎక్కడా తాగునీటి కొరత తలెత్తకుండా ప్రత్యేక కార్యాచరణ రూపొందించాలని ఎమ్మెల్యే కోరారు. కమిషనర్ మయూర్ అశోక్ సానుకూలంగా స్పందిస్తూ, సమస్యలను త్వరగతిన పరిష్కరించేలా అవసరమైన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు వేములపల్లి శ్రీరామ్ ప్రసాద్, కొమ్మినేని కోటేశ్వర రావు, ఈరంటి వర ప్రసాద్, తేలుకట్ల హనుమాయమ్మ, అడకా పద్మావతి, మానం పద్మశ్రీ, శ్రీవల్లి, సాధు రాజేష్, నిమ్మల రమణ పాల్గొన్నారు.



సీఎంఆర్ఎఫ్ చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే నసీర్

పేదల ఆరోగ్యానికి ప్రథమ ప్రాధాన్యం

● తూర్పు ఎమ్మెల్యే నసీర్ ● 27 మందికి సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

గుంటూరు, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో వైద్య రంగానికి ప్రథమ ప్రాధాన్యమిస్తున్నామని, పేద ప్రజలెవరూ అనారోగ్యం కారణంగా ఇబ్బంది పడకూడదనేదే కూటమి ప్రభుత్వ లక్ష్యమని గుంటూరు తూర్పు ఎమ్మెల్యే నసీర్ అన్నారు. స్థానిక తూర్పు ఎమ్మెల్యే కార్యాలయంలో సోమవారం 27 మంది లబ్ధిదారులకు రూ.91 లక్షల విలువైన సీఎంఆర్ఎఫ్ చెక్కులను ఆయన పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ చంద్రబాబు ఆధ్వర్యంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక తూర్పు నియోజకవర్గంలో ఇప్పటి వరకు రూ.8.70 కోట్ల విలువైన సీఎంఆర్ఎఫ్ చెక్కులు అందించామని తెలిపారు. ఏ ఒక్కరికీ వైద్య సేవలు దూరం కాకూడదనే ఉద్దేశంతో సీఎం చంద్రబాబు ఆధ్వర్యంలో కూటమి ప్రభుత్వం పని చేస్తోందని చెప్పారు. రాష్ట్రానికి సంజీవనిగా ఉన్న గుంటూరు ప్రభుత్వాస్పత్రిలో అన్ని విభాగాల్లో పూర్తి స్థాయి సౌకర్యాలు కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. గతంలోనే ఎన్నడూ లేనివిధంగా తూర్పు నియోజకవర్గంలో సంక్రాంతి సంబరాలు నిర్వహించామన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఏపీఐడీసీ చైర్మన్ దేగల ప్రభాకర్

రేపు టీడీపీ జిల్లా కమిటీ ప్రమాణ స్వీకారం : దేగల

గుంటూరు, జనవరి 19(ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీ జిల్లా నూతన కార్యవర్గం ఈనెల 21న పార్టీ జిల్లా కార్యాలయంలో ప్రమాణ స్వీకారం చేస్తుందని ఆంధ్రప్రదేశ్ ఇండస్ట్రియల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ దేగల ప్రభాకర్ చెప్పారు. పార్టీ జిల్లా కార్యాలయంలో సోమవారం ఆయన విలేకరుల సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఇటీవల పార్టీ అధినేత చంద్రబాబు గుంటూరు జిల్లా అధ్యక్షుణ్ణి, కార్యవర్గాన్ని ప్రకటించారని, ఈ నూతన కార్యవర్గం బుధవారం మధ్యాహ్నం 3 గంటలకు ప్రమాణ స్వీకారం చేస్తుందని తెలిపారు. ఈ సందర్భంగా గుంటూరులోని లాడ్జి సెంటర్ అంబేద్కర్ విగ్రహం వద్ద నుంచి టీడీపీ జిల్లా కార్యాలయంలోని ఎన్టీఆర్ విగ్రహం వరకు భారీ ర్యాలీ జరుగుతుందని తెలిపారు. కార్యక్రమానికి కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, మంత్రులు, శాసనమండలి, శాసనసభ సభ్యులు, రాష్ట్ర కార్పొరేషన్ చైర్మన్లు, డైరెక్టర్లు, రాష్ట్ర, జిల్లా టీడీపీ నాయకులు పాల్గొంటారని తెలిపారు. సమావేశంలో వేములకొండ శ్రీనివాస్, సోపాటి రత్నం, బొబ్బిలి రామారావు, పడకండ్ల కోటేశ్వరరావు, పాటిబండ్ల బలరాం పాల్గొన్నారు.

కవిత్వం చదవడం ఒక కళ

గుంటూరు, జనవరి 19 (ఆంధ్రజ్యోతి) : జిల్లా రచయితల సంఘం ప్రతి నెలా నిర్వహిస్తున్న కవిత్వంతో కాసేపు కార్యక్రమం ఈ నెల అరండల్ పేటలోని జిల్లా గ్రంథాలయంలో సోమవారం సాయంత్రం నిర్వహించారు. కవి నానా, డాక్టర్ భూసురపల్లి వెంకటేశ్వర్లు, పాణిరావు ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో కొణతం నాగేశ్వరరావు , బండికల్లు జమదగ్ని, ఎస్ఎం సుభాని, నానా, శ్రీవశిష్ఠ సోమేపల్లి, బొమ్ము ఉమామహేశ్వరరెడ్డి, సోమేపల్లి విజయలక్ష్మి, మేడిశెట్టి సుభద్రాక్రిష్ణ, రమణి, పింగళి భాగ్యలక్ష్మి, పద్మావతి, మెట్టు శ్రీనివాసరెడ్డి, పి.శ్రీనివాసాచార్యులు, కొణతం నాగేశ్వరరావు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న సహన నాటకం

గుంటూరు(తూర్పు), జనవరి 19 (ఆంధ్రజ్యోతి): స్థానిక బృందావన్ గార్డెన్స్, శ్రీ వేంకటేశ్వరస్వామి దేవస్థానం, అన్నమయ్య కళావేదికపై కె ఆర్.కె ఈవెంట్స్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఎన్టీఆర్ కళాపరిషత్ 21వ నాటకోత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. కార్యక్రమాల్లో భాగంగా సోమవారం ప్రదర్శించిన సహన నాటకం ప్రేక్షకులను ఆకట్టుకున్నది.

నేటి నుంచి శ్రీ కన్యకా పరమేశ్వరి అమ్మవారి ఆత్మార్పణ దినోత్సవం

గుంటూరు, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): శ్రీ కన్యకా పరమేశ్వరి అమ్మవారి ఆత్మార్పణ దినోత్సవం ఈనెల 20 నుంచి 24వ తేదీ వరకు నిర్వహించనున్నట్లు ఆంధ్రప్రదేశ్ ఆర్యవైశ్య మహాసభ ఈసీ సభ్యుడు, టీడీపీ నాయకుడు కొనకళ్ళ సత్యం, కోట వెంకట శేషగిరిరావు తెలిపారు. ఐదు రోజుల పాటు జరిగే వేడుకలకు ఏటుకూరు రోడ్డులోనున్న శ్రీ కన్యకా పరమేశ్వరి అమ్మవారి దేవస్థానంలో ప్రత్యేక ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు.

ముగిసిన త్యాగరాజ ఆరాధనలు

గుంటూరు(తూర్పు), జనవరి 19 (ఆంధ్రజ్యోతి): స్థానిక లక్ష్మీపురం, శ్రీ త్యాగరాజ మందిరం కళావేదికగా గాయత్రీ మహిళా సంగీత సన్మండలి ఆధ్వర్యంలో మూడు రోజులుగా జరుగుతున్న శ్రీ త్యాగబ్రహ్మ ఆరాధనోత్సవాలు సోమవారంతో ముగిసాయి.

ఆంధ్రజ్యోతి

నవ్య డాక్టర్

మంగళవారం • 20 జనవరి 2026

బ్లడ్ క్యాన్సర్



కొన్ని తీవ్రమైన వ్యాధుల లక్షణాలు పక్కదోవ పట్టిస్తూ, వ్యాధి నిర్ధారణ, చికిత్సల్లో జాప్యాలకు కారణమవుతూ ఉంటాయి. అలాంటి వ్యాధుల్లో రక్త క్యాన్సర్ ఒకటి. లక్షణాల ఆధారంగా ఈ రుగ్మతను సకాలంలో గుర్తించడం, నివారణ, చికిత్సల గురించి వైద్యులు ఇలా వివరిస్తున్నారు

రక్త క్యాన్సర్ రాకుండా...

రక్త క్యాన్సర్ నిర్ధారణ పరంగా మన దేశం ప్రపంచంలో మూడో స్థానంలో ఉంది. ప్రతి ఏటా లక్ష రక్త క్యాన్సర్ కేసులు నమోదవుతున్నాయి. ఇప్పటివరకూ కనుగొన్న రక్త క్యాన్సర్లతో పాటు ఇప్పటివరకూ కనిపెట్టని పలు రకాల రక్త క్యాన్సర్లు కూడా ఉన్నాయి. అయితే ఇప్పటివరకూ కనుగొన్న వాటిని... లుకేమియా, లింఫోమా, మైలోమా అనే మూడు రకాల ప్రధాన రక్త క్యాన్సర్లుగా విభజించారు. వీటిలో ప్రతి ఒక్క క్యాన్సర్‌కూ భిన్నమైన ఉప రకాలు, లక్షణాలు, కారణాలు, చికిత్సలూ ఉంటాయి. మన దేశంలో సర్వసాధారణంగా కనిపించే రక్త క్యాన్సర్... లుకేమియా. అలాగే లింఫోమా, మైలోమాలు కూడా కొన్నేళ్ల కాలంలో ప్రబలంగా మారాయి. అయితే రక్త క్యాన్సర్ ఏ రకానికి చెందినదైనా, లక్షణాల ఆధారంగా వ్యాధిని గుర్తించడం ఆలస్యమవుతోంది.

రక్త క్యాన్సర్ అంటే?

రక్తకణాలను, రక్తకణాలు ఉత్పత్తయ్యే ఎముక మజ్జనూ ప్రభావితం చేసే క్యాన్సర్‌నే ప్రధానంగా రక్త క్యాన్సర్ అంటారు. రక్తకణాల్లో... ఆక్సిజన్‌ను సరఫరా చేసే ఎర్ర రక్త కణాలు, వ్యాధులతో పోరాడే తెల్ల రక్తకణాలూ, రక్తం గడ్డకట్టడానికి తోడ్పడే ప్లేట్‌లెట్లూ ఉంటాయి. వీటిలో ఏ కణం అసహజంగా మారినా, పరిమితికి మించి పెరిగినా, రక్తం, వ్యాధినిరోధక వ్యవస్థల సహజ పనితీరుకు అవరోధంగా మారినా రక్త క్యాన్సర్ చోటుచేసుకుంటుంది.

పక్కదోవ పట్టించే లక్షణాలు...

లుకేమియాలు పలు రకాలు. రకాన్ని బట్టి లక్షణాల్లో మార్పు ఉన్నప్పటికీ, అన్ని రకాల లుకేమియాలో ప్రధానంగా కొన్ని లక్షణాలు కనిపిస్తూ ఉంటాయి. అవేంటంటే...

- **నీరసం:** రోజువారీ పనులు చేసుకోలేనంత నీరసం, చిన్న పనికే ఆయాసం, ఈ స్థితి రోజుల తరబడి కొనసాగడం
- **జ్వరం:** తరచూ జ్వరం రావడం, మూడు, నాలుగు వారాలకు మించి కొనసాగడం
- **బరువు తగ్గడం:** క్రమేపీ బరువు తగ్గిపోతూ ఉండడం
- **చమటలు:** రాత్రి వేళల్లో దుస్తులు తడిచిపోయేటంత చమట పట్టడం
- **రక్తస్రావం:** చర్మం అడుగున సులభంగా కమిలిపోతూ ఉండడం, నెలసరి స్రావం విపరీతంగా ఉండడం
- **పురుషుల్లో:** ముక్కు, దంతాల నుంచి రక్తం కారడం, మలంలో రక్తస్రావం

ఇతర రుగ్మతల్లో కూడా ఇవే లక్షణాలు కనిపిస్తూ ఉంటాయి. కాబట్టి సాధారణంగా ఇతరత్రా వ్యాధులకు ఆపాదించుకుంటూ, మందులు వాడుకుంటూ తాత్సారం చేయడం వల్ల రక్త క్యాన్సర్ వ్యాధి ముదిరిపోతూ ఉంటుంది. ఇలా జరగకుండా ఉండాలంటే, పైన చెప్పిన లక్షణాల్లో ఏ మూడు లక్షణాలు ఉమ్మడిగా కనిపించినా, రెండు నుంచి మూడు వారాల పాటు కొనసాగినా, రక్త క్యాన్సర్‌గానే అనుమానించి, వీలైనంత త్వరగా వైద్యులను కలవాలి.

వయసును బట్టి...

- **పిల్లల్లో:** అక్యూట్ లింఫోబ్లాస్టిక్ లుకేమియా పిల్లల్లో సర్వసాధారణం. 10 నుంచి 15 శాతం కేసుల్లో పిల్లలకు జన్యుపరంగా ఈ వ్యాధి సంక్రమిస్తూ ఉంటుంది
- **20 నుంచి 40/50 ఏళ్లు:** క్రానిక్ మైలాయిడ్ లుకేమియా, లింఫోమాలు
- **మధ్య వయస్కుల్లో:** మల్టిపుల్ మైలోమా, సిఎల్ఎల్‌లు
- **వృద్ధులు:** క్రానిక్ లింఫోసైటిక్ లుకేమియా, ఇతరత్రా లింఫోమాలు

ఈ రక్త క్యాన్సర్లు ఈ వయసులకే పరిమితం కాదు. ఇవి ఏ వయసు వారికైనా, ఎప్పుడైనా రావచ్చు.



ప్రధాన కారణాలివే!

తినే తిండి, తాగే నీరు, పీల్చే గాలి, పని వాతావరణంలోని... వీటిలోని రసాయనాలే రక్త క్యాన్సర్ ప్రధాన కారణాలు! పాలీసైక్లిక్ ఆరోమాటిక్ హైడ్రోకార్బన్స్ కోవకు చెందిన 'బెంజీన్' రసాయనం, రక్త క్యాన్సర్‌కు ముఖ్య కారణమని తేలింది. సేంద్రీయ పదార్థాలైన బొగ్గు, చమురు, సహజ వాయువులను మండించడం వల్ల, పొలాలకు చల్లే పురుగు మందుల వల్ల, అవి భూమిలోకి చేరుకుని భూగర్భ జలాలు కలుషితమవడం వల్ల... ఈ రసాయనం మన శరీరాల్లోకి చేరుకుని, రక్త క్యాన్సర్ ముప్పును పెంచుతోంది. వాహన కాలుష్యం, పురుగుమందులు, ఎరువుల వాడకం, వాటితో పండే పంటలను తినడం, కలుషితమైన నీటిని తాగడం, పాలీసైక్లిక్ ఆరోమాటిక్ హైడ్రోకార్బన్స్ కలిసిన గాలిని పీల్చడం వల్ల, రక్త క్యాన్సర్ విపరీతంగా ప్రబలుతోంది. నిజానికి వీటిలో ఏ ఒక్క కారణాన్నీ సమూలంగా అడ్డుకునే అవకాశాలు లేవు. ఎయిర్ ప్యూరిఫయర్లు గాల్లో కలిసిన ధూళి రేణువులను వడగకట్టగలుగుతాయి కానీ, వాయువులను వడగట్టలేవు. వాటర్ ఫిల్టర్లు వ్యాధికారక సూక్ష్మజీవులను వడగట్టగలుగుతాయి తప్ప, రసాయనాలను వడగట్టలేవు. కూరగాయలు, పండ్లలోకి చేరుకునే రసాయనాలను తొలగించుకోగలిగే మార్గం లేదు. అయినప్పటికీ సాధ్యమైనంత మేరకు ఈ హానికారక రసాయనాలకు దూరంగా ఉండే ప్రయత్నం చేయాలి. అదెలాగంటే...

- బయటకు వెళ్లినప్పుడు ముఖానికి మాస్కులు పెట్టుకోవాలి
- ట్రాఫిక్‌కు దూరంగా ఉండాలి
- నీటిని వడగట్టడం కోసం రివర్స్ ఆస్మోసిస్ ఫిల్టర్ ఉపయోగించాలి
- కూరగాయలు, పండ్లను శుభ్రంగా కడిగా తొక్క తీసి వాడుకోవాలి
- సోడియం బైకార్బొనేట్ కలిపిన నీళ్లలో కూరగాయలు, పండ్లను కడగడం ద్వారా రసాయనాలను కొంత మేరకు తొలగించుకోవచ్చు
- కార్బైడ్‌తో పండించిన పండ్లను తినకూడదు
- సేంద్రీయ పండ్లు, కూరగాయలను ఎంచుకోవాలి
- వీలైతే, ఇంట్లోనే కూరగాయలు పండించుకోవాలి
- పరిశ్రమలకు, ట్రాఫిక్‌కు దూరంగా నివసించాలి
- హానికారక రసాయనాలకు ఎక్కువగా బహిర్గతమయ్యే స్వర్ణకారులు, శిలాజ ఇంధనాల వృత్తుల్లో ఉన్న వాళ్లు తగిన జాగ్రత్తలు పాటించాలి

సమర్థ చికిత్సలున్నాయి

మల్టిపుల్ మైలోమా, సిఎల్ఎల్ రక్త క్యాన్సర్లకు శాశ్వత చికిత్స లేకపోయినప్పటికీ, మధుమేహంలా దీన్ని కూడా అదుపులో ఉంచే చికిత్స తీసుకోవచ్చు. ప్రధాన లుకేమియాలన్నిటికీ కీమో థెరపీ కీలక చికిత్సా విధానం. అయితే అత్యాధునిక కీమోథెరపీలతో తక్కువ దుష్ప్రభావాలు, ఎక్కువ ఫలితాన్ని పొందే వీలు కలుగుతోంది. టార్గెటెడ్ థెరపీల సహాయంతో, క్యాన్సర్ జెనెటిక్ ప్రొఫైల్ ఆధారంగా, జెనెటిక్, ప్రొటీన్ లక్ష్యాల ఆధారిత చికిత్సను అందించవచ్చు. ప్రపంచవ్యాప్తంగా ప్రతి ఏటా సగటున ఆరు నుంచి ఏడు టార్గెటెడ్ థెరపీలనూ, రెండు నుంచి మూడు మందులనూ ఆవిష్కరిస్తున్నారు. అలాగే కొత్త రకం ఇమ్యునోథెరపీ మందుల సహాయంతో శరీర వ్యాధినిరోధక కణాలను క్యాన్సర్ కణాలతో పోరాడేలా ప్రోత్సహించే చికిత్స కూడా సత్ఫలితాలనిస్తోంది. చివరి ప్రయత్నంగా కొందరికి ఎముక మజ్జ మార్పిడి అవసరం పడొచ్చు. మునుపటితో పోలిస్తే, ప్రస్తుత మజ్జ మార్పిడి చికిత్సలతో దుష్ప్రభావాలు, ఖర్చు తగ్గిపోయాయి. కోలుకునే వేగం పెరిగింది. కొన్ని రకాల ఎముక మజ్జ మార్పిడి చికిత్సలను ఔట్ పేషెంట్ పద్ధతిలో అందించగలిగే సౌలభ్యం కూడా అందుబాటులోకొచ్చింది. అలాగే వ్యాధి సంక్లిష్టతలను తగ్గించి, నయం చేసే అవకాశాలు ఇటీవలి కాలంలో పెరిగాయి. ఎముక మజ్జ మార్పిడి సైతం సాధ్యపడని వాళ్ల కోసం కార్‌టి సెల్ థెరపీ అనే కొత్త ప్రక్రియ కూడా ఇప్పుడు అందుబాటులోకొచ్చింది.

డాక్టర్ జి.శ్రీనివాస్ చక్రవర్తి
సీనియర్ మెడికల్ ఆంకాలజిస్ట్,
హెమటో ఆంకాలజిస్ట్,
యశోద హాస్పిటల్స్, సికింద్రాబాద్



అవగాహన

నీళ్ల నిల్వకు ఏ సీసా ఉత్తమం?

మనం తాగే నీటితో, ఆ నీటిని నింపుకునే సీసా కూడా ఆరోగ్యకరమైనదై ఉండాలి. నీళ్ల కోసం ఉపయోగించే సీసా తయారీ పదార్థం మన ఆరోగ్యంతో పాటు, నీటి రుచిని కూడా ప్రభావితం చేస్తుందని పరిశోధకులు చెబుతున్నారు. రాగి, గాజు, ప్లాస్టిక్ బాటిళ్ల వెనుక ఉన్న నిజాలేంటో తెలుసుకుందాం.

రాగి బాటిళ్లు

రాగి పాత్రలో సుమారు 16 గంటలపాటు నీటిని నిల్వ ఉంచితే అందులోని కాపర్ అయాన్లు హానికారక 'ఇ-కొలై', 'సాల్మొనెల్లా' వంటి బ్యాక్టీరియాను చంపేస్తాయి. ఇది రోగ నిరోధకశక్తిని పెంచడానికి, జీర్ణక్రియ మెరుగుపడటానికి దోహదం చేస్తుంది. దీనివల్ల వాంతులు, కడుపులో తిప్పడం, కడుపునొప్పి వంటి ఇబ్బందులు తలెత్తవచ్చు. రాగిబాటిళ్లలో నిమ్మరసం వంటి ఆమ్ల గుణం ఉన్న పానీయాలను నిల్వ చేయకూడదు

గాజు బాటిళ్లు

ఆరోగ్య నిపుణుల దృష్టిలో గాజు బాటిళ్లు అత్యంత సురక్షితమైనవి. ఇవి ఎటువంటి రసాయన చర్యలకు లోను కావు. వీటి వల్ల నీటి రుచి మారదు. ప్లాస్టిక్‌లో ఉండే బిస్ఫినాల్ ఎ లాంటి హానికారక రసాయనాల భయం గాజుతో ఉండదు. బోరోసిలికేట్ గ్లాస్ అయితే వేడి, చల్లని



పానీయాలను తట్టుకుంటుంది. అయితే గాజు బాటిళ్ల మూతలకు ప్లాస్టిక్ కోటింగ్ ఉంటే మూత తీసేటప్పుడు కలిగే ఘర్షణ వల్ల మైక్రోప్లాస్టిక్స్ నీటిలో కలిసే అవకాశం ఉందని ఇటీవలి పరిశోధనలో వెల్లడైంది. కాబట్టి మెటల్ లేదంటే సిలికాన్ మూతలు ఉన్న గ్లాస్ బాటిళ్లను ఎంచుకోవడం మంచిది.

ప్లాస్టిక్ బాటిళ్లు

తక్కువ ధర, తేలికగా ఉండటం వల్ల ప్లాస్టిక్ బాటిళ్లను ఎక్కువగా వాడుతుంటాం. కానీ ఇవి ఆరోగ్యానికి పెను ముప్పు కలిగిస్తాయి. వీటిలో ఉండే బిస్ఫినాల్ ఎ హార్మోన్ల అసమతుల్యతకు, గర్భిణులలో ఆరోగ్య సమస్యలకు కారణమవుతుంది. ప్లాస్టిక్ బాటిళ్లపై 'బిపిఎ ఫ్రీ' అని రాసి ఉన్నప్పటికీ అవి పాతబడే కొద్దీ రసాయనాలను విడుదల చేస్తాయి. కాబట్టి వీటిని వాడకపోవడమే మంచిది.

మీకు తెలుసా?

బ్లాక్ కాఫీ భేష్

టీ, కాఫీల కంటే బ్లాక్ కాఫీ మేలైన పానీయని ఆరోగ్య నిపుణులు అభిప్రాయపడుతున్నారు. ఎందుకో తెలుసుకుందాం!

- **తక్షణ చురుకుదనం:** ఒక కప్పు బ్లాక్ కాఫీలో 95 మిల్లీగ్రాముల కెఫీన్ ఉంటుంది. క్యాలరీలు ఏమాత్రం ఉండవు. కాబట్టి బరువు తగ్గాలనుకునేవారు పాలు, చక్కెర కలపని బ్లాక్ కాఫీ తాగాలి.
- **ఆరోగ్య రక్ష:** అలాగే బ్లాక్ కాఫీలో 'క్లోరోజెనిక్ యాసిడ్' వంటి శక్తివంతమైన యాంటీ ఆక్సిడెంట్లు పుష్కలంగా ఉంటాయి. ఇవి శరీరంలోని వాపులను తగ్గించడమే



కాకుండా, టైప్-2 మధుమేహం, హృద్రోగాల నుంచి రక్షణ కల్పిస్తాయి. టీలో ఉండే పాలీఫినాల్స్ కంటే కాఫీలో ఉండే యాంటీ ఆక్సిడెంట్లు మరింత విభిన్నంగా ఉండి సంపూర్ణ ఆరోగ్యానికి తోడ్పడతాయి.
- **శారీరక సామర్థ్యం:** అథ్లెట్లు, జిమ్‌కు వెళ్లే వారికి కెఫీన్ మంచి సప్లిమెంట్. వ్యాయామాలకు ముందు బ్లాక్ కాఫీ తాగడం వల్ల శరీరం శక్తిని పుంజుకుంటుందనీ, కండరాల పనితీరు మెరుగుపడుతుందనీ పరిశోధనలు చెబుతున్నాయి
- **బరువు తగ్గిస్తుంది:** కెఫీన్ శరీరంలోని కొవ్వు కణాలను విచ్ఛిన్నం చేయడంలో సాయపడుతుంది. ఇది శరీర వేడిని పెంచి, క్యాలరీలను వేగంగా ఖర్చు చేయడంలో తోడ్పడుతుంది. టీతో పోలిస్తే కాఫీ తాగడం వల్ల రోజువారీ క్యాలరీలు గణనీయంగా ఖర్చవుతాయి.

రిపేర్ సర్జరీ

చెవిపోగు రంధ్రాన్ని సరిచేద్దాం!

బరువైన కమ్మలు, జూకాలు లాంటివి అలంకరించుకోవాలంటే అందుకు చెవులు కూడా సహకరించాలి. కానీ చెవి రంధ్రం సాగిపోయిన వాళ్ల పరిస్థితి ఏంటి? ఈ ఇబ్బందిని సరి చేసే వీలుందా? వైద్యులేమంటున్నారు?



చెవిలో కింది భాగమైన ఇయర్ లాబ్యూల్‌లో చర్మం, కొవ్వు మాత్రమే ఉంటుంది. కాబట్టి మృదువుగా, సాగే గుణాన్ని కలిగి ఉండే ఈ ప్రదేశంలో ఏర్పరిచే రంధ్రాలు కూడా క్రమేపీ సాగుతాయి. చెవి పైభాగమైన ఇయర్ హెలిక్స్, నమ్యత కలిగిన మృదు కణజాలంతో కాస్త బిగుతుగా, దృఢంగా ఉంటుంది. కాబట్టి ఇక్కడ ఏర్పరిచే రంధ్రాలు సాగవు. అలాగని ఇయర్ లాబ్యూల్ అందర్లో ఒకేలా ఉండదు. కాబట్టి అందరికీ సాగిపోతుందని అనుకోడానికి కూడా వీల్లేదు. ఈ సమస్య ప్రధానంగా శరీర తత్వం మీద ఆధారపడి ఉంటుంది. ఏదేమైనప్పటికీ కొందరు మహిళల ఇయర్ లాబ్యూల్స్ సాగిపోతూ, తెగిపోతూ ఉంటాయి. దుస్తులు మార్చుకునేటప్పుడు లేదా పిల్లలు కమ్మలు పట్టుకుని లాగేసినప్పుడు ఇలా జరగవచ్చు.

కిలాయిడ్స్ సమస్య ఉంటే...

కొందరికి గాయమైన ప్రదేశంలో కండ పెరిగే 'కిలాయిడ్' సమస్య ఉంటుంది. ఈ కోవకు చెందినవాళ్లు ఇయర్ హెలిక్స్‌లో రంధ్రాలు చేయించుకోకుండా ఉండడమే మేలు. ఈ సమస్య ఉన్నవారు గన్‌షాట్‌కు బదులుగా సంప్రదాయ పద్ధతిలో భాగంగా, చేత్తో చెవి లాబ్యూల్‌కు రంధ్రం చేయించుకోవడం ఉత్తమం.

సరికొత్త సర్జరీలతో...


ఇయర్ లాబ్యూల్ రంధ్రం సాగిపోయి లేదా తెగిపోయినప్పుడు, చిన్న రంధ్రాన్ని వదిలేసి, మిగతా భాగాన్ని జోడించే సంప్రదాయ సర్జరీ చేసేవారు. కానీ ఈ రకమైన సర్జరీతో తిరిగి సమస్య పునరావృతయ్యే అవకాశాలు ఎక్కువ. సంప్రదాయంలో భాగంగా చెవి కమ్మలు ధరించకుండా ఉండలేని సందర్భాల్లో మాత్రమే ఇలాంటి సర్జరీని అనుసరించాలి. లేదంటే లాబ్యూల్ రంధ్రాన్ని పూర్తిగా మూసేసే సర్జరీని ఎంచుకోవాలి. ఈ సర్జరీ చేయించుకున్న ఆరు వారాల తర్వాత, అవసరమైన చోట రంధ్రాన్ని ఏర్పరుచుకుని, ఆరు వారాల పాటు తేలికపాటి కమ్మలు పెట్టుకుంటూ, ఆ తర్వాత బరువైన కమ్మలు పెట్టుకోవచ్చు. ఈ రకమైన సర్జరీతో ఇయర్ లాబ్యూల్ రంధ్రం సాగిపోయే సమస్య ఉండదు. అరుదుగా కొందర్లో ఈ భాగం పలుచగా ఉండి, కొన్నేళ్లకు మళ్లీ రంధ్రం సాగిపోవచ్చు. ఇలాంటి అరుదైన సందర్భాల్లో, ఇయర్ హెలిక్స్ (చెవి పైభాగం)లోని మృదుకణజాలాన్ని సేకరించి, ఇయర్ లాబ్యూల్ లోపల అమర్చి, చర్మాన్ని మూసేసి, గాయం పూర్తిగా మానిపోయిన తర్వాత రంధ్రం చేయొచ్చు. ఈ సర్జరీతో సమస్య తిరగబెట్టే అవకాశం ఉండదు.

నీడిల్ పియర్సింగ్ ఉత్తమం

సాధారణంగా పియర్సింగ్ కోసం గన్స్‌ను ఆశ్రయిస్తూ ఉంటారు. అయితే ఈ విధానంలో రంధ్రం ఏర్పడే ప్రదేశంలో స్వల్ప వ్యత్యాసాలు చోటుచేసుకోవచ్చు. ఇయర్ లాబ్యూల్ మరీ చిన్నగా ఉన్న వారిలో 1 లేదా 2 మిల్లీమీటర్ల వ్యత్యాసం కూడా పెద్ద తేడాను సృష్టించవచ్చు. అలాగే ఈ విధానంలో అమర్చే ఆభరణాలు కృత్రిమమైనవి ఉంటాయి. దాంతో కొందరికి అలర్జీ తలెత్తవచ్చు. కాబట్టి ఈ విధానానికి బదులుగా కచ్చితత్వంతో రంధ్రాన్ని ఏర్పరుచుకోవడం కోసం నీడిల్ విధానాన్ని ఎంచుకోవచ్చు. ఈ విధానంతో, ఇయర్ లాబ్యూల్‌తో పాటు వంపుతో కూడిన ఇయర్ హెలిక్స్‌లో కచ్చితమైన ప్రదేశంలో రంధ్రాన్ని ఏర్పరుచుకుని, కృత్రిమ ఆభరణాలకు బదులుగా బంగారు ఆభరణాన్నే చెవికి అమర్చుకోవచ్చు.

రంధ్రం సాగిపోకుండా...

- బరువైన చెవి ఆభరణాలు అరుదుగా అలంకరించుకోవాలి
- చెవి ఆభరణానికి ఆసరా అందించే అదనపు ఆభరణాలు వాడుకోవాలి
- రంధ్రం సాగుతున్నట్టు గ్రహించిన వెంటనే జాగ్రత్త పడాలి
- కమ్మలు, జూకాలు దుస్తులకు తగులుకోకుండా చూసుకోవాలి
- చిన్న పిల్లల చేతికి అందకుండా జాగ్రత్తపడాలి



బిగుతుగా బిగిస్తే...

కొందరు కమ్మలు జారిపోతున్నాయనే ఆలోచనతో వాటికి ఆసరాగా బటన్స్ బిగించుకుంటూ ఉంటారు. అయితే వీటిని బిగుతుగా బిగించేసి, అలాగే వదిలేయడం వల్ల ఆ ప్రదేశం ఒరుసుకుపోయి, బటన్ పైనుంచి కండ పెరిగిపోతుంది. దాంతో చెవి కమ్మ తొలగించలేని సమస్య తలెత్తుతుంది. ఇలా జరగకుండా ఉండాలంటే అప్పుడప్పుడూ కమ్మలను తొలగిస్తూ ఉండాలి. కమ్మలతో తలెత్తే అసౌకర్యాన్ని పరిశీలించుకుంటూ, ఒరుసుకుపోకుండా చూసుకోవాలి. మరీ ముఖ్యంగా పిల్లలకు అలంకరించే చెవి జూకాల విషయంలో కూడా ఇవే జాగ్రత్తలు పాటించాలి.

డాక్టర్ వెంకటేష్ బాబు
ప్లాస్టిక్ రికన్‌స్ట్రక్టివ్ అండ్
ఈస్థటిక్ సర్జన్,
కాస్మోస్యూర్ క్లినిక్, హైదరాబాద్.



గుడ్ ఫుడ్

పదార్థాలు... పోషకాలు

కొన్ని పదార్థాల పోషకాలను సంపూర్తిగా పొందాలన్నా, వాటిలోని హానికారకాలను వదిలించుకోవాలన్నా కొన్ని సులువైన చిట్కాలు పాటించాలి. అవేంటంటే...

అన్నం

అన్నంలోని ఆర్సెనిక్ మోతాదును తగ్గించుకోవడం కోసం నేరుగా ఉడికించుకోకుండా, ఎక్కువ నీళ్లలో నానబెట్టి ఉడికించుకోవాలి.


దీంతో 80% ఆర్సెనిక్ తగ్గిపోతుంది. అలాగే బియ్యానికి కొబ్బరినూనె జోడిస్తే, దాని గ్లైసెమిక్ మోతాదు తగ్గిపోతుంది. అలాగే వండిన అన్నాన్ని రాత్రంతా ఫ్రిజ్‌లో ఉంచి మరుసటి రోజు తినడం వల్ల కూడా గ్లైసెమిక్ మోతాదు తగ్గుతుంది

వెల్లుల్లి

వెల్లుల్లిని తరిగిన వెంటనే వంటల్లో వాడుకోకుండా, పది నిమిషాల తర్వాత వాడుకుంటే, దాన్లోని శక్తివంతమైన యాంటీ ఇన్‌ఫ్లమేటరీ మూలకమైన అల్లిసిన్ మరింత పెరుగుతుంది

టమాటా

పచ్చి టమాటాలు తినడానికి బదులుగా, వాటిని ఆలివ్ నూనెలో ఉడికిస్తే, కణగోడలు విచ్ఛిన్నమై, లైపోసీన్ శోషణ పెరుగుతుంది



నట్స్

వీటిని నేరుగా తినకుండా ఉప్పు నీళ్లలో 4 నుంచి 12 గంటలు నానబెట్టి తింటే, అజీర్తికి కారణమయ్యే వాటిలోని ఫైటిక్ ఆమ్లం విచ్ఛిన్నమవుతుంది.

చెవి గులిమి మీ ఆరోగ్యాన్ని చెబుతుంది

చెవిలోని గులిమిని సాధారణంగా ఒక వ్యర్థ పదార్థంగా భావిస్తాం. దాని రంగు లేదా ఆకృతి గురించి మాట్లాడటానికి చాలామంది ఇష్టపడరు. అయితే, మన శరీరంలోని క్యాన్సర్, గుండె జబ్బులు, మధుమేహం వంటి వ్యాధులను గుర్తించడంలో ఈ గులిమి ఒక అద్భుతమైన సూచికగా పనిచేస్తుందని శాస్త్రవేత్తలు చెబుతున్నారు.

గులిమి అంటే ఏమిటి?

చెవి వెలుపల భాగంలో ఉండే 'సెరుమినస్', 'సెబేషియస్' గ్రంథుల నుంచి వచ్చే స్రావాలు, చనిపోయిన చర్మకణాలు, ధూళి కణాల మిశ్రమమే ఈ గులిమి. ఇది మన చెవి లోపలి భాగాన్ని లూబ్రికేట్‌గా ఉంచుతుంది.

రంగులు.. ఆరోగ్య సంకేతాలు

- **ఆఫ్‌వైట్ నుంచి పసుపు:** ఇది తాజాగా ఉన్న గులిమి
- **నారింజ నుంచి గోధుమ:** ఇది పాతబడిన, చిక్కని, జిగటగా ఉండే గులిమి
- **పాలిపోయిన నారింజ:** ఇది పొడిగా ఉన్న పాత గులిమి
- **బూడిదరంగు:** చెవిలో అధికంగా ధూళి చేరిందని అర్థం

ఎప్పుడు జాగ్రత్త పడాలి?

- **ఆకుపచ్చ రంగు:** చెవిలో తీవ్రమైన ఇన్ఫెక్షన్ ఉందని అర్థం
- **రక్తంతో కూడిన గులిమి:** చెవి లోపల గాయాలు, కర్ణభేరి దెబ్బతింటే ఇలా వస్తుంది
- **నలుపు రంగు:** గులిమి విపరీతంగా పేరుకుపోయి గట్టిపడిందని అర్థం



రోగ నిర్ధారణలో సెరుమెనోగ్రామ్

రక్త పరీక్షలు, మూత్ర పరీక్షల కంటే కూడా గులిమి ద్వారా వ్యాధులను మరింత వేగంగా గుర్తించవచ్చని శాస్త్రవేత్తలు చెబుతున్నారు. దీనికోసం 'సెరుమెనోగ్రామ్' అనే సరికొత్త పరీక్షను అభివృద్ధి చేస్తున్నారు.

- **క్యాన్సర్ గుర్తింపు:** గులిమిలోని 27 సమ్మేళనాల ద్వారా శరీరంలోని క్యాన్సర్ ఉనికిని ముందుగానే గుర్తించవచ్చు. బ్రెజిల్‌లోని కొన్ని ఆసుపత్రులలో ఇప్పటికే ఈ విధానాన్ని వాడుతున్నారు.
- **మెనియర్స్ వ్యాధి:** గులిమిలో ఉండే ఫ్యాటీ యాసిడ్ల స్థాయిని బట్టి ఈ వ్యాధిని కచ్చితంగా నిర్ధారించవచ్చు.
- **ఇతర వ్యాధులు:** మధుమేహం, పార్కిన్సన్స్, అల్జీమర్స్, గుండె జబ్బుల ముందస్తు సంకేతాలను కూడా ఇది వెల్లడిస్తుంది.

వింటర్ కేర్

చలి బద్ధకం వదలడం కోసం...

చలికాలంలో బద్ధకం పెరుగుతుంది. దాంతో పూర్తిచేయవలసిన పనులన్నీ మూలన పడిపోతాయి. ఈ కాలంలో శరీరం, మనసూ రెండూ చలాకీగా ఉండాలంటే ఈ చిట్కాలు పాటించాలి.



- **విటమిన్ డి:** మెదడులోని హ్యాపీ హార్మోన్ సెరటోనిన్ మోతాదు తగ్గిపోకుండా ఉండాలంటే విటమిన్ డి సరిపడా ఉండాలి. కాబట్టి శరీరానికి ఎండ సోకేలా చూసుకోవాలి. ఎండ తగలకపోవడం వల్ల మెలటోనిన్ స్రావం పెరిగి, పగటి మత్తు పెరుగుతుంది.
- **వ్యాయామం:** వ్యాయామం చేయడానికి బద్ధకిస్తే, దీర్ఘకాలంలో ఎముకలు, కీళ్ల బిగుసుకుపోయే పరిస్థితి తలెత్తుతుంది. శరీరంతో పాటు మనసు కూడా చురుగ్గా ఉండాలంటే ఈ కాలంలో తప్పనిసరిగా వ్యాయామం చేయాలి. కనీసం గంట పాటైనా నడక, ఈత, సైక్లింగ్ లాంటి వ్యాయమాలు చేయాలి.
- **కాలక్షేపాలు:** చల్లని వాతావరణానికి భయపడి ఇంటికే పరిమితమైపోవడం సరి కాదు. బయటకు వెళ్లి స్నేహితులతో కబుర్లు చెప్పుకోవాలి. కలిసి తిరగాలి. సరదాగా కాలక్షేపం చేయాలి. ఇలాంటి పనులతో హ్యాపీ హార్మోన్లు అయిన డోపమైన్, సెరటోనిన్, ఆక్సిటోసిన్, ఎండార్ఫిన్లు విడుదలవుతాయి.



బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	1,45,690 ▲	1,33,550 ▲	3,18,000 ▲
విజయవాడ	1,48,800 ▲	1,37,800 ▲	3,00,000 ▲
విశాఖపట్నం	1,48,737 ▲	1,31,800 ▲	3,18,000 ▲
రాజమండ్రి	1,45,690 ▲	1,33,550 ▲	2,91,000 ▲
ప్రొద్దుటూరు	1,45,500 ▲	1,33,860 ▲	2,96,000 ▲
ముంబై	1,43,946 ▲	1,31,855 ▲	2,93,975 ▲

బులియన్ మార్కెట్‌కు గ్రీన్‌లాండ్ సెగ



మరో రికార్డు స్థాయికి ధరలు

ఒక్కరోజే రూ.10,000 పెరిగిన కిలో వెండి ధర .. రూ.3,02,600కి చేరిక

అదే బాటలో పసిడి. రూ.1,900 పెరుగుదలతో రూ.1.48 లక్షలకు.. ● ఫ్యూచర్స్ మార్కెట్లోనూ బులియన్ భగభగలు

న్యూఢిల్లీ: అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ గ్రీన్‌లాండ్ సుంకాల పోరు బులియన్ మార్కెట్‌ను చుక్కలంటేలా చేస్తోంది. ట్రంప్ హెచ్చరికలతో సోమవారం స్పాట్, ఫ్యూచర్స్ మార్కెట్లో బంగారం, వెండి ధరలు మరో ఆల్ టైమ్ రికార్డు స్థాయికి చేరాయి. ఢిల్లీ స్పాట్ మార్కెట్లో 10 గ్రాముల మేలిమి (24 క్యారట్స్) బంగారం ఒకే రోజు రూ.1,900 పెరిగి రూ.1,48,100కు చేరి సరికొత్త రికార్డు నమోదు చేసింది. మరోవైపు కిలో వెండి ధర కూడా రూ.10,000 పెరుగుదలతో జీవితకాల గరిష్ఠ స్థాయి రూ.3,02,600కి చేరింది.

ఫ్యూచర్స్ మార్కెట్లోనూ అదే జోరు

గ్రీన్‌లాండ్‌పై పెత్తనం కోసం ట్రంప్ చేస్తున్న హెచ్చరికల ప్రభావం సోమవారం బులియన్ మార్కెట్ ఫ్యూచర్స్‌పైనా కనిపించింది. మల్టీ కమోడిటీస్ ఎక్స్ఛేంజీ (ఎంసీఎక్స్)లో కిలో వెండి ధర ఒకే రోజు రూ.16,438 (6 శాతం) పెరిగి రూ.3,04,200కు చేరి రికార్డు సృష్టించింది. దీంతో గత వారం రోజుల్లో కిలో వెండి ధర 14 శాతం (రూ.35,037) పెరిగినట్టయింది. ఈ ఏడాది ప్రారంభం నుంచి చూసినా కిలో వెండి ధర ఇప్పటి వరకు 29 శాతం (రూ.68,499) లాభాలు పంచింది. పసిడి ధర కూడా వెండి బాటలోనే పయనించింది. ఎంసీఎక్స్‌లో ఫిబ్రవరిలో డెలివరీ ఇచ్చే 10 గ్రాముల మేలిమి పసిడి ధర రూ.2,983 లాభంతో రూ.1,45,500కు చేరి సరికొత్త రికార్డు నమోదు చేసింది. దీంతో గత వారం రోజుల్లో 10 గ్రాముల పసిడి ధర ఫ్యూచర్స్ మార్కెట్‌లో రూ.3,698 (2.7 శాతం) పెరిగినట్టయింది.

ర్యాలీకి కారణాలు

- గ్రీన్‌లాండ్‌పై ఆధిపత్యం కోసం యూరోపియన్ దేశాలపై ట్రంప్ విసిరిన సుంకాల అస్త్రం
- సురక్షిత పెట్టుబడులనే నమ్మకంతో భారీగా పెరిగిన బంగారం, వెండి కొనుగోళ్లు
- ప్రధాన కరెన్సీలతో తగ్గుతున్న డాలర్ మారకం రేటు
- ఫారెక్స్ నిల్వల వివిధీకరణలో భాగంగా కేంద్ర బ్యాంకుల కొనుగోళ్లు
- డాలర్‌తో క్షీణిస్తున్న రూపాయి మారకం రేటు
- అమెరికా ఫెడ్ రిజర్వ్ వడ్డీ రేట్లు తగ్గిస్తుందనే అంచనాలు
- వెండి ఎగుమతులపై చైనా అమలు చేస్తున్న లైసెన్సింగ్ విధానం
- పారిశ్రామిక రంగం నుంచి బంగారం, వెండికి పెరుగుతున్న గిరాకీ
- గత ఏడాది వెండి ధర 170 శాతం, పసిడి ధర 70 శాతం పెరగడం

ఈ ఏడాది వృద్ధి 7.3%

అంచనాలను భారీగా పెంచిన ఐఎంఎఫ్

న్యూఢిల్లీ/వాషింగ్టన్: అమెరికా విధించిన భారీ సుంకాల ప్రభావాన్ని కూడా తట్టుకుని భారత ఆర్థిక వ్యవస్థ ఊహించిన దాని కన్నా మెరుగైన పనితీరు ప్రదర్శిస్తున్న నేపథ్యంలో అంతర్జాతీయ ద్రవ్య నిధి (ఐఎంఎఫ్) 2025-26 ఆర్థిక సంవత్సర వృద్ధి అంచనాలను గణనీయంగా పెంచింది. ఈ ఏడాది వృద్ధి రేటు 7.3% ఉండవచ్చని తాజా నివేదికలో తెలిపింది. ఇది అక్టోబరులో ప్రకటించిన అంచనాల కన్నా 0.7% అధికం. 2026-27 ఆర్థిక సంవత్సరానికి ప్రకటించిన అంచనాను కూడా 6.2% నుంచి 6.4 శాతానికి పెంచింది. ఐఎంఎఫ్ సోమవారం ప్రకటించిన ప్రపంచ ఆర్థిక గమనం నివేదికలో ఈ అంశాలు ప్రస్తావించింది. ఆర్థిక రంగం మూడో త్రైమాసికంలో ఊహించిన దాని కన్నా మెరుగైన వృద్ధిని నమోదు చేయడంతో పాటు నాలుగో త్రైమాసికంలోకి బలంగా పురోగమిస్తోందని పేర్కొంది. అయితే తాత్కాలికంగా ఆర్థిక రంగానికి ఉత్తేజం కల్పిస్తున్న అంశాలు కనుమరుగైపోయి, కాలానుగుణంగా ఏర్పడే మార్పుల ప్రభావంతో 2026, 2027 సంవత్సరాల్లో వృద్ధి రేటు 6.4 శాతానికి పరిమితం కావచ్చని అంచనా వేసింది.

ప్రపంచ వృద్ధి 3.3%

ప్రపంచ వృద్ధి ఈ ఏడాది 3.3 శాతంగాను, 2027 సంవత్సరంలో 3.2 శాతంగాను ఉండవచ్చని ఐఎంఎఫ్ అంచనా వేసింది. గతంలో ప్రకటించిన అంచనాలతో పోల్చితే 2026 అంచనా స్వల్పంగా పెంచి, 2027 సంవత్సరానికి మాత్రం స్థిరంగా ఉంచింది. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ అనుసరిస్తున్న ఆత్మరక్షణ వాణిజ్య విధానాలను సైతం లెక్క చేయకుండా ప్రపంచ ఆర్థిక రంగం స్థితి స్థాపకత ప్రదర్శిస్తోందని తాజా నివేదికలో పేర్కొంది. ప్రధానంగా ఉత్తర అమెరికా, ఆసియా దేశాల్లో కృత్రిమ మేధపై పెట్టుబడులు వృద్ధికి ఊతం ఇవ్వవచ్చని వ్యాఖ్యానించింది. అమెరికాలో వృద్ధి రేటు ఈ ఏడాది 2.4% ఉండవచ్చని జోస్యం చెప్పింది. ప్రపంచంలో రెండో పెద్ద ఆర్థిక వ్యవస్థ అయిన చైనా సైతం 4.5% వృద్ధి చెందవచ్చని అంచనా వేసింది. కాగా భారత్ ప్రపంచ వృద్ధికి కీలకమైన చోదకశక్తి అని ఐఎంఎఫ్ కమ్యూనికేషన్ విభాగం డైరెక్టర్ జూలీ కొజాక్ అన్నారు.


రూ.80 కోట్లకు నాచారం భూముల విక్రయం

యునైటెడ్ బ్రూవరీస్

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): లిక్కర్ కంపెనీ యునైటెడ్ బ్రూవరీస్ లిమిటెడ్ (యూబీఎల్) హైదరాబాద్‌లోని నాచారం పారిశ్రామిక ప్రాంతంలో తన ఎనిమిది ఎకరాల భూమిని విక్రయించింది. ఈ భూమిని ఎకరా రూ.10 కోట్ల చొప్పున టాప్‌సన్ సోలార్ ప్రైవేట్ లిమిటెడ్‌కు రూ.80.8 కోట్లకు విక్రయించినట్టు రెగ్యులేటరీ సంస్థలకు తెలిపింది. యూబీఎల్ గతంలో ఇక్కడి ప్లాంట్‌లో మెక్‌డోవెల్ విస్కీ తయారు చేసేది. అయితే ప్రస్తుతం ఈ ప్లాంటులో ఎలాంటి ఉత్పత్తి కార్యకలాపాలు జరగడం లేదు. దీంతో ఖాళీగా ఉన్న ఈ భూమిని కంపెనీ అమ్మి సొమ్ము చేసుకుందని భావిస్తున్నారు.

ఎలక్ట్రిక్ ద్విచక్ర వాహన సంస్థ ప్యూర్ ఈవీ ఆంధ్రప్రదేశ్‌లో తన కార్యకలాపాలు విస్తరించింది. ఇందులో భాగంగా కడపలో కొత్త షోరూమ్‌ను ప్రారంభించింది. ఈ షోరూమ్‌లో ఈప్లూటో 7జీ మాక్స్, ఈట్రిస్ట్ ఎక్స్ అందుబాటులో ఉంటాయి. వచ్చే 30 నెలల కాలంలో కొత్తగా 250 డీలర్‌షిప్‌ను ఏర్పాటు చేయాలని ప్యూర్ లక్ష్యంగా పెట్టుకుంది.

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)



20వ తేదీ			
హైదరాబాద్	500	విజయవాడ	500
వరంగల్	502	గోదావరి	495
చిత్తూరు	543	విశాఖపట్నం	500
		డజను గుడ్లు రూ. 75	

ఫామ్‌గేట్ ధర — వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



హైదరాబాద్	156	విజయవాడ	157
వరంగల్	156	గుంటూరు	164
కరీంనగర్	156	ఒంగోలు	164
మహబూబ్‌నగర్	156	చిత్తూరు	164
కర్నూలు	156	నెల్లూరు	169
విశాఖపట్నం	145	అనంతపురం	169
గోదావరి	157		

మార్కెట్‌ను ముంచిన టారిఫ్ భయాలు

325 పాయింట్లు నష్టపోయిన సెన్సెక్స్

న్యూఢిల్లీ: భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతల పెరుగుదల... ప్రత్యేకించి 8 యూరోపియన్ దేశాలపై సుంకాలు మరింతగా పెంచుతామంటూ అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చేసిన హెచ్చరిక నేపథ్యంలో ఈక్విటీ మార్కెట్ సోమవారం తీవ్రంగా ప్రభావితమైంది. దీంతో ఈక్విటీ మార్కెట్ సూచీలు భారీగా నష్టపోయాయి. సెన్సెక్స్ ఒక దశలో 672.04 పాయింట్ల మేరకు నష్టపోయి 82,898.31 పాయింట్లను తాకినప్పటికీ చివరికి నష్టాన్ని 324.17 పాయింట్లకు పరిమితం చేసుకుని 83,246.18 వద్ద ముగిసింది. నిఫ్టీ 108.85 పాయింట్ల నష్టంతో 25,585.50 వద్ద ముగిసింది. ట్రంప్ తాజా హెచ్చరికలకు తోడు నిరాశాపూరితమైన ఫలితాల కారణంగా కార్పొరేట్ దిగ్గజాలైన రిలయన్స్ ఇండస్ట్రీస్, ఐసీఐసీఐ బ్యాంక్, ఎటర్నల్ షేర్లలో భారీ అమ్మకాలు మార్కెట్ సెంటిమెంట్‌ను బలహీనపరిచాయని మార్కెట్ వర్గాలు వెల్లడించాయి. సర్వత్రా బలహీనత నేపథ్యంలో బీఎస్ఈ స్మాల్‌క్యాప్ సూచీ 1.28%, మిడ్‌క్యాప్ సూచీ 0.43% నష్టపోయాయి. సెన్సెక్స్ షేర్లలో ఆర్ఐఎల్ గరిష్ఠంగా 3.04%, ఐసీఐసీఐ బ్యాంక్ 2.26% నష్టపోయాయి.

బీసీసీఎల్ లిస్టింగ్ సూపర్ హిట్

కోల్ ఇండియా అనుబంధ సంస్థ భారత్ కోకింగ్ కోల్ (బీసీసీఎల్) షేర్ల లిస్టింగ్ సూపర్ హిట్టయింది. ఇష్యూ ధర కన్నా ఈ షేరు 77% ప్రీమియంను నమోదు చేసింది. ఇష్యూ ధర రూ.23తో పోల్చితే 96.56% ప్రీమియంతో బీఎస్ఈలో రూ.45.21 వద్ద లిస్టయిన ఈ షేరు రూ.40.66 వద్ద ముగిసింది. ఎన్ఎస్ఈలో కూడా 95.65% ప్రీమియంతో రూ.45 వద్ద లిస్టయిన ఈ షేరు చివరికి 76.43% ప్రీమియంతో రూ.40.58 వద్ద ముగిసింది.ఈ ధరలో కంపెనీ మార్కెట్ విలువ రూ.18,935.36 కోట్లుగా నిలిచింది.

'ఫ్రెషర్స్'కు చుక్కలు చూపిస్తున్న విప్రో

ఎన్ఐటీఈఎస్

న్యూఢిల్లీ: ఐటీ కంపెనీ విప్రో 250 మందికి పైగా ఫ్రెషర్లకు చుక్కలు చూపిస్తోంది. క్యాంపస్ నియామకాల్లో ఎంపికయ్యారని తీపి కబురు చెప్పి, ఏడెనిమిది నెలలైనా వారిని ఉద్యోగాల్లోకి తీసుకోకుండా తాత్సారం చెస్తోంది. మా పరిస్థితి ఏమిటని అభ్యర్థులు నిలదీస్తున్నా కంపెనీ నుంచి ఉలుకూ పలుకు లేదు. దీంతో వెంటనే ఈ విషయంలో జోక్యం చేసుకుని ఫ్రెషర్లకు న్యాయం చేయాలని ఐటీ ఉద్యోగులకు ప్రాతినిధ్యం వహించే ఎన్ఐటీఈఎస్.. కేంద్ర కార్మిక శాఖ మంత్రి మన్‌సుఖ్ మాండవీయకు ఫిర్యాదు చేసింది. విప్రో వైఖరితో ఈ అభ్యర్థులు క్యాంపస్ ప్లేస్‌మెంట్స్‌లో వేరే కంపెనీల ఇంటర్వ్యూలకు దూరమై రెండు విధాలా నష్టపోయారని పేర్కొంది. ప్రభుత్వం వెంటనే ఈ విషయంలో జోక్యం చేసుకుని న్యాయం చేయకపోతే, ఐటీ పరిశ్రమలో ఇది మామూలు విషయంగా మారే అవకాశం ఉందని హెచ్చరించింది.

అసెట్‌ప్లస్‌కు రూ.175 కోట్ల నిధులు

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): డిజిటల్ వెల్త్ మేనేజ్‌మెంట్ ప్లాట్‌ఫామ్ అసెట్‌ప్లస్ రూ.175 కోట్ల నిధులు సమీకరించింది. నెక్సస్ వెంచర్ పార్ట్‌నర్స్ నుంచి ఈ మొత్తాలను సమీకరించినట్లు వెల్లడించింది. డిస్ట్రిబ్యూటర్ ఆధారిత వెల్త్ మేనేజ్‌మెంట్ విభాగంలోకి ప్రవేశించేందుకు ఈ మొత్తాలను వినియోగించనున్నట్లు సంస్థ కో ఫౌండర్, సీఈఓ విశ్రాంత్ సురేశ్ వెల్లడించారు. అలాగే ఉత్పత్తుల పోర్టుఫోలియో విస్తరణ, పోర్టుఫోలియో మేనేజ్‌మెంట్ సర్వీసులతో పాటు వచ్చే ఆరు నెలల్లో వినియోగదారులకు గిఫ్ట్ సిటీ ద్వారా అంతర్జాతీయంగా ఇన్వెస్ట్‌మెంట్స్ ఆప్షన్స్‌ను అందిచాలని చూస్తున్నట్లు ఆయన చెప్పారు. కాగా ఎయిట్‌రోడ్స్ వెంచర్స్, జీరోధా కో ఫౌండర్ నితిన్ కామత్‌కు చెందిన రెయిన్‌మ్యాటర్ ఫండ్.. అసెట్‌ప్లస్‌లో ఇప్పటికే పెట్టుబడులు పెట్టాయి. ప్రస్తుతం అసెట్‌ప్లస్ నిర్వహణలో రూ.7,250 కోట్ల ఆస్తులున్నాయి.

ఎల్‌టీఐమైండ్‌ట్రీ లాభంలో క్షీణత

న్యూఢిల్లీ: ఐటీ రంగంలోని ఎల్‌టీఐమైండ్‌ట్రీ లాభం డిసెంబరు త్రైమాసికంలో 10.5% తగ్గి రూ.970.6 కోట్లకు పరిమితమైంది. కొత్త కార్మిక చట్టాల అమలు బాధ్యత కోసం రూ.590 కోట్లు కేటాయించడం ఇందుకు కారణమని కంపెనీ తెలిపింది. ఏడాది క్రితం ఇదే కాలంలో కంపెనీ ఆర్జించిన లాభం రూ.1,085 కోట్లుంది. ఇదిలా ఉండగా కంపెనీ ఆదాయం 11.6% పెరిగి రూ.10,781 కోట్లకు చేరింది. సెప్టెంబరు త్రైమాసికంతో పోల్చితే మాత్రం లాభం 30.7% క్షీణించగా ఆదాయం మాత్రం 3.7% పెరిగింది. క్యూ3లో కొత్తగా 1,511 మందిని కొత్తగా ఉద్యోగాల్లోకి తీసుకోగా డిసెంబరు 31 నాటికి మొత్తం ఉద్యోగుల సంఖ్య 87,958గా ఉంది.

పీఎన్‌బీ లాభం రూ.5,100 కోట్లు

ముంబై: ప్రభుత్వ రంగంలోని పంజాబ్ నేషనల్ బ్యాంక్ (పీఎన్‌బీ) డిసెంబరు త్రైమాసికంలో 13% వృద్ధితో రూ.5,100 కోట్ల లాభం ఆర్జించింది. ఒక త్రైమాసికంలో బ్యాంక్ ఆర్జించిన అత్యధిక లాభం ఇదే. మొండి బకాయిల తగ్గుదల ఈ వృద్ధికి దోహదపడిందని బ్యాంక్ తెలిపింది. గత ఏడాది ఇదే కాలంలో బ్యాంక్ ఆర్జించిన లాభం రూ.4,508 కోట్లుగా ఉంది. ఈ ఆర్థిక ఫలితాల స్ఫూర్తితో ఇక ప్రతి త్రైమాసికంలోనూ రూ.5,000 కోట్ల పైబడి లాభం ఆర్జించాలని లక్ష్యంగా పెట్టుకున్నట్టు బ్యాంక్ ఎండీ, సీఈఓ అశోక్ చంద్ర చెప్పారు. కాగా ఇదే కాలంలో బ్యాంకు మొత్తం ఆదాయం రూ.34,752 కోట్ల నుంచి రూ.37,253 కోట్లకు పెరిగినట్టు రెగ్యులేటరీ సంస్థలకు పంపిన సందేశంలో బ్యాంక్ తెలిపింది. డిసెంబరు 31 నాటికి స్థూల మొండి బకాయిలు (జీఎన్‌పీఏ) 4.09% నుంచి 3.19 శాతానికి తగ్గాయి. నికర ఎన్‌పీఏలు 0.41% నుంచి 0.32 శాతానికి దిగి వచ్చాయి. ఎన్‌పీఏలు తగ్గడంతో కేటాయింపులు సైతం రూ.1,341 కోట్ల నుంచి రూ.318 కోట్లకు తగ్గినట్టు బ్యాంక్ తెలిపింది.

స్పోర్ట్స్

డబ్ల్యూపీఎల్‌లో నేడు
ఢిల్లీ X ముంబై (రా. 7.30)

ప్లేఆఫ్స్‌లో ఆర్‌సీబీ

వరుసగా ఐదో విజయం

గౌతమి హాఫ్ సెంచరీ



సయాలీ (3/21)



గౌతమీ నాయక్ (73)

వడోదర: మహిళల ప్రీమియర్ లీగ్ (డబ్ల్యూపీఎల్)లో వేదిక మారినా.. రాయల్ చాలెంజర్స్ బెంగళూరు (ఆర్‌సీబీ) జోరు మాత్రం తగ్గలేదు. సోమవారం గుజరాత్ జెయింట్స్‌తో జరిగిన మ్యాచ్‌లో ఆల్‌రౌండ్‌షో కనబర్చిన ఆర్‌సీబీ 61 రన్స్ తేడాతో ఘనవిజయం సాధించింది. అలాగే వరుసగా ఐదు విజయాలతో ప్లేఆఫ్స్‌లో అడుగుపెట్టిన తొలి జట్టుగా నిలిచింది. అటు గుజరాత్‌కు హ్యాట్రిక్ ఓటమి. ఈ మ్యాచ్‌లో ముందుగా బ్యాటింగ్‌కు దిగిన బెంగళూరు 20 ఓవర్లలో 6 వికెట్లకు 178 పరుగులు చేసింది. గౌతమీ నాయక్ (55 బంతుల్లో 7 ఫోర్లు, 1 సిక్స్‌తో 73) అర్ధసెంచరీ సాధించగా.. రిచా (27), మంధాన (26) ఫర్వాలేదనిపించారు. కష్వీ, ఆష్లేలకు రెండేసి వికెట్లు దక్కాయి. ఆ తర్వాత ఛేదనలో గుజరాత్ 20 ఓవర్లలో 8 వికెట్లకు 117 పరుగులు చేసి ఓడింది. ఆష్లే గార్డ్‌నర్ (54) మాత్రమే ఆకట్టుకుంది. 5 పరుగులకే మూడు వికెట్లు కోల్పోయి కష్టాల్లో పడిన జట్టును తను ఆదుకునే ప్రయత్నం చేసినా.. మరో ఎండ్‌లో సహకారం కరువైంది. వరుస విరామాల్లో ఆర్‌సీబీ బౌలర్లు వికెట్లు తీస్తూ ప్రత్యర్థిని గెలుపునకు దూరం చేశారు. సయాలీకి మూడు, డిక్లెర్క్‌కు రెండు వికెట్లు దక్కాయి. ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్‌గా గౌతమీ నాయక్ నిలిచింది.

గుజరాత్ చిత్తు

గౌతమీ అండతో..: టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన ఆర్‌సీబీ ఇన్నింగ్స్‌లో గౌతమీ నాయక్ ఆట హైలైట్‌గా నిలిచింది. ఓపెనర్ హ్యారిస్ (1), జార్జియా వాల్ (1) తొలి రెండు ఓవర్లలోనే వెనుదిరిగినా.. కెప్టెన్ మంధానతో కలిసి మూడో వికెట్‌కు నాయక్ 60 పరుగులు జోడించింది. పదో ఓవర్‌లో మంధానను గార్డ్‌నర్ అవుట్ చేసినా.. రిచా అండతో గౌతమి మరింత ధాటిగా ఆడింది. ఈ జోరుతో 42 బంతుల్లోనే హాఫ్ సెంచరీని పూర్తి చేసుకుంది. అటు 16వ ఓవర్‌లో రిచా రెండు సిక్సర్లతో 17 రన్స్ అందించింది. వరుస ఓవర్లలో ఈ జోడీ వెనుదిరగ్గా.. ఆఖరి ఓవర్‌లో రాధా (17) రెండు ఫోర్లు, శ్రేయాంక (8 నాటౌట్) రెండు ఫోర్లతో జట్టు 17 రన్స్‌తో స్కోరు 170 దాటింది.

సంక్షిప్త స్కోర్లు

బెంగళూరు: 20 ఓవర్లలో 178/6 (గౌతమి 73, రిచా 27, మంధాన 26; కష్వీ 2/38, గార్డ్‌నర్ 2/43).
గుజరాత్: 20 ఓవర్లలో 117/8 (గార్డ్‌నర్ 54, అనుష్క 18; సయాలీ 3/21, డి క్లెర్క్ 2/17).

జొకో 'సెంచరీ'



మెల్‌బోర్న్ పార్క్‌లో 100వ విజయం
స్వియటెక్, గాఫ్, ఆండ్రీవా ముందంజ
ఆస్ట్రేలియన్ ఓపెన్

మెల్‌బోర్న్: దిగ్గజ ఆటగాడు నొవాక్ జొకోవిచ్ ఆస్ట్రేలియన్ ఓపెన్‌లో శుభారంభం చేశాడు. రికార్డు స్థాయిలో 25వ గ్రాండ్‌స్లామ్‌పై కన్నేసిన జొకో తొలి రౌండ్‌ను సునాయాసంగా అధిగమించాడు. ఫేవరెట్ ఇగా స్వియటెక్ కూడా రెండో రౌండ్‌కు చేరింది. అయితే తొలి సెట్ గట్టెక్కేందుకు ఆమె శ్రమకోర్చాల్సి వచ్చింది. పురుషుల్లో 11వ సీడ్ మెద్వెదెవ్ 12వ సీడ్ రూడ్, 13వ సీడ్ రుబ్లేవ్ సైతం మొదటి రౌండ్‌లో అలవోక విజయాలు సాధించారు. మహిళల్లో మూడో సీడ్ కొకొ గాఫ్, నాలుగో సీడ్ అనిసిమోవా, ఆరో సీడ్ పెగులా, ఎనిమిదో సీడ్ ఆండ్రీవా మొదటి రౌండ్‌లో గెలుపొందారు. సోమవారం జరిగిన మహిళల సింగిల్స్ తొలి రౌండ్‌లో వరల్డ్ నెం.2 స్వియటెక్ 7-6 (5), 6-3తో చైనా క్వాలిఫయర్ యువాన్ యుయిపై కష్టపడి నెగ్గింది. మూడో సీడ్ కొకొ గాఫ్ 6-2, 6-3తో కమిల్లా రాఖిమోవాపై, నాలుగో సీడ్ అమందా అనిసిమోవా 6-3, 6-2తో వాల్టెర్ట్‌పై, ఆరో సీడ్ పెగులా 6-2, 6-1తో జఖరోవాపై, ఎనిమిదో సీడ్ ఆండ్రీవా 4-6, 6-3, 6-0తో వెకిక్‌పై నెగ్గి రెండో రౌండ్‌లో అడుగుపెట్టారు.

నొవాక్ చరిత్ర

పదిసార్లు ఆస్ట్రేలియన్ ఓపెన్ విజేత, నాలుగో సీడ్ నొవాక్ జొకోవిచ్ పురుషుల సింగిల్స్ మొదటి రౌండ్‌లో 6-3, 6-2, 6-2తో పెడ్రో మార్టినెజ్‌ని వరుస సెట్లలో ఓడించాడు. ఈక్రమంలో 38 ఏళ్ల జొకో మెల్‌బోర్న్ పార్క్‌లో 100వ విజయం అందుకోవడం విశేషం. అంతేకాదు..మూడు భిన్న గ్రాండ్‌స్లామ్‌లలో 100 మ్యాచ్‌లు నెగ్గిన ఏకైక ఆటగాడిగా జొకోవిచ్ చరిత్ర సృష్టించాడు. ఫ్రెంచ్ ఓపెన్, వింబుల్డన్‌లో నొవాక్ ఇప్పటికే సెంచరీ ఫీట్ నమోదు చేశాడు. 11వ సీడ్ మెద్వెదెవ్ 7-5, 6-2, 7-6 (2)తో డి జోంగ్‌ని, 12వ సీడ్ కాస్పెర్ రూడ్ 6-1, 6-2, 6-4తో బెలూసినీని, 13వ సీడ్ రుబ్లేవ్ 6-4, 6-2, 6-3తో అర్నాల్డీని, 14వ సీడ్ డవడోవిచ్ 6-2, 6-3, 6-3తో మిసోలిచ్‌ని ఓడించి ముందంజ వేశారు. ఏడో సీడ్ అలియాసిమ్ 6-3, 4-6, 4-6తో వెనుకంజలో ఉన్న దశలో గాయంతో ప్రత్యర్థి బోర్గెస్‌కు వాకోవర్ ఇచ్చాడు. 21వ సీడ్ షపోవలోవ్, 25వ సీడ్ టీన్, 19వ సీడ్ టామీ పాల్, అన్ సీడెడ్‌లు స్టాన్ వావ్రింకా, మారిన్ సిలిచ్, మహిళల్లో 19వ సీడ్ ముచోవా, 21వ సీడ్ మెర్టెన్స్, 23వ సీడ్ ష్నీడెర్, 25వ సీడ్ బడోసా కూడా తొలి రౌండ్‌లో విజయం సాధించారు.

ఆడితే ఆడండి..లేదంటే అంతే

బంగ్లాకు ఐసీసీ అల్టిమేటం
అయినా ఆడేది లేదంటున్న బీసీబీ

ఢాకా/దుబాయ్: టీ20 ప్రపంచ కప్‌లో తమ జట్టు మ్యాచ్‌లను భారత్ నుంచి మార్చాల్సిందేనంటూ మొండికేస్తున్న బంగ్లాదేశ్ క్రికెట్ బోర్డు (బీసీబీ)కు అంతర్జాతీయ క్రికెట్ మండలి (ఐసీసీ) గట్టిగా సమాధానమిచ్చింది. ఈ నేపథ్యంలో బంగ్లా నిర్ణయాన్ని మార్చుకొనేందుకు ఐసీసీ ఈనెల 21 వరకు గడువు విధించినట్టు సమాచారం. భారత్‌లో ఖరారు చేసిన వేదికలలోనే మ్యాచ్‌లు ఆడాలని బీసీబీకి ఐసీసీ అల్టిమేటమ్ జారీ చేసినట్టు తెలుస్తోంది. ఆ గడువులోగా తేల్చకపోతే టోర్నీనుంచి బంగ్లాదేశ్‌ను బహిష్కరిస్తామని కూడా ఖరాఖండిగా చెప్పినట్టు ఐసీసీ వర్గాలు వెల్లడించాయి. భారత్ వెళ్లేందుకు నిరాకరిస్తే..ఆ జట్టు స్థానంలో ర్యాంకింగ్స్ ఆధారంగా మరో జట్టును ఆడిస్తామని బీసీబీని హెచ్చరించినట్టు ఐసీసీ వర్గాలను ఉటంకించాయి.

ఆ వార్తలు నిజం కాదు: ఐసీసీ తమకు అల్టిమేటం జారీ చేసినట్టుగా వస్తున్న వార్తలను బంగ్లా బోర్డు ఖండించింది. 'గత శనివారం ఐసీసీ ప్రతినిధి ఒకరు మా దేశం వచ్చారు. ఇంతకుముందు ఖరారు చేసిన వేదికల్లో ఆడలేమని తెలిపాం. అందువల్ల ప్రత్యామ్నాయ వేదికను నిర్ణయించాలని కోరాం. అంతేగానీ ఫలానా తేదీలోగా నిర్ణయం చెప్పాలని ఆయన అనలేదు' అని బీసీబీ డైరెక్టర్ అంజాద్ హొసేన్ సోమవారం తెలిపారు. కాగా ఈ వరల్డ్‌కప్ వచ్చేనెల ఏడునుంచి జరుగుతుంది.

మూడో రౌండ్‌లో గుకేష్‌తో అర్జున్ గేమ్ డ్రా

విజ్క్ ఆన్ జీ (నెదర్లాండ్స్): టాటా చెస్ టోర్నీ మూడో రౌండ్‌లో ప్రపంచ చాంపియన్ గుకేష్‌తో గేమ్‌ను తెలుగు గ్రాండ్‌మాస్టర్ అర్జున్ ఇరిగేసి డ్రా చేసుకున్నాడు. సోమవారం జరిగిన గేమ్‌లో 34 ఎత్తుల అనంతరం అర్జున్, గుకేష్ పాయింట్ పంచుకున్నారు. ఈ రౌండ్ ముగిసే సరికి మరో నలుగురితో కలిసి అర్జున్ (2 పాయింట్లు) సంయుక్తంగా అగ్రస్థానంలో కొనసాగుతున్నాడు. మరో భారత ఆటగాడు అరవింద్ చిదంబరం.. అబ్దుసత్తోరోవ్ (ఉజ్బెకిస్థాన్)తో మూడో రౌండ్‌ను ఫలితం లేకుండా ముగించాడు.

గంభీర్.. ఇక కష్టమేనా?

భారత జట్టు కోచ్‌పై సర్వత్రా విమర్శలు

భారత క్రికెట్ జట్టు సిరీస్‌లను కోల్పోవడం కొత్తేం కాదు.. గతంలోనూ ఇలాంటి ఓటములు ఎదురయ్యాయి. కానీ సొంత గడ్డపై టీమిండియాను మట్టికరిపించడం మాత్రం ఎంత పటిష్ఠ జట్టుకైనా కష్టంగానే ఉండేది. కానీ గౌతం గంభీర్ కోచ్‌గా వచ్చాక పరిస్థితులు మారాయి. భారత్‌లో భారత జట్టుపై పర్యాటక జట్లు అలవోకగా గెలవడంతో పాటు సిరీస్‌లు కూడా ఎగరేసుకుపోతుండడం అభిమానులను కలచివేస్తోంది. తాజాగా న్యూజిలాండ్ గురించే చెప్పుకొంటే.. గతంలో ఇక్కడ ఐసీసీ టోర్నీలు, వన్డే సిరీస్‌ల కోసం 16 సార్లు పర్యటించినా ఫలితం సాధించలేదు. కానీ ద్వితీయ శ్రేణి జట్టుతో వచ్చిన కివీస్ 38 ఏళ్ల తర్వాత మొదటిసారి 2-1తో వన్డే సిరీస్‌ను పట్టేసింది. ఈ జట్టులో ఎనిమిది మంది ఆటగాళ్లకు అసలు భారత్‌లో ఆడిన అనుభవం కూడా లేదు. టీ20 ఫార్మాట్‌లో భారత్ ఫర్వాలేదనిపిస్తున్నా వన్డే, టెస్టుల్లో జట్టు ప్రదర్శన తీసికట్టుగా మారుతోంది. చాంపియన్స్ ట్రోఫీలో విజయాన్ని పక్కనబెడితే.. జట్టు శ్రీలంక, ఆసీస్‌లోనూ వన్డే సిరీస్‌లను కోల్పోయింది. గతంలో కివీస్, దక్షిణాఫ్రికాలపై స్వదేశంలోనే టెస్టు సిరీస్‌లో వైట్‌వాష్ అయ్యింది. అలాగే బోర్డర్-గవాస్కర్ ట్రోఫీలోనూ నిరాశే ఎదురైంది. పైగా గౌతీ ధోరణి వల్లే విరాట్, రోహిత్ టెస్టులకు దూరమయ్యారనే అపవాదు నెలకొంది. దీనికి తోడు వ్యూహాల్లో స్పష్టత లోపించడం, ఆటగాళ్ల స్థానాల్లో పదే పదే మార్పు చేయడం, విఫలమవుతున్న వారినే కొనసాగించడం కూడా జట్టు విజయాలను దెబ్బతీస్తోంది. సిరీస్‌లో జడేజా ఏమాత్రం రాణించకపోయినా అన్ని మ్యాచ్‌లను ఆడేశాడు. అదే లెఫ్టామ్ పేసర్ అర్షదీప్‌నకు మాత్రం చివరి మ్యాచ్‌లో చాన్స్ ఇవ్వగా.. మూడు వికెట్లు తీసి, తనను పక్కనబెట్టడం ఎంత తప్పో తెలిసొచ్చేలా చేశాడు.

(ఆంధ్రజ్యోతి క్రీడావిభాగం)



తప్పించాల్సిందేనా?

వచ్చే ఆరు నెలల వరకు భారత జట్టుకు వన్డే సిరీస్‌లు లేవు. ఇక జట్టు దృష్టంతా వచ్చే నెల నుంచి జరిగే టీ20 వరల్డ్‌కప్‌పైనే ఉండనుంది. అయితే కివీస్‌పై వన్డే సిరీస్ ఓటమితో కోచ్ గంభీర్ కొనసాగింపుపై సందేహాలు వ్యక్తమవుతున్నాయి. అందుకే రాబోయే ఆరు నెలల్లో సెలెక్టర్లు, బీసీసీఐ కఠిన నిర్ణయం తీసుకునే అవకాశం ఉండవచ్చని విశ్లేషకులు భావిస్తున్నారు. అలాగే ఆటగాళ్లతో పాటు మేనేజ్‌మెంట్ బృందంలోనూ మార్పులు జరిగినా ఆశ్చర్యపోనవసరం లేదు.

'ఇండోనేసియా' బరిలో సింధు, శ్రీకాంత్

జకార్త: ఇండియా ఓపెన్‌లో నిరాశ పర్చిన భారత షట్లర్లు ఆ తప్పిదాలను సరిదిద్దుకుని ఇండోనేసియా మాస్టర్స్‌లో పతకాలు సాధించేందుకు సిద్ధమయ్యారు. మంగళవారం నుంచి జరగనున్న ఈ పోటీల్లో తమ అదృష్టాన్ని పరీక్షించుకునేందుకు తెలుగు షట్లర్లు పీవీ సింధు, కిడాంబి శ్రీకాంత్, మన్నేపల్లి తరుణ్‌తో పాటు భారత అగ్రశ్రేణి క్రీడాకారులు లక్ష్యసేన్, హెచ్ఎస్ ప్రణయ్, యువ షట్లరు తన్వీ శర్మ, ఉన్నతి హుడా, మాళవిక బన్సోద్ బరిలోకి దిగుతున్నారు. మనామి సూయిజు (జపాన్)తో సింధు, కోకి వతనాబే (జపాన్)తో శ్రీకాంత్ తొలి రౌండ్‌లో తలపడనున్నారు.

ఒలింపిక్స్‌లో క్రికెట్ ఆడతా!



ఉస్సేన్ బోల్ట్

జమైకా: కరీబియన్ దిగ్గజ అథ్లెట్, మూడు ఒలింపిక్స్‌లో పతకాలు సాధించిన జమైకా చిరుత ఉస్సేన్ బోల్ట్ తనకు క్రికెట్ ఆడాలని ఉందంటూ మనసులో మాట బయట పెట్టాడు. 2028 లాస్ ఏంజెల్ ఒలింపిక్స్‌లో క్రికెట్‌కు చోటు కల్పించడంతో అన్నీ కలిసొస్తే మరోసారి బోల్ట్ ఒలింపిక్స్‌లో ఆడే అవకాశం ఉంది. 'ప్రొఫెషనల్ క్రీడా జీవితానికి సంతోషంగా వీడ్కోలు పలికా. నేను క్రికెట్ ఎక్కువ కాలం ఆడలేదు కానీ ఆ క్రీడంటే చాలా మక్కువ. మా దేశ క్రికెట్ బోర్డు నన్ను సంప్రదిస్తే క్రికెట్ ఆడేందుకు సిద్ధంగా ఉన్నా' అని బోల్ట్ తెలిపాడు. వాస్తవానికి బోల్ట్ క్రీడా జీవితం పేస్ బౌలర్‌గానే మొదలైంది. అప్పటి పరిస్థితుల దృష్ట్యా బోల్ట్ క్రికెట్ నుంచి అథ్లెటిక్స్‌కు తన దిశను మార్చుకున్నాడు. 2024లో అమెరికా, కరీబియన్ దీవులు సంయుక్తంగా ఆతిథ్యం ఇచ్చిన టీ20 వరల్డ్‌కప్‌నకు బోల్ట్ ప్రచారకర్తగా కూడా వ్యవహరించడం విదితమే.

కడప ఇస్తేమాకు 1.25 కోట్లు విడుదల

▸▸ ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు తెలిపిన మంత్రి ఫరూక్



అమరావతి, జనవరి 19(ఆంధ్రజ్యోతి): కడపలో మూడు రోజులపాటు జరగనున్న ఇస్తేమా నిర్వహణ ఏర్పాట్లకు రాష్ట్ర ప్రభుత్వం రూ.1.25 కోట్లు విడుదల చేసింది. కొప్పర్తి పారిశ్రామికవాడ సమీపంలో ఈ నెల 23, 24, 25 తేదీల్లో జాతీయ స్థాయి తబ్లిగి జమాతే ఇస్తేమా నిర్వహిస్తున్నారు. దీనికి దేశంలోని వివిధ రాష్ట్రాల నుంచి పెద్ద ఎత్తున ముస్లింలు హాజరవుతారు. ఈ నేపథ్యంలో ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని ఏర్పాట్లు చేసినట్లు మంత్రి ఎన్ఎండీ ఫరూక్ తెలిపారు. సోమవారం ఈమేరకు ఆయన ఓ ప్రకటన చేశారు. రాష్ట్ర హజ్ కమిటీ ద్వారా ప్రభుత్వం విడుదల చేసిన రూ.1.25 కోట్లు మొత్తాన్ని కడప కలెక్టర్ బ్యాంకు ఖాతాకు జమ చేసిందన్నారు. ఇస్తేమాకు నిధులు విడుదల చేసిన సీఎం చంద్రబాబుకు మంత్రి కృతజ్ఞతలు తెలిపారు. జాతీయ స్థాయిలో జరిగే ఈ కార్యక్రమానికి తరలివస్తున్న వాహనాలకు రాష్ట్ర ప్రవేశ పన్నును మినహాయించాలని రవాణా మంత్రి మండిపల్లి రామ్‌ప్రసాద్ రెడ్డిని కోరుతూ లేఖ రాసినట్లు ఫరూక్ పేర్కొన్నారు. కాగా, మైనార్టీల సంక్షేమానికి 2026-27 ఆర్థిక సంవత్సర బడ్జెట్ ప్రతిపాదనపై మంత్రి ఫరూక్ సోమవారం సంబంధిత అధికారులతో సమీక్షించారు. కూటమి ప్రభుత్వం మైనార్టీల సంక్షేమానికి ఇస్తున్న అత్యధిక ప్రాధాన్యతను దృష్టిలో పెట్టుకుని అందుకు అనుగుణంగా బడ్జెట్ రూపకల్పన చేయాలని మంత్రి సూచించారు.

ఇతరుల క్రెడిట్ చోరీ చేయడమే జగన్ క్రెడిట్

▸▸ మంత్రి ఫరూక్, ఎమ్మెల్సీ బీద రవిచంద్ర

అమరావతి, జనవరి 19(ఆంధ్రజ్యోతి): దిగజారుడు రాజకీయాలకు, ఫేక్ ప్రచారాలకు చిరునామాగా వైసీపీ మారిందని మంత్రి ఫరూక్, ఎమ్మెల్సీ బీద రవిచంద్ర విమర్శించారు. టీడీపీ కేంద్ర కార్యాలయంలో సోమవారం వారు విలేకరులతో మాట్లాడారు. మంత్రి ఫరూక్ మాట్లాడుతూ... 'ఇతరుల క్రెడిట్ చోరీ చేయడమే జగన్ క్రెడిట్. జగన్ చేసిన అడ్డగోలు పనుల వల్లే రెవెన్యూ సమస్యలు. చాలా భూములను 22ఏలో పెట్టి కబ్జా చేసే ప్రయత్నం చేశారు. రైతుల పాస్‌పుస్తకాలపై జగన్ ఫొటోలు వేసుకున్నారు. గుంటూరులో క్రిస్టియన్ భవనాన్ని, కడపలో హజ్ హౌస్‌నూ జగన్ పూర్తి చేయకుండా వదిలేస్తే... ఇప్పుడు కూటమి ప్రభుత్వం పూర్తి చేస్తోంది' అని అన్నారు. రవిచంద్ర మాట్లాడుతూ... 'కూటమి ప్రభుత్వం ఏం చేసినా దాన్ని తామే చేశామని క్రెడిట్ చోరీ చేయడం వైసీపీకి అలవాటైంది. రాజధాని లేని రాష్ట్రంగా ఏపీని మార్చినందుకు, 3 రాజధానుల పేరుతో మూడు ముక్కలాట ఆడినందుకు జగన్‌కు క్రెడిట్ ఇవ్వాలా?' అని ప్రశ్నించారు.

ఐఏఎస్ క్యాడర్ స్ట్రెంత్ 259కి పెంపు

▸▸ గెజిట్ నోటిఫికేషన్ జారీచేసిన డీవోపీటీ

అమరావతి, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): పెరుగుతున్న పాలనా అవసరాల దృష్ట్యా కేంద్ర ప్రభుత్వం రాష్ట్రంలో ఐఏఎస్ క్యాడర్ స్ట్రెంత్‌ను 239 నుంచి 259కి పెంచింది. ఈ మేరకు.. సిబ్బంది, శిక్షణ శాఖ (డీవోపీటీ) అండర్ సెక్రటరీ రాజేశ్ కుమార్ యాదవ్ గెజిట్ నోటిఫికేషన్ జారీ చేశారు. రాష్ట్ర విభజన తర్వాత 2017లో డీవోపీటీ చివరిసారిగా ఐఏఎస్‌ల క్యాడర్ స్ట్రెంత్‌ను 239కి పెంచింది. ఆ తర్వాత ఏపీలో భౌగోళికంగా అనేక మార్పులు జరిగాయి. 13 జిల్లాలుగా ఉన్న ఆంధ్రప్రదేశ్‌లో 26 జిల్లాలు ఏర్పడ్డాయి. తాజాగా కూటమి ప్రభుత్వం మరో రెండు పెంచి 28 జిల్లాలు చేసింది. ఈ నేపథ్యంలో 239 మంది ఐఏఎస్‌లు సరిపోవడం లేదని, క్యాడర్ స్ట్రెంత్‌ను పెంచాలని రాష్ట్ర ప్రభుత్వం ఎప్పటినుంచో కేంద్రాన్ని కోరుతోంది. దీంతో కేంద్రం అదనంగా 20 ఐఏఎస్ పోస్టులను రాష్ట్రానికి కేటాయించడంతో క్యాడర్ స్ట్రెంత్ 259కి పెరిగింది. అలాగే మొన్నటి వరకూ ఉన్న 13 జిల్లా కలెక్టర్ క్యాడర్ పోస్టులను 26కు పెంచింది. జాయింట్ కలెక్టర్ క్యాడర్ పోస్టులను కూడా 13 నుంచి 26కు పెంచింది. డైరెక్ట్ రిక్రూట్‌మెంట్ పోస్టులను 181కి పెంచింది. ప్రమోషన్ ద్వారా 78 పోస్టులు భర్తీ చేసుకునే వెసులుబాటు కల్పించింది. ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శుల పోస్టును కూడా మరొకటి కేటాయించింది. దీంతో ఈ సంఖ్య మూడుకు చేరింది. అలానే కేంద్రానికి డిప్యుటేషన్‌పై వెళ్లేవారి సంఖ్యను 56కు పరిమితం చేసింది.

జెన్కో ఎండీగా అదనపు బాధ్యతలు చేపట్టిన పుల్లారెడ్డి

అమరావతి, జనవరి 19(ఆంధ్రజ్యోతి): ఏపీ జెన్కో ఎండీగా, సీపీడీసీఎల్ సీఎండీ పి.పుల్లారెడ్డి సోమవారం అదనపు బాధ్యతలు స్వీకరించారు. దీంతోపాటు ఏపీ స్టేట్ ఎనర్జీ కన్జర్వేషన్ మిషన్, ఏపీ స్టేట్ ఎనర్జీ ఎఫిషియన్సీ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ సీఈవోగా కూడా బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... 'విద్యుత్తు రంగంలో నా అనుభవాన్ని, సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకొని నాకు అప్పగించిన బాధ్యతలను సమర్థంగా నిర్వహిస్తా' అని పేర్కొన్నారు.

ప్రేమ పేరుతో మోసం.. ఎస్ఐకు పదేళ్ల జైలు శిక్ష



రవితేజ

గుంటూరు, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): ప్రేమ పేరుతో యువతిని మోసగించిన కేసులో ఓ పోలీసు అధికారికి పదేళ్ల జైలుశిక్ష పడింది. ఈ మేరకు గుంటూరు 4వ అదనపు జిల్లా సెషన్స్ కోర్టు న్యాయాధికారి శరత్‌కుమార్ సోమవారం తీర్పు ఇచ్చారు. ఈ తీర్పు ఉమ్మడి గుంటూరు జిల్లాలో సంచలనంగా మారింది. ప్రస్తుతం బాపట్ల జిల్లా అమృతలూరు ఎస్ఐగా విధులు నిర్వహిస్తున్న కె.రవితేజ గతంలో గుంటూరు జిల్లా నగరంపాలెం ఎస్ఐగా పనిచేశారు. ఆ సమయంలో నర్సుగా పనిచేస్తున్న ఓ యువతిని ప్రేమ పేరుతో మోసం చేసినట్లు కేసు నమోదైంది. 2023లో ఎస్ఐ రవితేజపై ఆ యువతి నగరపాలెం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. దీంతో పోలీసులు ఎస్ఐపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీతో పాటు అత్యాచార కేసు నమోదు చేశారు. అప్పటి నుంచి ఆ ఎస్ఐ విధులకు రాకపోవడంతో ఉన్నతాధికారులు అతడ్ని సస్పెండ్ చేశారు. ఈ కేసుపై గుంటూరు కోర్టులో సుదీర్ఘంగా విచారణ జరిగింది. చివరకు ప్రేమ పేరుతో యువతిని మోసం చేశాడని నిర్ధారణకు వచ్చిన న్యాయస్థానం.. రవితేజకు పదేళ్ల జైలు శిక్ష విధిస్తూ తీర్పునిచ్చింది.

ఫోన్ ట్యాపింగ్ కేసులో హరీశ్‌రావుకు నోటీసులు

హైదరాబాద్, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): ఫోన్ ట్యాపింగ్ కేసులో సంచలనం చోటుచేసుకుంది. మాజీ మంత్రి హరీశ్ రావుకు ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) నోటీసులు జారీ చేసింది. మంగళవారమే (నేడు) జూబ్లీహిల్స్ పోలీసు స్టేషన్లోని సిట్ కార్యాలయంలో విచారణకు హాజరు కావాలని సోమవారం రాత్రి సీఆర్పీఎస్ సెక్షన్ 160 కింద నోటీసు ఇచ్చింది. మంగళవారం ఉదయం 11 గంటలకు అధికారుల ఎదుట హాజరు కావాలని అందులో పేర్కొంది. జూబ్లీహిల్స్ ఏసీపీ పి.వెంకటగిరి ఈ నోటీసులను జారీ చేశారు. ఫోన్ ట్యాపింగ్ కేసులో కొన్ని వాస్తవాలు, ఘటనలపై మీకు అవగాహన ఉందని దర్యాప్తులో తెలిసిందని, దానిపై విచారించాల్సి ఉందని, మంగళవారం జూబ్లీహిల్స్ ఏసీపీ కార్యాలయంలో వ్యక్తిగతంగా విచారణకు హాజరుకావాలని అందులో పేర్కొన్నారు. కాగా, రాజకీయంగా తీవ్ర దుమారం రేపిన ఫోన్ ట్యాపింగ్ కేసులో ఇప్పటికే పలువురు ప్రస్తుత, మాజీ అధికారులు, రాజకీయ నాయకుల్ని విచారించిన సిట్.. విచారణలో లభించిన సమాచారం ఆధారంగా హరీశ్‌రావును విచారించి స్టేట్‌మెంట్ రికార్డు చేసేందుకు సిద్ధమైంది.

బీఆర్ఎస్ ఫిరాయింపు ఎమ్మెల్యేల వ్యవహారంలో తెలంగాణ స్పీకర్‌కు సుప్రీం నోటీసులు

న్యూఢిల్లీ, జనవరి 19(ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ ఫిరాయింపు ఎమ్మెల్యేల కేసులో అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కు సుప్రీంకోర్టు నోటీసులు జారీ చేసింది. ఈ వ్యవహారంలో గత ఏడాది సీజేఐ ధర్మాసనం ఇచ్చిన ఆదేశాలను పాటించని స్పీకర్‌పై కోర్టు ధిక్కరణ చర్యలు చేపట్టాలంటూ బీజేపీ శాసనసభా పక్ష నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి పిటిషన్ దాఖలు చేసిన సంగతి తెలిసిందే. దీనిపై సోమవారం జస్టిస్ సంజయ్ కరోల్, జస్టిస్ ఏజీ మాసిహ్‌ల ధర్మాసనం విచారణ జరిపింది. ఏలేటి పిటిషన్‌ను ఇదే అంశంపై ఇతరులు దాఖలు చేసిన పిటిషన్లతో జత చేస్తున్నట్లు ధర్మాసనం తెలిపింది. స్పీకర్‌కు నోటీసులు జారీ చేసింది.

ఎన్టీఆర్‌కు భారతరత్న ప్రకటించాలి: స్పీకర్ అయ్యన్న

నర్సీపట్నం, జనవరి 19(ఆంధ్రజ్యోతి): తెలుగువారి ఆత్మగౌరవాన్ని ప్రపంచానికి చాటిచెప్పిన మాజీ ముఖ్యమంత్రి నందమూరి తారకరామారావుకు కేంద్ర ప్రభుత్వం 'భారతరత్న' ప్రకటించి గౌరవించాలి అని స్పీకర్ చింతకాయల అయ్యన్న పాత్రుడు అన్నారు. ఎన్టీఆర్ 30వ వర్ధంతిని పురస్కరించుకుని సౌదీ అరేబియా, ఉక్రెయిన్, బహ్రెయిన్, కువైట్ దేశాల్లో ఉంటున్న తెలుగువారి ఆహ్వానం మేరకు ఆయన మంగళవారం జూమ్ కాన్ఫరెన్స్‌లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎన్టీఆర్‌తో తనకున్న సుదీర్ఘ అనుబంధాన్ని, మధుర జ్ఞాపకాలను వారితో పంచుకున్నారు. పేదవారి కోసం ఆయన అమలుచేసిన సంక్షేమ పథకాలను గుర్తుచేశారు. మే 8న ఉక్రెయిన్‌లో జరిగే శ్రీనివాస కల్యాణ ఉత్సవానికి హాజరుకావాలని నిర్వాహకులు స్పీకర్‌ను కోరారు. ఉక్రెయిన్ నుంచి రఘుబాబు, హరిబాబు, సతీశ్‌శెట్టి, కువైట్ నుంచి వెంకట్ కోడూరి, తదితరులు పాల్గొన్నారు.



ప్రవాసాంధ్రులతో జూమ్ మీటింగ్‌లో మాట్లాడుతున్న స్పీకర్ అయ్యన్న

ధాన్యం కొన్న రోజే సొమ్ము చెల్లింపు

అధికారులకు మంత్రి నాదెండ్ల ఆదేశం

▸▸ తుది దశలో ఖరీఫ్ సీజన్ కొనుగోళ్ల ప్రక్రియ

▸▸ 24 గంటల్లోపే 94 శాతం నగదును రైతుల ఖాతాల్లో జమ చేసినట్లు వెల్లడి

అమరావతి, జనవరి 19(ఆంధ్రజ్యోతి): ఇకపై రైతుల నుంచి ఉదయం ధాన్యం కొనుగోలు చేస్తే.. అదే రోజు సాయంత్రానికి సదరు రైతు ఖాతాలో మద్దతు ధర ప్రకారం సొమ్ము జమ చేసేందుకు చర్యలు తీసుకోవాలని పౌరసరఫరాల మంత్రి నాదెండ్ల మనోహర్ అధికారులను ఆదేశించారు. ఖరీఫ్ సీజన్‌కు సంబంధించిన ధాన్యం కొనుగోలు ప్రక్రియపై సోమవారం విజయవాడలోని సివిల్ సప్లయిస్ భవన్‌లో అధికారులతో మంత్రి సమీక్ష నిర్వహించారు. ధాన్యం కొనుగోళ్లు చివరి దశకు చేరుకున్నాయని, తిరుపతి, నెల్లూరు, బాపట్ల, గుంటూరు తదితర జిల్లాల్లో ఇంకా కొనుగోళ్లు జరుగుతున్నాయని మంత్రి తెలిపారు. ఇప్పటి వరకు కొనుగోలు చేసిన ధాన్యానికి సంబంధించి 24 గంటల్లోపే 94 శాతం నగదును రైతుల ఖాతాల్లో జమ చేసినట్లు వివరించారు. ఈ సీజన్‌లో ఎదురైన సమస్యలు, లోపాలపై సమీక్షించుకొని.. వచ్చే రబీ సీజన్‌కు పూర్తిస్థాయిలో సన్నద్ధం కావాలని అధికారులకు సూచించారు. రబీ సీజన్‌లో ధాన్యం కొనుగోళ్లకు సంబంధించిన శిక్షణ కార్యక్రమాన్ని తిరుపతిలో నిర్వహించనున్నట్లు వెల్లడించారు. క్షేత్రస్థాయిలో రైతు సేవా కేంద్రాల్లో ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించే విధంగా శిక్షణ ఇవ్వాలని ఆదేశించారు. ఈ ఖరీఫ్ సీజన్‌లో ఇప్పటి వరకు రాష్ట్ర వ్యాప్తంగా 6,83,623 మంది రైతుల నుంచి 41.69 లక్షల టన్నుల ధాన్యం కొనుగోలు చేసినట్లు తెలిపారు. ధాన్యంలో తేమ శాతం, జీపీఎస్, రవాణా సమస్యలను అధిగమించామని, రైతులు ఇబ్బందులు పడకుండా తొలిసారి రైళ్ల ద్వారా కృష్ణా, గుంటూరు జిల్లాల నుంచి ధాన్యం తరలింపునకు ఏర్పాట్లు చేశామని వివరించారు. సివిల్ సప్లయిస్ కార్పొరేషన్ వైస్ చైర్మన్, ఎండీ ఎస్.ఢిల్లీరావు, ఇతర ఉన్నతాధికారులు ఈ సమీక్షా సమావేశంలో పాల్గొన్నారు.



మంత్రి నాదెండ్ల మనోహర్‌తో భేటీ అయిన పౌరసరఫరాల శాఖ డైరెక్టర్ శ్రీవాస్ నూపుర్

మంత్రిని కలిసిన సివిల్ సప్లయిస్ కొత్త డైరెక్టర్

సివిల్ సప్లయిస్ డైరెక్టరుగా బాధ్యతలు చేపట్టిన ఐఏఎస్ అధికారిణి శ్రీవాస్ నుపూర్ అజయ్‌కుమార్ సోమవారం ఆ శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ప్రభుత్వ లక్ష్యాలకు అనుగుణంగా, పారదర్శకతకు ప్రాధాన్యమిస్తూ వేగవంతమైన సేవలు అందించడం ద్వారా ప్రజాపంపిణీ వ్యవస్థను ముందుకు తీసుకువెళ్లాలని మంత్రి సూచించారు.

మధ్యవర్తిత్వంలో న్యాయవాదులదే కీలకపాత్ర

▸▸ మీడియేషన్ సెంటర్ ద్వారా కేసులను పరిష్కరించుకోవాలి

▸▸ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ మానవేంద్రనాథ్‌రాయ్ సూచన

విజయవాడ లీగల్, జనవరి 19(ఆంధ్రజ్యోతి): విజయవాడలోని సిటీ సివిల్ కోర్టులో ఏర్పాటు చేసిన మీడియేషన్ సెంటర్‌ను కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలని రాష్ట్ర న్యాయసేవాధికార సంస్థ కార్యనిర్వాహక అధ్యక్షులు, హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ మానవేంద్రనాథ్‌రాయ్ సూచించారు. సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు మధ్యవర్తిత్వ నూతన విధానంపై ఎన్టీఆర్ జిల్లా లీగల్‌సెల్ అథారిటీ ఆధ్వర్యంలో శిక్షణ కార్యక్రమాన్ని సోమవారం ఆయన ప్రారంభించారు. శుక్రవారం వరకు ఈ శిక్షణ కొనసాగనుంది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మీడియేషన్ ద్వారా కేసుల పరిష్కారంలో న్యాయవాదులదే ప్రముఖ పాత్ర అన్నారు. కక్షిదారులందరూ సద్వినియోగం చేసుకొని తమ కేసులను పరిష్కరించుకోవాలన్నారు. కృష్ణాజిల్లా ప్రధాన న్యాయమూర్తి గుట్టల గోపి మాట్లాడుతూ ఉమ్మడి కృష్ణాజిల్లాలో ఇప్పటి వరకు 64మంది శిక్షణ పొందిన అడ్వొకేట్ మీడియేటర్లు ఉన్నారని, రెండో దశలో 35 మంది న్యాయవాదులకు శిక్షణ ఇస్తున్నట్లు చెప్పారు. ఈ సందర్భంగా జస్టిస్ మానవేంద్రనాథ్‌రాయ్‌ను బెజవాడ బార్ న్యాయవాదులు జ్ఞాపికతో సత్కరించారు.



హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ మానవేంద్రనాథ్‌రాయ్‌ను జ్ఞాపికతో సత్కరిస్తున్న బెజవాడ బార్ న్యాయవాదులు

14 కొత్త క్యాంపస్‌లతో 'నారాయణ' విస్తరణ

అమరావతి, జనవరి 19(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో 14 నూతన క్యాంపస్‌లను ప్రారంభిస్తున్నట్లు నారాయణ విద్యాసంస్థ ప్రకటించింది. వీటిలో 10 పాఠశాలలు, నాలుగు జూనియర్ కళాశాలలు ఉన్నాయని వెల్లడించింది. తిరుపతి, అనంతపురం, శ్రీకాకుళం, భీమవరం, విశాఖపట్నం, విజయవాడ, కడప, కర్నూలు, రాజమహేంద్రవరం తదితర ప్రాంతాల్లో ఏర్పాటు చేయబోతున్న ఈ క్యాంపస్‌లతో నారాయణ విద్యాసంస్థల సంఖ్య 406కు చేరుకుంటుందని ఆ సంస్థ తెలిపింది. 47 ఏళ్ల సుదీర్ఘ అనుభవంతో విద్యార్థులకు వ్యక్తిగత మార్గదర్శకత్వం, అత్యాధునిక డిజిటల్ బోధనా పద్ధతులు, సంపూర్ణ వికాసంపై దృష్టి సారించడం ఈ విస్తరణ లక్ష్యమని నారాయణ విద్యా సంస్థల డైరెక్టర్ పునీత్ కొత్తప ఒక ప్రకటనలో పేర్కొన్నారు. దేశవ్యాప్తంగా 23 రాష్ట్రాలలో 250కి పైగా నగరాల్లో 950కి పైగా క్యాంపస్‌లతో విస్తరించిన భారీ నెట్‌వర్క్ నారాయణ సొంతమని పునీత్ తెలిపారు. 50 వేల మంది అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులు, సబ్జెక్ట్ నిపుణులు నారాయణలో సేవలందిస్తున్నారని కిండర్ గార్డెన్ నుంచి పోస్ట్ గ్రాడ్యుయేషన్ వరకూ 6 లక్షల మంది విద్యార్థులు నారాయణ విద్యా సంస్థల్లో విద్యనభ్యసిస్తున్నారని పునీత్ వివరించారు.

శ్రీశైలం ఐటీడీఏ పరిధిలోకి గిరిజన ఆశ్రమ పాఠశాలలు

అమరావతి, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): కర్నూలు, ప్రకాశం, గుంటూరు జిల్లాల్లో ఉన్న ఆశ్రమ పాఠశాలలను జిల్లా గిరిజన సంక్షేమశాఖ అధికారుల పాలన నుంచి శ్రీశైలం ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి (పీవో) పరిధిలోకి తెస్తూ గిరిజన సంక్షేమశాఖ ఉత్తర్వులు జారీచేసింది. 2012కు ముందు శ్రీశైలం ఐటీడీఏ పరిధిలోని గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలు, ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలన్నీ శ్రీశైలం ఐటీడీఏ ఆధ్వర్యంలో నిర్వహిస్తుండేవారు. 2012 ఫిబ్రవరి 27న ఉమ్మడి రాష్ట్రంలో గిరిజన సంక్షేమ శాఖ కమిషనర్... ఈ ఆశ్రమ పాఠశాలలను జిల్లా గిరిజన సంక్షేమాధికారి పరిధిలోకి తెస్తూ ఉత్తర్వులిచ్చారు. 2012 ఏప్రిల్ నుంచి ఆ ఉత్తర్వులు అమల్లోకి వచ్చాయి. కర్నూలు జిల్లాలోని ఆరు ఆశ్రమ పాఠశాలలు, ప్రకాశం జిల్లాలోని 14 ఆశ్రమ పాఠశాలలు, గుంటూరు జిల్లాలోని 3 ఆశ్రమ పాఠశాలలు జిల్లా కేంద్రాలకు దూరంగా ఉండటం వల్ల వాటి పర్యవేక్షణ అధికారులకు ఇబ్బందిగా ఉందని, వాటిని సమీపంలోని శ్రీశైలం ఐటీడీఏ పీవో పరిధిలోకి తీసుకురావాలని గిరిజన సంక్షేమశాఖ డైరక్టర్ సిఫారసు చేశారు. దీంతో వాటి పాలనాబాధ్యతలను శ్రీశైలం ఐటీడీఏ పరిధిలోకి తెస్తూ గిరిజన సంక్షేమ శాఖ ఆదేశాలిచ్చింది.

2 నుంచి ఆర్‌సెట్ ఇంటర్వ్యూలు

అమరావతి, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): పీహెచ్‌డీ ప్రవేశాలకు కోసం ఆర్‌సెట్ అభ్యర్థులకు ఫిబ్రవరి 2 నుంచి 6 వరకు ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు ఉన్నత విద్యా మండలి సోమవారం ఓ ప్రకటనలో తెలిపింది. ఆంధ్రా, శ్రీవెంకటేశ్వర, నాగార్జున, పద్మావతి మహిళా, జేఎన్‌టీయూ కాకినాడ, జేఎన్‌టీయూ అనంతపురం యూనివర్సిటీల్లో ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు తెలిపింది. అభ్యర్థులు ఏ యూనివర్సిటీలో ఇంటర్వ్యూలకు హాజరుకావాలనే వివరాలను మంగళవారం వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేస్తామని పేర్కొంది.

మిర్చి ధరలు పైపైకి

ఈ సీజన్‌లో 23 వేలకు చేరిన దేవనూరు డీలక్స్



▸▸ తేజ రకం రేటులోనూ 1,500 వరకు పెరుగుదల

▸▸ వచ్చిన సరుకు వచ్చినట్లు కొనేస్తున్న ట్రేడర్లు

గుంటూరు, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): సంక్రాంతి సెలవుల అనంతరం మిర్చియార్డు గేట్లు తెరిచిన తొలిరోజే ట్రేడర్ల మధ్య కొనుగోళ్లలో పోటీ నెలకొంది. కారం తయారీలో వినియోగించే వెరైటీలకు ఆర్డర్లు బాగా ఉండటంతో ఆయా రకాల మిరపకాయలను ఎక్కువ ధర పెట్టి మరీ కొనుగోలు చేశారు. మిర్చి రకాల్లో రారాజుగా పేరొందిన దేవనూరు డీలక్స్ (డీడీ) వెరైటీ ఈ సీజన్‌లో తొలిసారిగా సోమవారం క్వింటాల్ ధర రూ.23 వేలకు చేరింది. రెండేళ్ల క్రితం ఈ రకం మిర్చి క్వింటాల్ ధర రూ.30 వేలు దాటింది. అయితే గతేడాది ధర నేల చూపులు చూడటంతో చాలామంది రైతులు కోల్డ్‌స్టోరేజ్‌ల్లో నిల్వ చేసుకొన్నారు. ఇప్పుడు మళ్లీ డీడీ వెరైటీ రేటు పైపైకి వెళ్తోంది. దీంతో పోటాపోటీగా 341 వెరైటీ సైతం రూ.22 వేలకు చేరుకుంది. నంబరు 10 కూడా రూ.19 వేలు, తేజ రూ.16 వేలు, ఆర్మూరు రూ.15 వేల వరకు ధర పెట్టి ట్రేడర్లు కొనుగోలు చేశారు. సంక్రాంతి ముందు వరకు స్థిరంగా ఉన్న ఎక్స్‌పోర్టు వెరైటీ మిర్చి తేజ ధర కూడా క్వింటాల్‌కు రూ.1,500 వరకు పెరిగింది. దీంతో అటు రైతులు, ఇటు కమీషన్ వ్యాపారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. సోమవారం 50 వేల టిక్కీలకు పైగా మిర్చిని రైతులు యార్డుకు తీసుకురాగా దాదాపుగా అన్నీ అమ్ముడయ్యాయి. కొత్త పంట దిగుబడి రావడానికి మరో 15 రోజుల నుంచి నెల పట్టే అవకాశం ఉండటంతో ధర మరింత పెరిగే అవకాశాలున్నట్లు మార్కెట్ వర్గాలు అంచనా వేస్తున్నాయి.

రవాణా సమస్యలు తొలిగితే మరింత డిమాండ్

మిర్చి రవాణాలో నేటికీ ట్రేడర్లు కొన్ని సమస్యలు ఎదుర్కొంటున్నారు. ప్రధానంగా బిహార్‌లోని సమస్తిపూర్, చాప్రా, పట్నా, సైవాన్, గులాబ్‌బాగ్, ముజఫర్‌పూర్, గయ, బాగల్‌పూర్, బేతియాకు గుంటూరు ఏఎంసీ నుంచి ట్రేడర్లు మిర్చి కొనుగోలు చేసి పంపిస్తుంటారు. అయితే ఇక్కడ కూలీ, ట్రాన్స్‌పోర్టు ఖర్చులు అధికంగా ఉండటంతో ఆయా ప్రాంతాల్లోని దిగుమతిదారులు కొంచెం సరుకు ఇక్కడ, మిగతాది తెలంగాణలోని ఏఎంసీలో కొనుగోలు చేస్తున్నారు. ఖర్చులు తగ్గించగలిగితే ఆ రాష్ట్రంలోని బిజినెస్ కూడా ఇక్కడికి వచ్చి డిమాండ్ మరింత పెరుగుతుంది. దీంతో అటు రైతులు, వ్యాపారస్థులకు, ఇటు మిర్చియార్డుకు గణనీయంగా ఆదాయం పెరిగే అవకాశం ఉంది.

28 నుంచి 'వందేమాతరం కోస్టల్ సైక్లోథాన్'

▸▸ తీర ప్రాంతంలో 6,553 కి.మీ.సైకిల్ యాత్ర

▸▸ ఫిబ్రవరి 6న విశాఖపట్నం చేరనున్న యాత్ర

విశాఖపట్నం, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): వందేమాతరం గీతానికి 150 ఏళ్లు పూర్తయిన సందర్భంగా కేంద్ర పారిశ్రామిక భద్రతా దళం (సీఐఎస్ఎఫ్) ఈ నెల 28 నుంచి 'వందేమాతరం కోస్టల్ సైక్లోథాన్-2026' నిర్వహించనుందని విశాఖపట్నం సీఐఎస్ఎఫ్ డీఐజీ డాక్టర్ ఎంజీ రాఘవేంద్రకుమార్ తెలిపారు. పోర్టు గెస్ట్‌హౌస్‌లో సోమవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో సీనియర్ కమాండెంట్ సతీశ్‌కుమార్ బాజ్‌పాయి, కమాండెంట్ జితేంద్రబాబుతో కలిసి ఆయన వివరాలు వెల్లడించారు. 'సురక్షిత తీరాలు... సమృద్ధ భారత్' నినాదంతో చేపట్టే సైక్లింగ్ యాత్ర దేశంలోని తొమ్మిది తీర ప్రాంత రాష్ట్రాల్లో 6,553 కి.మీ. పొడవున 25 రోజులపాటు సాగుతుందని చెప్పారు. ఈ యాత్ర ఆంధ్రప్రదేశ్‌లో 8 రోజుల పాటు 964 కి.మీ. మేర సాగుతుందన్నారు. ఈ నెల 28న ఢిల్లీలో కేంద్ర హోంశాఖ సహాయక మంత్రి నిత్యానందరాయ్ ప్రారంభించే ఈ యాత్ర ఫిబ్రవరి 6న విశాఖపట్నం చేరుతుందన్నారు. 7న ఆర్కే బీచ్‌లో భారీ బహిరంగ సభ నిర్వహిస్తామని చెప్పారు. ఈ యాత్ర ఫిబ్రవరి 22ను ముగుస్తుందని, యువత పెద్ద సంఖ్యలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. యాత్రలో 130 మంది సీఐఎస్ఎఫ్ సిబ్బంది పాల్గొంటారని, అందులో 65 మంది మహిళా కానిస్టేబుళ్లు ఉన్నారని తెలిపారు.

తిరుమలలో ఏనుగుల గుంపు కలకలం

▸▸ పార్వేట మండపం వద్ద హల్‌చల్

తిరుమల, జనవరి 19(ఆంధ్రజ్యోతి): తిరుమలలో సోమవారం తెల్లవారుజామున పాపనాశనం మార్గంలోని పార్వేట మండపం వద్ద ఏనుగుల గుంపు గంటన్నర పాటు హల్‌చల్ చేసింది. 12 ఏనుగులతో కూడిన గుంపు అడవిలోంచి శ్రీగంధం వనం ధ్వంసం చేసుకుంటూ, పార్వేట మండపం కంచెను కూల్చేస్తూ రోడ్డు వైపునకు దూసుకువచ్చాయి. సమీపంలోని వెదురుపొదలను విరిచేశాయి. వేకువజామున 5 గంటల సమయంలో ఏనుగులు గుంపును కొందరు స్థానికులు గుర్తించి ఫారెస్ట్, విజిలెన్స్ అధికారులకు సమాచారమిచ్చారు. ఘటనా ప్రాంతానికి చేరుకున్న అధికారులు ముందు జాగ్రత్తగా ఆ మార్గంలో వాహన రాకపోకలను నిలిపివేశారు. ఏనుగులను అడవిలోకి పంపేందుకు శబ్ధాలు చేశారు. అవి పాపనాశనం డ్యాములో నీళ్లు తాగి, తిరిగి అడవిలోకి వెళ్లిపోయాయి. ఆ తర్వాతే వాహనాలను అనుమతించారు. పిల్ల ఏనుగులతో కూడిన ఈ గుంపు తరుచూ నీటి కోసం ఇలా వస్తోందని, వాటిని ఇబ్బంది పెట్టనంతవరకు ఎలాంటి సమస్య ఉండదని అధికారులు తెలిపారు.

రిపబ్లిక్ డే పరేడ్ సంగీత దర్శకుడిగా కీరవాణి

న్యూఢిల్లీ, జనవరి 19: 77వ గణతంత్ర దినోత్సవం సందర్భంగా ఢిల్లీలోని కర్తవ్యపథ్‌లో ఈ నెల 26న నిర్వహించే వేడుకల్లో దేశంలో ఉన్న విభిన్న నృత్య సంప్రదాయాలను ప్రతిబింబించేలా సుమారు 2,500 మంది కళాకారులతో మహత్తర సాంస్కృతిక ప్రదర్శన జరగనుంది. ఈ కార్యక్రమానికి ప్రముఖ సంగీత దర్శకుడు, ఆస్కార్ అవార్డు గ్రహీత ఎం.ఎం. కీరవాణి సంగీతం అందిస్తున్నారు. ఈ సందర్భంగా ఆయన 'ఎక్స్' వేదికగా స్పందిస్తూ.. వందేమాతరం 150వ వార్షికోత్సవం సందర్భంగా రిపబ్లిక్ డే పరేడ్‌కు సంగీతం అందించడం ఎంతో గౌరవంగా భావిస్తున్నానని తెలిపారు.

సాగునీటి రంగంపై సీఎం ఫోకస్!

▸▸ దావోస్ నుంచి రాగానే నీటి సంఘాలతో సమావేశం?

▸▸ 'సమాఖ్య'తో మంత్రి నిమ్మల భేటీ



అమరావతి, జనవరి 19(ఆంధ్రజ్యోతి): సాగునీటి రంగంపై ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రత్యేక దృష్టి సారించారు. దావోస్ పర్యటనకు వెళ్లే ముందు రాష్ట్ర జల వనరుల శాఖపై సమగ్ర సమీక్ష నిర్వహించిన చంద్రబాబు.. ఈ పర్యటన ముగించాక .. వెలిగొండ, ఉత్తరాంధ్ర ప్రాజెక్టుల ప్రగతిని సమీక్షించనున్నారు. అలాగే, చిన్న తరహా నీటి వ్యవస్థలో కీలకభూమిక వహిస్తున్న సాగునీటి సంఘాలతో రాజధాని నగరం అమరావతిలో ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించాలని జల వనరుల శాఖను సీఎం ఆదేశించారు. ఈ నేపథ్యంలో సోమవారం సాగునీటి సంఘాల సమాఖ్య కార్యవర్గంతో జల వనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు, ఆ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జి.సాయిప్రసాద్, సలహాదారు ఎం.వెంకటేశ్వరరావు సమావేశమయ్యారు. సీఎం దావోస్ పర్యటన నుంచి తిరిగి రాగానే.. వెలగపూడి సచివాలయం వెనుక భాగంలో రాష్ట్ర సాగునీటి వినియోగదారుల సంఘాల సమాఖ్యతో బహిరంగ సమావేశాన్ని నిర్వహిస్తామని ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జి.సాయిప్రసాద్ 'ఆంధ్రజ్యోతి'కి వివరించారు. తేదీ ఇంకా ఖరారు కాలేదని, నెలాఖరులోగా సమావేశం ఉంటుందని తెలిపారు. వెలిగొండ ప్రాజెక్టు, ఉత్తరాంధ్ర ప్రాజెక్టుల ప్రగతిని సీఎం సమీక్షిస్తారు. దావోస్ నుంచి వచ్చాక ఈ నెలాఖరు దాకా సాగునీటి ప్రాజెక్టులపైనే సీఎం దృష్టి కేంద్రీకరించనున్నారు.

సంక్షేమ హాస్టళ్ల మెనూలో రాజీ పడొద్దు: సీఎస్

అమరావతి, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని సంక్షేమ హాస్టళ్లలో ప్రభుత్వం నిర్దేశించిన మెనూ ప్రకారం విద్యార్థులకు ఆహారం అందించాలని, నాణ్యత విషయంలో రాజీపడే ప్రసక్తే లేదని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కే విజయానంద్ స్పష్టం చేశారు. సోమవారం రాష్ట్ర సచివాలయంలోని ఆర్టీజీఎస్‌లో ఆయన ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా సీఎస్ మాట్లాడుతూ.. 'ప్రతి హాస్టల్‌లో మెనూ ప్రకారమే ఆహారం అందించాలి. పారిశుధ్యం, తాగునీటి వసతులు మెరుగుపర్చాలి. ప్రజల సంతృప్తి స్థాయి ఏ మాత్రం తగ్గకుండా పథకాలు అందించాలి. సంతృప్తి స్థాయి 90%పైగా వచ్చేలా పర్యవేక్షించాలి. మహిళల భద్రతపై అవగాహన కార్యక్రమాలు విస్తృతంగా నిర్వహించాలి. ఇందు కోసం జిల్లాల్లో పోలీస్ అధికారులు ప్రత్యేక డ్రైవ్ చేపట్టాలి' అని సూచించారు.

27 బ్లాకుల్లో ఖనిజాన్వేషణ

మెరిట్ సమావేశంలో కీలక నిర్ణయం

ఐదు ప్రైవేటు సంస్థలతో ఎంప్యానల్ జాబితా

త్వరగా సీఈవో పోస్టు భర్తీకి తీర్మానం

అమరావతి, జనవరి 19(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో మరోసారి భారీగా ఖనిజాల అన్వేషణ పరిశోధన కార్యక్రమాలు చేపట్టాలని ప్రభుత్వం నిర్ణయించింది. కేంద్ర ప్రభుత్వం ఇచ్చే నిధులతో 27 బ్లాకుల్లో ఖనిజాల అన్వేషణ ప్రారంభించాలని నిర్ణయించింది. సోమవారం సచివాలయంలో గనుల శాఖ మంత్రి కొల్లు రవీంద్ర చైర్మన్‌గా ఉన్న ఖనిజాన్వేషణ, పరిశోధన, ఆవిష్కరణల ట్రస్టు(మెరిట్) సమావేశం జరిగింది. మెరిట్ నిధులతో కడప, విజయనగరం, కృష్ణా, కర్నూలు జిల్లాల పరిధిలో సున్నపురాయికి సంబంధించి మూడు బ్లాక్‌లు, మాంగనీస్ ఆరు బ్లాక్‌లు, ముడి ఇనుప ఖనిజం ఒక బ్లాక్‌లో అన్వేషణ, పరిశోధన కార్యక్రమాలు చేపట్టాలని ఖరారు చేశారు. కేంద్ర సంస్థ ఎన్ఎమ్ఈటీ నిధులతో కడప, గుంటూరు జిల్లాల్లో సున్నపురాయి నిక్షేపాలను గుర్తించే పరిశోధనలు చేపట్టాలని నిర్ణయించారు. ఈ ప్రాంతాల్లో గ్రేడ్-2 సున్నపురాయి నిక్షేపాలు ఉంటాయని అంచనా. ప్రైవేటు సహకారంతో రామగిరి, బొకసంపల్లి, జవాకుల బ్లాకుల్లో బంగారం లభ్యత, త్వవకాలపై అన్వేషించాలనుకుంటున్నారు. ఈ రంగంలో అనుభవం ఉన్న ప్రైవేటు సంస్థలను గుర్తించి వాటి సేవలను ఉపయోగించుకోవాలని నిర్ణయం తీసుకున్నారు. కేంద్ర గనులు, ఖనిజాల అభివృద్ధి, నియంత్రణ చట్టం ప్రకారం కనీసం ఐదు ప్రైవేటు సంస్థలతో ఎంప్యానల్ జాబితాను తయారు చేయాలని నిర్ణయించారు. ఇందుకు సంబంధించిన విధివిధానాలను రూపొందించాలని అధికారులను ట్రస్టు ఆదేశించింది. ట్రస్టు కార్యకలాపాలను మరింతగా పెంచేందుకుగాను కొత్తగా ముఖ్య కార్యనిర్వహణాధికారి(సీఈఓ) పోస్టును త్వరితగతిన భర్తీచేయాలని నిర్ణయించారు. మెరిట్ సంస్థను మరింతగా బలోపేతం చేయాలని, నిధులను గ్రీన్‌చానల్ ద్వారా అందించాలని సమావేశంలో తీర్మానించారు.


చంద్రబాబుతో భేటీ అయిన ఈరోస్ ఇన్నోవేషన్స్ ఛైర్మన్ కిశోర్ లుల్లా

చంద్రబాబు దావోస్ మ్యాన్

- ఈరోస్ సంస్థ ఛైర్మన్ కిశోర్ లుల్లా ప్రశంసలు
- ఏఐ క్రియేటివ్ టెక్ హబ్‌కు అపార అవకాశాలు
- ఈరోస్ ఇన్నోవేషన్స్‌ను రాష్ట్రానికి ఆహ్వానించిన సీఎం

అమరావతి, జనవరి 19(ఆంధ్రజ్యోతి): దావోస్ మ్యాన్ చంద్రబాబు అంటూ ఈరోస్ ఇన్నోవేషన్స్ సంస్థ వ్యవస్థాపక ఛైర్మన్ కిశోర్ లుల్లా ప్రశంసలు గుప్పించారు. దావోస్ పర్యటనలో భాగంగా సోమవారం నాడు జ్యూరిక్‌లో కిశోర్ లుల్లాతో సీఎం సమావేశమయ్యారు. రాష్ట్రాన్ని కృత్రిమ మేధో ఆధారిత సృజనాత్మక కేంద్రంగా అభివృద్ధి చేయడమే లక్ష్యమని ముఖ్యమంత్రి చంద్రబాబు ఈ సందర్భంగా ప్రకటించారు. ఏఐ క్రియేటివ్ టెక్ హబ్ జనరేటివ్ ఏఐ డీప్ టెక్, డిజిటల్ కంటెంట్ ఎకానమీ రంగాల్లో రాష్ట్రంలో పెట్టుబడులకు ఉన్న అవకాశాలపై లుల్లాకు సీఎం వివరించారు. యువతకు ఉపాధి అవకాశాలు కల్పించేలా డిజిటల్ మీడియా, వర్చువల్ ప్రొడక్షన్, గేమింగ్, యానిమేషన్, ఫిలిం ప్రొడక్షన్, టెక్నాలజీ రంగాల్లో పెట్టుబడులను ప్రోత్సహిస్తున్నామని చంద్రబాబు వివరించారు. ఈ భేటీలో ఈరోస్ సహ వ్యవస్థాపక అధ్యక్షుడు రిధిమా లుల్లా, కో ప్రెసిడెంట్ స్వనీత్ సింగ్ పాల్గొన్నారు. ఈరోస్ జెన్ ఏఐ, ఈరోస్ యూనివర్స్ వర్చువల్ ప్రొడక్షన్ స్టూడియోలను గురించి ఈరోస్ ప్రతినిధులు వివరించారు. "డిస్కవర్ ఆంధ్రప్రదేశ్ 360" పేరుతో రియాలిటీ ప్రచారం కార్యక్రమాలను కూడా రూపొందిస్తున్నట్లుగా ఈరోస్ ప్రతినిధులు వివరించారు..

జ్యూరిక్‌లో చంద్రబాబుకు ఘనస్వాగతం


జ్యూరిక్‌లో ఎన్ఆర్ఐ చిన్నారులతో సీఎం చంద్రబాబు

అమరావతి, జనవరి 19(ఆంధ్రజ్యోతి): దావోస్ ప్రపంచ ఆర్థిక సదస్సులో పాల్గొనేందుకు సోమవారం జ్యూరిక్ విమానాశ్రయంలో దిగిన ముఖ్యమంత్రి చంద్రబాబుకు ఘన స్వాగతం లభించింది. చంద్రబాబుకు స్విస్‌లో భారత రాయబారి మృదుల్ కుమార్ స్వాగతం పలికారు. సింగపూర్ దేశాధ్యక్షుడు ధర్మన్ షణ్ముగరత్నం, అస్సాం సీఎం హేమంత్ విశ్వ శర్మ, ప్రపంచబ్యాంకు గ్రూప్ ప్రెసిడెంట్ అజయ్ బంగా తదితరులు విమానాశ్రయంలోనే చంద్రబాబును కలిశారు. చంద్రబాబుకు స్వాగతం పలికేందుకు భారీగా ప్రవాసాంధ్రులు విమానాశ్రయానికి తరలివచ్చారు.

ఏపీలో స్విస్ పెట్టుబడులకు సహకరించండి

- జ్యూరిక్‌లో రాయబారి మృదుల్ కుమార్‌కు చంద్రబాబు వినతి


చంద్రబాబుతో సమావేశమైన స్విస్‌లో భారత రాయబారి మృదుల్ కుమార్

అమరావతి, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): ఏపీలో స్విస్ పెట్టుబడులు పెట్టేలా సహకరించాలని స్విట్జర్లాండ్‌లో భారత రాయబారి మృదుల్ కుమార్‌ను ముఖ్యమంత్రి చంద్రబాబు కోరారు. దావోస్ సదస్సులో పాల్గొనేందుకువెళ్లిన ఆయన, జ్యూరిక్‌లో మృదుల్ కుమార్‌తో సమావేశమయ్యారు. రాష్ట్రంలో పెట్టుబడుల అవకాశాల గురించి మృదుల్‌కు వివరించారు. ఫార్మా, వైద్య పరికరాల తయారీ, యంత్ర పరికరాలు, భారీ మెషినరీ, హార్డ్ వేర్, ఎలక్ట్రానిక్స్ తదితర రంగాల్లో పెట్టుబడులకు అవకాశం ఉన్నదన్నారు. రాష్ట్రంలో పెట్టుబడులకు సానుకూల విధానాలు అనుసరిస్తున్నామని వివరించారు. స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ విధానం అమలు చేస్తున్నామని సీఎం తెలిపారు.

వాణిజ్య బంధం బలోపేతానికి సహకరించండి

- ఏపీలో పెట్టుబడులకు స్విస్ కంపెనీలను ప్రోత్సహించండి
- స్విస్‌లో భారత రాయబారి మృదుల్ కుమార్‌తో మంత్రి లోకేశ్

అమరావతి, జనవరి 19(ఆంధ్రజ్యోతి): స్విట్జర్లాండ్‌తో వాణిజ్య సంబంధాల బలోపేతానికి సహకరించాలని స్విట్జర్లాండ్‌లో భారత రాయబారి మృదుల్ కుమార్‌కు రాష్ట్ర మంత్రి లోకేశ్ విజ్ఞప్తి చేశారు. జ్యూరిక్‌లో మృదుల్‌తో మంత్రి లోకేశ్ మర్యాదపూర్వకంగా భేటీ అయ్యారు. రాష్ట్రంలో పెట్టుబడుల కోసం స్విస్ కంపెనీలకు ఆహ్వానం పలుకుతున్నామని ఈ సందర్భంగా లోకేశ్ వెల్లడించారు. టెక్నాలజీ, టెక్స్‌టైల్స్, యంత్రాల తయారీ, ఎలక్ట్రానిక్స్, రైలు విడిభాగాల తయారీ, ఫార్మా, పరిశోధనా- అభివృద్ధి, వర్సిటీలతో సహకారం వంటి వాటిలో తాము స్విస్ సహకారం ఆశిస్తున్నామని లోకేశ్ తెలిపారు. స్విస్‌లోని జ్యూరిక్, బాసెల్, బెర్న్, జెనీవా వంటి ప్రఖ్యాత వర్సిటీలతో కలసి రాష్ట్రంలోని వర్సిటీలలో విద్యా అనుసంధానం ద్వారా వివిధ రకాల కోర్సులను అందించేందుకు సిద్ధంగా ఉన్నామని లోకేశ్ వెల్లడించారు. మెడికల్ డివైజెస్, స్టార్టప్, ఎక్స్ఛేంజీ ప్రోగ్రామ్‌లలో పరస్పర సహకారం కోరుకుంటున్నామని చెప్పారు. గ్లోబల్ స్థాయిలో విస్తరించి ఉన్న తెలుగు డయాస్పోరా రాష్ట్రాభివృద్ధికి దోహదపడుతోందని మృదుల్‌కు లోకేశ్ వివరించారు. స్విస్‌లో భారత సాంకేతిక ప్రతిభకు మంచి డిమాండ్ ఉందని అన్నారు. రాష్ట్రం నుంచి మరింత మంది నిపుణులను స్విస్‌కు పంపేందుకు అవకాశం ఇవ్వాలని కోరారు. మంత్రి లోకేశ్ అభ్యర్థనపై మృదుల్ సానుకూలంగా స్పందించారు. గత ఏడాది అక్టోబరు ఒకటిన భారత్-యూరోపియన్ ఫ్రీ ట్రేడ్ అసోసియేషన్ మధ్య జరిగిన ట్రేడ్ అండ్ ఎకనామిక్ భాగస్వామ్య ఒప్పందంలో ఇరు ప్రాంతాల మధ్య వాణిజ్య సంబంధాలు బలోపేతమయ్యాయని వెల్లడించారు. రాబోయే 15 ఏళ్లలో భారత్‌లో బిలియన్ డాలర్ల పెట్టుబడులు రానున్నాయని చెప్పారు. భారత్‌లో పది లక్షలమంది యువతకు ఉగ్యోగాలను కల్పించడమే ఈ ఒప్పందం లక్ష్యమని వెల్లడించారు. రాష్ట్ర ప్రభుత్వం చూపుతున్న చొరవకు తమ సహకారం ఉంటుందని మృదుల్ హామీ ఇచ్చారు.

విదేశీ విద్యకు గ్యారెంటీ!

(మొదటి పేజీ తరువాయి)

విజయవాడలో ఉన్నామా.. విశాఖలో ఉన్నామా అనేలా ఉందన్నారు. యూరప్‌లోని 20 దేశాల నుంచి వచ్చిన తెలుగువారిని ఒక్కచోట చూస్తుండటం ఆనందంగా ఉందని తెలిపారు. 195 దేశాల్లో తెలుగువారు ఉంటే 148 దేశాల్లో ఎన్నార్టీ (ప్రవాస తెలుగు వారు) వ్యవస్థను ఏర్పాటు చేశామని, మిగిలిన దేశాలకూ విస్తరిస్తామన్నారు. ఏపీలో రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్ పెట్టాం. స్టార్టప్ కంపెనీలను ప్రోత్సహిస్తున్నాం. వన్ ఫ్యామిలీ వన్ ఎంటర్‌ప్రెన్యూర్ అనేది ప్రభుత్వ విధానం" అని వివరించారు."జన్మభూమిని మర్చిపోతే చరిత్ర హీనులవుతారు. అలాగే కర్మభూమికి సేవలు అందించాలి. ఏ ప్రాంతంలో ఉంటే ఆ ప్రాంతంలోని స్థానికులతో మమేకం కావడం తెలుగువారి ప్రత్యేకత. ప్రస్తుతం భారతదేశం మినహా అన్ని దేశాల్లోనూ మానవ వనరుల కొరత ఉంది. ఇది మనదేశానికి పెద్ద వరం. ఉద్యోగాలు చేసే వాళ్లుగా కాదు, ఉద్యోగాలు ఇచ్చే వాళ్లుగా తెలుగు జాతి ఎదగాలి. ముఖ్యంగా ఎన్నార్టీలు (ప్రవాస తెలుగువారు) ఈ దిశగా అడుగులు వేయాలి." అని తెలిపారు.

ఒకరు ఉద్యోగానికి. మరొకరు వ్యాపారానికి..

భార్యాభర్తలిద్దరూ ఉద్యోగాలు చేస్తుంటే, ఒకరు ఉద్యోగం చేయండి.. మరొకరు వ్యాపారం చేయండి అని చంద్రబాబు సూచించారు. కొత్త తరహాలో ఆలోచన చేస్తే పారిశ్రామికవేత్తలుగా రాణించగలరని, జాతి కోసం, దేశం కోసం స్ఫూర్తితో పనిచేయండని పిలుపునిచ్చారు. "విజన్ 2020, ఐటీ గురించి ఆనాడు తీసుకున్న నిర్ణయం వల్ల 195 దేశాలకు తెలుగువారు వెళ్లే అవకాశం లభించింది. 2047కు భారతదేశం ప్రపంచంలో నంబర్ వన్ ఎకానమీగా అవతరిస్తుంది. దేశానికి అత్యంత బలమైన నాయకత్వం మోదీ రూపంలో ఉంది. ఉన్నత విద్యను అభ్యసించిన వారిని.. యువకులను పార్టీలో.. ప్రభుత్వంలో ప్రోత్సహిస్తున్నాం. అందుకే రామ్మోహన్ నాయుడు, లోకేశ్, టీజీ భరత్‌కు పదవులు దక్కాయి. రామ్మోహన్ నాయుడు కేంద్రంలో యువ మంత్రి. పదవులంటే గ్లామర్ కాదు. రాళ్లు కూడా పడతాయి. వీటిని ఎదుర్కోవడం యువత అలవర్చుకోవాలి.



తెలుగు డయాస్పోరా సమావేశానికి హాజరైన ఎన్ఆర్ఐలు, మాట్లాడుతున్న సీఎం చంద్రబాబు

ప్రపంచవ్యాప్తంగా ప్రభావితం చూపే కమ్యూనిటీగా తెలుగు వాళ్లు ఎదగాలి. రాష్ట్ర ఎన్నికల్లో ఎన్నార్టీలు అద్భుతంగా పనిచేశారు. ప్రభుత్వ వ్యతిరేక ఓటు చీలకూడదని పవన్ కల్యాణ్ సహకరించారు. అలాగే బీజేపీ కలిసి వచ్చింది. రాష్ట్రానికి పూర్వవైభవం తేవాలి.. సహకరించాలని ఎన్నార్టీలను కోరితే ఆలోచన చేయకుండా తరలివచ్చారు. రాష్ట్రంలోని నేతలు, కార్యకర్తలతో సమానంగా కొందరు ఎన్నార్టీలు కూడా కేసులు పెట్టించుకున్నారు."

22 లక్షల కోట్ల పెట్టుబడులు

"విధ్వంసమైన రాష్ట్రాన్ని తిరిగి పునర్ నిర్మించడం సాధ్యమా అని అందరూ ఆందోళన చెందారు. కానీ 18 నెలల కాలంలో బ్రాండ్ పునరుద్ధరించాం. పెట్టుబడులు.. అభివృద్ధి విషయంలో మంత్రులు, నేను పోటీ పడుతున్నాం. దేశంలోకి వచ్చిన మొత్తం పెట్టుబడుల్లో 25 శాతం ఏపీకే వచ్చాయి. అలాగే దేశానికి వచ్చిన అతి పెద్ద పెట్టుబడి గూగుల్ రూపంలో ఏపీకే వచ్చింది. మిట్టల్ లక్ష కోట్ల రూపాయల పెట్టుబడితో ఉక్కు పరిశ్రమ స్థాపిస్తోంది. కాకినాడలో గ్రీన్ అమ్మోనియా ప్లాంట్ ఏర్పాటు కానుంది. ఏఎం గ్రీన్ సంస్థ 10 బిలియన్ డాలర్ల పెట్టుబడి పెడుతోంది. తక్కువ ఖర్చుతో కరెంటు ఉత్పత్తి చేసేలా పరిశ్రమలు స్థాపిస్తున్నాం. తక్కువ ఖర్చుతో విద్యుత్తు కొనుగోళ్లు చేపడుతున్నాం. విద్యుత్తు రంగంలో సంస్కరణలు చేపట్టడం వల్ల డేటా సెంటర్లు రాష్ట్రానికి పెద్ద ఎత్తున వస్తున్నాయి. వివిధ సంస్థలతో మొత్తం రూ.22 లక్షల కోట్ల పెట్టుబడులపై కసరత్తు చేస్తున్నాం. ఇది సాకారమైతే 20 లక్షల ఉద్యోగ అవకాశాలు లభిస్తాయి. ఏపీలోని మారుమూల గ్రామాల నుంచి వచ్చి వివిధ దేశాల్లో స్థిరపడిన తెలుగు వారు, వారి ఊళ్లలో ఉన్నవారిని అభివృద్ధి చేసే బాధ్యత తీసుకోవాలి. ప్రభుత్వం రాష్ట్రాన్ని మూడు రీజియన్లుగా చేసి అభివృద్ధి చేస్తోంది."


దావోస్‌లో ముఖ్యమంత్రి చంద్రబాబుకు స్వాగతం పలుకుతున్న ఎన్ఆర్ఐలు

'అడ్వాన్స్‌డ్ క్వాంటం'కు అనూహ్య స్పందన

- లక్ష మంది నిపుణులు మా లక్ష్యం: సీఎం

అమరావతి, జనవరి 19(ఆంధ్రజ్యోతి): అడ్వాన్స్‌డ్ క్వాంటం స్కిల్లింగ్ కోర్సుకు అనూహ్య స్పందన లభించిందంటూ ముఖ్యమంత్రి హర్షం వ్యక్తం చేశారు. ఈ కోర్సు నేర్చుకునేందుకు ఇప్పటివరకూ 50,000 మంది నమోదు చేసుకున్నారని ఆయన సోమవారం ఎక్స్‌లో ప్రకటించారు. 'రాష్ట్రంలో లక్ష మంది క్వాంటం నిపుణుల్ని తయారుచేయడం మా లక్ష్యం. అడ్వాన్స్‌డ్ క్వాంటం స్కిల్లింగ్ కోర్సు నేర్చుకునేందుకు ఎక్కువ మంది ఆసక్తి చూపడం ఆనందం కలిగిస్తోంది. ఈ కోర్సులో బంగారు, వెండి పతకాలు సాధించే నిపుణులను స్వయంగా సత్కరిస్తా' అని చంద్రబాబు పేర్కొన్నారు.

టెక్నాలజీని అంది పుచ్చుకోవాలి..

"లిక్టన్‌స్టైన్ చాలా చిన్న దేశం. కానీ ప్రపంచంలోనే అది అత్యంత సంపన్న దేశాల్లో ఒకటి. టెక్నాలజీని అందిపుచ్చుకోవడం వల్లే ఆ దేశం సంపన్న దేశంగా ఎదిగింది. అందుకే నేను క్వాంటమ్, ఏఐ, స్పేస్, డ్రోన్ టెక్నాలజీని ప్రోత్సహిస్తున్నాను. ఎలక్ట్రానిక్స్, హెల్త్ డివైజెస్, ఫార్మా రంగాల అభివృద్ధిపై రాష్ట్రం దృష్టి సారించింది. రాష్ట్రంలో నీటి భద్రతకు చర్యలు తీసుకుంటున్నాం. ప్రపంచవ్యాప్తంగా ఏఐకి చిరునామాగా భారతీయులు, తెలుగు వాళ్లే ఉన్నారు. ఏపీ ఫస్ట్ అనే అతిపెద్ద రీసెర్చి వ్యవస్థను తెస్తున్నాం. ఐఐటీ - ఐఐఎస్ఈఆర్(ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ ఎడ్యుకేషన్ అండ్ రీసెర్చి) కాంబినేషన్‌తో ఈ సెంటర్‌ను తిరుపతిలో స్థాపిస్తున్నాం."

గోదావరి పుష్కరాలకు రండి..

ఈ సమావేశంలో కొంత మంది తాము ఎక్కడి నుంచి వచ్చామో తెలియజేస్తూ, బ్యానర్లు ప్రదర్శించారు. వచ్చే ఏడాది నేను ఇక్కడికి వచ్చినప్పుడు మీ సక్సెస్ చూపించాలి. వివిధ దేశాల్లో ఉన్న తెలుగువారిని సమన్వయపరిచి, వారిని అభివృద్ధి చేసేలా పారిశ్రామికవేత్తలుగా మార్చేలా లోకేశ్, రామ్మోహన్‌నాయుడు, భరత్ వంటి వారు బాధ్యత తీసుకోవాలి. 30 ఏళ్లకు ముందు భారతదేశం గురించి ప్రత్యేకంగా చర్చించుకునే వారు కాదు. ఇప్పుడు పరిస్థితి మారింది. ప్రపంచం మొత్తం భారత్ వైపు చూస్తోంది. గోదావరి పుష్కరాలకు రండి" అని చంద్రబాబు ఆహ్వానించారు.

తరలివచ్చిన తెలుగు వారు

తెలుగు డయాస్పోరా కార్యక్రమానికి యూరోప్‌లోని 20 దేశాల నుంచి తెలుగు ప్రజలు తరలి వచ్చారు. వారు తమ దేశాల పేర్లను సూచిస్తూ ప్లకార్డులు ప్రదర్శించారు. చంద్రబాబు తన ప్రసంగంలో ఏపీలోని వారి నియోజకవర్గాల పేర్లను ప్రస్తావించినప్పుడు ఎన్నార్టీల నుంచి పెద్ద ఎత్తున స్పందన లభించింది. స్విట్జర్లాండ్ తెలుగు అసోసియేషన్ నిర్వహించిన సంక్రాంతి పోటీల్లో విజేతలకు చంద్రబాబు బహుమతులు అందజేశారు. కార్యక్రమం అనంతరం తెలుగు కుటుంబాలను చంద్రబాబు ఆత్మీయంగా పలకరించి, ఫొటోలు దిగారు. ఈ కార్యక్రమంలో ఏపీ ఎన్నార్టీ సొసైటీ అధ్యక్షుడు వేమూరి రవి తదితరులు పాల్గొన్నారు.

'టీమ్ 11' ముఖం చూసి..
ఎవరైనా పెట్టుబడులు పెడతారా?

- అభివృద్ధి అంటే గుర్తు కొచ్చేది చంద్రబాబే!
- ఆయన విజన్ సాధనకు అహర్నిశలు కృషి
- 18 నెలల్లో రూ.23.50 లక్షల కోట్ల ఎంవోయూలు
- జ్యూరిక్‌లో తెలుగు డయాస్పోరా భేటీలో మంత్రి లోకేశ్

అమరావతి, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): అభివృద్ధి అంటే గుర్తుకొచ్చేది చంద్రబాబు మాత్రమేనని, ఆయన విజన్ సాధనకు తామంతా అహర్నిశలు కృషి చేస్తున్నామని ఐటీ శాఖ మంత్రి లోకేశ్ పేర్కొన్నారు. దావోస్ వరల్డ్ ఎకనమిక్ ఫోరంలో పాల్గొనేందుకు స్విట్జర్లాండ్ వెళ్లిన మంత్రి లోకేశ్ జ్యూరిక్‌లో జరిగిన యూరప్ తెలుగు డయాస్పోరా సమావేశంలో మాట్లాడారు. "చంద్రబాబు, నేను ఏ దేశానికి వెళ్లినా ముందు తెలుగు వారిని కలుస్తున్నాం. ఆ తర్వాతే అధికారిక కార్యక్రమాలకు వెళ్తున్నాం. గత ఏడాది ఏపీ గ్రోత్ స్టోరీ ఇక్కడే ప్రారంభమైంది. అప్పటి నుంచి తిరుగులేకుండా సాగిపోతోంది. 18 నెలల్లో రూ.23.50 లక్షల కోట్ల పెట్టు బడులు ఏపీకి వచ్చాయి. వీటి ద్వారా 16 లక్షలకుపైగా ఉద్యోగాలు రాబోతున్నాయి. పెట్టుబడుల్లో ఇప్పుడు ఏపీ నంబర్ 1. ఈ రోజు ఏపీకి ఇన్ని పెట్టుబడులు.. ఇంత మంది పారిశ్రామికవేత్తలు వస్తున్నారంటే దానికి కారణం చంద్రబాబు. ఆయన రేర్ పీస్.. యూనిక్ పీస్. చంద్రబాబును మనమంతా బ్లైండ్‌గా ఫాలో కావాలి. ఆయనకు విజన్ ఉంది. ఆయన ఇంజనీరింగ్ కాలేజీలు ప్రారంభించినా..హైటెక్ సిటీ కట్టినా..శంషాబాద్ ఎయిర్‌పోర్టు కట్టినా.. అమరావతి కట్టినా అనేక మంది విమర్శలు చేస్తుంటారు. చివరికి చంద్రబాబు చేసిన పనులతో వారూ ఫలితాలు అనుభవిస్తారు" అని తెలిపారు. లోకేశ్ ఇంకా ఏమన్నారంటే..

చంద్రబాబు జీపీఎస్.. మేమంతా మిస్సైళ్లం

"గతంలో కోడిగుడ్డు మంత్రిని దావోస్ ఎందుకు వెళ్లలేదంటే బాగా చలిగా ఉంటుందని, అందుకే వెళ్లలేదన్నారు. 75 ఏళ్ల వయసులో చలిని లెక్కచేయకుండా రాష్ట్రం కోసం పనిచేస్తున్న వ్యక్తి చంద్రబాబు. మేమంతా మిస్సైళ్ల లాంటి వారం. చంద్రబాబు జీపీఎస్ లాంటి వారు. మిస్సైల్‌కు జీపీఎస్ లేకపోతే ప్రమాదకరం."

ప్రభుత్వ కొనసాగింపు చాలా ముఖ్యం

"అభివృద్ధి కొనసాగాలంటే ప్రభుత్వ కొనసాగింపు చాలా ముఖ్యం. ప్రభుత్వం కొనసాగింది కాబట్టే గుజరాత్, ఒడిశా లాంటి రాష్ట్రాలు అభివృద్ధి చెందాయి. పవనన్న చెప్పినట్లు కూటమి ప్రభుత్వం కనీసం 15 ఏళ్లు ఉండాలి. రాజధాని కేంద్రీకరణ- అభివృద్ధి వికేంద్రీకరణ మా అజెండా. ప్రపంచంలో ఉన్న తెలుగు వారంతా ఏపీకి బ్రాండ్ అంబాసిడర్లు. మీలో చాలా మంది పారిశ్రామికవేత్తలు ఉన్నారు. మీరంతా ఏపీలో పెట్టుబడులు పెట్టండి. మీరు పనిచేసే కంపెనీలకు విస్తరణ ఆలోచన ఉంటే ఏపీలో పెట్టుబడులు పెట్టేలా సూచనలు చేయండి" అని లోకేశ్ కోరారు.

నేడు దిగ్గజ కంపెనీలతో సీఎం చంద్రబాబు భేటీ

- దావోస్ వేదికగా పెట్టుబడుల వేట
- ఐబీఎం, గూగుల్ క్లౌడ్ సీఈవోలతో చర్చలు

అమరావతి, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రానికి పెట్టుబడులే లక్ష్యంగా దావోస్ వేదికగా ప్రముఖ సంస్థల ప్రతినిధులతో మంగళవారం ముఖ్యమంత్రి చంద్రబాబు సమావేశం కానున్నారు. ఐబీఎం, గూగుల్ క్లౌడ్ వంటి సంస్థలతో ముఖాముఖీ భేటీలను నిర్వహించనున్నారు. పెట్టుబడులను ఆకర్షించడం, ఆధునిక సాంకేతికత, ఏఐ, గ్రీన్ ఎనర్జీ వంటి అంశాలపై సీఎం దృష్టి సారించనున్నారు. ఉదయం సీఐఐ బ్రేక్‌ఫాస్ట్ సెషన్‌లో 'ది ఆంధ్రప్రదేశ్ అడ్వాంటేజ్' అనే అంశంపై చంద్రబాబు ప్రసంగిస్తారు. స్పీడ్ ఆఫ్ డూయింగ్ విధానంలో తీసుకుంటున్న నిర్ణయాలను గురించి వివరించనున్నారు. పోర్టు ఆధారిత అభివృద్ధి, మౌలిక సదుపాయల కల్పన, మానవ వనరుల నైపుణ్యం వంటి అంశాల్లో తీసుకుంటున్న శ్రద్ధ, అమలు చేస్తున్న చర్యలను తెలపనున్నారు. టీమ్ ఇండియా లాంజ్‌లో ప్రారంభ కార్యక్రమంలో చంద్రబాబు పాల్గొంటారు. ప్రపంచ పెట్టుబడిదారులతో ముఖాముఖీ చర్చలు జరుపుతారు. దిగ్గజ ఐటీ సంస్థ ఐబీఎం ఛైర్మన్ అరవింద్ కృష్ణతో సమావేశమవుతారు. గూగుల్ క్లౌడ్ సీఈవో థామస్ కురియన్‌తోనూ భేటీ అవుతారు. దావోస్ కాంగ్రెస్ సెంటర్‌లో వరల్డ్ ఇంటిలెక్చువల్ ప్రాపర్టీ రైట్స్ ఆర్గనైజేషన్ డైరెక్టర్ జనరల్ డారెన్ టాంక్, అనిల్ మూర్తితో కొద్దిసేపు ముచ్చటిస్తారు. సాయంత్రం జేఎస్‌డబ్ల్యూ ఛైర్మన్ సజ్జన్ జిందాల్, జేఎస్ డబ్ల్యూ సిమెంట్స్, పెయింట్స్ సంస్థల ఎండీ పార్థ్ జిందాల్‌తో సమావేశమవుతారు. అంతర్జాతీయ కంటేయినర్ లాజిస్టిక్స్ సంస్థ మోలర్ మేర్స్క్ సీఈవో విన్సెంట్ క్లర్క్‌తో ముఖాముఖీ చర్చలు జరుపుతారు. పలు దిగ్గజ సంస్థల యాజమాన్యాలు, ఛైర్మన్లను కలుస్తారు. ఈ కార్యక్రమాల్లో మంత్రులు లోకేశ్, టీజీ భరత్ పాల్గొంటారు. 'వన్ ఫ్యామిలీ వన్ ఎంటర్‌ప్రెన్యూర్ " అనే అంశంపై రౌండ్ టేబుల్ నిర్వహించనున్నారు.

చంద్రబాబు ఒరిజినల్ దావోస్ మ్యాన్

- పెట్టుబడులు తేవడమే ఆయన లక్ష్యం: నీలాయపాలెం



అమరావతి, జనవరి 19(ఆంధ్రజ్యోతి): ఏపీ సీఎం చంద్రబాబు 'ది ఒరిజినల్ దావోస్ మ్యాన్' అని ఏపీ బయోడైవర్సిటీ బోర్డు ఛైర్మన్ నీలాయపాలెం విజయ్‌కుమార్ పేర్కొన్నారు. టీడీపీ కేంద్ర కార్యాలయంలో సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. 'ఉమ్మడి ఏపీ మొదలుకొని నవ్యాంధ్రప్రదేశ్ వరకు 30 ఏళ్లలో 15 సార్లు దావోస్‌కు వెళ్లి రాష్ట్రాభివృద్ధి కోసం, పెట్టుబడుల కోసం కృషి చేయడం చంద్రబాబు అంకితభావానికి నిదర్శనం. 1997లో తొలిసారి దావోస్ వెళ్లి రాష్ట్ర స్థాయిలో పెట్టుబడులు పెట్టాలని కోరిన తొలి సీఎం చంద్రబాబు. దావోస్ అంటే కేవలం ఒప్పందాలు.. సంతకాలు మాత్రమే కాదు. పెట్టుబడిదారుల్లో మన రాష్ట్రంపై నమ్మకం పెంచడం. మన రాష్ట్రంలో ఉన్న వేగవంతమైన వ్యాపార వాతావరణాన్ని వివరించడం. అదే దావోస్ పర్యటన అసలైన లక్ష్యం' అని నీలాయపాలెం వివరించారు.

వ్యవసాయ ఎగుమతుల
క్లస్టర్లకు మద్దతివ్వండి

- బ్యూలర్ ఇండియా ఛైర్మన్ దీపక్‌కు మంత్రి లోకేశ్ విజ్ఞప్తి
- జ్యూరిక్‌లో సినర్జిటెక్ ఎండీ జోస్ మెల్లాడోతోనూ భేటీ
- పోర్టుల్లో హైడ్రోజన్ కో-పైలట్ వాహనాల అభివృద్ధి వినతి


బ్యూలర్ గ్రూప్ ఇండియా ఛైర్మన్ దీపక్ మానేతో సమావేశమైన మంత్రి లోకేశ్


ఎవల్యూషన్ సినర్జెటిక్ ఆటోమోటివ్ సంస్థ ఎండీ జోస్ మెల్లాడోతో భేటీ అయిన మంత్రి లోకేశ్

అమరావతి, జనవరి 19(ఆంధ్రజ్యోతి): ఫుడ్ సెక్యూరిటీ టెక్నాలజీ, ఫుడ్ ప్రాసెసింగ్ రంగాల్లో అంతర్జాతీయంగా 140 దేశాల్లో సప్లయ్ చైన్ ఇంటిగ్రేషన్ కలిగి ఉన్న బ్యూలర్ గ్రూప్ ఎగ్జిక్యూటివ్ బోర్డు సలహాదారు, బ్యూలర్ ఇండియా ఛైర్మన్ దీపక్ మానేతో రాష్ట్ర విద్య, ఐటీ శాఖల మంత్రి లోకేశ్ భేటీ అయ్యారు. స్విట్జర్లాండ్‌లోని జ్యూరిక్‌లో సోమవారం నిర్వహించిన ఈ సమావేశంలో లోకేశ్ మాట్లాడుతూ రాష్ట్రంలో బ్యూలర్ ఫుడ్స్ అండ్ గ్రెయిన్ టెక్నాలజీ అప్లికేషన్ సెంటర్‌ను ఏర్పాటు చేయాలని కోరారు. పైలట్ ట్రయల్స్ ప్రోడక్ట్ లోకలైజేషన్ ద్వారా ఏపీలోని వ్యవసాయ ఎగుమతుల క్లస్టర్లకు మద్దతు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. బ్యూలర్ మిల్లెట్ ప్రాసెసింగ్ టెక్నాలజీని రాష్ట్రంలో వాణిజ్య స్థాయి ప్రదర్శన, స్కేలప్ సౌకర్యంగా మార్చడానికి సహకారం అందించాలని కోరారు. మిల్లెట్ ఆధారిత ఆహార పరిశ్రమ అభివృద్ధితో పాటు మెరుగైన దిగుబడులు, ఎక్స్‌పోర్ట్ రెడీ న్యూట్రిషన్‌కు బ్యూలర్ సహకారం కావాలన్నారు. రాష్ట్రంలో ఉద్యోగ కల్పనతో పాటు స్వదేశీ తయారీని ప్రోత్సహించాలని విజ్ఞప్తి చేశారు. అలాగే, బ్యూలర్ గ్లోబల్ అప్లికేషన్ అండ్ ట్రైనింగ్ స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్‌ను రాష్ట్రంలో ఏర్పాటు చేయాలని కోరారు. ప్లాంట్ ఆపరేటర్లు, సూపర్‌వైజర్లు, ఇంజనీర్లకు శిక్షణ ఇచ్చి రాష్ట్రంలో ఫుడ్ పార్కులు, అగ్రి ఇండస్ట్రియల్ కారిడార్లకు మద్దతు అందించాలన్నారు. కాగా, దేశంలో బెంగళూరు ప్రధాన కేంద్రంగా తమ సంస్థ పనిచేస్తోందని దీపక్ మానే వెల్లడించారు. ఈ క్యాంపస్ ద్వారా ఫుడ్ గ్రెయిన్స్, రైస్ ప్రాసెసింగ్, బిస్కట్స్, డ్రయర్స్, కాఫీ రోస్టింగ్ తయారీ, ఆప్టికల్ పార్టింగ్ సేవలను ఇంటిగ్రేట్ చేస్తున్నామని చెప్పారు. వడోదర, హైదరాబాద్, రాయపూర్, కాకినాడల్లో తమకు ప్రాంతీయ కార్యాలయాలు ఉన్నాయని తెలిపారు. కాకినాడ బ్రాంచి రీజినల్ సేల్స్ అండ్ లైఫ్ సైకిల్ సర్వీస్ నోడ్‌గా పనిచేస్తుందని, ఇది రాష్ట్రమంతటా కస్టమర్ ఇంటర్‌ఫేస్, సర్వీస్ కోఆర్డినేషన్, స్పేర్స్ ఫెసిలిటేషన్ అందిస్తుందని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వ సలహాలు, ప్రతిపాదనలను పరిశీలిస్తామని మనో ప్రకటించారు.

హైడ్రోజన్ కో-పైలట్ వాహనాలను అభివృద్ధి చేయండి..

స్పెయిన్‌కు చెందిన ఎవల్యూషన్ సినర్జిటిక్ ఆటోమోటివ్ ఎస్ఎల్ సంస్థ ఎండీ జోస్ మెల్లాడోతోనూ మంత్రి లోకేశ్ సమావేశమయ్యారు. గ్రీన్ హైడ్రోజన్, జీరో ఎమిషన్ వెహికల్స్‌లో అంతర్జాతీయ స్థాయి భాగస్వామ్యులను బలోపేతం చేసేందుకు ఆసక్తి కనబరుస్తున్నామని తెలిపారు. కాంప్లెక్స్ వెహికల్స్ మొబిలిటీ సిస్టమ్స్ అభివృద్ధిలో ప్రత్యేకత కలిగిన ఏవో సంస్థ ఆధ్వర్యాన వైజాగ్/కాకినాడ పోర్టుల్లో హైడ్రోజన్ టెర్మినల్ ట్రాక్టర్స్ పైలట్ వాహనాలను అభివృద్ధి చేయాలని కోరారు. రాష్ట్రంలోని పారిశ్రామిక పార్కుల్లో ఎలక్ట్రిక్/హైడ్రోజన్ ఆఫ్ రోడ్ వాహనాల కోసం కో-పైలట్‌ను అభివృద్ధి చేసి, రీడిజైన్, ఆప్టిమైజేషన్‌కు నేతృత్వం వహించాలని విజ్ఞప్తి చేశారు. ఇందుకోసం అవసరమైన టెస్ట్ బెడ్‌లు, అనుమతులను రాష్ట్ర ప్రభుత్వం అందిస్తుందన్నారు.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao,on behalf of Aamoda Publications Pvt.Ltd., Aamoda Press, Door no.1078, Vengalayapalem village, Guntur Rural Mandal,Guntur, Editor: N.Rahul Kumar Phone No: (0863)2512379,2512376 , RNI no.APTEL/2003/9781. Managing Director : Vemuri Radha Krishna. Founder: K.L.N.Prasad.